

'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 16 సంచిక: 77
శనివారం 2-12-2023



సిరీస్ చేతికందింది..
నాలుగో టీ20లో 20 పరుగులతో ఆసీస్‌పై భారత్ గెలుపు - 13లో



సరికొత్త శిఖరంపై నిఫ్టీ
67 వేల స్థాయి పైకి సెన్సెక్స్.. కలిసొచ్చిన 'ఇన్వెస్టర్ల' కొనుగోళ్లు - 13లో

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | VIJAYAWADA | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

ప్రపంచానికి పెను చీకట్లే



శతాబ్ద కాలంలో జరిగిన పొరపాట్లను సరిచేసుకోవడానికి ప్రపంచానికి ఎక్కువ సమయం లేదని ప్రధాని మోదీ అన్నారు. మన ప్రయోజనాలు మాత్రమే కాపాడుకోవాలన్న మానవాళి వైఖరి భూగోళాన్ని చీకట్లోకి నెట్టేస్తుందన్నారు. 6లో

మార్కుల డివిజన్ ప్రకటించం



10, 12 తరగతుల మార్కుల ఫలితాల్లో ఇకపై డివిజన్, డిస్టింక్షన్‌ను ప్రకటించబోమని సీబీఎస్‌ఈ పేర్కొంది. మెరిట్ లిస్ట్‌ను ప్రకటించే విధానానికి గతంలోనే స్వస్తి చెప్పిన బోర్డు తాజాగా డివిజన్, డిస్టింక్షన్‌పై నిర్ణయాన్ని వెలువరించింది. 6లో

వాణిజ్య సిలిండర్ మరింత ప్రియం



5 రాష్ట్రాల ఎన్నికలు ముగియగానే చమురు కంపెనీలు గ్యాస్ వినియోగదారులకు షాకిచ్చాయి. 19 కిలోల వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను శుక్రవారం రూ.21కి పెంచాయి. ఈ ధరలు డిసెంబర్ 1 నుంచే అమల్లోకి వస్తాయని పేర్కొన్నాయి. 6లో

ఫ్యాక్ట్‌చెక్
మాటలు కాదు.. మీ రాతలతోనే చేటు

పేదల్లో చీలిక తెచ్చి తెలుగుదేశానికి లబ్ధి చేకూర్చేందుకు 'ఈనాడు' ప్రయాస

టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎస్సీలకు లబ్ధి రూ.8,844 కోట్లే

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇప్పటివరకు రూ.40,440 కోట్ల ఖర్చు 10లో

బడుగుల అభివృద్ధి కనిపించడంలేదా రామోజీ?

- సీఎం జగన్ పాలనలో సామాజిక విప్లవం పరిఢవిల్లుతోంది
- ముఖ్యమంత్రి విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారు
- మంత్రి మేరుగు నాగార్జున

10లో

'ఐబీ' అడుగులు

విద్యాశాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దిశా నిర్దేశం

- సర్కారు స్కూళ్లలో విద్యార్థులకు ఫ్యూచర్ స్కిల్స్.. పాఠ్య ప్రణాళికలో ఆర్థిక పాఠాలకు ప్రాధాన్యం
- అంతర్జాతీయంగా రాణించేలా విదేశీ భాషలు కూడా
- 'ఐబీ' బోధనా విధానాలపై వచ్చే ఏడాది టీచర్లకు ట్రైనింగ్
- 2025–26లో ఒకటో తరగతితో ఐబీ ప్రారంభించి.. ఆపై ఏటా ఒక్కో తరగతిలో దశలవారీగా అమల్లోకి
- ఏపీ ఎస్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో ఐబీ అమలు, పర్యవేక్షణ
- డిసెంబర్‌లో విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీకి ఏర్పాట్లు



సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు అంతర్జాతీయంగా రాణించేందుకు అవసరమైన తర్ఫీదు స్కూళ్ల స్థాయి నుంచే అందించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. అందుకు అనుగుణంగా అన్ని చర్యలు చేపట్టాలని, ముఖ్యంగా విద్యార్థులకు ఫ్యూచర్ స్కిల్స్ నేర్పించాలని ఆదేశించారు. ఈ క్రమంలో రాష్ట్రంలో ఇంటర్నేషనల్ బాకలారియెట్ (ఐబీ) సిలబస్ అమలుకు సన్నద్ధం కావాలని, రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఏపీ ఎస్‌సీఈఆర్‌టీ) ఆధ్వర్యంలో దీన్ని నిర్వహించాలని దిశా నిర్దేశం చేశారు. 2025–26 విద్యా సంవత్సరం నుంచి ఐబీ సిలబస్‌ను ప్రభుత్వ పాఠశాలలో ఒకటో తరగతి నుంచి ప్రవేశపెట్టి ఆ తరువాత ఏడాది రెండో తరగతికి, ఆపై దశల వారీగా మిగతా తరగతులకు

మిగతా 3వ పేజీలో ▶

సీఆర్‌పీఎఫ్ పహారాలో 'సాగర్'

- తెలంగాణలో కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యే వరకూ 'స్టేటస్ కో'.. నేడు ఇరు రాష్ట్రాల జల వనరుల శాఖ ఉన్నతాధికారుల భేటీ
- కృష్ణా బోర్డుకు నిర్వహణ బాధ్యతలు..
- కేంద్ర ప్రతిపాదనకు అంగీకరించిన ఇద్దరు సీఎస్‌లు.. నవంబర్ 30 నాటి పరిస్థితి పరిగణలోకి తీసుకోవాలన్న ఏపీ సీఎస్
- 28కి ముందు పరిస్థితిని లెక్కలోకి తీసుకోవాలన్న తెలంగాణ సీఎస్
- నాలుగు జిల్లాల దాహార్తి తీరుస్తూ కుడి కాలువ రెండు గేట్ల నుంచి రెండో రోజూ నీటి విడుదలను కొనసాగించిన ఏపీ

2లో



మన భూభాగంలోకి వెళ్తే దండయాత్రా!?

సాగర్‌పై ఏమిటా రాతలు రామోజీ


రాధాకృష్ణ? ఇదేనా మీ జర్నలిజం?

మంత్రి అంబటి రాంబాబు ధ్వజం

2లో

రిగ్గింగ్ ఆరోపణలు అవాస్తవం

తెలంగాణలో ఎగ్జిట్ పోల్స్ అంచనాలు



- కొన్ని కేంద్రాల్లో రాత్రి 9.30 వరకు కొనసాగిన ఓటింగ్
- అందుకే పోలింగ్ శాతం పెరిగింది: సీఈఓ వికాస్‌రాజ్
- ఆరోపణలు, పరిశీలకులు స్క్రూటినీ నిర్వహిస్తున్నారు
- అసెంబ్లీ ఎన్నికలకు 'సాగర్' ఘటనతో సంబంధం లేదు
- 3న ఓట్ల లెక్కింపు కోసం ఏర్పాట్లు

- వివరాలు 14లో

కోస్తాంధ్రపై 'మిచాంగ్' తుపాను పడగ!

- రేపు తుపానుగా బలపడే అవకాశం.. అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం.. కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు
- 5న నెల్లూరు–మచిలీపట్నం మధ్య తీరం దాటే ఛాన్స్
- రేపట్నుంచి సీమ, దక్షిణ కోస్తాంధ్రకు భారీ వర్షాలు

14లో

ముందు జాగ్రత్తలు తీసుకోండి

రాష్ట్ర ఉన్నతాధికారులతో కేంద్ర కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబ వీడియో కాన్ఫరెన్స్

14లో

తుపానును ఎదుర్కోవడానికి పూర్తి సన్నద్ధతతో ఉన్నాం: సీఎస్ జవహర్‌రెడ్డి

ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

మా అమ్మాయి ఇంజినీర్..



మాది గిరిజన కుటుంబం. రెక్కాడితే గాని డొక్కాడదు. కొండపోడు పనులు, కూలీనాలీ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. పార్వతీపురం మన్యం జిల్లాలోని సీతంపేట ఏజెన్సీలో కొండ శిఖరంపైన ఉన్న జన్నోడుగూడ గ్రామానికి చెందిన నాకు ముగ్గురు కుమార్తెలు. వీరిలో ఇద్దరు కుమార్తెలకు చదువంటే చాలా ఇష్టం. స్థానికంగా ఉన్న ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో ఇద్దరినీ ఇంటర్మీడియట్ వరకు చదివించాను. ఆ పై చదువులు చదివించాలంటే చాలా ఖర్చు అవుతుందని భయపడ్డాను. అయితే పేద కుటుంబాల పిల్లల చదువుకు ప్రభుత్వం సాయం అందిస్తోందని గ్రామంలో చదువుకున్న వారు చెప్పారు. దీంతో పిల్లలను చదివించేందుకు ఏర్పాట్లు చేశాను. సర్కారు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తోంది. హాస్టల్‌లో ఉండి చదువుకునేందుకు జగనన్న వసతిదీవెన పథకం కింద డబ్బు సమకూరుస్తోంది. పెద్దకుమార్తె విజయ ఏలూరులోని ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ సెకండియర్ సివిల్ ఇంజినీరింగ్ చదువుతోంది. చిన్నకుమార్తె ప్రశాంతి విశాఖపట్నంలో బీఎస్సీ నర్సింగ్ మొదటి సంవత్సరం చదువుతోంది. పైసా ఖర్చు లేదు. ఏటా ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు నా భార్య బ్యాంకు ఖాతాలో వేయడంతో కళాశాలకు ఫీజులు కడుతున్నాను. మాలాంటోళ్ల పిల్లలు ఇంజనీరింగ్ చదవడమంటే మాటలా! మా కల నిజమైంది.

– సవర బంగారయ్య, జన్నోడుగూడ
(బోనుమద్ది కొండలరావు, విలేకరి, సీతంపేట)

పథకాలే మా బంధువులు



భార్యభర్తలిద్దరం కూలి పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించుకుంటూ మా నలుగురు బిడ్డల్ని చదివించుకునేవాళ్లం. రాను రాను కూలి పనులు తగ్గిపోయాయి. రాబడి కూడా అంతంతమాత్రంగానే ఉండేది. కూలి చేస్తూ నలుగుర్ని సాకడం కష్టమైపోయింది. అప్పులు పెరిగిపోయాయి. ఏం చేయాలో పాలుపోలేదు. బంధువుల్లో కూడా మాపై చిన్న చూపు ఏర్పడింది. మాతో మాట్లాడేందుకు, మా ఇంటికి వచ్చేందుకు ఎవరూ పెద్దగా ఇష్టపడేవారు కాదు. ఈ పరిస్థితిలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రావడం.. వైఎస్సార్ ఆసరా, జగనన్న చేయూత పథకాల ద్వారా నాకు లబ్ధి కలిగింది. ఈ మొత్తాలకు శ్రీ నిధి తోడైంది. బ్యాంకు లింకేజీ కింద 1.5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం తీసుకుని, ప్రకాశం జిల్లా తుర్లపాడు మండలం తుమ్మల చెరువులో కిరాణా షాప్ పెట్టుకున్నాము. నేను, నా భర్త కలిసి దుకాణాన్ని నడుపుతున్నాము. మా చుట్టుపక్కల ఉన్న డ్వాక్రా సంఘాల మహిళలంతా మా దుకాణంలోనే సరుకులు కొంటున్నారు. క్రమంగా మా ఆర్థిక పరిస్థితులు గాడిలో పడ్డాయి. ఇద్దరు కుమారులకు పెళ్లిళ్లు చేశాం. ఈ ప్రభుత్వమే లేకపోయి ఉండుంటే మేము ఏమైపోయేవాళ్లమో! ప్రభుత్వ పథకాలే మా బంధువులయ్యాయి. ఇప్పుడు హాయిగా ఉన్నంతలో సంతోషంగా బతుకుతున్నాం.

– షేక్ మహబున్నీ, తుమ్మల చెరువు
(రామయోగయ్య, విలేకరి, తుర్లపాడు)

పని కోసం ఇక వలసపోము..



జీవనోపాధి కోసం గతంలో చెన్నై వంటి దూర ప్రాంతాలకు వెళ్లే వాళ్లం. వైఎస్ జగన్ సీఎం అయిన తరువాత ఆ బాధలు తప్పాయి. మా సొంత ఊరు పార్వతీపురం మన్యం జిల్లాలోని కొత్తపల్లి. నా ఇద్దరు ఆడ పిల్లలను మా అమ్మ దగ్గర ఉంచి నేను, నా భర్త జీవనోపాధి కోసం చెన్నైకి వెళ్లి పనులు చేసుకునే వారం. అయితే కోవిడ్ సమయంలో మా ఊరికి తిరిగొచ్చాం. తరువాత పిల్లలతో సహా విశాఖపట్నం వచ్చాము. ఇక్కడ అక్కయ్యపాలెం అబిత్‌నగర్‌లో నేను అపార్ట్‌మెంట్‌లో వాచ్ ఉమెన్‌గా ఉంటున్నాను. నా భర్త పోలిశెట్టి తాపీ పనులకు వెళ్తున్నాడు. డిగ్రీ చదువుతుండగానే మా పెద్దమ్మాయికి పెళ్లి చేశాము. రెండో అమ్మాయి మౌనిక అక్కయ్యపాలెం జీవీఎంసీ హైస్కూలులో తొమ్మిదవ తరగతి చదువుతోంది. ఈ పాపను బాగా చదువించుకోవాలని కోరిక. కానీ కుటుంబ ఆర్థిక పరిస్థితులు బాగా లేకపోవటంతో మా లాంటి పేదలకు ఆ ఆశ నెరవేరుతుందా అనే భయం ఉండేది. ఈ ప్రభుత్వం వచ్చాక ఇప్పుడా భయం లేదు. వరుసగా నాలుగేళ్లుగా అమ్మ ఒడి డబ్బులు పడ్డాయి. దీంతో మా అమ్మాయికి కావలసినవన్నీ కొనగలుగుతున్నాను. బడికి పంపిస్తే పుస్తకాలు, బూట్లు, బ్యాగు ఇలా అన్నీ ఫ్రీగానే ఇస్తున్నారు. జగనన్న చేస్తున్న సాయం మాలాంటోళ్లకు భరోసాగా నిలుస్తోంది. ధైర్యంగా పిల్లలను చదివిస్తున్నాం. మేము కూలి పనుల కోసం ఎక్కడికీ వలస వెళ్లాల్సిన అవసరం లేదు.

– వెంపటాపు లక్ష్మి,
అబిత్‌నగర్, విశాఖపట్నం
(కోవెల కాశీ విశ్వనాధం, విలేకరి, విశాఖపట్నం)

సీఆర్‌పీఎఫ్ పహారాలో 'సాగర్'



సాక్షి, అమరావతి: నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు సంబంధించి యథాస్థితి (స్టేటస్ కో) కొనసాగిస్తూ సీఆర్‌పీఎఫ్ దళాల పహారాలో ప్రాజెక్టు పర్యవేక్షణ బాధ్యతను కృష్ణా బోర్డుకు అప్పగిస్తామన్న కేంద్ర హోంశాఖ ప్రతిపాదనకు తెలుగు రాష్ట్రాలు అంగీకరించాయి. అయితే నవంబర్ 30 నాటి పరిస్థితిని పరిగణలోకి తీసుకోవాలని ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి స్పష్టం చేయగా గత నెల 28కి ముందున్న పరిస్థితిని లెక్కలోకి తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి పేర్కొన్నారు. కాగా రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణలో ఏమాత్రం రాజీ లేకుండా పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల దాహార్తి తీర్చేలా తాగునీటి అవసరాల కోసం రెండో రోజు శుక్రవారం కూడా 3,300 క్యూసెక్కుల నీటి విడుదలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొనసాగించింది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ భూభాగంలోని నాగార్జునసాగర్ సగం స్పిల్‌వే, కుడి కాలువ హెడ్ రెగ్యులేటర్‌ను ఏపీ ప్రభుత్వం గురువారం స్వాధీనం చేసుకుని కుడి కాలువకు నీటిని విడుదల చేయడంపై తెలంగాణ సర్కార్ కేంద్ర హోంశాఖకు ఫిర్యాదు చేసింది. ఈ వివాదంపై కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్ బల్లా శుక్రవారం ఇంటెలిజెన్స్ బ్యూరో స్పెషల్ డైరెక్టర్, జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ డైరెక్టర్ జనరల్‌లతో కలిసి రెండు రాష్ట్రాల సీఎస్‌లు, డీజీపీలు, జలవనరుల శాఖల ముఖ్య కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జల్ శక్తి శాఖ సంయుక్త కార్యదర్శి ఆనంద్‌మోహన్, కృష్ణా బోర్డు చైర్మన్ శివ్‌నందన్‌కుమార్, కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ) చైర్మన్ కుశ్వీందర్‌సింగ్ వోరా తదితరులు ఇందులో పాల్గొన్నారు.

హక్కులు కాపాడుకోవడానికే..

తాము శాసన సభ ఎన్నికల నిర్వహణలో ఉండగా ఏపీ ప్రభుత్వం 500 మంది పోలీసులను పంపి సాగర్‌లో సగం స్పిల్ వే, కుడి కాలువ హెడ్ రెగ్యులేటర్‌ను స్వాధీనం చేసుకుని ఐదు వేల క్యూసెక్కులు విడుదల చేసిందని తెలంగాణ సీఎస్ శాంతికుమారి పేర్కొన్నారు. దీనివల్ల ఏపీ ప్రభుత్వం తమ రాష్ట్రంలో శాంతి భద్రతల సమస్యను సృష్టించిందన్నారు. ఏపీ ప్రభుత్వం ఇలాంటి అతిక్రమణలకు పాల్పడడం ఇది రెండోసారి అని చెప్పారు. సాగర్ కుడి కాలువకు నీటిని తరలించడం వల్ల హైదరాబాద్ నగరంతోపాటు పరిసర ప్రాంతాల్లో రెండు కోట్ల మంది ప్రజల తాగునీటి అవసరాలకు తీవ్ర ఆటంకం కలుగుతుందన్నారు. దీనిపై ఏపీ సీఎస్ కేఎస్ జవహర్‌రెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. శ్రీశైలం ప్రాజెక్టులో అక్టోబర్ 6న కృష్ణా బోర్డు 30 టీఎంసీలు కేటాయిస్తే అదే రోజు అక్రమంగా ఎడమగట్టు కేంద్రంలో విద్యుదుత్పత్తి చేపట్టి ప్రాజెక్టును ఖాళీ చేస్తూ సాగర్‌కు తెలంగాణ సర్కారు నీటిని తరలించిందని ప్రస్తావించారు. దీనివల్ల శ్రీశైలంలో తమకు కేటాయించిన నీటిలో 17 టీఎంసీలను కోల్పోవాల్సి వచ్చిందన్నారు. తమ రాష్ట్రానికి నీటిని విడుదల చేసే సాగర్ కుడి కాలువ హెడ్ రెగ్యులేటర్ ఏపీ భూభాగంలోనే ఉన్నా దాన్ని తెలంగాణ తన అధీనంలోకి తీసుకుని నీటిని విడుదల చేయకుండా హక్కులను హరిస్తోందన్నారు. తమ హక్కులను కాపాడుకోవడానికే సాగర్ స్పిల్ వేలో సగం, కుడి కాలువ హెడ్ రెగ్యులేటర్‌ను స్వాధీనం చేసుకున్నామని తేల్చి చెప్పారు.

కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక చర్చలు

రెండు రాష్ట్రాల సీఎస్‌ల వాదనలు, కేంద్ర జల్ శక్తి శాఖ సంయుక్త కార్యదర్శి, కృష్ణా బోర్డు చైర్మన్ అభిప్రాయాలను విన్న తర్వాత కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ బల్లా దీనిపై స్పందించారు. ఈనెల 3న తెలంగాణ ఎన్నికల ఓట్ల లెక్కింపు జరుగుతుందని, ఆ రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యే వరకూ సాగర్‌పై స్టేటస్ కో కొనసాగుతుందని ప్రకటించారు. ఈలోగా ఈ వివాదంపై రెండు రాష్ట్రాల జలవనరుల శాఖ ఉన్నతాధికారులతో కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ శనివారం సమావేశం నిర్వహిస్తారని చెప్పారు. తెలంగాణలో కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక రెండు రాష్ట్రాలతో సమగ్రంగా చర్చించి వివాదాన్ని పరిష్కరిస్తామని, అప్పటిదాకా సంయమనం పాటించాలని ఇరు రాష్ట్రాల సీఎస్‌లకు దిశానిర్దేశం చేశారు.

తెలంగాణ సర్కార్ తీరుతో వివాదాలు

కృష్ణా బోర్డు పరిధిని నిర్దేశిస్తూ 2021 జూలై 15న గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశామని కేంద్ర జల్ శక్తి శాఖ సంయుక్త కార్యదర్శి ఆనంద్‌మోహన్ సమావేశంలో పేర్కొన్నారు. ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, సాగర్‌లను కృష్ణా బోర్డుకు అప్పగించేందుకు ఏపీ ప్రభుత్వం అంగీకరించగా తెలంగాణ సర్కారు ఎప్పటికప్పుడు నిర్ణయాలు మార్చుకుంటోందని, ఇప్పుడు అపెక్స్ కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని కోరుతోందని ప్రస్తావించారు.

తెలంగాణ సర్కార్ చర్యల వల్లే గెజిట్ నోటిఫికేషన్ అమలులో జాప్యం జరుగుతోందని, దీనివల్లే వివాదాలు ఉత్పన్నమవుతున్నాయని తేల్చి చెప్పారు. తాను శ్రీశైలం ప్రాజెక్టును క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు వెళ్తే తెలంగాణ సర్కార్ తనను ఎడమ గట్టు విద్యుత్కేంద్రంలోకి అనుమతించలేదని వెల్లడించారు. ఎడమ గట్టు కేంద్రంలో విద్యుదుత్పత్తి చేపట్టి శ్రీశైలాన్ని ఖాళీ చేస్తూ తెలంగాణ సర్కార్ కృష్ణా జలాలను వాడుకుంటోందని, ఇదే వివాదానికి కారణమవుతోందని ఆనంద్‌మోహన్ స్పష్టం చేశారు. కృష్ణా బోర్డు చైర్మన్ శివ్‌నందన్‌కుమార్ కూడా ఇదే అంశాన్ని పునరుద్ఘాటించారు.

తెలంగాణ పోలీసులపై కేసులు నమోదు..

సాగర్ డ్యామ్‌పై విధులు నిర్వహిస్తున్న ఏపీ జలవనరుల శాఖ, పోలీసు సిబ్బందిని అడ్డుకున్న ఘటనకు సంబంధించి తెలంగాణ స్పెషల్ ఫోర్స్ (ఎస్పీఎఫ్)పై రెండు కేసులు నమోదయ్యాయి. దీనిపై పల్నాడు జిల్లా విజయపురి సౌత్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం రాత్రి కేసులు నమోదు చేశారు.

కొనసాగుతున్న నీటి విడుదల

- రెండో రోజు సాగర్ కుడికాలువ ద్వారా 3,300 క్యూసెక్కులు దిగువకు

సాక్షి, నరసరావుపేట, మాచర్ల, విజయపురిసౌత్: నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు సంబంధించి ఏపీ భూభాగంలో ఉన్న 13 క్రస్ట్‌గేట్లు, హెడ్ రెగ్యులేటర్‌ను స్వాధీనపర్చుకున్న రాష్ట్ర ప్రభుత్వం నీటి హక్కులపై రాజీలేని పోరాటాన్ని కొనసాగిస్తోంది. సాగర్ కుడికాలువ రెండు గేట్ల ద్వారా 3,300 క్యూసెక్కుల నీటి విడుదల రెండో రోజు శుక్రవారం కూడా కొనసాగింది. పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు తాగునీటి అవసరాల కోసం 5వ గేటు నుంచి 2,000 క్యూసెక్కులు, 2వ గేటు నుంచి 1,300 క్యూసెక్కుల విడుదలను కొనసాగిస్తూ ఇరిగేషన్, పోలీసు అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టారు. సాగర్ పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో ఇరువైపులా ఏపీ, తెలంగాణ పోలీసులు భారీగా మోహరించారు. పల్నాడు ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి నేతృత్వంలో సుమారు 1,300 మందికి పైగా పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు. గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజ్, బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్ బందోబస్తును పరిశీలించారు.

మన భూభాగంలోకి వెళ్తే దండయాత్రా!?

- ఏమిటీ రాతలు రామోజీ.. రాధాకృష్ణ? ఇదేనా మీ జర్నలిజం?
- నాగార్జునసాగర్ విషయంలో చంద్రబాబు చేసిన తప్పును మేం సరిదిద్దాం
- జలవనరుల మంత్రి అంబటి రాంబాబు

సాక్షి, అమరావతి: రాష్ట్ర భూభాగంలోని సాగర్ స్పిల్ వే 13 గేట్లతోపాటు కుడి కాలువ హెడ్ రెగ్యులేటర్‌ను గురువారం న్యాయ, ధర్మబద్ధంగానే స్వాధీనం చేసుకున్నామని.. ఇది దండయాత్ర ఎలా అవుతుందో ఈనాడు రామోజీరావు, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ చెప్పాలని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు డిమాండ్ చేశారు. ఓటుకు కోట్లు కేసులో అడ్డంగా దొరికిపోయిన నాటి సీఎం చంద్రబాబు నాగార్జునసాగర్‌ను తెలంగాణకు తాకట్టు పెట్టారని.. తద్వారా కోల్పోయిన రాష్ట్ర హక్కులను సీఎం వైఎస్ జగన్ సాధించారని ఆయన తెలిపారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కృష్ణా జలాల్లో రాష్ట్ర వాటా జలాలకు మించి ఒక్క నీటి బొట్టునూ అదనంగా వాడుకోబోమని తేల్చిచెప్పారు. 'మా వాటా నీటిని వాడుకోవడానికి స్వేచ్ఛ సాధించాం. దీనిని తెలుగు ప్రజలంతా సమర్థిస్తారని.. స్వాగతిస్తారని భావిస్తున్నాం. తెలంగాణ ప్రజలు కూడా పంతాలకు, పట్టుదలకు వెళ్లొద్దు'.. అంటూ అంబటి విజ్ఞప్తి చేశారు. సున్నితమైన అంశంపై ఎల్లో మీడియా అవాస్తవాలు పోగేసి అచ్చేస్తున్న తప్పుడు కథనాలను నమ్మవద్దని రెండు రాష్ట్రాల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అంబటి ఇంకా ఏమన్నారంటే..



హక్కును కాపాడుకుంటే దండయాత్ర అంటారా..?

మరోవైపు.. కృష్ణా బోర్డు పరిధిని 2021, జూలై 15న కేంద్రం నిర్దేశించాక.. ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, సాగర్‌ల నిర్వహణ బాధ్యతలను కృష్ణా బోర్డుకు అప్పగించేందుకు ఏపీ ప్రభుత్వం అంగీకరించిందని.. తెలంగాణ సర్కారే ఒప్పుకోలేదని గురువారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డే చెప్పారు. చంద్రబాబు చేసిన తప్పును మేం సరిదిద్దితే.. సాగర్ మీదకు దండయాత్ర చేస్తున్నామని ఈనాడు రామోజీ, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ రాతలు రాస్తారా? ఇదేనా మీ జర్నలిజం? మేం తెలంగాణ భూభాగంలోకి వెళ్తే అది తప్పవుతుందిగానీ మన భూభాగంలోకి మనం వెళ్తే అది తప్పెలా అవుతుంది?

బాబు అసమర్థతవల్లే హక్కులు కోల్పోయాం..

- కృష్ణా జలాల విషయంలో రెండు రాష్ట్రాల మధ్య విభేదాలు తలెత్తకుండా చూసేందుకు కేంద్రం కృష్ణా బోర్డును ఏర్పాటుచేసింది.
- బోర్డు పరిధిని నోటిఫై చేసే వరకూ ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం నిర్వహణ బాధ్యతను ఏపీకి, సాగర్ నిర్వహణ బాధ్యతను తెలంగాణకు అప్పగించింది. కానీ, శ్రీశైలం ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం తన భూభాగంలో ఉందన్న సాకుతో తెలంగాణ దానిని అధీనంలోకి తీసుకుని తన వాటాకు మించి అధికంగా జలాలను వాడుకుంటూ విద్యుదుత్పత్తి చేస్తూ దిగువకు నీటిని తరలిస్తోంది.
- అలాగే.. నాగార్జునసాగర్‌ను కూడా తెలంగాణ సర్కార్ 2014లోనే పూర్తిగా అధీనంలోకి తీసుకుంది.
- కానీ, అప్పటి సీఎం బాబు ఇదంతా చూస్తూ మిన్నకుండిపోయారు. తద్వారా సాగర్‌పై రాష్ట్ర హక్కులను తెలంగాణకు తాకట్టు పెట్టినట్లయింది. 2015 ఫిబ్రవరి 13న చంద్రబాబు హయాంలో సాగర్ కుడి కాలువకు నీటిని విడుదల చేయటానికి మన అధికారులను పంపితే.. తెలంగాణ అధికారులు అభ్యంతరం పెట్టారు. దాంతో రెండు రాష్ట్రాల పోలీసుల మధ్య పెద్ద గొడవ జరిగింది. చివరికి చంద్రబాబు గవర్నర్ దగ్గర మొరపెట్టుకుని.. తెలంగాణ సర్కార్ దయాదాక్షిణ్యాలతో నీరు విడుదల చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. మన నీటిని మనం విడుదల చేసుకోవాలంటే తెలంగాణ సర్కార్ అనుమతి అవసరమా?

తెలంగాణలో మాకు ఎలాంటి లక్ష్యాలు లేవు..

రాష్ట్ర ప్రజల హక్కులను కాపాడే విషయంలో వైఎస్సార్‌సీపీ చిత్తశుద్ధితో పనిచేస్తుంది. తెలంగాణలో మాకు ఎలాంటి లక్ష్యాలు, ప్రయోజనాల్లేవు. ఒక పార్టీని గెలిపించాల్సిన అవసరంగానీ ఓడించాల్సిన అవసరం కూడా లేదు. పొరుగు రాష్ట్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా ఆ ప్రభుత్వంతో మేం సత్సంబంధాలు కొనసాగిస్తాం.

దిగజారి మాట్లాడుతున్న పురందేశ్వరి..

సాగర్ స్పిల్ వేపైకి మన పోలీసులను పంపడం దారుణమంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి దిగజారి మాట్లాడుతున్నారు. ఆమె బీజేపీ అధ్యక్షురాలా? లేక టీడీపీ అధ్యక్షురాలా?

ఏపీలో టీడీపీకి సమాధే

తెలంగాణ ఎన్నికల్లో చంద్రబాబుకు సంబంధించిన కుల సంఘాలు, ఆ పార్టీ శ్రేణుల ప్రవర్తనవల్ల వచ్చే ఎన్నికల్లో ఏపీలో ప్రజలు ఆ పార్టీని కూకటివేళ్లతో పెకలించి, సమాధి కట్టబోతున్నారు. ఇక స్కిల్ స్కాం కేసులో చంద్రబాబును జైలుకు పంపితే.. ఒక్క పవన్ మాత్రమే వెళ్లి టీడీపీతో కలిసి పోటీచేస్తానని ప్రకటించారు. పవన్‌కళ్యాణ్ ఇంత త్యాగం చేసి తెలంగాణలో ఆయన ఎనిమిది సీట్లల్లో పోటీచేస్తే.. చంద్రబాబు సామాజికవర్గం వారు పవన్‌ను గెలిపిస్తామని ఎందుకు అనలేదు? చంద్రబాబు కోసం పనిచేస్తున్న పవన్ పిచ్చోడు అయితే అవ్వొచ్చేమోగానీ.. ఆయన సామాజికవర్గం వాళ్లు మాత్రం పిచ్చోళ్లు కాదు.

మీ వైఫల్యం వల్లే.. సాగర్ స్పిల్ వే సగం స్వాధీనం

- కుడి కాలువ హెడ్ రెగ్యులేటర్‌నూ అధీనంలోకి తీసుకున్నాం
- తాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేశాం..
- నీటి విడుదలను ఆపే ప్రశ్నేలేదు
- కృష్ణా బోర్డు చైర్మన్‌కు రాష్ట్ర జలవనరుల శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌కుమార్ లేఖ

నేడు రెండు రాష్ట్రాలతో కేంద్రం భేటీ

కృష్ణా జలాలపై హక్కులను కాపాడుకోవడమే లక్ష్యంగా రాష్ట్ర భూభాగంలోని నాగార్జునసాగర్ స్పిల్ వే సగం, కుడి కాలువ హెడ్ రెగ్యులేటర్‌ను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడంతో రెండు రాష్ట్రాల మధ్య ఉత్పన్నమైన వివాదాన్ని పరిష్కరించేందుకు కేంద్రం రంగంలోకి దిగింది. సాగర్ వివాదంతో పాటు కృష్ణా జలాల పంపకాలు, ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, సాగర్‌ల నిర్వహణ బాధ్యతను కృష్ణా బోర్డుకు అప్పగించడంపై రెండు రాష్ట్రాల జలవనరుల శాఖ ఉన్నతాధికారులతో కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించనున్నారు. కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్, కృష్ణా బోర్డు చైర్మన్ శివ్‌నందన్‌కుమార్ తదితరులు పాల్గొనే ఈ సమావేశం శనివారం ఉ.11గంటలకు హైబ్రీడ్ విధానంలో (వీడియో కాన్ఫరెన్స్) జరుగుతుంది. గత తొమ్మిదేళ్లుగా కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కులను తెలంగాణ సర్కార్ హరిస్తున్న తీరును ఈ సమావేశంలో కేంద్రం దృష్టికి మరోసారి తీసుకెళ్లడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది.




సాక్షి, అమరావతి : ఉమ్మడి ప్రాజెక్టుల్లో రాష్ట్రానికి కేటాయించిన నీటిని వాడుకునే అవకాశం కల్పించేలా తెలంగాణ సర్కార్‌ను నియంత్రించడంలో మీ వైఫల్యంవల్లే మా భూభాగంలోని నాగార్జునసాగర్ స్పిల్ వేలో సగం, కుడి కాలువ హెడ్ రెగ్యులేటర్‌ను గురువారం స్వాధీనం చేసుకున్నామని కృష్ణా బోర్డుకు ఏపీ ప్రభుత్వం తేల్చిచెప్పింది. ఏపీకి కేటాయించిన నీటిని తాగునీటి అవసరాల కోసం సాగర్ కుడి కాలువకు విడుదల చేశామని స్పష్టంచేసింది. ఈ మేరకు కృష్ణా బోర్డు చైర్మన్ శివ్‌నందన్‌కుమార్‌కు రాష్ట్ర జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ శుక్రవారం రాత్రి లేఖ రాశారు. సాగర్ స్పిల్‌వేలో సగభాగాన్ని ఏపీ స్వాధీనం చేసుకుందని కృష్ణా బోర్డుకు తెలంగాణ సర్కార్ ఫిర్యాదు చేసింది. కుడి కాలువకు నీటి విడుదలను ఆపేలా ఏపీ సర్కార్‌ను ఆదేశించాలని ఆ లేఖలో కోరింది. తెలంగాణ సర్కార్ ఫిర్యాదుపై కృష్ణా బోర్డు ఏపీ సర్కార్‌కు శుక్రవారం లేఖ రాసింది. తక్షణమే నీటి విడుదలను నిలిపేయాలన్న కృష్ణా బోర్డు ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం తోసిపుచ్చుతూ శశిభూషణ్‌కుమార్ బదులిచ్చారు. ఏపీ లేఖలో ప్రధానాంశాలివీ..

- శ్రీశైలం ప్రాజెక్టు నిర్వహణ బాధ్యత కర్నూలు ప్రాజెక్ట్స్ సీఈకి, సాగర్ నిర్వహణ బాధ్యత ఆ ప్రాజెక్టు సీఈకి అప్పగించారు. 2014 నుంచే తెలంగాణ భూభాగంలోని శ్రీశైలం ఎడమ గట్టు కేంద్రాన్ని ఆ రాష్ట్ర ప్రభుత్వం కర్నూలు ప్రాజెక్ట్స్ సీఈకి అప్పగించకుండా.. తానే నిర్వహిస్తోంది. అదే సమయంలో మా భూభాగంలోని సాగర్ కుడి కాలువ హెడ్ రెగ్యులేటర్‌ను సైతం తెలంగాణ తన అధీనంలోకి తీసుకుంది.
- గత తొమ్మిదేళ్లుగా ఎడమ గట్టు కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ శ్రీశైలాన్ని ఖాళీచేస్తూ సాగర్‌కు తరలించి.. అటు సాగర్ ఎడమ కాలువలో తమ పరిధిలోని ఆయకట్టుకు నీళ్లందిస్తూ రాష్ట్ర హక్కులను తెలంగాణ హరిస్తోందని అనేకసార్లు బోర్డుకు ఫిర్యాదు చేశాం. ఈ క్రమంలోనే ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జునసాగర్‌లను స్వాధీనం చేసుకోవాలని బోర్డును అనేక సార్లు కోరాం. లేదంటే ఏపీ భూభాగంలోని సాగర్ కుడి కాలువ హెడ్ రెగ్యులేటర్‌ను ఏపీకి అప్పగించాలని కోరాం. కానీ, వీటిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు.
- అక్టోబరు 6న త్రిసభ్య కమిటీ చేసిన సిఫార్సుల మేరకు శ్రీశైలం నుంచి 30 టీఎంసీలు, సాగర్ నుంచి 15 టీఎంసీలను ఏపీకి కేటాయిస్తూ కృష్ణా బోర్డు అక్టోబరు 9న ఉత్తర్వులిచ్చింది. తెలంగాణకు 35 టీఎంసీలు కేటాయించింది. ఆ ఉత్తర్వులను ఉల్లంఘిస్తూ యథావిధిగా అదే రోజున ఎడమ గట్టు కేంద్రంలో విద్యుదుత్పత్తి ప్రారంభించి శ్రీశైలాన్ని తెలంగాణ సర్కార్ ఖాళీచేస్తూ వచ్చింది. దీనిపై అప్పుడే బోర్డుకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదు. దీనివల్ల శ్రీశైలంలో మాకు కేటాయించిన 30 టీఎంసీల్లో కేవలం 13 టీఎంసీలనే వాడుకునే పరిస్థితి ఏర్పడింది. తెలంగాణ చర్యలవల్ల 17 టీఎంసీలను కోల్పోయాం.
- సాగర్ కుడి కాలువ కింద మాకు కేటాయించిన 15 టీఎంసీల్లో ఇప్పటివరకు ఐదు టీఎంసీలు వాడుకున్నాం. మిగతా పది టీఎంసీలను వాడుకోనివ్వకుండా సాగర్‌ను తెలంగాణ ఖాళీచేస్తే.. గుంటూరు, పల్నాడు, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో తాగునీటి ఎద్దడిని తీర్చడం సవాల్‌గా మారుతుందన్న ఆందోళనతోనే సాగర్ స్పిల్ వేను స్వాధీనం చేసుకుని, కుడి కాలువకు నీటిని విడుదల చేసి మా హక్కులను పరిరక్షించుకున్నాం. నీటి విడుదలను ఆపే ప్రశ్నేలేదు.

తెలంగాణలో 71.34 శాతం ఓటింగ్

2018తో పోల్చుకుంటే 1.86% తగ్గుదల

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఈసారి అర్హులైన ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగినా, ఆ మేరకు ఎక్కువ మంది ఓటు హక్కు వినియోగించుకోకపోవడంతో పోలింగ్ శాతం తగ్గింది. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 3,26,02,793 మంది ఓటర్లకు గాను 2,32,59,256 మంది (71.34%) తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 1,62,98,482 మంది పురుషులకు గాను 1,15,84,728 మంది, 1,63,01,634 మంది మహిళలకు గాను 1,16,73,722 మంది, 2,677 మంది థర్డ్ జెండర్ ఓటర్లకు గాను 806 మంది ఓటేశారు. గురువారం నాటి పోలింగ్‌కు సంబంధించిన తుది గణాంకాలను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) శుక్రవారం రాత్రి విడుదల చేశారు. అత్యధికంగా మునుగోడులో 91.89 శాతం పోలింగ్ నమోదు కాగా..పాలేరు (90.89 శాతం), ఆలేరు (90.77శాతం) తర్వాతి స్థానాల్లో నిలిచాయి. అత్యల్పంగా యాకుత్‌పురలో 39.64 శాతం నమోదైంది. మలక్‌పేట (41.32 శాతం), చార్మినార్ (43.27 శాతం) ఆపై స్థానాల్లో ఉన్నాయి. ఈ సారి ఎన్నికల్లో పురుషుల కంటే మహిళలు అధిక సంఖ్యలో ఓటేయడం గమనార్హం. కాగా 2018లో జరిగిన ఎన్నికల్లో 73.2 శాతం పోలింగ్ నమోదైంది. ఈ ఎన్నికలతో పోల్చితే ప్రస్తుత ఎన్నికల్లో 1.86 శాతం పోలింగ్ తగ్గింది. 2018 ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో మొత్తం 2.8 కోట్ల మంది ఓటర్లుండగా, 2.05 కోట్ల మంది ఓటేశారు. అయితే ఈసారి ఓటర్ల సంఖ్య భారీగా పెరిగి 3.26 కోట్లకు చేరుకోగా, 2.32 కోట్ల మందే తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ కారణంగానే.. 2018 అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే ప్రస్తుతం 26.78 లక్షల మంది ఎక్కువగా ఓటేసినా, పోలింగ్ శాతం మాత్రం తగ్గింది.




ఒంగోలు బృందావన్‌నగర్‌లో పి.సారమ్మకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శిరీష


నెల్లూరులోని సాదానగర్‌లో లీలావతికి వితంతు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ వి.కోమల


కాకినాడ జిల్లా పెదకొత్తూరులో వృద్ధురాలు సీతమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ వీరలక్ష్మి


విజయవాడలో చికిత్స పొందుతున్న నున్నకి చెందిన మోహనరావుకు పింఛను అందిస్తున్న వలంటీర్ పావని


విజయనగరంలోని దాసన్నపేటలో సత్యవతికి వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ నీరజ


నంద్యాల జిల్లా గుళ్లదూర్తిలో దస్తగిరమ్మకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సుబ్బమ్మ


గుంటూరు యాదవ్ బజారులో శామ్యూల్‌కు దివ్యాంగ పింఛన్ అందజేస్తున్న వలంటీరు జ్యోతి


ఏలూరులో పోలవరపు రామకృష్ణకు దివ్యాంగ పింఛన్ అందిస్తున్న వలంటీర్ ఎ.కృప


శ్రీకాకుళం నగరంలోని బైరవానిపేటలో రాజులమ్మకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ అనిత


తిరుపతిలో చికిత్స పొందుతున్న వెంకటాపురానికి చెందిన బత్తెమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ తులసి


అనంతపురం సున్నపువీధిలో రసూల్‌బీకి వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వార్డు వలంటీర్ రాజు


విశాఖలోని శివాజీపాలెంలో ఎర్రయ్యమ్మకు దివ్యాంగ పింఛన్ అందజేస్తున్న వలంటీర్ హేమలత

1వ తేదీన రూ.1,447.82 కోట్ల పంపిణీ

తొలి రోజునే 80.42 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి


కడప నగరం రవీంద్రనగర్‌లో రెడ్డి శేఖర్‌కు దివ్యాంగ పింఛన్ అందించేందుకు బయో మెట్రిక్ తీసుకుంటున్న వలంటీర్ రూతు

సాక్షి, అమరావతి: ఠంచన్‌గా 1వ తేదీనే రాష్ట్ర వ్యాప్తంగా అవ్వాతాతలు, వితంతు, దివ్యాంగ, ఒంటరి మహిళ, చేతి వృత్తిదారులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు పింఛన్ డబ్బులు ప్రభుత్వం పంపిణీ చేసింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచే వలంటీర్లు ఇంటింటికి వెళ్లి సాయంత్రం వరకు 52,54,500 మంది లబ్ధిదారులకు రూ.1447.82 కోట్లు పింఛన్ డబ్బులు పంపిణీ చేశారు. మొత్తం లబ్ధిదారుల్లో 80.42 శాతం మందికి శుక్రవారమే పింఛన్లు పంపిణీ పూర్తి కాగా మిగిలిన వారి కోసం ఈ నెల 5 వరకు వలంటీర్లు ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ కొనసాగనుంది.

ప్రభుత్వ పనితీరుకు గణాంకాలే నిదర్శనం

మంత్రి ధర్మాన ప్రసాదరావు



సాక్షి ప్రతినిధి, గుంటూరు: రాష్ట్ర ప్రభుత్వం పనితీరుకు కనిపిస్తున్న గణాంకాలే నిదర్శనమని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి, గుంటూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధర్మాన ప్రసాదరావు తెలిపారు. శుక్రవారం గుంటూరులో నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2014–19 మధ్య కాలంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు జీడీపీ 16 శాతం ఉండగా, మన ప్రభుత్వంలో నాల్గోవ స్థానానికి ఎగబాకిందన్నారు. వ్యవసాయంలో నాడు మైనస్ 6.5 ఉండగా, మన ప్రభుత్వంలో ప్లస్ 5.56కు చేరిందని తెలిపారు. పారిశ్రామిక అభివృద్ధి అప్పట్లో 3.2 శాతం గ్రోత్ ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 10.59కి చేరిందన్నారు.. దీంతోపాటు రాష్ట్ర పర్ క్యాపిట టీడీపీ ప్రభుత్వంలో 17వ స్థానంలో ఉండగా, మన ప్రభుత్వంలో తొమ్మిదో స్థానంలో నిలిచిందన్నారు. ఇలా అనేక విభాగాల్లో మన రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతుందని కేంద్ర గణాంకాలు చెబుతున్నాయని మంత్రి వివరించారు. విమర్శలు చేసేవారిని పట్టించుకోవద్దని, మనం చేస్తున్న మంచిని మాత్రమే చూస్తూ ముందుకు వెళ్లాలని సూచించారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న అధికారులతో పాటు క్షేత్ర స్థాయి సిబ్బంది కూడా ప్రభుత్వ కార్యక్రమాలను తమ కార్యక్రమాలుగా భావించి పనిచేయాలని కోరారు.

త్వరలో వీసీఐసీ రెండో దశ పనులకు శ్రీకారం

సాక్షి, అమరావతి: విశాఖ–చెన్నై పారిశ్రామిక కారిడార్ (వీసీఐసీ) రెండవ దశ అభివృద్ధి పనులకు రంగం సిద్ధమైంది. ఈ కారిడార్‌లో రెండో దశ కింద మూడు పారిశ్రామిక పార్కులను రూ.1,632.82 కోట్లతో అభివృద్ధి చేయనుండగా అందులో రూ.1,130 కోట్లు ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంకు (ఏడీబీ) రుణం ఇవ్వడానికి ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో చిత్తూరు నోడ్‌లోని రౌతుసురమాల పారిశ్రామిక పార్కు, విశాఖ నోడ్‌లోని నక్కపల్లి, రాంబిల్లి పార్కులను ఏపీఐఐసీఐ అభివృద్ధి చేయనుంది. ఈ మూడు పార్కుల ద్వారా సుమారు 23,046 ఎకరాలు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే రౌతుసురమాల, నక్కపల్లి పార్కుల అభివృద్ధికి టెండర్లు పిలిచామని, త్వరలోనే రాంబిల్లి పార్కుకు టెండర్లు పిలవనున్నట్లు ఏపీఐఐసీ వీసీఎండీ ప్రవీణ్‌కుమార్ 'సాక్షి'కి తెలిపారు. ఇందులో రౌతుసురమాలను రూ.462.96 కోట్లతో 2,770 ఎకరాల స్టార్టప్ ఏరియాను అభివృద్ధి చేయడానికి టెండర్లు పిలిచామని, ఈ టెండర్లకు ఏడీబీ ఆమోదం తెలపడంతో త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు ఆయన చెప్పారు. అలాగే, నక్కపల్లి క్లస్టర్‌లో రూ.399.03 కోట్లతో 1,120 ఎకరాల స్టార్టప్ ఏరియా అభివృద్ధికి టెండర్లు పిలిచామని.. దీనికి ఏడీబీతో ఇంకా ఒప్పందం కుదుర్చుకోవాల్సి ఉందన్నారు. ఇక రాంబిల్లిలో రూ.149 కోట్లతో 396 ఎకరాల అభివృద్ధికి సంబంధించి టెండర్లు పిలవనున్నట్లు ఆయన తెలిపారు.

'ఐబీ' అడుగులు

▶ మొదటి పేజీ తరువాయి

విస్తరించాలని సూచించారు. అందుకు అనుగుణంగా ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలని నిర్దేశించారు. ఈమేరకు విద్యాశాఖపై శుక్రవారం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో సీఎం జగన్ పలు కీలక సూచనలు చేశారు. పాఠ్య ప్రణాళికలో ఆర్థిక పాఠాలను అంతర్భాగం చేయాలన్నారు. హైస్కూల్ స్థాయిలో ప్రతి తరగతిలోనూ ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లు (ఐఎఫ్‌పీ) అందుబాటులో ఉండాలన్నారు. టోఫెల్ అమలు తీరు మరింత మెరుగ్గా ఉండాలని సూచించారు. దేశవ్యాప్తంగా సగటున 37.03 శాతం మంది ఇంగ్లిష్ మీడియంలో పరీక్షలు రాస్తుండగా ఆంధ్రప్రదేశ్‌లో 84.11 శాతం మంది ఆంగ్ల మాధ్యమంలో పరీక్షలు రాస్తున్నట్లు ఈ సందర్భంగా అధికారులు వెల్లడించారు. మిగిలిన పిల్లలను కూడా ప్రోత్సహిస్తూ వంద శాతం ఇంగ్లిష్ మీడియంలో పరీక్షలు రాసేలా సిద్ధం చేయాలని సీఎం సూచించారు. నాడు–నేడు రెండో దశ పనులు నిర్దేశిత గడువులోగా పూర్తి కావాలని స్పష్టం చేశారు. సమీక్షలో ముఖ్యాంశాలు ఇవీ..

ప్రతి స్కూల్‌కూ ఇంటర్నెట్

'నాడు– నేడు తొలిదశ పనులు పూర్తైన స్కూళ్ల నిర్వహణను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలి. అవసరమైన నిధులు అందించాలి. నాడు– నేడు రెండో దశ పనులను నిర్దేశించుకున్న గడువులోగా పూర్తి చేయాలి. ప్రభుత్వ జూనియర్ కాలేజీలను కూడా పాఠశాలల స్థాయిలో అద్భుతంగా తీర్చిదిద్దాలి. డిసెంబర్ మూడోవారం నాటికి రాష్ట్రవ్యాప్తంగా అన్ని హైస్కూళ్లలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్ల (ఐఎఫ్‌పీ) ఏర్పాటు పూర్తి చేయాలి. దీంతోపాటు ప్రతి పాఠశాలకు ఇంటర్నెట్ సదుపాయం కచ్చితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేకంగా దృష్టి పెట్టి రాణించేలా చర్యలు చేపట్టాలి' అని సీఎం ఆదేశించారు. నాడు–నేడు రెండో దశ కింద రూ.3,746.82 కోట్ల విలువైన పనులు చేపట్టి 11 రకాల సదుపాయాలను కల్పిస్తున్నట్లు అధికారులు వివరించారు. నాడు – నేడు రెండో దశ పనులు చురుగ్గా జరుగుతున్నాయని, డిసెంబర్ నాటికి ఐఎఫ్‌పీ ప్యానళ్ల ఏర్పాటు పూర్తవుతుందని, అదే రోజు ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు సైతం పంపిణీ పూర్తి చేస్తామని తెలిపారు. అన్ని ట్యాబ్‌ల్లో విద్యార్థుల సందేహాలను తీర్చే యాప్‌లను ఇన్‌స్టాల్ చేశామన్నారు. టీచర్లకు కూడా ట్యాబ్‌ల పంపిణీతో బోధనలో మంచి మార్పులు వచ్చాయని, గతేడాది ట్యాబ్‌లను పొందిన ఉపాధ్యాయులు సగటున రోజూ 77 నిమిషాలు వినియోగిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు పాఠ్యాంశాలను నేర్చుకునేందుకు సగటున 67 నిమిషాలు ట్యాబ్‌లను వాడుతున్నట్లు తెలిపారు.


విద్యాశాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ఇంగ్లిష్ మీడియంలో పరీక్షలు..

ఇంగ్లిష్ మీడియంలో పరీక్షలు రాసే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగినట్లు అధికారులు వెల్లడించారు. మూడో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు యూనిట్ పరీక్షల్లో 87 శాతం మంది ఇంగ్లిష్ మీడియంలోనే పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా సగటున 37.03 శాతం మంది మాత్రమే ఇంగ్లిష్ మీడియంలో పరీక్షలు రాస్తుండగా ఏపీలో 84.11 శాతం మంది విద్యార్థులు ఆంగ్ల మాధ్యమంలోనే పరీక్షలు రాస్తున్నట్లు చెప్పారు. టోఫెల్ శిక్షణకు అనుగుణంగా అన్ని చర్యలు చేపట్టామని, రోజూ ఒక పీరియడ్ చొప్పున శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

వంద శాతంతో నంద్యాల రికార్డు

మళ్లీ స్కూళ్లు తెరిచేలోగా విద్యాకానుక పంపిణీకి చర్యలు తీసుకోవాలని సీఎం జగన్ అధికారులను ఆదేశించారు. డ్రాపౌట్స్‌ను అరికట్టేందుకు చేపట్టిన స్పెషల్ డ్రైవ్ సత్ఫలితాలను ఇస్తున్నట్లు అధికారులు తెలిపారు. పదో తరగతి ఫెయిల్ అయిన వారితో సహా 1,49,515 మంది తిరిగి స్కూళ్లలో చేరినట్లు చెప్పారు. పిల్లలను తిరిగి బడులకు పంపే ప్రక్రియలో వలంటీర్లు కీలక పాత్ర పోషించారని, దేశంలో నూరు శాతం పిల్లలను బడికి పంపిన తొలి జిల్లాగా నంద్యాల రికార్డు సృష్టించిందని అధికారులు ముఖ్యమంత్రికి దృష్టికి తెచ్చారు.

ఐబీపై టీచర్లకు శిక్షణ..

ఐబీ సిలబస్ అమలుపై ఇప్పటికే వర్కింగ్ గ్రూప్ సమావేశాలకు హాజరైనట్లు అధికారులు వివరించారు. ఫేజ్–1 పాఠ్య ప్రణాళిక, అసెస్‌మెంట్, టీచర్ ట్రైనింగ్, ఇక్కడి అవసరాలను దృష్టిలో పెట్టుకుని బోధనా ప్రణాళిక, తదితర అంశాలపై అధ్యయనం చేస్తున్నట్లు చెప్పారు. ఐబీ బోధనా పద్ధతులపై వచ్చే విద్యా సంవత్సరంలో టీచర్లకు శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు (విద్యాశాఖ) ఆలూరు సాంబశివారెడ్డి, ఏపీఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ నాగార్జున యాదవ్, పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్, ఆర్థికశాఖ కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ, పాఠశాల విద్యాశాఖ (మౌలిక సదుపాయాలు) కమిషనర్ కాటమనేని భాస్కర్, ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి, ఎస్ఎస్ఏ ఎస్పీడీ బి.శ్రీనివాసరావు, ఏపీఎస్ఎఫ్ఎల్ ఎండీ ఎం.మధుసూదనరెడ్డి, ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ డి. దేవానందరెడ్డి, నాడు – నేడు టెక్నికల్ డైరెక్టర్ మనోహరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఏడాది నుంచి విదేశీ భాషలు

మన విద్యార్థులు ఉన్నత చదువులు, ఉద్యోగాల కోసం ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలకు వెళుతున్న నేపథ్యంలో అక్కడ మెరుగ్గా రాణించేలా పాఠశాల స్థాయి నుంచే వారికి విదేశీ భాషలు నేర్పించాలని సీఎం సూచించారు. ఆర్థిక అంశాలను సైతం పాఠ్యాంశాల్లో అంతర్భాగం చేయాలన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఫ్యూచర్ స్కిల్స్‌పై పాఠ్యాంశాల బోధన చేపట్టాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి హైస్కూల్ స్థాయిలో విద్యార్థులు విదేశీ భాషలను ఐచ్ఛికంగా ఎంచుకునే అవకాశం కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. జపనీస్, జర్మన్, ఫ్రెంచ్, స్పానిష్, చైనీస్, మాండరిన్ తదితర భాషలు విద్యార్థులకు నేర్పించనున్నట్లు చెప్పారు. ఆయా భాషలను నేర్చుకునేందుకు వీలుగా యాప్ అందుబాటులోకి తెస్తామన్నారు. ఫ్యూచర్ స్కిల్స్‌లో విద్యార్థులకుయ ట్రైనింగ్ కోసం ఇంజనీరింగ్ కాలేజీలలో నైపుణ్యం ఉన్నవారి సేవలను వినియోగించుకుంటూ స్టైఫండ్ చెల్లించనున్నట్లు తెలిపారు.

ఆర్టీసీలో రెండు కేటగిరీల ప్రకారం పదోన్నతులు

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రజా రవాణా విభాగం(ఆర్టీసీ) ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఉద్యోగుల సర్వీసు నిబంధనల డిమాండ్‌పై సానుకూలంగా స్పందించింది. రెండు కేటగిరీల ప్రకారం పదోన్నతులు కల్పించే విధానాన్ని ఆమోదించింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులిచ్చింది. ప్రభుత్వంలో విలీనం చేయక ముందు అంటే.. 2020, జనవరి 1 కంటే ముందు నుంచి ఆర్టీసీలో ఉన్న ఉద్యోగులకు గతంలో అమలు చేసిన ఆర్టీసీ సర్వీస్ నిబంధనలే వర్తిస్తాయి. ఆర్టీసీని విలీనం చేశాక ఉద్యోగాల్లో చేరిన వారికి ప్రజా రవాణా విభాగం(పీటీడీ) సర్వీస్ నిబంధనలు అమలు చేస్తారు. ఈ మేరకు పీటీడీ సర్వీసు నిబంధనల్లోని సెక్షన్ 5ను సవరిస్తూ ప్రభుత్వం గతంలో ఆర్డినెన్స్ ఇచ్చింది. అనంతరం సవరణ బిల్లునూ ఆమోదించింది. కాగా, ఈ విధానంపై తుది మార్గదర్శకాలను ఖరారు చేస్తూ పీటీడీ నిబంధనల్లోని సెక్షన్ 5ను సవరిస్తూ శుక్రవారం ఉత్తర్వులిచ్చింది.

రెండు కేటగిరీలుగా పదోన్నతులు

2020, జనవరి 1 కంటే ముందు నుంచి ఉన్న దాదాపు 50 వేలమంది ఉద్యోగులకు పదోన్నతులు, క్రమశిక్షణ చర్యలు మొదలైనవన్నీ ఆర్టీసీ సర్వీస్ నిబంధనల మేరకే కల్పిస్తారు. ఎందుకంటే గతంలో ఉద్యోగులుగా నియమితులైనవారికి పదోన్నతులకు సంబంధించి విద్యార్హతల నిబంధనలు ప్రత్యేకంగా ఉండేవి. ఆర్టీసీని విలీనం చేశాక రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసు నిబంధనలను ఆర్టీసీ ఉద్యోగులకు వర్తింపజేశారు. దీంతో గతంలో తక్కువ విద్యార్హతతో ఉద్యోగాలు పొంది.. పదోన్నతులకు అర్హత కలిగిన ఉద్యోగులు తాజా నిబంధనలతో నష్టపోయే అవకాశాలున్నాయని ఉద్యోగ సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ విషయాన్ని పరిశీలించిన ప్రభుత్వం సర్వీస్ నిబంధనలను సవరించింది. ఆర్టీసీని విలీనం చేసేనాటికి(2020, జనవరి 1) ఉద్యోగులుగా ఉన్నవారికి ఆర్టీసీ సర్వీస్ నిబంధనల మేరకు పదోన్నతులు కల్పించే విధానాన్ని అమల్లోకి తెచ్చింది. దీంతో దాదాపు 50 వేల మందికి ప్రయోజనం కలగనుంది. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశాక ఉద్యోగాల్లో చేరిన వారికి ప్రభుత్వ ఉద్యోగుల సర్వీస్ నిబంధనల మేరకు పదోన్నతులు కల్పిస్తారు. ప్రస్తుతం ఆ కేటగిరీలో ఆర్టీసీలో 311 మంది ఉద్యోగులున్నారు. ఇక భవిష్యత్‌లో ఆర్టీసీలో ఉద్యోగులుగా నియమితులయ్యేవారికి ప్రభుత్వ ఉద్యోగుల సర్వీస్ నిబంధనలు వర్తిస్తాయి.

టీచర్లను రెచ్చగొట్టేలా ఈనాడు దుర్మార్గపు రాతలు

- వైఎస్ జగన్ సర్కారులోనే ఉపాధ్యాయులకు గౌరవప్రద జీవితం
- గతంలో ఉపాధ్యాయులను అవమానించింది చంద్రబాబే..
- వైఎస్సార్‌సీపీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: రాష్ట్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులను రెచ్చగొట్టేలా ఈనాడు కథనాలు రాస్తోందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి చెప్పారు. నెల్లూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈనాడులో ఉపాధ్యాయులపై రాసిన కథనం పూర్తిగా అవాస్తవమన్నారు. ప్రభుత్వ టీచర్లు విద్యార్థుల స్థితిగతులపై డిక్లరేషన్ ఇవ్వాలని మౌఖిక ఆదేశాలు ఇచ్చారని శుక్రవారం ఈనాడు వార్త ప్రచురించిందని, కానీ ప్రభుత్వం ఎప్పుడూ మౌఖిక ఆదేశాలు ఇవ్వదని, అధికారికంగా పేపర్ పరంగా ఆదేశాలుంటాయనేది ఆ పత్రికకు తెలియదా అని ప్రశ్నించారు. ఎవరు మౌఖిక ఆదేశాలిచ్చారో రాయకుండా టీచర్లను రెచ్చగొట్టేలా రాయడం దుర్మార్గమన్నారు. ఉపాధ్యాయులకు ఎలాంటి సమస్యలున్నా తక్షణమే సీఎం వైఎస్ జగన్ పరిష్కరిస్తున్నారని గుర్తుచేశారు. ఇకనైనా ఈనాడు ఇలాంటి అసత్య కథనాలు రాయడం మానుకోవాలని హితవు పలికారు.

గతంలో బాబు ఎంతోమందిని అవమానించారు

చంద్రబాబు అధికారంలో ఉన్న సమయంలో అనంతపురం ప్రాంతంలో ఒక పాఠశాలలో టీచర్ స్కూల్లోని సమస్యలను చంద్రబాబు దృష్టికి తీసుకొస్తే.. ఆ టీచర్‌ను యూజ్‌లెస్ ఫెలో అంటూ తిట్టి సస్పెండ్ చేశారని, అదే జిల్లా శింగనమల ప్రాంతంలో పంచాయతీ అధికారి ఒకరిని జీపుపై ఎక్కించి అవమానించిన ఘనత బాబుదేనన్నారు. టీడీపీ నేత నిమ్మల కిష్టప్ప ఉపాధ్యాయులను చెట్టుకు కట్టేసి కొట్టండి అని గతంలో అన్నారని గుర్తుచేశారు. కొన్ని పత్రికలు, ప్రతిపక్షాలు విద్యావ్యవస్థపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో వసతులు కల్పించి, ఉపాధ్యాయులకు గౌరవాన్ని పెంచిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని చంద్రశేఖర్‌రెడ్డి చెప్పారు.

రేపు విభిన్న ప్రతిభావంతుల అంతర్జాతీయ దినోత్సవం

సాక్షి, అమరావతి: విభిన్న ప్రతిభావంతుల అంతర్జాతీయ దినోత్సవాన్ని ఈనెల 3వ తేదీన నిర్వహించాలనీ, ఇందుకోసం ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర మహిళా, శిశు, విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ ఎస్.శ్రీనివాసరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. విభిన్న ప్రతిభావంతులకు సేవలు అందించే అన్ని శాఖల అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసి ఈ దినోత్సవాన్ని నిర్వహించాలని జిల్లా కలెక్టర్‌లకు ఆదేశాలు ఇచ్చారు. విభిన్న ప్రతిభావంతుల హక్కులు, ప్రభుత్వం అందిస్తున్న పథకాలు వంటి వివరాలు తెలిపి, వాటిని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు.

ప్రభుత్వోద్యోగులకు ఏడాదిలో 7 రోజులు లీవ్‌లు

ప్రభుత్వ ఉద్యోగుల్లో విభిన్న ప్రతిభావంతులకు ఏడాదిలో ఏడు రోజులు స్పెషల్ క్యాజువల్ లీవ్‌లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ప్రిన్సిపల్ సెక్రటరీ జి.జయలక్ష్మి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏడాదిలో ఏడు రోజులకు మించి వారు విధులకు గైర్హాజరైతే ఆ కాలాన్ని సాధారణ సెలవుగా పరిగణించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

సీఎం వైఎస్ జగన్ సహకారం మరువలేనిది

పెప్పర్ మోషన్ విద్యుత్ వాహనాల తయారీ సంస్థ సీఈవో ఆండ్రియాస్ హేగర్

- పుంగనూరు మండలం ఆరడిగుంటలో 800 ఎకరాల్లో పరిశ్రమ
- 4,640 కోట్లతో ఏర్పాటు.. 8,100 మందికి ఉపాధి
- ఫిబ్రవరిలో పనులు ప్రారంభం.. 2027కి 30 వేల బస్సులు, ట్రక్కులు విడుదల
- భారతదేశం పెప్పర్ సంస్థకు రెండవ పుట్టినిల్లని వెల్లడి
- ఆరడిగుంటలో పరిశ్రమ స్థలాన్ని పరిశీలించిన హేగర్ బృందం


పుంగనూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పెప్పర్ సంస్థ సీఈవో ఆండ్రియాస్ హేగర్, పక్కన కలెక్టర్ షన్మోహన్

పుంగనూరు: జర్మనీకి చెందిన తమకు రాష్ట్రంలో పరిశ్రమ ఏర్పాటులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సహకారం మరువలేనిదని పెప్పర్ మోషన్ విద్యుత్ బస్సుల తయారీ సంస్థ సీఈవో ఆండ్రియాస్ హేగర్ చెప్పారు. తాము చిత్తూరు జిల్లా పుంగనూరులో ఏర్పాటు చేయబోయే పరిశ్రమ ద్వారా యువతకు ఉపాధి కల్పిస్తామని తెలిపారు. హేగర్, ఆయన బృందం శుక్రవారం పుంగనూరు మండలంలోని ఆరడిగుంటలో పెప్పర్ మోషన్ బస్సులు, ట్రక్కుల తయారీ పరిశ్రమకు కేటాయించిన భూమిని జిల్లా కలెక్టర్ షన్మోహన్‌తో కలిసి పరిశీలించింది. ఈ సందర్భంగా హేగర్ జిల్లా కలెక్టర్‌తో, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్‌తో పలు విషయాలపై చర్చించారు. అనంతరం పుంగనూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. భారతదేశం పెప్పర్ మోషన్ సంస్థకు రెండో పుట్టినిల్లు అని తెలిపారు. 2009లో తొలిసారిగా ఇండియాను సందర్శించామన్నారు. భారతదేశంలో అధిక జనాభా ఉన్నారని, అధిక శాతం వాహనాలను వినియోగిస్తున్నారని తెలిపారు. అందుకే ఇక్కడ 800 ఎకరాలలో రూ.4,640 కోట్లతో పరిశ్రమ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇందులో 8,100 మందికి ఉపాధి కల్పిస్తామన్నారు. ఫిబ్రవరిలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. 2027 నాటికి 30 వేల బస్సులు, ట్రక్కులను మార్కెట్‌లో విడుదల చేస్తామన్నారు. మూడు దశల్లో నిర్మాణం చేస్తామని తెలిపారు. పర్యావరణానికి పూర్తి అనుకూలమైన విద్యుత్ బస్సులు, ట్రక్కుల తయారీతో పాటు విడిభాగాల తయారీ పరిశ్రమ కూడా ఇక్కడే ఏర్పాటు చేస్తామన్నారు. బెంగళూరు, తమిళనాడుకు పుంగనూరు జాతీయ రహదారులు అనుసంధానం కావడం, విమానాశ్రయాలు, రవాణా సదుపాయాలు ఎంతో బాగుండడంతో ఇక్కడ పరిశ్రమ పెట్టాలని నిర్ణయించామన్నారు. దీని ద్వారా అంతర్జాతీయ స్థాయిలో వ్యాపారాలు కొనసాగించేందుకు వీలుందని సీఈవో తెలిపారు. ఈ పరిశ్రమ ఏర్పాటులో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి,, ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ షన్మోహన్ పూర్తి సహకారం అందిస్తున్నారని చెప్పారు.

సువర్ణాక్షరాలతో లిఖించదగ్గది: జిల్లా కలెక్టర్


పుంగనూరు మండలంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన జర్మన్ పెప్పర్ ఎలక్ట్రికల్ బస్సుల సంస్థ పరిశ్రమ ఏర్పాటు కావడం సువర్ణాక్షరాలతో లిఖించదగ్గదని జిల్లా కలెక్టర్ షన్మోహన్ కొనియాడారు. రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి చొరవతో పరిశ్రమ ఏర్పాటవుతోందన్నారు. నిరుద్యోగులు ఉపాధి కోసం వలసలు వెళ్లకుండా ఇక్కడే 8 వేల మందికి ఉపాధి లభిస్తుందని కలెక్టర్ తెలిపారు.

ఘన స్వాగతం

పెప్పర్ కంపెనీ సీఈవో ఆండ్రియస్ హేగర్‌కు, ఆయన బృందానికి కర్ణాటక సరిహద్దులో పుంగనూరు ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొత్తపల్లె చెంగారెడ్డి ఘన స్వాగతం పలికారు. శాలువలు కప్పి సన్మానించారు. హేగర్‌తో పాటు ఆ సంస్థ సీటీవో డాక్టర్ మదియాస్ కెర్లర్, సీఎస్‌వో సత్య, ఫైనాన్స్ డైరెక్టర్ ఉవే స్టెల్డర్, సీఐవో రాజశేఖర్‌రెడ్డి, సీఎస్‌వో సత్య బులుసు, సీసీవో రవిశంకర్, ఉర్త్ ఎలక్ట్రానిక్స్ ఎండీ హర్ష ఆద్య తదితరులు ఉన్నారు.

సీఎంకు కృతజ్ఞతతో..శబరిమలకు పాదయాత్ర

అనారోగ్యంతో ఉన్న తన కుమార్తెను ఆదుకోవడంతో సీఎంకు కృతజ్ఞతగా


పాదయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చెరుకువాడ

పెనుగొండ: అరుదైన వ్యాధితో బాధపడుతోన్న తన కూతురికి లక్షలాది రూపాయల వ్యయంతో అండగా నిలిచిన సీఎం వైఎస్ జగన్ రాష్ట్రానికి అవసరమని, పేద ప్రజలకు అండగా నిలిచే నాయకుడు జగనే మళ్లీ మళ్లీ సీఎం కావాలని ఆకాంక్షిస్తూ ఓ అయ్యప్ప మాలధారుడు శబరిమలకు పాదయాత్రను ప్రారంభించారు. పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ మండలం తూర్పుపాలెంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు పాదయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆచంట మండలం అయోధ్యలంకకు చెందిన కొప్పాడి రాంబాబు కుమార్తె హనీ చిన్న వయసులోనే అరుదైన వ్యాధికి గురైంది. వ్యవసాయం చేసుకొంటూ జీవించే రాంబాబు వైద్యం చేయించలేక దిక్కుతోచని స్థితిలో ఉన్న తరుణంలో 2022 జూన్ 23న గంటి పెదపూడి వచ్చిన సీఎం జగన్ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. దీంతో సత్వర వైద్యానికి ఆర్థికంగా అండగా నిలుస్తానని సీఎం భరోసా ఇచ్చారు. హనీకి ప్రతి నెలా రూ.1.50 లక్షలతో ఇంజక్షన్ చేయించవలసి ఉంది. దీనికయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందంటూ సీఎం భరోసా ఇచ్చి అక్టోబర్‌లో వైద్య సహాయం ప్రారంభించారు. దీనికి గాను ఒకేసారి 40 ఇంజక్షన్లను అందజేశారు. అవి ఇప్పటివరకు రావడంతో మరోసారి 24 ఇంజక్షన్లు 2 రోజుల్లో పంపించనున్నారని రాంబాబు శుక్రవారం తెలిపారు. వైద్యం అందించడమే కాకుండా, కోనసీమ జిల్లాలోని ప్రైవేటు పాఠశాలలోనూ చదువుకునేందుకు ఏర్పాటు చేసి, నెలకు రూ.10 వేలు పింఛన్ సౌకర్యం కల్పించారని తెలిపారు. అందుకే సీఎంగా జగనే కావాలని అయ్యప్ప స్వామిని కోరుకుంటూ శబరిమల వరకు పాదయాత్ర చేయనున్నట్లు చెప్పారు.

హెచ్ఐవీ రహిత సమాజమే లక్ష్యం

సాక్షి, అమరావతి: హెచ్ఐవీ రహిత సమాజమే లక్ష్యంగా దేశానికే మార్గదర్శకంగా నిలిచే పద్ధతులను ఏపీలో పాటిస్తున్నామని ఏపీ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ(ఏపీశాక్స్) ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ రాజేంద్ర కుమార్ తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర స్థాయిలో లెట్ కమ్యూనిటీస్ లీడ్ అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్రకుమార్ మాట్లాడుతూ.. దేశంలోని మొత్తం హెచ్ఐవీ రోగుల్లో మన రాష్ట్రంలో 13% మాత్రమే ఉన్నారన్నారు. ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇవ్వడంతో మన జనాభాలో కేవలం 0.2 శాతానికి వ్యాధి తగ్గిపోయిందని ప్రముఖ వైద్యుడు సమరం అన్నారు. 2030 నాటికి హెచ్ఐవీని మన సమాజం నుంచి పూర్తిగా నిర్మూలించగలమన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

ఓంకార స్వరూపమైన అది (పరబ్రహ్మ) అన్ని విధాల పూర్ణమైనది.
ఇది (జగత్తు) కూడా పూర్ణమైనది. ఆ పూర్ణం నుండే ఈ పూర్ణం ఉత్పన్నమైనది.
పూర్ణం నుండి పూర్ణం తీసివేసినా పూర్ణం మిగిలేవుంటుంది.
– ఈశావాస్యోపనిషత్తు

సాక్షి
శనివారం, 2 డిసెంబర్ 2023

కాప్ దిశ ఎటువైపు?

ఏటా తప్పనిసరి లాంఛనంగా జరిగే కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ (కాప్)-28 సదస్సు శుక్రవారం మొదలైంది. ఈనెల 12 వరకూ జరగబోయే ఈ సదస్సుకు 130 మంది దేశాధినేతలు, దాదాపు 80,000 మంది ప్రతినిధులు హాజరవుతారని అంచనా. అలా చూస్తే ఈ సదస్సు గత సమావేశాలతో పోలిస్తే విస్తృతమైనదే. కానీ చివరాఖరికి ఇది ప్రభావవంతమైన నిర్ణయాలు తీసుకోగలదా లేక గత సదస్సుల మాదిరే ఉసూరనిపిస్తుందా అన్నదే పెద్ద ప్రశ్న. లక్ష సంవత్సరాల వ్యవధిలో జరగాల్సిన వాతావరణ మార్పులు కేవలం గత వందేళ్లలో సంభవించాయన్న చేదు వాస్తవాన్ని గుర్తించి చిత్త శుద్ధితో కాలుష్య నివారణ చర్యలకు ఉపక్రమించాల్సిన సంపన్న దేశాలు మాటలతో కాలక్షేపం చేసి లక్ష్యానికి తిలోదకాలిస్తున్నాయి. భూమాత తన భవిష్యత్తును పరిరక్షించమంటూ మనవైపు చూస్తున్న దని, ఈ విషయంలో నిర్ణయాత్మకంగా వ్యవహరించి విజయం సాధించటం మనందరి కర్తవ్యమని సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు అర్థవంతమైనది. 2030 కల్లా కర్బన ఉద్గారాల తీవ్రతను 45 శాతానికి తగ్గించటంతో పాటు హరిత ఇంధనాల వాడకం వాటాను 50 శాతానికి పెంచాలని భారత్ నిర్ణయం తీసుకుందని ఆయన చెప్పటం కూడా మెచ్చదగ్గదే.

అయితే ప్రధాన కాలుష్య కారక దేశాలైన చైనా, అమెరికా, ఇతర సంపన్న దేశాలూ ఏం చేయబోతున్నాయన్నదే ప్రధానం. శిలాజ ఇంధనాల అవసరం లేని భవిష్యత్తును నిర్మించాలని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి గుటెరస్ దేశాధినేతలకు విన్నవించారు గానీ వినేదెవరు? వాతావరణ మార్పులు ఎలా వున్నాయో వివిధ నివేదికలు చెబుతున్నాయి. గత ఏడెనిమిది దశాబ్దాలుగా కనీవినీ ఎరుగని ఉష్ణోగ్రతలను ఈ ఏడాది చవిచూశామని వాతావరణ పరిశోధకులు అంటున్నారు. ఇది ఏ స్థాయిలో వున్నదంటే పనామాలో కరువుకాటకాలు విస్తరిల్లి పసిఫిక్, అట్లాంటిక్ మహా సముద్రాలను అనుసంధానించే 80 కిలోమీటర్ల పనామా కాలువకు నీటి పరిమాణం గణనీయంగా తగ్గింది. దాంతో ఆ కాల్వమీదుగా వెళ్లే నౌకల సంఖ్య 40 నుంచి 32కు తగ్గింది. అంతేకాదు... నౌకలు మోసుకెళ్లే సరుకుల బరువుపై కూడా పరిమితులు విధించారు. పర్యవసానంగా సరుకు రవాణా బాగా దెబ్బతింది. ఇక ప్రపంచవ్యాప్తంగా ఈ ఏడాదంతా చవిచూసిన కార్చిచ్చులు, వరదలు అన్నీ ఇన్నీ కావు. ఈసారి భారీవర్షాలతో మన దేశం 1,500 కోట్ల డాలర్ల మేర ఆస్తి నష్టాన్ని చవిచూసింది. లిబియానూ, మెక్సికోనూ కనీవినీ ఎరుగని రీతిలో వరదలు ముంచెత్తాయి. ఇలాంటి పరిణామాలు ఆర్థిక వ్యవస్థలను తలకిందులు చేస్తాయి. నిజానికి ఈ పరిస్థితులను సమీక్షించి, సరైన నిర్ణయాలు తీసుకోవటానికి కాప్ వంటి వేదికలు తోడ్పడాలి. ఆచరణలో అది సాధ్యం కావటం లేదు. ఉష్ణోగ్రతల పెరుగుదలను పారిశ్రామికీకరణకు ముందునాటి ఉష్ణోగ్రతలతో పోలిస్తే కనీసం 1.5 డిగ్రీల సెల్సియస్ మేరకు పరిమితం చేయాలంటే అన్ని రకాల శిలాజ ఇంధనాల వాడకాన్నీ నిలిపేయటం తప్ప తగ్గించటంవల్ల ఒరిగేదేమీ లేదన్నది పర్యావరణవేత్తల మాట. కానీ సంపన్న దేశాలు నిలకడగా ఒక మాట మీద ఉండటం, ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చటం ఇంతవరకూ లేనేలేదు. ఉదాహరణకు శాస్త్రవేత్తలు ఎప్పటినుంచో చేస్తున్న హెచ్చరికలు చేదు వాస్తవమని పర్యావరణపరంగా జరుగుతున్న పెనుమార్పులు రుజువు చేస్తున్నాయని, తక్షణం కర్బన ఉద్గారాలను ఆపటంలో విఫలమైతే మహా విపత్తు తప్పదని ఇదే సదస్సులో మాట్లాడిన బ్రిటన్ రాజు చార్లెస్-3 చెప్పారు. కానీ విషాదమేమంటే బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ గత ప్రభుత్వాల వాగ్దానాలను బుట్టదాఖలు చేస్తూ పెట్రోల్, డీజిల్ కార్ల విక్రయాలకున్న గడువును 2030 నుంచి 2035కు పొడిగించారు. 2035 నాటికి కొత్త గ్యాస్ బాయిలర్ల ఏర్పాటును ఆపేస్తామన్న వాగ్దానాన్ని కూడా పక్కనబెట్టారు. ఒకే దేశం భిన్న వైఖరులను ప్రదర్శించటం పర్యావరణ పరిరక్షణకు ఏమేరకు దోహదపడుతుందో చార్లెస్-3, సునాక్‌లు ఆలోచించాలి.

అసలు శిలాజ ఇంధనాల ఉత్పత్తిలో అగ్రస్థానంలో వున్న దేశాల్లో ఒకటైన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో కాప్ సదస్సు నిర్వహించటం, సదస్సు అధ్యక్ష స్థానంలో వుండటం ఒక విచిత్రం. నిరుడు ఈజిప్టులో కాప్ సదస్సు జరిగింది. అప్పటినుంచీ శిలాజ ఇంధనాలైన బొగ్గు, చమురు, సహజవాయు ఉత్పత్తులు రికార్డు స్థాయికి చేరాయని గణాంకాలు చెబుతున్నాయి. మొత్తం ఉత్పత్తుల్లో చమురు వాటా 40 శాతం కాగా, బొగ్గు ఉత్పత్తి వాటా 31 శాతం. మిగిలిన 29 శాతం సహజవాయు ఉత్పత్తులది. వీటిని ఒకేసారి పూర్తిగా తగ్గించుకోవటం సాధ్యపడదు గానీ, ఒక క్రమ పద్ధతిలో హరిత ఇంధనాల వైపు మొగ్గటం ప్రారంభిస్తే లక్ష్యసాధన సులభం అవుతుంది. కానీ ఆ దిశగా ఏ దేశమూ చర్యలు తీసుకోవటం లేదు. నిరుడు ప్రపంచదేశాలు శిలాజ ఇంధనాల సబ్సిడీ కోసం ఏడు లక్షల కోట్ల డాలర్ల సొమ్మును వినియోగించాయని ఒక అంచనా. పునరుత్పాదక ఇంధన వనరులను పెంచటం విషయంలో ఈసారైనా కాప్ దృష్టి సారించాలి. లేనట్టయితే పర్యావరణ విధ్వంసం మరింత పెరగటం ఖాయం. ఇందుకు అవసరమైన సాంకేతికతలను వెనకబడిన దేశాలకు చవగ్గా అందించటంలో సంపన్న దేశాలు విఫలమవుతున్నాయి. ఇది సరికాదు. నిపుణుల మాట వినటం, పారిస్ ఒడంబడిక అమలుకు నిర్దిష్ట కార్యాచరణ రూపొందించి చిత్తశుద్ధితో దాన్ని అమలు చేయటం తక్షణావసరం. ఒడంబడిక లక్ష్యాలను విస్మరించిన దేశాలపై ఎలాంటి చర్యలుండాలో నిర్ణయించాలి. ప్రపంచంలో ఏమూల పర్యావరణానికి విఘాతం కలిగినా అది అన్ని దేశాలకూ ముప్పు కలిగిస్తుందని అందరూ గుర్తించాలి. కాప్ సదస్సు ఈ స్పృహను కలిగించగలిగితే దాని లక్ష్యం ఏదోమేరకు నెరవేరినట్టే.

కార్మికులను కాపాడాం... గుణపాఠాలో!

విశ్లేషణ



దినేష్ సి. శర్మ

ఉత్తరకాశీలోని సొరంగంలో చిక్కుకుపోయిన కార్మికుల పరిరక్షణ చర్య విజయవంతంగా ముగిసింది. పాక్షికంగా కూలిపోయిన సొరంగంలో దాదాపు 17 రోజులపాటు చిక్కుకున్న కార్మికులందరినీ భారతీయ, విదేశీ నిపుణులు ఉమ్మడిగా సురక్షితంగా బయటికి తీయగలిగారు. హిమాలయ ప్రాంతంలో ఒక పెద్ద అభివృద్ధి ప్రాజెక్టుకు సంబంధించిన ప్రమాదం జరగడం ఇదే మొదటిసారి కాదు. సిల్‌క్యారా సొరంగంలో జరిగిన విపత్తు... పెళుసైన కొండ ప్రాంతాలలో చేపట్టే భారీ స్థాయి ప్రాజెక్టులకు సంబంధించి అనేక ప్రశ్నలను లేవనెత్తింది. కఠినతరమైన భూభాగంలో కార్యకలాపాల భద్రతపైనా, అలాంటి ప్రాజెక్టులకు అవసరమైన విపత్తు సంసిద్ధతపైనా కూడా ప్రశ్నలను లేవనెత్తింది. హిమాలయ పర్యావరణ వ్యవస్థను కోలుకోలేని నష్టం నుండి రక్షించడానికి ఈ సొరంగ ప్రమాద ఘటన మరో మేల్కొలుపు కావాలి.

బద్రీనాథ్, కేదార్‌నాథ్ వంటి ముఖ్యమైన మతపరమైన పుణ్యక్షేత్రాలను కలుపుతూ, అన్ని వాతావరణాల్లో పనిచేసే నాలుగు లేన్ల రహదారిని నిర్మించాలనే లక్ష్యంతో, ప్రతిష్టాత్మకమైన చార్ ధామ్ ప్రాజెక్టులో భాగంగా సిల్‌క్యారా సొరంగాన్ని నిర్మించారు. ఈ ప్రాజెక్టును పర్యావరణ సంఘాలు విమర్శించాయి. దీనిపై సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం కూడా వేశాయి. అనేక ప్రభుత్వ కమిటీలు ప్రాజెక్టును వివిధ కోణాల్లో పరిశీలించి, దానికి అనుమతిని ఇచ్చాయి. అయితే ప్రస్తుత సొరంగ ప్రమాద ఘటన హిమాలయ ప్రాంతంలో ఇటువంటి ప్రాజెక్టులను చేపట్టడంపై అన్ని సందేహాలను, భయాలను పునరుద్ధరించింది.



సొరంగాలు ఉత్తమ మార్గమే అయినా...

అడవుల విధ్వంసాన్ని నివారించడానికి, పర్యావరణ హానిని తగ్గించడానికి సొరంగ నిర్మాణం ఒక మంచి ఎంపికగా కనిపిస్తున్నప్పటికీ, సొరంగం పరిమాణం చాలా ముఖ్యమైనది. పొడవాటి సొరంగాల వల్ల కలిగే నష్టాన్ని కొండలు తట్టుకోగలవా? చిన్న సొరంగాలను నిర్మించడంపై ప్రాజెక్ట్ బృందాలు ఆలోచించాలి. రహదారులు లేదా జల విద్యుత్ ప్రాజెక్టుల కోసం పొడవైన నిర్మాణాలను నిర్మించే ముందు సొరంగ తవ్వకం కలిగించే పర్యావరణ ప్రభావాన్ని సరిగ్గా అంచనా వేయాలి. అనాలోచితంగా చేసే సొరంగ నిర్మాణం భూగర్భ జల వనరులను ప్రభావితం చేస్తుంది. అదే సమయంలో కొండచరియలు విరిగిపడతాయి కూడా. విశాలమైన సొరంగాల తయారీ కోసం చేసే పేలుళ్లు ప్రమాదకరమైన పర్యావరణ పరిణామాలకు కారణమవుతాయి. విపత్తు సంసిద్ధతతోపాటు, నిర్మాణ సంస్థలు తీసుకునే భద్రతా జాగ్రత్తలు మరొక సమాధానం లేని ప్రశ్నగా ఉంటున్నాయి. సిల్‌క్యారా ప్రాజెక్ట్‌లో ప్రమేయం ఉన్న కంపెనీలు, ప్రభుత్వ సంస్థల వైపు నుండి లోపాలు ఉంటే వాటిని పూర్తి స్థాయి విచారణ మాత్రమే వెల్లడిస్తుంది.

కొండల్లో భారీ జలవిద్యుత్ ప్రాజెక్టులు, హైవేలు, పర్యాటక సంబంధిత మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడంపై దాదాపు రెండు దశాబ్దాలుగా చర్చలు సాగుతున్నాయి. నాటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ హయాంలో పర్యావరణ సంఘాల సుదీర్ఘ ఆందోళన తర్వాత, రెండు భారీ ప్రాజెక్టులను నిలిపివేశారు. పైగా కొత్త, పెద్ద ప్రాజెక్టులు ఏవీ చేపట్టలేదు. అయితే గత దశాబ్దంలో, కొండలపై నిర్మాణ కార్యకలాపాలను పునరుద్ధరించారు. భద్రతా సమస్యలు, పర్యావరణ సమీక్షల కోసం పిలుపులను విస్మరించారు. తప్పనిసరి పర్యావరణ ప్రభావ అంచనా వంటి వివిధ చట్టాలు, నిబంధనలను సంబంధిత ఏజెన్సీలు, ప్రభుత్వాలు తీవ్రంగా పలుచన చేసిపడేశాయి లేదా దాటవేశాయి. ఈలోగా, వాతావరణ మార్పుల కారణంగా పర్యావరణ ప్రమాదాలు పెరిగాయి. దీని ఫలితంగా తీవ్రమైన వాతావరణ ఘటనలు, విపత్తులు సంభవిస్తాయి.

సంసిద్ధత ఉందా?

కొండల్లోని ప్రాజెక్టుల భద్రత, విపత్తులను ఎదుర్కొనే సంసిద్ధతను పూర్తిగా పరిష్కరించడం అనేది మరొక ప్రధాన సమస్య. సొరంగ ప్రమాదాలకు గల కారణాలపై శ్రద్ధ చూపడం, నిర్మాణ స్థలాల వద్ద భద్రతను నిర్ధారించడం చాలా కీలకం. గతంలో ఉత్తరాఖండ్‌లో జరిగిన సంఘటనలతో పాటు, ఇటీవల సిక్కింలో జరిగిన హిమనీనద సరస్సు ఉప్పెన వరద సంబంధిత విపత్తు ద్వారా కూడా ఇది బాగా నిరూపితమైంది. తక్కువ సాంకేతిక, భద్రతాపరమైన నిర్వహణ, అలాగే వర్ష మేఘాల విస్ఫోటనం, కొండ చరియలు విరిగి పడటం మొదలైన ప్రకృతి వైపరీత్యాల వల్ల ప్రమాదాలు తరచుగా సంభవిస్తాయి. అన్ని స్థాయిలలో శిక్షణ, భద్రతా నిర్వహణపై తగిన శ్రద్ధ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అనేక సాంకేతిక, శాస్త్రీయ సమస్యలను ప్రణాళికా దశలోనే అధ్యయనం చేసి పరిష్కరించాలి. సిల్‌క్యారా–బడ్‌కోట్ సొరంగం కోసం నవయుగ ఇంజనీరింగ్ కంపెనీకి ప్లానింగ్, కన్సల్టెన్సీ సేవలను అందిస్తున్న యూరప్‌కు చెందిన బెర్నార్డ్ గ్రుప్పే సంస్థ, "సొరంగాన్ని తవ్వడం ప్రారంభమైనప్పటి నుండి, టెండర్ డాక్యుమెంట్‌లలో ఊహించిన దానికంటే భౌగోళిక పరిస్థితులు చాలా సవాలుగా ఉన్నాయని నిరూపితమయ్యాయి. ఆ విధంగా అమలు దశ ప్రారంభంలో చేపట్టిన తదుపరి అన్వేషణే దాని చర్యల ఫలితాలను నిర్ధారిస్తుంది" అని వెల్లడించింది. అటువంటి ప్రాజెక్టులను ఆమోదించే ముందు సమగ్రమైన భౌగోళిక అధ్యయనాల అవసరాన్ని ఇది సూచిస్తుంది.

కేవలం ప్రమాదమా?

కార్మికుల రక్షణ కోసం సొరంగం లభ్యత వంటి భద్రతా నియమాలను, నిబంధనలను నిర్మాణ సంస్థలు అనుసరించి ఉంటే, సొరంగంలో చిక్కుకున్న కార్మికులను చాలా ముందుగానే రక్షించి ఉండవచ్చు. ఇప్పుడు ఇలాంటి ప్రమాదం సంభవించినందున, ఇటీవలి సంవత్సరాలలో రాష్ట్రం అనేక విపత్తులను ఎదుర్కొన్న వాస్తవాన్ని బట్టి త్వరితగతిన కార్మికుల పరిరక్షణ కార్యకలాపాలకు వ్యవస్థలు ఉండాలి. సంబంధిత అన్ని ఏజెన్సీలు పరిస్థితిని ఎలా నిర్వహించాలనే అంశంపై తమ అనుభవాన్ని, పరిజ్ఞానాన్ని పంచుకోవాలి.

సిల్‌క్యారా సొరంగ విపత్తును కేవలం ప్రమాదంగా పరిగణించి హిమాలయాల్లో యథావిధిగా వ్యవహారాలను కొనసాగించడం తప్పు. కోలుకోలేని నష్టం నుండి హిమాలయ పర్యావరణాన్ని కాపాడటానికి ఇది మరో మేల్కొలుపు. ఈ ప్రాంతంలో అభివృద్ధి ప్రాజెక్టులు అని పేర్కొంటున్న వాటి గురించి మనం అసౌకర్యమైన ప్రశ్నలు అడగవలసి ఉంటుంది. 900 కిలోమీటర్ల ఎక్స్‌ప్రెస్ హైవే, ఈ ప్రాంతంలో రైల్వే ప్రాజెక్టులు (కనీసం ఒక డజను సొరంగాల నిర్మాణంతో కూడి ఉంటాయి), పర్యాటకాన్ని నిస్సంకోచంగా ప్రోత్సహించడం (ఇది కొండలను మోసుకెళ్లే సామర్థ్యాన్ని మించి ఉంటోంది), జల విద్యుత్ ప్రాజెక్టుల భారీ స్థాయి అభివృద్ధి... ఇలా అన్నింటిపై ఒక పునరాలోచన అవసరం. కొండల్లోని ప్రజలకు విద్యుత్తు, ఉపాధి లేదా పట్టణ ప్రాంతాల్లోని ప్రజలు ఆనందించే లేదా అందుబాటులో ఉండే ఇతర సౌకర్యాలు లేకుండా చేయాలని దీని అర్థం కాదు. పర్యావరణానికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా ఇవన్నీ ఎలా సాధిస్తామన్నదే కీలక ప్రశ్న. వాతావరణ మార్పుల వల్ల ఎదురవుతున్న సవాల్‌కు తగ్గట్టుగా దీన్ని ఎలా సాధిస్తాం? సిల్‌క్యారాలో జరిగినటువంటి విషాద సంఘటనల పట్ల మనకు ఒక సమగ్ర దృక్పథం లేకుండా ఎంతమాత్రమూ ముందడుగు వెయ్యలేం.

వ్యాసకర్త సైన్స్ అంశాల వ్యాఖ్యాత
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఏ ప్రయోజనాలకు?



ఉత్తుత్తి ఖలిస్తానీ భయాన్ని సృష్టించడం అనేది నిప్పుతో చెలగాటం. ఎన్నికల్లో లబ్ధి కోసం బూచిని పుట్టించడం జాతీయ భద్రతతో ఆడుకోవడమే. ప్రస్తుతం పంజాబ్‌లో వేర్పాటు వాద భావాలు లేవు. అయినా ఎందుకీ కృత్రిమ కథనాలను వండుతున్నారు? కెనడా, యూఎస్‌ఏలో ఉన్నవాళ్ల మీద మోదీ ప్రభుత్వం ఎందుకు అతిగా శ్రద్ధ పెడుతోంది?

– స్వాతి చతుర్వేది, జర్నలిస్ట్

ఇప్పుడు వింతేనా?



నాకు 48 ఏళ్లు. మద్యం, పొగ తాగను. వారానికి 70 కిలో మీటర్లు పరుగెత్తుతాను. కార్పొరేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తాను. పార్టీలకు వెళ్లను. పదింటికల్లా నిద్రపోతాను. చిన్న కారుంది. కానీ ఎక్కువగా పబ్లిక్ ట్రాన్స్‌పోర్టులోనే ప్రయాణిస్తాను. నన్ను సమాజం అంగీకరిస్తుందా?

– పాజన్ శామ్యూల్, రన్నర్

ఎందుకీ వ్యతిరేకత?



నా వ్యాఖ్యల్ని సోషల్ మీడియాలో పంచుకున్నందుకు, కశ్మీర్‌లోని ఇస్లామిస్టులు ఒక హిందూ విద్యార్థిని చంపుతామని బెదిరిస్తున్నారు. విద్యార్థిని వదిలిపెట్టి, నన్ను పట్టుకోండి. భావ స్వేచ్ఛ మీద ముస్లింలు చూపే వ్యతిరేకతతో నేను విసిగి పోయాను. (శ్రీనగర్‌లోని ఎన్ఐటీ విద్యార్థి వివాదాస్పద పోస్టు నేపథ్యంలో.)

– మొసాబ్ హసాన్ యూసెఫ్, హమాస్ మాజీ నాయకుడి కొడుకు, ఇజ్రాయెల్‌కు ఒకప్పటి గూఢచారి

భలే ఐడియా



ఎగ్జిట్ పోల్ కంపెనీని ప్రారంభించడం సరదాగా ఉండేట్టుంది. మనం ఏదైనా చెప్పొచ్చు, కానీ ఎవరూ మనల్ని జవాబుదారీ చేయరు. ఇంకీ, పింకీ, పాంకీ ఆడుతూ కూడా గెలిచేది ఎవరో చెప్పినా మనల్ని ఎవరూ ఆపరు.

– కార్తీక్, వ్యాఖ్యాత

మనమెందుకు మరి?



దేవుళ్లు లేకపోతే మనం ఏమీ కామని పిల్లలకు బోధించడమంటే, వాళ్లు ఎందుకూ పనికిరారని బోధించడమే.

– ఇంతియాజ్ మహమూద్, నాస్తికుడు

షరతులు వర్తించాలి!



ఇజ్రాయెల్‌కు యూఎస్ ఇచ్చే సాయం మీద షరతులు విధించాలా అన్న ప్రశ్నే అర్థరహితం. కచ్చితంగా విధించాలి. అది ఇజ్రాయెల్ అయినందువల్ల కాదు; ఏ దేశానికైనా పంపే 'పూర్తి' సైనిక సాయం షరతులతోనే వెళ్లాలి.

– ఏమీ దార్, ఇజ్రాయెల్ పీస్ యాక్టివిస్ట్

ఎన్నికల గ్యారంటీలు 'జుమ్లా'లేనా?

అభిప్రాయం



సి. రామచంద్రయ్య

దేశంలోని దాదాపుగా అన్ని రాజకీయ పార్టీలు తరచుగా చెప్పే మాట తమకు అధికారం ఇస్తే ప్రజలను సాధికారులుగా చేస్తాం అన్నది. అసలు సాధికారత (ఎంపవర్‌మెంట్) అంటే అర్థం ఏమిటి? దీనికి విస్తృతమైన అర్థాలు ఉన్నాయి. ముందుగా శారీరకంగా బలహీనంగా ఉన్న వ్యక్తి లేదా అతని కుటుంబాన్ని బలోపేతం చేయడం, ఆ తర్వాత ఆ కుటుంబాన్ని సామాజికంగా బలోపేతం చేయడం అన్నది సాధికారతలో ఓ భాగం. కుటుంబాన్ని బలోపేతం చేయడమనే ప్రక్రియ ఎలా జరుగుతుంది? ప్రతిరోజూ బలవర్ధకమైన ఆహారాన్ని వ్యక్తికి లేదా అతని కుటుంబానికి అందించాలి. వారు ఆరోగ్యంగా ఉండేటట్లు చూడాలి. అలా ఎంత కాలం చేయాలి? జీవితకాలంపాటు ఈ ప్రక్రియ కొనసాగాలి. కానీ, ఏ ప్రభుత్వమైనా అధికారంలో ఉండేది ఐదేళ్లపాటు మాత్రమే.

ఐదేళ్లు ఉండే ప్రభుత్వం ఏ వ్యక్తినైనా, కుటుంబాన్నైనా, వర్గాన్నైనా జీవితకాలం పాటు పోషించలేదు కదా? అటువంటప్పుడు వారు సాధికారులు ఎలా అవుతారు?! ఆధునిక చైనా పితామహుడిగా చెప్పుకొనే డెంగ్ జియావో పింగ్ దీనినే ఓ ఉదాహరణ ద్వారా వివరించారు. ఆకలి గొన్న వ్యక్తికి రోజూ ఓ చేప చొప్పున ఇస్తూపోతే... అది ఇచ్చినంత కాలమే అతని ఆకలి తీరుతుంది. అదే అతనికి చేపలు పట్టే విద్య నేర్పించి, ఓ వలను ఇవ్వగలిగితే అతడు తన జీవితకాలం తన పొట్టను తానే పోషించుకొంటాడు. పైగా తన కుటుంబాన్ని సైతం ఆదుకోగలుగుతాడు. ప్రభుత్వాలు ప్రజలకు సంక్షేమం ఎలా ఇవ్వాలో సూక్ష్మంగా చెప్పాడు డెంగ్ ఈ ఉదాహరణ ద్వారా. ఇదే సిద్ధాంతాన్ని నమ్మి ఆచరణలో పెట్టడం ద్వారానే డెంగ్ తన పాలనలో చైనాను ప్రపంచంలో ఓ బలమైన ఆర్థిక శక్తిగా రూపొందించగలిగాడు.

ప్రజల సమస్త వ్యక్తిగత, సామాజిక అవసరాలన్నింటినీ తామే తీర్చగలమన్న భ్రమల్ని వారిలో కల్పిస్తూ కొన్ని రాజకీయ పార్టీలు పబ్బం గడుపుకొంటున్నాయి. ఓట్ల కోసం హామీలు గుప్పించడం రాజకీయ పార్టీలకు రివాజుగా మారింది. అది ఇటీవలి కాలంలో మరింత వెర్రితలలు వేస్తోంది. వ్యవసాయరంగం మెరుగుదల, మౌలిక సదుపాయాల విస్తరణ; విద్య, వైద్యం వంటివి సామాన్యులకు అందుబాటులోకి తేవడం, శాంతి భద్రతలను పటిష్టపర్చి పారిశ్రామిక పెట్టుబడుల్ని ఆకర్షించడం ద్వారా నిరుద్యోగాన్ని పారద్రోలడం వంటి చర్యలు ఏ ప్రభుత్వానికైనా ప్రాధాన్యం కావాలి. మహిళలు, బాలలు, వృద్ధులకు తగిన సామాజిక సంరక్షణ కల్పించడం ప్రభుత్వాల బాధ్యత. వీటిపైన దృష్టి పెట్టగలిగితే ప్రజలను సాధికారుల్ని చేసినట్లే.

భారతదేశం నిద్రపోతున్న ఓ ఆర్థిక దిగ్గజం (స్లీపింగ్ జెయింట్) అని 70వ దశకంలోనే నాటి సింగపూర్ అధ్యక్షుడు 'లీ కువాన్ యు' అన్నారు. 1991లో పీవీ నరసింహారావు దేశ ప్రధాని అయిన తర్వాత గానీ దేశానికి పట్టిన స్తబ్దత వదలలేదు. దశాబ్దాలపాటు పట్టి పీడించిన కొన్ని జాడ్యాలను వదిలించుకొని ఆర్థిక వ్యవస్థ వడివడిగా అడుగులు వేస్తూ... పీవీ – డా॥ మన్మోహన్ సింగ్‌ల ద్వయం చూపిన సంస్కరణల బాటలో ముందుకు సాగిన ప్రస్థానానికి దాదాపు 3 దశాబ్దాల వయస్సు. ఈ కాలంలో దేశం చాలా రంగాలలో అభివృద్ధి చెందిన మాట నిజం. ప్రపంచంలో 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించబోతున్నది అన్నది కూడా ఓ వాస్తవం.

అయితే, ఈ ప్రస్థానం ఏ దిశగా సాగుతోంది? దేశంలోని సహజ వనరులన్నీ ప్రజలందరికీ సమానంగా చెందాలన్న రాజ్యాంగ లక్ష్యాలకు, రాజ్యాంగ నిర్మాత డా॥ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు భిన్నంగా దేశ సంపద కొంత మంది పారిశ్రామిక వేత్తలకు దఖలు పడింది. ప్రపంచ కుబేరుల జాబితాలో భారత్‌కు చెందిన ఇద్దరు లేదా ముగ్గురు మొదటి వరుసలో ఉండగా, మరో 10 మంది రెండో వరుసలో కనిపిస్తారు. అదే సమయంలో... ప్రపంచ ఆకలి సూచీలో 180 దేశాల జాబితాలో ఇండియా 165–170 స్థానాల మధ్య ఊగిసలాడుతోంది. మనకంటే పొరుగునున్న ఆసియా దేశాలైన బంగ్లాదేశ్, నేపాల్ ఆకలి సూచీలో మెరుగైన స్థానంలో ఉన్నాయి. ఆర్థిక దిగ్గజమైన భారత్‌కు ఇంతకంటే అవమానం మరొకటి ఉంటుందా?

ఈ 3 దశాబ్దాలలో దేశ సంపద బాగా పెరిగింది. దేశ స్థూల ఉత్పత్తి 40 లక్షల కోట్లు దాటింది. అదే సమయంలో దేశంలో ఆర్థిక అంతరాలు విపరీతంగా పెరిగిపోయినట్లు స్పష్టంగా తెలుస్తూనే ఉంది. దేశంలో పేదలు మరింత పేదలయ్యారు. సంపన్నులు పైపైకి ఎగబాకుతున్నారు.

ఒకప్పుడు బాగా ప్రాచుర్యం పొందిన సోషలిజం



స్థానంలో చాలాకాలంగా 'పాపులిజం' వచ్చి చేరింది. 'అన్ని వర్గాలకూ అన్నీ' అన్నదే పాపులిజం మూల సూత్రం. ఓట్లు రాల్చే ఈ 'ఇజం' చుట్టూనే నేటి రాజకీయాలు పరిభ్రమిస్తున్నాయి. ఈ పాపులిజం ఇటీవలి కాలంలో వెర్రితలలు వేయడమే నేటి విషాదం! దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షుడు 'జాకబ్ జుమా' పాపులిస్ట్‌గా మారి దేశాన్ని అప్పుల ఊబిలో నెట్టివేశారు. ఆ దేశ జీడీపీలో అప్పుల నిష్పత్తి 50 శాతం దాటిన నేపథ్యంలో... సొంత పార్టీ వారే ఆయనపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి పదవి నుంచి దించి వేశారు. 'జాకబ్ జుమా' ఉదంతం ప్రపంచంలో అనేక దేశాలకు గుణపాఠం నేర్పింది. మొత్తం జీడీపీలో అప్పుల శాతం 24 శాతం మించరాదనీ, అదికూడా వృద్ధిరేటు 7 శాతం దాటినప్పుడే అది ఆమోదయోగ్యం కాగలదనీ ప్రముఖ ఆర్థికవేత్తలు నిగ్గు తేల్చారు.

అయితే, భారత్‌లో కొన్ని రాజకీయ పార్టీలు ఇటువంటి లెక్కల్ని పరిగణనలోకి తీసుకోవడం లేదు. అధికారం కోసం మొదట కర్ణాటకలో, ఆ తర్వాత తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన గ్యారంటీలు, ఇతర హామీల విలువ కనీసం రెండు రాష్ట్రాల బడ్జెట్‌తో సమానం. ఇవి నెరవేర్చాలంటే ప్రజలపై అధికంగా పన్నులు వేయాలి, ఎఫ్.ఆర్.బి.ఎం.ను మించి అప్పులు తేవాలి. అవీ చాలకపోతే ప్రభుత్వ భూములు అమ్మాలి. ఇప్పటికే విలువైన ప్రభుత్వ భూములు చాలావరకు వేలంలో పోయాయి. భవిష్యత్ అవసరాలకోసం తిరిగి భూములు కొనాల్సిన దుస్థితి ఇకపై రావొచ్చు. ఇక ఎటొచ్చీ, కొన్ని పథకాలను అమలు చేయకుండా మంగళం పాడొచ్చు. అలాగే ఎన్నికల ముందు ప్రకటించిన గ్యారంటీలను సైతం ఎత్తివేయవచ్చు.

రాజకీయ పార్టీలు ప్రకటించే మేనిఫెస్టోకు ఎలాంటి మార్గదర్శకాలు లేకపోవడమే ఎడాపెడా హామీలు ప్రకటించడానికి కారణం అవుతోంది. మన దేశంలో రాజకీయ పార్టీల హామీల అంశంలో న్యాయస్థానాలు జోక్యం చేసుకోవడానికి నిరాకరిస్తున్నాయి. అందువల్ల ఆకాశమే హద్దుగా కొన్ని రాజకీయ పార్టీలు హామీల సునామీ సృష్టిస్తున్నాయి. 2014లో బీజేపీ తన మేనిఫెస్టోలో ఏటా 2 కోట్ల ఉద్యోగాలు అందిస్తామని చెప్పింది. విదేశాల్లో పోగుపడిన నల్ల ధనాన్ని వెనక్కి రప్పించి అందరి ఖాతాల్లో 15 లక్షల రూపాయల చొప్పున జమ చేస్తామని బీజేపీ అగ్రనేతలు నమ్మకంగా చెప్పారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక ఆ హామీల సంగతేమిటని కేంద్రమంత్రి 'అమిత్ షా'ను నిలదీస్తే, అవన్నీ 'ఎన్నికల జుమ్లా' అని ఆయన ఒక్క మాటతో తేల్చేశారు. అంటే, ఎన్నికల సందర్భంలో ఎన్నో గాలి వాగ్దానాలు చేస్తుంటాం. వాటిని మీరు సీరియస్‌గా తీసుకొంటే ఎలా? అనే అర్థంలో కొందరు రాజకీయ నాయకులు అంటున్నారు. ప్రజలు ఈ 'జుమ్లా' మాటలు నమ్మడం లేదనే కారణంగానే ఇపుడు గ్యారెంటీలు ఇస్తున్నారు. సదరు గ్యారెంటీలు అమలు జరుగుతాయన్న గ్యారెంటీ కూడా లేదు. ఇదొక చేదు వాస్తవం.

వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యులు

భగవంతుడు ఒక రైతు

భగవంతుణ్ణి మన పూర్వాచార్యులు వ్యవసాయకారుడితో పోల్చినారు. ఎలాగంటే, వ్యవసాయదారుడు అదనులో దుక్కిదున్ని విత్తనం చల్లుతాడు. ఆ యేడు కురిసిన మిక్కుటమైన వర్షాలవల్ల కోతకొచ్చిన పంట కొట్టుకు పోతుందనుకో, అతడు నిరాశ చెందడు. వ్యవసాయానికి ఎగనామం పెట్టడు. మరుసటేడు మళ్ళీ దుక్కిదున్ని మళ్లీ విత్తనం చల్లుతాడు. ఈసారి కూడా అనావృష్టి వల్ల ఆశించినంతగా పంట దిగుబడి కాలేదనుకో, అయినా అతడు నిరాశకు లోనుకాడు. తన ప్రయత్నం మానడు. మళ్ళీ దున్నుతాడు, మళ్ళీ విత్తనం చల్లుతాడు.

అలాగే భగవంతుడూను. మానవులు ఉపాసించి, తాపత్రయం వీడి, జీవన్ముక్తులై, తన సన్నిధి చేరి తరిస్తారని భగవంతుడి ఆశ. వారిని ఉద్ధరించే ఉద్దేశంతో భగవంతుడు చేయని ప్రయత్నం లేదు. ఎప్పుడెప్పుడు ధర్మం క్షీణముఖం పడుతుందో, అప్పుడప్పుడల్లా ధర్మరక్షణ నిమిత్తం భూమ్మీద తాను స్వయంగా అవతరిస్తాడు. ఇంత చేసినా తనను అవతారమూర్తిగా గుర్తించేవారు ఏ కొద్ది మందో ఉంటారు. మిగతా అందరూ తనను నిర్లక్ష్యం చేసే వారుగానో, వ్యతిరేకించే వారుగానో ఉంటారు. భగవద్గీత ఏడో అధ్యాయం 'జ్ఞాన విజ్ఞాన యోగం'లో భగవంతుడైన శ్రీకృష్ణుడు, 'మనుష్యాణాం సహస్రేషు...' అనీ, 'మూఢోయం నాభిజానామి' అనీ, 'మాంతు వేద న కశ్చన...' అనీ అంటాడు. అంటే, వేయిమంది మనుష్యుల్లో ఏ ఒక్కడో నన్ను తెలుసుకోవడం కోసం ప్రయత్నిస్తాడు. అట్లా ప్రయత్నించే వాళ్లలో ఎవడో ఒకడు నన్ను యథార్థంగా తెలుసుకొంటాడు. ఈ మూఢ లోకం నన్ను గుర్తించలేక పోతోంది. వీరంతా ఎవరో నాకు తెలుసు కాని, నేనెవరో వీళ్లలో ఏ ఒక్కడికీ తెలియదు అని అర్థం. ఈ విధంగా భగవంతుడు తన నిర్వేదాన్ని తెలియజేస్తాడు.

జ్యోతిర్మయం

అయినప్పటికీ భగవంతుడు నిరాశ చెంది తన సృష్టి కార్యాన్ని విరమించుకుంటాడా అంటే విరమించుకోడు. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా తిరిగి తన సృష్టి కార్యానికి శ్రీకారం చుడతాడు. ధర్మగ్లాని సంభవించినప్పుడల్లా తానే స్వయంగా పూనుకొని, ధర్మాన్ని నిలబెడతాడు. అజ్ఞానంలో ఉన్న మానవాళికి జ్ఞానం ప్రసాదించటానికి ఆచార్యుల్నీ, సద్గురువుల్నీ అవసరమైనపుడల్లా వెంటవెంటనే భూమ్మీదకు పంపే ఏర్పాటు చేస్తాడు. నిరాశ చెందకుండా ఇంత ప్రయత్నం పదే పదే ఎందుకు చేస్తాడు అంటే, అందుకు కారణం, తను చేసిన సృష్టిలోని మానవుడి మీద భగవంతుడికి ఉండే ప్రేమ! తన పొలం మీద వ్యవసాయదారుడికి ఎంత ప్రేమో భగవంతుడికి మానవుడి మీద అంత ప్రేమ. అందువల్లనే భగవంతుడితో వ్యవసాయదారుడికి పోలిక చెప్పారు.

– దీవి సుబ్బారావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, శరదృతువు, కార్తీక మాసం, తిథి: బ.పంచమి సా.4.33 వరకు,తదుపరి షష్ఠి, నక్షత్రం: పుష్యమి రా.7.04 వరకు, తదుపరి ఆశ్లేష, వర్జ్యం: లేదు, దుర్ముహూర్తం: ఉ.6.14 నుండి 7.47 వరకు, అమృతఘడియలు: ప.12.10 నుండి 1.54 వరకు ; రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు, యమగండం: ప.1.30 నుండి 3.00 వరకు, సూర్యోదయం: 6.17, సూర్యాస్తమయం: 5.20.

పేదల ఉపాధిపై చంద్రబాబు దెబ్బ

1,160వ రోజు రిలే దీక్షలో బహుజన నేతలు



తాడికొండ: ప్రపంచస్థాయి రాజధానిని నిర్మిస్తానని చెప్పిన చంద్రబాబు.. తాత్కాలికం పేరుతో అమరావతి ప్రాంతంలోని రైతులు, రైతు కూలీలు, పేదలకు ఉపాధి లేకుండా చేశాడని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. అమరావతిలో కనీసం సొంతిల్లు నిర్మాణం చేసుకోకుండా.. కబ్జా చేసిన ఇంటిలో నివశిస్తూ రాష్ట్రంలో అల్లర్లు సృష్టించేందుకు కుట్రలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెంసీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,160వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో శుక్రవారం పలువురు మాట్లాడారు. రాష్ట్రంలో ఐదు కోట్లమంది ప్రజల ఆశయాలకు అనుగుణంగా మేలు చేసే నిర్ణయాలు తీసుకుంటున్న ప్రభుత్వాన్ని కులవాదులు వ్యతిరేకిస్తూ అడ్డుపడటం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు దోచుకో, దాచుకో, పంచుకో అన్న రీతిగా అమరావతి పేరుతో పరిసర ప్రాంతాల్లో భూదందా చేసి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ఏపీలో తన సామాజిక వర్గానికి దోచిపెట్టేందుకు 29 గ్రామాల రైతులను పావులుగా వాడుకుని వదిలేశాడనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. ఎన్‌ఆర్‌ఐ చందాలతో కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి హైటెక్ వసతులతో ఉద్యమం చేస్తున్న కులవాదులు దొంగ దీక్షలు విరమించాలని సూచించారు. రాష్ట్రంలో నేడు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభివృద్ధి కోసం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జనరంజక పాలన అందిస్తున్నారని తెలిపారు. నాయకులు మాదిగాని గురునాథం, పులి దాసు, కారుమూరు పుష్పరాజు, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు పెంచం

రాష్ట్ర ప్రజలకు భారీ ఊరటనిచ్చిన విద్యుత్ పంపిణీ సంస్థలు

- 2024–25లో 83,118.13 మిలియన్ యూనిట్ల అవసరం
- ఈ లెక్కన కొనుగోలు ఖర్చే రూ.39,017.60 కోట్లు
- మొత్తం ఖర్చులన్నీ తీరాలంటే రూ.రూ.56,576.03 కోట్ల రాబడి అవసరం
- కానీ అన్ని విధాలుగా వచ్చే ఆదాయం రూ.రూ.42,697.92 కోట్లే
- డిస్కంలకు ఈసారి కూడా రూ.13,878.11 కోట్ల రెవెన్యూ లోటు
- అయినప్పటికీ ఏ వర్గంపైనా వచ్చే ఏడాది విద్యుత్ చార్జీల భారం పడదు
- కొనసాగనున్న ఉచిత, రాయితీ విద్యుత్
- ఏపీఈఆర్‌సీకి సమర్పించిన వార్షిక ఆదాయ అవసరాల నివేదికలో స్పష్టం చేసిన డిస్కంలు



వార్షిక నివేదికను ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్ సమక్షంలో ఏపీఈఆర్సీకి సమర్పిస్తున్న ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు, ఏపీ జెన్‌కో ఎండీ చక్రధర్‌బాబు, ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పద్మాజనార్ధనరెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రజలకు విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కంలు) భారీ ఊరటనిచ్చాయి. వచ్చే ఏడాది ఏ వర్గం వినియోగదారులపైనా విద్యుత్ చార్జీలు పెంచబోమని ప్రకటించాయి. రూ.13,878.11 కోట్ల రెవెన్యూ లోటు ఉన్నప్పటికీ చార్జీల భారం వేయబోమని స్పష్టం చేశాయి. ఈ మేరకు రాష్ట్రంలోని విద్యుత్ ప్రసార (ఏపీ ట్రాన్స్‌కో), పంపిణీ సంస్థలు (డిస్కంలు) 2024–25 ఆర్థిక సంవత్సరానికి వార్షిక ఆదాయ అవసరాల నివేదిక (ఏఆర్‌ఆర్), 2024–2029 నియంత్రణ కాలానికి సంబంధించి నెట్‌వర్క్ ఆదాయ అవసరాల నివేదికలను ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ)కి సమర్పించాయి. ఈ నివేదికలోని ముఖ్యాంశాలను ఇంధన శాఖ శుక్రవారం వెల్లడించింది. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా తక్కువ ధరలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్‌ను ప్రజలకు సరఫరా చేసేందుకు ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థలు కట్టుబడి ఉన్నాయని తెలిపింది. దానికి తగ్గట్టుగానే ఏఆర్‌ఆర్‌లలో ఎలాంటి విద్యుత్ చార్జీల పెంపుదలను ప్రతిపాదించలేదని వివరించింది.

లోటు ఉన్నప్పటికీ భారం మోపబోం..

2024–25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా 74,522.67 మిలియన్ యూనిట్ల విద్యుత్ అవసరమని డిస్కంలు అంచనా వేశాయి. వ్యవసాయానికి పగటిపూట 9 గంటలు ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు 12,321.58 మిలియన్ యూనిట్లు అవసరమని నివేదించాయి. మొత్తం మీద 83,118.13 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను కొనుగోలు చేయాల్సి ఉంటుందని లెక్కగట్టాయి. విద్యుత్ ప్రసార నష్టాలు 2.6 శాతం, ఇంటర్ స్టేట్ నష్టాలు 0.9 శాతం, పంపిణీ నష్టాలు 6.84 శాతం, మొత్తం ట్రాన్స్‌మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ నష్టాలు 10.34 శాతంగా నమోదు కావచ్చని అంచనా వేశాయి. ఈ లెక్కన విద్యుత్ కొనుగోలు ఖర్చు రూ.39,017.60 కోట్లు అవుతుందని భావిస్తున్నాయి. అది కాకుండా ట్రాన్స్‌మిషన్ అండ్ లోడ్ డిస్పాచ్ ఖర్చు రూ.5,722.88 కోట్లు, డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ ధర రూ.9,514.42 కోట్లు, ఇతర ఖర్చులు రూ.2,321.13 కోట్లుగా పంపిణీ సంస్థలు నిర్ణయించాయి. దీని ప్రకారం మొత్తంగా రూ.56,576.03 కోట్ల రాబడి అవసరమని నివేదించాయి. అయితే అన్ని రకాల ఆదాయాలు కలిపి రూ.42,697.92 కోట్లు మాత్రమే వస్తున్నాయని.. దీంతో రూ.13,878.11 కోట్ల రెవెన్యూ లోటు ఏర్పడుతుందని వివరించాయి. అయినప్పటికీ ఈ లోటును భర్తీ చేసుకోవడం కోసం ప్రజలపై చార్జీల భారం మోపాలనుకోవడం లేదని ఏపీఈఆర్‌సీకి డిస్కంలు నివేదించాయి.

యధావిధిగా ఉచిత, రాయితీలు

రైతులకు ఉచిత వ్యవసాయ విద్యుత్ సరఫరాకు అయ్యే ఖర్చును సబ్సిడీ రూపంలో ప్రభుత్వం డిస్కంలకు తిరిగి చెల్లిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో కూడా డిస్కంలు దాదాపు రూ.11,800 కోట్ల రెవెన్యూ లోటుతో వార్షిక ఆదాయ అవసరాల నివేదికలను దాఖలు చేశాయి. ఈ నేపథ్యంలో డిస్కంలను ఆదుకోవడానికి రూ.10,135.22 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం అందించింది. అలాగే ఉచిత వ్యవసాయ విద్యుత్ సరఫరా, తక్కువ స్లాబ్ గృహవినియోగదారులకు సబ్సిడీ, ఆక్వాకల్చర్ రైతులు, ఎస్సీ, ఎస్టీ గృహ వినియోగదారులు, పవర్ లూమ్స్, హ్యాండ్‌లూమ్స్, సెలూన్లు, గోల్డ్ ప్లేటింగ్, రజక సంఘాలు మొదలైన వాటికి రాయితీలు వచ్చే ఏడాది కూడా కొనసాగనున్నాయి. దీంతో డిస్కంలు వినియోగదారుల టారిఫ్‌లలో ఎలాంటి మార్పును ప్రతిపాదించలేదు.

భవిష్యత్ తరాలకు 'విద్యుత్' భరోసా

- ఏపీఎస్ఈసీఎం ఆధ్వర్యంలో ఇన్వెస్ట్‌మెంట్ బజార్ ఫర్ ఎనర్జీ ఎఫిషియెన్సీ సదస్సు
- ఇంధన సామర్థ్యం కోసం దేశంలో 2031 నాటికి రూ. 13.20 లక్షల కోట్ల పెట్టుబడులు
- రాష్ట్రంలో ఇంధన సామర్థ్య ప్రాజెక్టుల ఆర్థిక సాయానికి తొమ్మిది బ్యాంకులతో ఆర్థిక కమిటీ



ప్రసంగిస్తున్న ఏపీజెన్‌కో ఎండీ చక్రధరబాబు

సాక్షి, అమరావతి: భవిష్యత్ తరాలకు విద్యుత్ భద్రత కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా ఇంధన శాఖకు చెందిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎనర్జీ కన్సర్వేషన్ మిషన్ (ఏపీఎస్ఈసీఎం) ఆధ్వర్యంలో ఇన్వెస్ట్‌మెంట్ బజార్ ఫర్ ఎనర్జీ ఎఫిషియెన్సీ సదస్సును శుక్రవారం నిర్వహించింది. పారిశ్రామిక రంగంలో ఇంధన సామర్థ్య ప్రాజెక్టులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అమలు చేయడానికి అవసరమైన ఆర్థిక సాయాన్ని అందించడం కోసం జరిగిన ఈ పెట్టుబడి బజార్‌కు ఆంధ్రప్రదేశ్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ (ఏపీజెన్‌కో) ఎండీ, ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ కేవీఎస్ చక్రధర్‌బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2031 నాటికి దేశంలో ఇంధన సామర్థ్యం కోసం రూ. 13.20 లక్షల కోట్ల పెట్టుబడులు అవసరమని అంచనా వేసినట్లు తెలిపారు. అందులో కేవలం పరిశ్రమలు, వాణిజ్యం, రవాణా రంగాల్లోనే రూ. 10.72 లక్షల కోట్లు పెట్టుబడి పెట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భావిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి ఇంధన పొదుపు, ఇంధన సామర్థ్య పెట్టుబడులను ప్రోత్సహించే దిశగా ఎనర్జీ ఎఫిషియెన్సీ ఫైనాన్సింగ్ ప్లాట్‌ఫాం (ఈఈఎఫ్‌పీ) రాష్ట్రంలో ఎనర్జీ ఎఫిషియెన్సీ ఫైనాన్సింగ్‌ను పెంచేందుకు దోహదపడుతుందన్నారు. రాష్ట్ర పారిశ్రామిక రంగంలో ఇంధన సామర్థ్య ప్రాజెక్టులు, సాంకేతిక పరిజ్ఞానం, ఉపకరణాలకు ఆర్థిక సాయం సులభంగా లభించడం కోసం తొమ్మిది బ్యాంకులతో ఆర్థిక కమిటీని ఏర్పాటు చేసినట్లు ఏపీఎస్ఈసీఎం సీఈఓ బీఏవీపీ కుమారరెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ డిస్కం సీఎండీ జె.పద్మజనార్దన రెడ్డి, స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ సెగు సుకుమార్, వివిధ బ్యాంకులు, నాన్ బ్యాంక్ ఫైనాన్షియల్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పలు రైళ్ల రద్దు, దారి మళ్లింపు, ప్రత్యేక రైళ్ల పొడిగింపు



రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): విజయవాడ డివిజన్‌లో జరుగుతున్న ట్రాక్ నిర్వహణ పనుల కారణంగా డివిజన్ మీదుగా నడిచే పలు రైళ్లను పూర్తిగాను, పాక్షికం గాను రద్దు చేయడంతో పాటు మరికొన్నింటిని దారి మళ్లించి నడపనున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. ఈ నెల 4 నుంచి 17వ తేదీ వరకు కాకినాడ పోర్టు–విశాఖపట్నం (17267/17268), మచిలీపట్నం–విశాఖపట్నం (17219/17220), ఈ నెల 5 నుంచి 18 వరకు గుంటూరు–రాయగడ (17243/17244), బిట్రగుంట–విజయవాడ (07977/07978), విజయవాడ–తెనాలి (07279/07575), విజయవాడ–ఒంగోలు (07461/07575), విజయవాడ–గూడూరు (07500), విజయవాడ–గూడూరు (12744), ఈ నెల 4, 5, 6, 8 తేదీలలో విజయవాడ–విశాఖపట్నం (22702), ఈ నెల 9, 11, 12, 13 తేదీలలో విశాఖపట్నం–విజయవాడ (22701), ఈ నెల 4 నుంచి 18వ తేదీ వరకు గుంటూరు–విశాఖపట్నం (17239/17240), ఈ నెల 5 నుంచి 18వ తేదీ వరకు విశాఖపట్నం–గుంటూరు (17240), ఈ నెల 4 నుంచి 8వ తేదీ వరకు, అదే విధంగా ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు బిట్రగుంట–చెన్నై సెంట్రల్ (17237/17238), ఈ నెల 5 నుంచి 18వ తేదీ వరకు గూడూరు–విజయవాడ (07458/12743) రైళ్లు పూర్తిగా రద్దు చేశారు. కాగా, మచిలీపట్నం- విజయవాడ, నర్సాపూర్–విజయవాడ, విజయవాడ–భీమవరం మధ్య రైళ్లను పాక్షికంగా రద్దు చేశారు.

ప్రత్యేక రైళ్ల పొడిగింపు: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా వేర్వేరు ప్రాంతాల నుంచి నడుపుతున్న పలు రైళ్లను పొడిగిస్తున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం ప్రకటించారు. ఈ నెల 4 నుంచి 25వ తేదీ వరకు పూర్ణా–తిరుపతి (07609), ఈ నెల 5 నుంచి 26వ తేదీ వరకు తిరుపతి–పూర్ణా (07610), ఈ నెల 2 నుంచి 30వ తేదీ వరకు హైదరాబాద్–నర్సాపూర్ (07631), ఈ నెల 3 నుంచి 31వ తేదీ వరకు నర్సాపూర్–హైదరాబాద్ (07632), ఈ నెల 3 నుంచి 31వ తేదీ వరకు తిరుపతి–సికింద్రాబాద్ (07481), ఈ నెల 4 నుంచి 25వ తేదీ వరకు సికింద్రాబాద్–తిరుపతి (07482), ఈ నెల 1 నుంచి 29వ తేదీ వరకు కాకినాడ టౌన్–లింగంపల్లి (07445), ఈ నెల 2 నుంచి 30వ తేదీ వరకు లింగంపల్లి–కాకినాడ టౌన్ (07446) రైళ్లను పొడిగించారు.

జిల్లా గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కళ్లేపల్లి



గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం

సాక్షి, అమరావతి/గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రప్రదేశ్ జిల్లా గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా 5వ సారి కళ్లేపల్లి మధుసూదనరాజు ఎన్నికయ్యారు. శుక్రవారం విజయవాడలో జరిగిన సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గం ఏకగ్రీవమైంది. ప్రధాన కార్యదర్శిగా పి.కమ్మన్న, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా బీరం వెంకట రమణ, కోశాధికారిగా ఎం.ధనుంజేయులు, ఉపాధ్యక్షుడిగా ఐవీవీ రామారావు, సహాయ కార్యదర్శిగా హెచ్.శ్రీనివాసులు, ప్రాంతీయ అధ్యక్ష, కార్యదర్శులుగా సత్యంబాబు, కొండపల్లి భాస్కరరావు, సుంకర నాగేశ్వరరావును ఉమ్మడి 13 జిల్లాల గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘ నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం విశేషం. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన కమిటీ పేర్కొంది.

రూ.1.45 కోట్ల విలువైన సిగరెట్లు స్వాధీనం

- పాట్నా నుంచి మధురైకు అక్రమంగా తరలింపు
- తిరుపతి జిల్లా నెలబల్లి సమీపంలో ఘటన



పట్టుబడిన సిగరెట్ ప్యాకెట్లను చూపుతున్న పోలీస్ అధికారులు

దొరవారిసత్రం: కంటైనర్‌లో పాట్నా నుంచి మధురైకు అక్రమంగా తరలిస్తున్న రూ.1.45 కోట్ల విలువ చేసే సిగరెట్లను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్న ఘటన తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండలం, నెలబల్లి గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై శుక్రవారం జరిగింది. విజిలెన్స్ అధికారుల కథనం ప్రకారం.. వివిధ కంపెనీలకు చెందిన పలు రకాల సిగరెట్లను పాట్నా ప్రాంతంలోని ఓ కంపెనీ నుంచి చెన్నైలోని మధురైకు పన్నులు చెల్లించకుండా కంటైనర్ లారీలో తరలిస్తున్నారు. ఉన్నతాధికారులకు వచ్చిన సమాచారం మేరకు వారి ఆదేశాలతో నెలబల్లి గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై విజిలెన్స్, తూనికలు కొలతల శాఖ అధికారులు వాహనాల తనిఖీ నిర్వహించారు. కంటైనర్‌లో తరలిస్తున్న సిగరెట్లకు పన్ను చెల్లింపు పత్రాలు లేకపోవడాన్ని గుర్తించారు. కంటైనర్‌ను స్వాధీనం చేసుకున్నారు. సిగరెట్ల లోడ్‌ను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ ఎస్పీ ఈశ్వరరెడ్డి పరిశీలించారు. సిగరెట్లతో పాటు కంటైనర్ లారీని సీజ్ చేసి డీవీ సత్రం పోలీసులకు అప్పగించారు. ఈ దాడుల్లో సీఐలు వెంకటరవి, చంద్రశేఖర్, రమాదేవి, నాగసురేష్, సోమయ్య పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యం హత్య కేసులో సీబీఐ దర్యాప్తు అవసరం లేదు

- ఈ విషయంలో సింగిల్ జడ్జి తీర్పు సరైందే
- హైకోర్టు ధర్మాసనం తీర్పు.. అప్పీల్ కొట్టివేత



సాక్షి, అమరావతి: డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించేందుకు హైకోర్టు ధర్మాసనం సైతం నిరాకరించింది. కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించేందుకు నిరాకరిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును ధర్మాసనం సమర్థించింది. పోలీసుల దర్యాప్తు సరిగ్గానే ఉందని, ఈ కేసు సీబీఐకి అప్పగించాల్సినంత కేసు కాదంటూ ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) మహేశ్వరరెడ్డి చేసిన వాదనతో ధర్మాసనం ఏకీభవించింది. సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ అతని తల్లిదండ్రులు దాఖలు చేసిన అప్పీల్‌ను ధర్మాసనం కొట్టేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ ప్రతాపవెంకట జ్యోతిర్మయి ధర్మాసనం శుక్రవారం తీర్పు వెలువరించింది. తమ కుమారుడు సుబ్రహ్మణ్యం హత్య కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని కోరుతూ మృతుడి తల్లిదండ్రులు నూకరత్నం, సత్యనారాయణ గతేడాది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి.. దర్యాప్తును సీబీఐకి అప్పగించేందుకు నిరాకరిస్తూ పిటిషన్‌ను కొట్టేశారు. దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసి మూడు నెలల్లో సంబంధిత కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించారు. ఈ తీర్పును సవాలు చేస్తూ నూకరత్నం, సత్యనారాయణ ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేశారు. ఈ అప్పీల్‌పై జస్టిస్ దుర్గాప్రసాద్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. పోలీసుల తరపున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది వి.మహేశ్వరరెడ్డి వాదనలు వినిపించగా, ఈ అప్పీల్‌లో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేసిన ఎమ్మెల్సీ అనంతబాబు తరపున సీనియర్ న్యాయవాది చిత్తరవు రఘు వాదనలు వినిపించారు. సుబ్రహ్మణ్యం తల్లిదండ్రుల తరపు న్యాయవాది జడా శ్రవణ్‌కుమార్ వాదనలు వినిపించారు. అందరి వాదనలు విన్న ధర్మాసనం ఆగస్టులో తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా శుక్రవారం తీర్పు వెలువరించింది.

డాక్టర్ వైఎస్సార్ రంగస్థల పురస్కారాలు..

- 'టీమ్ వర్క్' తో పనిచేసిన నాటక పరిషత్తులకు ..
- డిసెంబర్ 10లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పంపాలి

సాక్షి, అమరావతి: ఈ ఏడాది నుంచి 'డాక్టర్ వైఎస్సార్ రంగస్థల పురస్కారం' పేరుతో నాటక సమాజాల ప్రోత్సాహానికి ఏటా ఓ అవార్డును అందజేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర టీవీ, నాటకరంగ అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, సమాచార పౌరసంబంధాల శాఖ ఎక్స్ అఫీషియో సెక్రటరీ తుమ్మ విజయకుమార్ రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. నాటక రంగంపై ఆసక్తిగల కళాప్రియులకు వేదిక కల్పించి, ఆ రంగం వృద్ధికి గణనీయమైన కృషి చేసిన సమాజాలు, పరిషత్తులకు రూ. 5,00,000, వైఎస్సార్ ప్రతిమ మెమెంటోను ప్రభుత్వం అందజేయనుంది. నంది నాటకోత్సవాల సందర్భంగా అదే వేదికపై వ్యక్తిగత స్థాయిలో నాటక రంగంలో విశేష కృషి చేసిన నటులకు, కళాకారులకు 'ఎన్టీఆర్ రంగస్థల పురస్కారం' పేరుతో అవార్డు ప్రదానం చేయనుంది. కాగా మొదటిసారి ఈ రంగంలో సమష్టి కృషితో (టీమ్‌వర్క్) పనిచేసిన సమాజాలకు, పరిషత్తులకు గుర్తింపు లభించనుంది. 'ఎన్టీఆర్, డాక్టర్ వైఎస్సార్ రంగస్థల పురస్కారాలకు' అర్హులైన వ్యక్తులు, సమాజాలు, పరిషత్తులు ఆన్ లైన్ ద్వారా తమ దరఖాస్తులను డిసెంబర్ 10వ తేదీ లోగా పంపాలి. తగు ధృవ పత్రాలు జతచేసిన దరఖాస్తులు డిసెంబర్ 18వ తేదీలోగా మేనేజింగ్ డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర టీవీ, నాటకరంగ అభివృద్ధి సంస్థ, ఆర్.టి.సి. కాంప్లెక్స్, ఎన్టీఆర్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, 4వ ఫ్లోర్, విజయవాడ–520013 చిరునామాకు చేరేట్టుగా పంపాలి. డిసెంబర్ చివరి వారంలో జరిగే నంది నాటకోత్సవాలు–2022 వేదికపై పురస్కారాల ప్రదానం జరుగనుంది.

10 రోజుల పాటు శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం

- 17 నుంచి జనవరి 14 వరకు సుప్రభాత సేవ స్థానంలో తిరుప్పావై సేవ
- టీటీడీ వెబ్‌సైట్‌లో అందుబాటులోకి కాషన్ డిపాజిట్ రీఫండ్ ట్రాకర్
- టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి వెల్లడి



తిరుమల: శ్రీవారి ఆలయంలో భక్తులకు వైకుంఠ ద్వార దర్శనాన్ని డిసెంబర్ 23 నుంచి జనవరి 1 (10 రోజులు) వరకు కల్పించనున్నట్లు టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి చెప్పారు. తిరుమల అన్నమయ్య భవనంలో శుక్రవారం జరిగిన డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తిరుపతి, తిరుమలలోని 10 కేంద్రాల్లో డిసెంబర్ 22 నుంచి 4,23,500 టోకెన్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. తిరుపతిలోని ఇందిరా మైదానం, రామచంద్ర పుష్కరిణి, శ్రీనివాసం కాంప్లెక్స్, విష్ణు నివాసం కాంప్లెక్స్, భూదేవి కాంప్లెక్స్, శ్రీ గోవిందరాజస్వామి రెండో సత్రం, బైరాగిపట్టెడలోని రామానాయుడు ఉన్నత పాఠశాల, ఎంఆర్ పల్లి, జీవకోనలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలు, తిరుమలలో స్థానికుల కోసం కౌస్తుభం విశ్రాంతి గృహం వద్ద టోకెన్లు ఇవ్వనున్నట్లు వివరించారు. టోకెన్లు ఉన్నవారిని మాత్రమే శ్రీవారి దర్శనానికి అనుమతిస్తామని స్పష్టం చేశారు. ఈ నెల 22 నుంచి 24 వరకు, డిసెంబర్ 31, జనవరి 1న కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం సేవలను రద్దు చేసినట్లు తెలిపారు. వైకుంఠ ఏకాదశి నాడు ఉదయం 9–11 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత మలయప్ప స్వామిని స్వర్ణ రథంపై మాడ వీధుల్లో ఊరేగిస్తామని తెలిపారు. వైకుంఠ ద్వాదశి నాడు శ్రీవారికి ఉదయం 4.30 గంటలకు చక్రస్నానం నిర్వహిస్తామని చెప్పారు. ధనుర్మాసం సందర్భంగా ఈ నెల 17 నుంచి జనవరి 14 వరకు సుప్రభాత సేవ స్థానంలో తిరుప్పావై పఠనాన్ని నిర్వహిస్తామని చెప్పారు. తిరుమలలో గదులు పొందిన భక్తులు కాషన్ డిపాజిట్ స్థితిని తెలుసుకునేందుకు టీటీడీ వెబ్‌సైట్‌లో కాషన్‌డిపాజిట్ రీఫండ్ ట్రాకర్‌ను పొందుపరిచినట్లు చెప్పారు.

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మండవ కిరణ్మయి శుక్రవారం దర్శించుకున్నారు. ఆమెకు ఆలయాధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం ఆలయ రంగ నాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనాలను,అధికారులు ప్రసాదాలను అంద జేశారు.



ఆలయం వెలుపల కుటుంబ సభ్యులతో జస్టిస్ మండవ కిరణ్మయి

అటు ఉపాధి- ఇటు అభివృద్ధి

- అడిగిన వారందరికీ పనులు
- వలసల నివారణే లక్ష్యంగా అమలు
- సీసీరోడ్లు, డ్రైయిన్లు, భవన నిర్మాణాలు
- నిర్మాణ పనులతో పల్లెలు అభివృద్ధి
- ఉద్యాన తోటల పెంపకం ద్వారా రైతులకు అండ
- పచ్చదనం కోసం లక్షలాది మొక్కల పెంపకం

కాకినాడ సిటీ: వలసలు నియంత్రించి, ఉన్న ఊళ్లోనే పని కల్పించేందుకు ఉద్దేశించిన ఉపాధి పథకం జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా జరుగుతోంది. పని కావాలని అడిగిన ప్రతి ఒక్కరికీ రాష్ట్ర ప్రభుత్వం పనులు చూపుతోంది. పథకంలో వ్యవసాయ అనుబంధ, అభివృద్ధి పనులకు అత్యంత ప్రాధాన్యం కల్పిస్తోంది. కూలీలు చేపట్టే వాటికి మొదటి ప్రాధాన్యత కల్పిస్తోంది. మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణం చేపడుతోంది. గ్రామ పాలనలో కీలక భూమిక పోషిస్తున్న సచివాలయాల నిర్మాణం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్, పాలకేంద్రం, డిజిటల్ లైబ్రరీలు, రోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులు చేపడుతున్నారు. పండ్లతోటల అభివృద్ధికి అండగా నిలుస్తోంది. పనులు చేసిన వెంటనే బిల్లులు సైతం జమ అవుతుండటంతో ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్య పెరుగుతోంది. సాధారణంగా వేసవిలో ఉపాధికి అత్యంత డిమాండ్ నెలకొంటుంది.

కూలీల ఖాతాల్లో జమ

ప్రస్తుతం వ్యవసాయ పనుల సీజన్ అయినా ఉపాధికి మాత్రం ఆదరణ తగ్గడం లేదు. వలసల సంఖ్య తగ్గిపోయింది. ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కూలీలకు వారు చేసి పనులకు సంబంధించిన వేతనాలను ప్రభుత్వం వారి బ్యాంకు అకౌంట్లలో జమ చేస్తుండడంతో ఆర్థిక పరిపుష్టి చేకూరుతోంది. ఈ పథకంలో భాగంగా చేపడుతున్న పనులతో పల్లెలు అభివృద్ధి బాట పట్టాయి. గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, భవన నిర్మాణాలు చేపడుతున్నారు.

నిశ్చితంగా బతుకులు

జిల్లాలో 21 మండలాలు ఉన్నాయి. అన్ని ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయి. ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు ఉపాధి కూలీలు పనులకు హాజరవుతున్నారు. అనంతరం ఇంటికి వెళ్లి భోజనం చేసి మధ్యాహ్నం మరో పనికి వెళ్తున్నారు. ఉపాధి పనులకు హాజరయ్యే కూలీలకు రోజుకు కనీసం రూ.257 వేతనం వారి ఖాతాల్లో జమవుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఇతర పనులకు వెళ్లడం ద్వారా వీరు అదనపు ఆదాయం కూడా పొందుతున్నారు. భార్య, భర్త ఇద్దరూ పనులకు వెళితే రూ.1000 వరకు సంపాదిస్తున్నారు. 2.09 లక్షల మంది రోజువారీ వేతనదారులు ఉపాధి హామీ పథకంకింద ప్రయోజనం పొందుతున్నారు. ఈ ఏడాది 80 లక్షలు పని దినాలు లక్ష్యంగా పనులు నిర్వహించి పూర్తిచేశారు. వేతన ఖర్చు రూ.136.05 కోట్లు, మెటీరియల్ ఖర్చు కింద రూ.42.68 కోట్ల మేర చెల్లించారు.

వ్యవసాయ రంగం అభివృద్ధి:

ఉపాధి హామీ పథకంలో వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పంట కాలువలు తీయడం, కాలువ పూడికతీత, చెరువుల్లో మట్టి తీయడం ద్వారా పూర్తి చేసుకుంటున్నారు. ఉపాధి హామీ నిధుల ద్వారా రోడ్లకు ఇరుపక్కల మొక్కలు నాటి పచ్చదనం పెంపొందిస్తున్నారు. పిఠాపురం, శంఖవరంల్లో డ్వామా నర్సరీలు ఏర్పాటు చేశారు. గడచిన ఏడాది 89 కిలోమీటర్ల పొడవున రోడ్లకు ఇరువైపులా రూ.18.32 కోట్ల వ్యయంతో 11.54 లక్షల మొక్కలు నాటారు. చిన్న, సన్నకారు రైతుల భూముల్లో ఉపాధి నిధులతో 430.53 ఎకరాల్లో మొక్కలు నాటడం పూర్తయ్యింది. తోటలు పెంచుతున్నారు. గుంట తీసి మొక్క నాటినప్పటి నుంచి మూడేళ్ల వరకు వాటి సంరక్షణ కోసం నిధులు కేటాయిస్తున్నారు. మామిడి, బత్తాయి, నిమ్మ, జామ, సపోట, మునగ తదితర తోటల పెంపకం చేపడుతున్నారు. గత నాలుగేళ్లలో రూ.10.75 కోట్ల వ్యయంతో 23.44 ఎకరాల్లో పండ్ల మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు. ఫ్లోరికల్చర్‌లో గులాబీ, మల్లె 12.75 ఎకరాలు మొక్కలు నాటారు.

పర్యాటక ప్రాంతాలకు భారత్ గౌరవ్ రైలు

ఐఆర్‌సీటీసీ ఏరియా మేనేజర్ రాజా



రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): భారతీయ రైల్వే అనుబంధ సంస్థ ఐఆర్‌సీటీసీ (ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్) ఆధ్వర్యంలో పూరీ, గయ, వారణాసి, అయోధ్య, ప్రయాగరాజ్ ప్రాంతాల్లో పర్యాటక ప్రదేశాలు, పుణ్యక్షేత్రాలను దర్శించుకునే యాత్రికుల కోసం భారత్ గౌరవ్ రైలు నడపనున్నట్లు ఐఆర్‌సీటీసీ ఏరియా మేనేజర్ ఎన్.రాజా తెలిపారు. శుక్రవారం విజయవాడ రైల్వేస్టేషన్‌లోని ఐఆర్‌సీటీసీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 9న సికింద్రాబాద్ నుంచి బయలుదేరే ఈ రైలుకు విజయవాడ, ఏలూరు, రాజమహేంద్రవరం, సామర్లకోట స్టేషన్‌లలో బోర్డింగ్ సదుపాయం ఉంటుందని తెలిపారు. ప్రయాణం అంతటా టూర్ ఎస్కార్ట్‌లు, రైలులో భద్రతకు సీసీ కెమెరాలు, టూర్ మేనేజర్లు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఈ ప్యాకేజీలో ఒక్కొక్కరికి స్లీపర్ క్లాస్–రూ.15,200, 3 ఏసీ–రూ.24,000, 2 ఏసీ–రూ.31,000 ధరగా నిర్ణయించారు. ఆసక్తి గల ప్రయాణికులు ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ లోను, విజయవాడ రైల్వే స్టేషన్‌లోని ఐఆర్‌సీటీసీ కార్యాలయం లోను, లేదా 8287932312, 9281495848 ఫోన్ నంబర్‌లలో సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

రూ.100 కోట్లతో 'ఆడుదాం ఆంధ్ర'

- రూ.12.21 కోట్ల నగదు బహుమతుల అందజేత
- కోటి మంది రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం
- మంత్రి ఆర్కే రోజా వెల్లడి



మాట్లాడుతున్న మంత్రి రోజా, చిత్రంలో సిద్ధార్థరెడ్డి

సాక్షి, అమరావతి: ఏపీలోని యువత క్రీడా ప్రతిభను చాటేలా 'ఆడుదాం ఆంధ్ర' నిర్వహిస్తున్నట్లు పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల శాఖ మంత్రి ఆర్కే రోజా చెప్పారు. శుక్రవారం విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ..రూ.100 కోట్లతో డిసెంబర్ 15 నుంచి 51 రోజుల పాటు 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా సంబరాలకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. 15ఏళ్లకు పైబడిన మహిళలు, పురుషులు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ డబుల్స్‌తో పాటు సాంప్రదాయ యోగ, మారథాన్, టెన్నీకాయిట్ పోటీలకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో విజేతలకు రూ.12.21 కోట్ల నగదు బహుమతులు ఇవ్వనున్నట్టు ప్రకటించారు. జీఎస్‌డబ్ల్యూఎస్, మండల పరిధిలో బేసిక్ స్పోర్ట్స్ కిట్స్, నియోజవర్గం స్థాయి నుంచి ప్రొఫెషనల్ స్పోర్ట్స్ కిట్స్‌ను అందిస్తామన్నారు. ఆడుదాం ఆంధ్ర పోర్టల్‌లో 72 గంటల్లోనే 5 లక్షల మంది క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. కనిష్టంగా 34లక్షలు, గరిష్టంగా 84 లక్షల నుంచి కోటి మంది క్రీడాకారుల రిజిస్ట్రేషన్ చేసుకునేలా ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి మాట్లాడుతూ 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా సంబరానికి మస్కట్ (కిట్టు) కింద రాష్ట్ర జంతువు కృష్ణ జింకను ఎంపిక చేసినట్లు తెలిపారు. పోటీలకు 10వేల క్రీడా మైదానాలను సిద్ధం చేశామని, త్వరలోనే క్రీడాకారులకు దుస్తులు, టోపీలు, స్పోర్ట్స్ కిట్ల పంపిణీని పూర్తి చేస్తామన్నారు. యువజన సర్వీసుల శాఖ ముఖ్యకార్యదర్శి ప్రద్యుమ్న, శాప్ ఎండీ ధ్యాన్‌చంద్ర పాల్గొన్నారు. అంతకు ముందు 'ఆడుదాం ఆంధ్ర' స్పోర్ట్స్ కిట్లు, బ్రోచర్లను ప్రదర్శించారు.

అడ్రస్ ఉంటే ఎవరైనా ఆడొచ్చు..

'రాష్ట్రంలో ఓటర్,ఆధార్, రేషన్ కార్డుల్లో అడ్రస్ ఉంటే పవన్‌కళ్యాణ్, లోకేశ్‌లు కూడా ఆడుదాం ఆంధ్రలో నమోదు చేసుకుని ఆడవచ్చని, హైదరాబాద్, బెంగళూరుల్లో ఓటు పెట్టుకుని ఇక్కడ ఆడాలంటే కష్టమని మంత్రి రోజా అన్నారు. ఈ పోటీల్లో విజేతలకు అందించే సర్టిఫికెట్లు యువతకు ఉపయోగపడేలా శాప్ బోర్డులో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. త్వరలోనే క్రీడారంగం స్వరూపాన్ని మార్చేలా కొత్త స్పోర్ట్స్ పాలసీని తీసుకొస్తామని చెప్పారు.

క్లుప్తంగా...

మార్కుల డివిజన్ ప్రకటించం

10, 12 తరగతుల ఫలితాలపై సీబీఎస్ఈ

సాక్షి, న్యూఢిల్లీ: 10, 12 తరగతుల మార్కుల ఫలితాల్లో ఇకపై డివిజన్, డిస్టింక్షన్‌ను ప్రకటించబోమని సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) పేర్కొంది. మెరిట్ లిస్టును ప్రకటించే విధానానికి గతంలోనే స్వస్తి చెప్పిన బోర్డు తాజాగా డివిజన్, డిస్టింక్షన్‌పై నిర్ణయాన్ని వెలువరించింది. ఈమేరకు సీబీఎస్ఈ ఎగ్జామినేషన్ కంట్రోలర్ భరద్వాజ్ ఒక ప్రకటన విడుదల చేశారు. మార్కుల శాతాన్ని లెక్కించడం, ప్రకటించడం వంటివి బోర్డు ఇకపై చేయదని స్పష్టం చేశారు. ఉన్నత చదువులకు మార్కుల శాతం అవసరమనిపిస్తే సదరు సంస్థ వాటిని గణించుకోవచ్చని వివరించింది. ఒకవేళ విద్యార్థి అయిదుకు మించి సబ్జెక్టులను ఎంచుకున్నట్లయితే..వాటిలో అయిదు ఉత్తమ సబ్జెక్టులను గుర్తించడంపై సంబంధిత ఉన్నత విద్యా సంస్థ లేదా యజమాని నిర్ణయం తీసుకోవచ్చని భరద్వాజ్ తెలిపారు. 10, 12వ తరగతి సీబీఎస్ఈ బోర్డు పరీక్షలు 2024 ఫిబ్రవరి 15వ తేదీ నుంచి మొదలవుతాయని తెలిపారు.

కోటాలో మరో విద్యార్థి బలవన్మరణం

కోటా: రాజస్తాన్‌లోని కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డారు. దీంతో ఈ ఏడాదిలో ఇప్పటి వరకు బలవన్మరణానికి పాల్పడిన విద్యార్థుల సంఖ్య 29కి చేరింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన నిషా యాదవ్(21)స్థానిక మహావీర్‌నగర్ ఏరియాలోని హాస్టల్‌లో ఉంటూ నీట్ కోసం ప్రిపేరవుతోంది. బుధవారం రాత్రి ఆమె తండ్రి ఫోన్ చేశారు. ఎంత సేపటికీ ఆమె స్పందించకపోవడంతో హాస్టల్ సిబ్బందికి సమాచారమిచ్చారు. వారు తలుపులు పగులగొట్టి చూడగా నిషా యాదవ్ ఫ్యానుకు ఉరి వేసుకుని, విగతజీవిగా కనిపించింది. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

వాణిజ్య గ్యాస్ సిలిండర్ మరింత ప్రియం

సాక్షి, న్యూఢిల్లీ: అయిదు రాష్ట్రాల ఎన్నికలు ముగియగానే చమురు కంపెనీలు గ్యాస్ వినియోగదారులకు షాక్ ఇచ్చాయి. 19 కిలోల వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను శుక్రవారం రూ.21కి పెంచాయి. పెంచిన ధరలు డిసెంబర్ 1నుంచే అమలులోకి వస్తాయని పేర్కొన్నాయి. తాజాగా పెరిగిన ధరల ప్రకారం.. దేశ రాజధాని ఢిల్లీలో వాణిజ్య సిలిండర్ ధర రూ.1,796.50, కోల్‌కతాలో రూ.1,908, ముంబైలో రూ.1,749, బెంగళూరులో రూ.1,883, చెన్నైలో రూ.1,968.50 గా ఉంది. కాగా, హైదరాబాద్ లో రూ.2,022, విజయవాడలో రూ.1,956.50కి చేరింది.

కశ్మీర్‌లో ఉగ్రవాది హతం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో గురువారం జరిగిన ఎదురు కాల్పుల ఘటనలో ఒక ఉగ్రవాది హతమయ్యాడు. నిఘా వర్గాల సమాచారం మేరకు భద్రతా సిబ్బంది గురువారం అరిహల్ గ్రామాన్ని చుట్టుముట్టాయి. గాలింపు జరుపుతున్న బలగాలపైకి నక్కి ఉన్న ఉగ్రవాది యథేచ్ఛగా కాల్పులకు దిగాడు. ఎదురుకాల్పుల్లో కిషాయత్ అయూబ్ అలీ అనే ఉగ్రవాది హతమయ్యాడు. ఇతడు లష్కరే తోయిబా తరఫున పనిచేస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

నేవీ షిప్‌పై మొదటిసారిగా మహిళా అధికారికి బాధ్యతలు

నేవీ చీఫ్ అడ్మిరల్ ఆర్.హరికుమార్ వెల్లడి

న్యూఢిల్లీ: నావికా దళం యుద్ధ నౌకపై మొదటిసారిగా మహిళా కమాండింగ్ అధికారిని నియమించినట్లు నేవీ చీఫ్ అడ్మిరల్ ఆర్.హరికుమార్ వెల్లడించారు. మహిళా అధికారులకు 'అన్ని ర్యాంకులు- అన్ని బాధ్యతలు' అనే సిద్ధాంతానికి నేవీ కట్టుబడి ఉంటుందన్నారు. హిందూ మహా సముద్రంలో చైనా ఉనికి పెరిగిన నేపథ్యంలో భారత నావికా దళం యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, విమానాలు గత ఏడాదిగా వ్యూహాత్మకంగా చురుగ్గా వ్యవహరిస్తున్నాయని చెప్పారు.

అలాంటి బిల్లులను రాష్ట్రపతి పరిశీలన కోసం పంపించలేరు

తమిళనాడు గవర్నర్‌కు సుప్రీం సూచన

న్యూఢిల్లీ: రాష్ట్రాల శాసనసభలో తొలుత తీర్మానించి, తర్వాత పునఃపరిశీలించి తీర్మానించిన బిల్లులపై ఆమోద ముద్ర వేయకుండా రాష్ట్రపతి పరిశీలన కోసం ఆ రాష్ట్ర గవర్నర్ పంపించడం కుదరని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. పెండింగ్‌లో ఉన్న 10కిపై బిల్లుల విషయంలో ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్‌తో నెలకొన్న ప్రతిష్టంభనకు ఇకనైనా తెరదించాలని తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవికి అత్యున్నత న్యాయస్థానం సూచించింది. ముఖ్యమంత్రితో సమావేశమై చర్చించుకోవాలని, బిల్లులను ఆమోదించే విషయంలో విభేదాలకు ముగింపు పలకాలని సూచించింది. చర్చలకు ముఖ్యమంత్రిని గవర్నర్ ఆహ్వానిస్తారని తాము ఆశిస్తున్నట్లు పేర్కొంది. కలిసి కూర్చొని మాట్లాడుకుంటే సమస్యలు సమసిపోతాయని స్పష్టం చేసింది. గవర్నర్ రవి, ముఖ్యమంత్రి స్టాలిన్ మధ్య ప్రచ్ఛన్న యుద్ధం కొనసాగుతోంది. అసెంబ్లీలో తీర్మానించిన కీలక బిల్లులకు ఆమోద ముద్ర వేయకుండా గవర్నర్ ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నారని ఆరోపిస్తూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. బిల్లులను సకాలంలో ఆమోదించేలా గవర్నర్‌ను ఆదేశించాలని కోరింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. తమిళనాడు ప్రభుత్వం తరఫున సీనియర్ లాయర్ అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు.

భూమిని వేడెక్కిస్తున్న పాపం... పెద్ద దేశాలదే!

2022లో ప్రపంచ కర్బన ఉద్గారాలు 5 వేల కోట్ల టన్నులు!

అందులో 30 శాతం వాటా చైనాదే, రెండో స్థానంలో అమెరికా



- తలసరి కర్బన ఉద్గారాల్లో అమెరికాది అగ్రస్థానం
- వాటికి అడ్డుకట్ట వేస్తేనే గ్లోబల్ వార్మింగ్‌కు చెక్
- మందుపాతరపై భూగోళం: ఐరాస ఆందోళన

గ్లోబల్ వార్మింగ్. కొన్ని దశాబ్దాలుగా ప్రపంచాన్ని వణికిస్తున్న సమస్య. దీని దెబ్బకు భూగోళపు సగటు ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరిగిపోతున్నాయి. అవి ఇంకో అర డిగ్రీ మేరకు పెరిగినా సర్వ వినాశనం జరిగే పరిస్థితి! ప్రాణికోటి మనుగడకే పెను ముప్పు! ఈ ప్రమాదం ఎంతో దూరం కూడా లేదని ఐక్యరాజ్యసమితి ఇప్పటికే ఎన్నోసార్లు హెచ్చరించింది. అయినా పరిస్థితిలో పెద్దగా మెరుగుదల లేదు. ముఖ్యంగా గ్లోబల్ వార్మింగ్‌కు ప్రధాన కారణమైన గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలు ఏటికేడు పెరుగుతున్నాయే తప్ప తగ్గడం లేదు. అంతర్జాతీయ పర్యావరణ సదస్సుల్లో దీనిపై ఎంతగా ఆందోళన వ్యక్తమవుతున్నా అది మాటలకే పరిమితమవుతోంది. ఉద్గారాలకు ముకుతాడు వేస్తామన్న సంపన్న దేశాల వాగ్దానాలు నీటిమూటలే అవుతున్నాయి. తరచి చూస్తే, గ్రీన్‌హౌస్‌వాయు ఉద్గారాల్లో సింహ భాగం పెద్ద దేశాలదే.

మాటలే తప్ప చేతల్లేవు

2022లో ప్రపంచ దేశాలన్నీ కలిపి విడుదల చేసిన గ్రీన్‌హౌస్ వాయువుల పరిమాణమెంతో తెలుసా? ఏకంగా 5,000 కోట్ల మెట్రిక్ టన్నులు! పర్యావరణ కాలుష్య కారకాల్లో అతి ముఖ్యమైనవి గ్రీన్‌హౌస్ ఉద్గారాలే. భూగోళాన్ని వేడెక్కించడంలో కూడా వీటిదే ప్రధాన పాత్ర. ఇంతటి ప్రమాదకరమైన సమస్య విషయంలో మన నిర్లిప్త వైఖరికి ఏటేటా ఏడాది గ్రీన్‌హౌజ్ వాయు ఉద్గారాల పరిమాణం మరో తాజా ఉదాహరణ మాత్రమే. ఈ పాపంలో సంపన్న దేశాల పాత్రే ఎక్కువ. చైనా విషయమే తీసుకుంటే, గతేడాది ప్రపంచ గ్రీన్‌హౌస్ ఉద్గారాల్లో ఆ ఒక్క దేశం వాటాయే ఏకంగా 30 శాతం! 2022లో అది 1,440 కోట్ల టన్నుల మేరకు కార్బన్ డయాక్సైడ్ (సీఓటూ) ఉద్గారాలను వాతావరణంలోకి విడుదల చేసిన చెత్త రికార్డును మూటగట్టుకుంది. కొన్ని దశాబ్దాలుగా చైనా పారిశ్రామిక వ్యవస్థ ప్రధానంగా బొగ్గుపై ఆధారపడటమే ఇందుకు ప్రధాన కారణం. ఇక 639 కోట్ల టన్నులతో అమెరికా రెండో స్థానంలో ఉంది. 343 కోట్ల టన్నులతో యూరోపియన్ యూనియన్(ఈయూ) నాలుగో స్థానంలో ఉంది. గణాంకాలపరంగా 352 కోట్ల టన్నులతో ఈ జాబితాలో భారత్ మూడో స్థానంలో ఉన్నట్టు కనిపించినా జనాభాను బట్టి చూస్తే కర్బన ఉద్గారాల పాపంలో మన వాటా నిజానికి చాలా తక్కువ. మన తలసరి వార్షిక కర్బన ఉద్గారాలు కేవలం 2.5 టన్నులు! ప్రపంచ వేదికలపై పెద్ద మాటలు చెప్పే అమెరికాదే ఈ పాపంలో అగ్రస్థానం! ఒక్కో అమెరికన్ ఏటా సగటున 19 టన్నుల సీఓటూ ఉద్గారాలకు కారకుడవుతున్నాడు. కేవలం 2.5 కోట్ల జనాభా ఉన్న ఆస్ట్రేలియాలో తలసరి కర్బన ఉద్గారాలు 20 టన్నులు, 3.8 కోట్ల జనాభా ఉన్న కెనడాలో 18 టన్నులు, 14 కోట్ల జనాభా ఉన్న రష్యాలో 14 టన్నులు! 20.7 టన్నుల తలసరి ఉద్గారాలతో సౌదీ అరేబియా ఈ జాబితాలో అగ్ర స్థానంలో ఉండటం విశేషం. మొత్తమ్మీద ప్రపంచ కర్బన ఉద్గారాల్లో చైనా, అమెరికా, ఈయూ వాటాయే దాదాపు సగం! వీటిలోనూ చారిత్రకంగా చూసుకుంటే అమెరికా, ఈయూ రెండే ప్రపంచ కాలుష్యానికి ప్రధాన కారకులుగా ఉంటూ వస్తున్నాయి.

వేడెక్కుతున్న భూమి

భూగోళపు ఉష్ణోగ్రత పారిశ్రామికీకరణకు ముందు నాటితో గత 150 ఏళ్లలో 1.5 డిగ్రీలకు మించి పెరిగిపోయింది! ఇటీవల ఒకానొక దశలో అది 2 డిగ్రీలకు మించి కలవరపరిచింది కూడా. దాన్ని 1.5 డిగ్రీలకు మించకుండా కట్టడి చేయాలన్న పారిస్ ఒప్పందానికి ప్రపంచ దేశాలన్నీ పేరుకు అంగీకరించాయే తప్ప ఆచరణలో చేస్తున్నది పెద్దగా కన్పించడం లేదు. ఈ నేపథ్యంలో ప్రపంచం ఇప్పుడు ఏ క్షణమైనా పేలనున్న మందుపాతర మీద ఉందని ఐక్యరాజ్యసమితి తాజాగా ఆందోళన వెలిబుచ్చింది. కర్బన ఉద్గారాల ప్రవాహం ఇలాగే కొనసాగి గ్లోబల్ వార్మింగ్ పెరుగుతూ పోతే ప్రపంచ దేశాలన్నీ ఎలాగోలా ప్రస్తుత పర్యావరణ లక్ష్యాలను చేరుకున్నా భూమి 2 డిగ్రీలను మించి వేడెక్కడం ఖాయమని హెచ్చరించింది. అప్పుడు కనీవినీ ఎరగని ఉత్పాతాలను, ఘోరాలను నిత్యం కళ్లజూడాల్సి వస్తుందని స్పష్టం చేసింది. ఇంతటి విపత్కర పరిస్థితుల నేపథ్యంలో దుబాయ్‌లో అంతర్జాతీయ పర్యావరణ సదస్సు కాప్–28 జరుగుతోంది. అందులోనైనా కర్బన ఉద్గారాలకు కళ్లెం వేసి భూగోళాన్ని కాపాడుకునే దిశగా ఏమైనా నిర్ణయాత్మకమైన అడుగులు పడతాయేమో చూడాలి.

2030 నాటికి భూగోళపు ఉష్ణోగ్రత పెరుగుదలను 1.5 డిగ్రీలకు పరిమితం చేయాలన్న లక్ష్యం నెరవేరాలంటే కర్బన ఉద్గారాల్లో టాప్-20లో ఉన్న దేశాలు వాటిని ఏ మేరకు కట్టడి చేయాలంటే...

ఈయూ	90 శాతం
అమెరికా	71 శాతం
జపాన్	69 శాతం
దక్షిణ కొరియా	65 శాతం
కెనడా	57 శాతం
రష్యా	52 శాతం
ఇరాన్	51 శాతం
ఆస్ట్రేలియా	50 శాతం
సౌదీ అరేబియా	49 శాతం
మెక్సికో	47 శాతం
చైనా	42 శాతం
దక్షిణాఫ్రికా	34 శాతం
తుర్కియే	32 శాతం
ఇండోనేసియా	26 శాతం
బ్రెజిల్	25 శాతం
వియత్నాం	20 శాతం
భారత్	2 శాతం

\- సాక్షి, నేషనల్ డెస్క్

ఏమిటీ కర్బన ఉద్గారాలు?

బొగ్గు, చమురు, గ్యాస్‌ను మండించినప్పుడు అవి వాతావరణంలోకి భారీ పరిమాణంలో కార్బన్ డయాక్సైడ్‌ను విడుదల చేస్తాయి. అది కొన్ని వందల ఏళ్లపాటు వాతావరణంలోనే ఉండిపోయి భూమిని వేడెక్కిస్తూ ఉంటుంది. ''ఆ లెక్కన భూమికి ముప్పు కేవలం 2022 తాలూకు కర్బన ఉద్గారాలు మాత్రమే కాదు. పారిశ్రామికీకరణ ఊపందుకున్నాక గత 150 ఏళ్లలో విడుదలైన కర్బన ఉద్గారాలన్నీ ఇప్పటికీ భూమిని వేడెక్కిస్తూనే ఉన్నాయి. ఆ లెక్కన ఈ 150 ఏళ్లలో అత్యధిక కర్బన ఉద్గారాలకు కారణమైన అమెరికాదే గ్లోబల్ వార్మింగ్‌లో ప్రధాన పాత్ర అని చెప్పాల్సి ఉంటుంది'' అని బ్రిటన్‌లోని ఎక్సెటర్ యూనివర్సిటీ పర్యావరణ శాస్త్రవేత్త పియరీ ఫ్రెడ్లింగ్‌స్టెయిన్ కుండబద్దలు కొట్టారు!

గాజాలో మళ్లీ దాడుల మోత

- వారం విరామానికి తెర
- విరుచుకుపడ్డ ఇజ్రాయెల్
- 100 మందికి పైగా మృతి

డెయిర్ అల్ బలాహ్ (గాజా స్ట్రిప్): వారం రోజుల విరమణకు తెర పడింది. గాజా స్ట్రిప్ మళ్లీ కాల్పులతో దద్దరిల్లుతోంది. విరామం అనంతరం ఇజ్రాయెల్ శుక్రవారం రెట్టించిన తీవ్రతతో మళ్లీ దాడులకు దిగింది. గాజాలోని పలు ప్రాంతాలపై క్షిపణులు, రాకెట్లు, బాంబులతో విరుచుకుపడింది. దాంతో ఖాన్ యూనిస్‌లో ఒక భారీ భవన సముదాయం నేలమట్టమైనట్టు తెలుస్తోంది. హమాద్‌లో కూడా ఒక అపార్ట్‌మెంట్‌పై క్షిపణుల వర్షం కురిసింది. దాడుల్లో కనీసం 109 మంది మరణించినట్టు హమాస్ ప్రకటించింది.

దక్షిణ గాజాపై కూడా దాడులను ఉధృతం చేసేలా కన్పిస్తోంది. ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయాలంటూ రోజంతా అక్కడ కరపత్రాలు జారవిడవడం దీన్ని బలపరుస్తోంది. అక్కడి ఖాన్ యూనిస్ తదితర ప్రాంతాలు ప్రమాదకరమైన యుద్ధ క్షేత్రాలుగా మారాయని వాటిలో హెచ్చరించింది. ''యుద్ధ లక్ష్యాల సాధనకు పూర్తిగా కట్టుబడి ఉన్నాం. బందీలందరినీ విడిపించుకోవడం, హమాస్‌ను నిర్మూలించడం, గాజా మరెప్పుడూ ఇజ్రాయెలీలకు ముప్పుగా మారకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకునేదాకా సైనిక చర్య కొనసాగుతుంది'' అంటూ ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ కార్యాలయం పేర్కొంది. మహిళా బందీలందరినీ వదిలేస్తామన్న ఒప్పంద వాగ్దానాన్ని హమాస్ ఉల్లంఘించడం వల్లే దాడులను తిరిగి మొదలుపెట్టాల్సి వచ్చిందని నెతన్యాహూ అన్నారు. ఇజ్రాయెలే రక్త దాహంతో తమ ప్రతిపాదనలన్నింటినీ బుట్టదాఖలు చేసి దాడులకు దిగిందని హమాస్ ఆరోపించింది.

8 మంది విడుదల...

గురువారం 8 మంది ఇజ్రాయెలీలను హమాస్ విడిచిపెట్టింది. బదులుగా శుక్రవారం ఉదయం 30 మంది పాలస్తీనా ఖైదీలను ఇజ్రాయెల్ వదిలేసింది. ఆ వెంటనే కాల్పుల విరమణకు స్వస్తి పలికి దాడులకు దిగింది.

మానవాళి స్వార్థంతో ప్రపంచానికి పెను చీకట్లే

- దుబాయ్ 'కాప్–28'లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- పొరపాట్లను సరిచేసుకోవడానికి ఎక్కువ సమయం లేదు
- ప్రజల భాగస్వామ్యంతో కర్బన ఉద్గారాలను తగ్గించుకోవాలి
- 'గ్రీన్ క్రెడిట్ ఇనిషియేటివ్'లో అందరూ పాలుపంచుకోవాలి
- 2028లో 'కాప్–33'ని భారత్‌లో నిర్వహిస్తామని మోదీ ప్రతిపాదన

దుబాయ్: గత శతాబ్ద కాలంలో జరిగిన పొరపాట్లను సరిచేసుకోవడానికి ప్రపంచానికి ఎక్కువ సమయం లేదని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. కేవలం మన ప్రయోజనాలు మాత్రమే కాపాడుకోవాలన్న మానవాళి వైఖరి అంతిమంగా భూగోళాన్ని చీకట్లోకి నెట్టేస్తుందని స్పష్టం చేశారు. వాతావరణ మార్పులు, తద్వారా ప్రకృతి విపత్తులతో భూగోళానికి పెనుముప్పు పొంచి ఉందని, వాటి దుష్ఫలితాలు ఇప్పటికే కనిపిస్తున్నాయని చెప్పారు. ప్రపంచానికి సవాలు విసురుతున్న కర్బన ఉద్గారాలను ప్రజల భాగస్వామ్యం ద్వారా తగ్గించుకోవడానికి 'గ్రీన్ క్రెడిట్ ఇనిషియేటివ్' కార్యక్రమాన్ని ఆయన ప్రకటించారు. ఐక్యరాజ్యసమితి వాతవరణ సదస్సు 'కాప్–33'ని 2028లో భారత్‌లో నిర్వహిస్తామని ప్రతిపాదించారు. శుక్రవారం యూఏఈలోని దుబాయ్‌లో జరిగిన కాప్–28లో ప్రధాని మోదీ ప్రసంగించారు. కాలుష్యం, విపత్తుల నుంచి భూగోళాన్ని కాపాడుకొనే చర్యలను వెంటనే ప్రారంభించాలని ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా 'గ్రీన్ క్రెడిట్ ఇనిషియేటివ్'ను ప్రస్తావించారు. వ్యాపారాత్మక ధోరణికి భిన్నంగా, ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా సాగే ఇందులో పాలుపంచుకోవాలని కోరారు.



మూల్యం చెల్లిస్తున్న మానవాళి

అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మధ్య సమతూకాన్ని భారత్ చక్కగా పాటిస్తోందని, ఈ విషయంలో ప్రపంచానికి గొప్ప ఉదాహరణగా నిలుస్తోందని ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. భూగోళ ఉపరితల ఉష్ణోగ్రత(గ్లోబల్ వార్మింగ్) పెరుగుదలను 1.5 డిగ్రీల సెల్సియస్‌కు పరిమితం చేయాలన్న లక్ష్య సాధనకు నిబద్ధతతో కృషి చేస్తున్న అతికొన్ని దేశాల్లో భారత్ కూడా ఉందన్నారు. గత శతాబ్ద కాలంలో మానవళిలో ఒక చిన్న సమూహం ప్రకృతికి ఎనలేని నష్టం కలిగించిందని మోదీ ఆక్షేపించారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని బదిలీ చేయండి

వాతావరణ మార్పులను ఎదుర్కొనే విషయంలో పేద, అభివృద్ధి చెందుతున్న దేశాలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని బదిలీ చేయాలని అభివృద్ధి చెందిన, సంపన్న దేశాలకు నరేంద్ర మోదీ సూచించారు.అభివృద్ధి చెందుతున్న దేశాలకు గ్లోబల్ కార్బన్ బడ్జెట్‌లో తగిన వాటా ఇవ్వాలన్నారు. 'కాప్–33'ని 2028లో భారత్‌లో నిర్వహించడానికి ప్రపంచ దేశాలు అంగీకరిస్తే తమ దేశంలో ఇటీవల జరిగిన జీ20 సదస్సు తర్వాత ఇదే అతిపెద్ద సదస్సు అవుతుందని పేర్కొన్నారు.

ఏమిటీ గ్రీన్ క్రెడిట్ ఇనిషియేటివ్?

భారత ప్రభుత్వం ఈ ఏడాది అక్టోబర్‌లో గ్రీన్ క్రెడిట్ ప్రోగ్రామ్‌ను ప్రకటించింది. 'గ్రీన్ క్రెడిట్ ఇనిషియేటివ్' కూడా దాదాపు ఇలాంటిదే. ఇదొక వినూత్నమైన మార్కెట్ ఆధారిత కార్యక్రమం. వేర్వేరు రంగాల్లో పర్యావరణ పరిరక్షణకు స్వచ్ఛందంగా కృషి చేసిన వ్యక్తులకు, వ్యవస్థలకు, కమ్యూనిటీలకు, ప్రైవేట్ రంగానికి ప్రత్యేక గుర్తింపునిస్తారు. ప్రోత్సాహకాలు అందజేస్తారు.

అమెరికా, చైనా అధినేతల గైర్హాజరు

దుబాయ్‌లో జరుగుతున్న కాప్–28కు వివిధ దేశాల అధ్యక్షులు, ప్రధానమంత్రులు పాల్గొంటున్నారు. ప్రపంచంలో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలైన అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, చైనా అధినేత షీ జిన్‌పింగ్ మాత్రం హాజరు కాకపోవడం చర్చనీయాంశంగా మారింది. ప్రపంచంలో ప్రతిఏటా కర్బన ఉద్గారాల్లో ఏకంగా 44 శాతం వాటా అమెరికా, చైనాలదే కావడం గమనార్హం. ఈ రెండు బడా దేశాల నిర్లక్ష్యం వల్ల ఇతర దేశాలకు నష్టపోతున్నాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది. అమెరికా, చైనా మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతున్న సంగతి తెలిసిందే.

8 మందిని కనండి: పుతిన్

మాస్కో: ఎనిమిది మంది, అంతకంటే ఎక్కువ సంతానాన్ని కనాలని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తమ దేశ మహిళలను కోరారు. రానున్న దశాబ్దాలతోపాటు ముందు తరాలు కూడా రష్యా జనాభాను పెంచటమే లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. పెద్ద కుటుంబాలను తయారు చేయడం జీవన విధానంగా మార్చుకోవాలని వారికి తెలిపారు. దేశంలో జననాల రేటు క్షీణిస్తుండటం, ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధంలో పెద్ద సంఖ్యలో సైనికులు మరణిస్తున్న నేపథ్యంలోనే ఆయన ఈ మేరకు పిలుపునిచ్చినట్లు భావిస్తున్నారు.

మిజోరంలో ఓట్ల లెక్కింపు 4న

న్యూఢిల్లీ: ఇటీవల ముగిసిన అయిదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు డిసెంబర్ 3న ఒకే రోజు మొదలవుతుందని ఎన్నికల కమిషన్(ఈసీ) ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, మిజోరంలో మాత్రం ఒక రోజు ఆలస్యంగా డిసెంబర్ 4న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు శుక్రవారం ఈసీ తెలిపింది. క్రైస్తవులు మెజారిటీ కలిగిన ఈ రాష్ట్రానికి చెందిన వివిధ వర్గాల ప్రతినిధులు 3వ తేదీ, ఆదివారం తమకు ఎంతో ప్రత్యేకమైనది అయినందున ఓట్ల లెక్కింపు వాయిదా వేయాలని కోరినట్లు ఈసీ వెల్లడించింది. ఈ మేరకు కౌంటింగ్‌ను ఒక రోజు అంటే 4వ తేదీకి వాయిదా వేసినట్లు వివరించింది.

2018 తీర్పుపై పునఃసమీక్షకు రాజ్యాంగ ధర్మాసనం

న్యూఢిల్లీ: సివిల్, క్రిమినల్ కేసుల్లో హైకోర్టు లేదా దిగువ కోర్టులిచ్చిన స్టేలు 6 నెలల తర్వాత ప్రత్యేకంగా పొడిగింపు ఆదేశాలివ్వకుంటే వాటంతటవే రద్దవుతాయంటూ 2018లో ఇచ్చిన తీర్పుపై పునఃసమీక్షకు రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 226 ప్రకారం సంక్రమించిన అధికారాలను 2018 నాటి తీర్పుతో హైకోర్టులు కోల్పోయాయంటూ అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం విచారణ చేపట్టింది. సీనియర్ లాయర్ రాకేశ్ ద్వివేది వాదనలు వినిపించారు. అప్పటి తీర్పుపై సమీక్షను రాజ్యాంగధర్మాసనానికి అప్పగిస్తామని తెలిపింది.

బెంగళూరు స్కూళ్లకు బాంబు బూచి

బనశంకరి: కర్ణాటక రాజధాని బెంగళూరు, చుట్టుపక్కల ప్రాంతాల్లోని 68 ప్రైవేట్ పాఠశాలలకు అందిన బాంబు బెదిరింపు మెయిళ్లు శుక్రవారం తీవ్ర అలజడి సృష్టించాయి. ఈ హెచ్చరికలతో విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాలల సిబ్బంది భయాందోళనలకు గురయ్యారు. పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులను వెంటనే ఇళ్లకు పంపించివేశాయి. అప్రమత్తమైన పోలీసులు బాంబు డిస్పోజల్ స్క్వాడ్లు, తనిఖీ బృందాలతో ఆయా పాఠశాలల్లో హుటాహుటిన గాలింపు చేపట్టారు. చివరికీ బెదిరింపులు ఉత్తుత్తివేనని తేలడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. బెంగళూరు, పరిసర ప్రాంతాల విద్యార్థులు శుక్రవారం ఉదయం యథావిధిగా తమ స్కూళ్లకు చేరుకున్నారు. అప్పటికే కొన్ని పాఠశాలలకు బెదిరింపు మెయిళ్లు వచ్చినట్లు సమాచారం బయటకు పొక్కింది. దీంతో, భయాందోళనలకు గురైన తల్లిదండ్రులు తమ ఇళ్లు, తాము పనిచేస్తున్న ఆఫీసుల నుంచి హడావుడిగా తమ పిల్లలు చదువుతున్న స్కూళ్లకు చేరుకుని, వారిని వెంట తీసుకెళ్లారు. బెదిరింపు మెయిళ్లు అందిన కొన్ని పాఠశాలల విద్యార్థులు శుక్రవారం పరీక్షలు రాయాల్సి ఉంది. కాగా, బెదిరింపు మెయిళ్లు అందిన 68 పాఠశాలల్లో బెంగళూరు నగరంలోనివి 48 కాగా, మిగతా బెంగళూరు గ్రామీణ పరిధిలోనివని నగర పోలీస్ కమిషనర్ బి.దయానంద తెలిపారు.

పాక్, బంగ్లా సరిహద్దుల్లో పటిష్ట భద్రత

మంత్రి అమిత్ షా

హజారీబాగ్: భారత్–పాకిస్తాన్, భారత్–బంగ్లాదేశ సరిహద్దుల్లో అత్యంత పటిష్టమైన భద్రత కల్పించబోతున్నామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వెల్లడించారు. రాబోయే రెండేళ్లలో సరిహద్దులను దుర్భేద్యంగా మార్చబోతున్నట్లు తెలిపారు. సరిహద్దుల్లో అసంపూర్తిగా ఉన్న 60 కిలోమీటర్ల మేర కంచె నిర్మాణాన్ని రెండేళ్లలో పూర్తి చేయనున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. శుక్రవారం జార్ఖండ్‌లోని హజారీబాగ్‌లో సరిహద్దు భద్రతా దళం(బీఎస్ఎఫ్) 59వ రైజింగ్ డే వేడుకల్లో అమిత్ షా పాల్గొన్నారు. జవాన్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత తొమ్మిదేళ్లలో భారత్–పాకిస్తాన్, భారత్–బంగ్లాదేశ సరిహద్దుల్లో 560 కిలోమీటర్ల మేర కంచె నిర్మాణం పూర్తి చేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వాల హయాంలో నిర్మించిన కంచెలో అక్కడక్కడా ఖాళీలు ఉండేవని, ఆ ఖాళీల గుండా చొరబాటుదారులు, స్మగ్లర్లు సులభంగా మన దేశంలోకి ప్రవేశించేవారని గుర్తుచేశారు. ఆ ఖాళీల్లోనూ కంచె నిర్మాణం పూర్తయ్యిందని, తూర్పు, పశ్చిమ సరిహద్దుల్లో మరో 60 కిలోమీటర్లే కంచె ఏర్పాటు చేయాల్సి ఉందని వివరించారు.

బ్యాంకులో పట్టపగలే రూ.18.80 కోట్ల దోపిడీ

ఇంఫాల్: మణిపూర్‌లోని ఓ బ్యాంకులో గురువారం పట్టపగలే భారీ దోపిడీ జరిగింది. గుర్తు తెలియని సాయుధ దుండగులు సుమారు రూ.18.80 కోట్లను దోచుకెళ్లారు. ఉఖ్రుల్ పట్టణంలోని వ్యూలాండ్‌లో ఉన్న పంజాబ్ నేషనల్ బ్యాంకులో ఈ ఘటన చోటుచేసుకుంది. రిజర్వు బ్యాంకు అధికారులు ఉఖ్రుల్ జిల్లాలోని అన్ని ఏటీఎంలకు అవసరమైన నగదును వ్యూలాండ్ బ్రాంచిలో నిల్వ ఉంచుతుంటారు. గురువారం సాయంత్రం 5.40 గంటల సమయంలో అత్యాధునిక ఆయుధాలతో ముసుగులు ధరించిన దుండగులు బ్యాంకు సిబ్బంది ప్రవేశించే గేట్ గుండా లోపలికి ప్రవేశించారు. ఉద్యోగులు, సెక్యూరిటీ సిబ్బందిని తుపాకీలతో బెదిరించి వాష్‌రూంలో బంధించారు. క్యాషియర్‌కు తుపాకీ గురిపెట్టి, క్యాష్ వాల్ట్‌ను తెరిపించారు. మొత్తం రూ.18.80 కోట్లను ఎత్తుకెళ్లి పోయారు.

వచ్చే పదేళ్లలో 50 శాతం మహిళా సీఎంలు

సీఎంలయ్యే అర్హతలున్న మహిళా నేతలు మా పార్టీలో ఉన్నారు: రాహుల్



కొచ్చి: కాంగ్రెస్ సంస్థాగత నిర్మాణంలో మహిళలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, వారిని మరింత ప్రోత్సహించాలని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. పార్టీలో ఇంకా చాలామంది మహిళా నాయకులను తయారు చేయాలని, దేశంలో వచ్చే పదేళ్లలో 50 శాత మంది మహిళా ముఖ్యమంత్రులు ఉండాలన్నదే తమ కాంగ్రెస్ లక్ష్యమని స్పష్టం చేశారు. శుక్రవారం కేరళలోని కొచ్చీలో మహిళా కాంగ్రెస్ నేతల సదస్సు 'ఉత్సాహ్'ను రాహుల్ గాంధీ ప్రారంభించారు. ప్రస్తుతం కాంగ్రెస్ నుంచి మహిళా ముఖ్యమంత్రి ఎవరూ లేరని అన్నారు. ముఖ్యమంత్రులు కావడానికి అవసరమైన అన్ని అర్హతలు కలిగిన మహిళా నాయకులు కాంగ్రెస్‌లో ఎంతోమంది ఉన్నారని చెప్పారు. ప్రయత్నించాలి, లక్ష్యం సాధించాలి అని సూచించారు. ఈరోజు నుంచి వచ్చే పది సంవత్సరాల్లో దేశంలో 50 శాతం మంది ముఖ్యమంత్రులు మహిళలే ఉండాలని, అదే మన లక్ష్యమని ఉద్ఘాటించారు.

మహిళా బిల్లు అమల్లో జాప్యమెందుకు?

ఆర్ఎస్ఎస్, బీజేపీపై రాహుల్ గాంధీ విరుచుకుపడ్డారు. అవి రెండూ పూర్తిగా పురుషాధిక్య సంస్థలని ఆరోపించారు. అధికారంలో మహిళలకు భాగస్వామ్యం కల్పించడానికి ఆర్ఎస్ఎస్ సిద్ధాంతం అంగీకరించదని చెప్పారు. మొత్తం ఆర్ఎస్ఎస్ చరిత్రను గమనిస్తే ఏనాడూ ఆ సంస్థలో మహిళల భాగస్వామ్యం లేదని గుర్తుచేశారు. మహిళలను ప్రోత్సహించే విషయంలో కాంగ్రెస్, ఆర్ఎస్ఎస్ మధ్య ఎంతో వ్యత్యాసం ఉందన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందినప్పటికీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వెంటనే అమలు చేయకపోవడం దారుణమని రాహుల్ మండిపడ్డారు. జాప్యం ఎందుకని ప్రశ్నించారు. పార్లమెంట్‌లో ఆమోదం పొందాక దశాబ్దం తర్వాత అమలు చేసే బిల్లును తాను ఏప్పుడూ చూడలేదని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. మహిళా బిల్లు విషయంలో మాత్రమే ఇలా జరుగుతోందని తప్పుపట్టారు. ఇదంతా బీజేపీ ప్రభుత్వ నిర్వాకమేనని ఆక్షేపించారు.

మైక్రోఫోన్‌ను ప్రజల వైపు మళ్లిస్తున్నా..

ఢిల్లీలో ఉండే కొందరు నాయకులు లౌడ్‌స్పీకర్లు, కెమెరాలను వారివైపే తిప్పుకుంటున్నారని రాహుల్ గాంధీ పరోక్షంగా బీజేపీ నాయకులపై ధ్వజమెత్తారు. తాను మాత్రం మైక్రోఫోన్‌ను ప్రజల వైపు మళ్లిస్తున్నానని చెప్పారు. సమస్యలను చెప్పుకొనే అవకాశం ప్రజలకు ఇస్తున్నానని తెలిపారు.

ప్రతినిధుల సభ నుంచి జార్జి శాంటోస్ బహిష్కరణ

వాషింగ్టన్: రిపబ్లికన్ పార్టీకి చెందిన జార్జి శాంటోస్‌ను ప్రతినిధుల సభ బహిష్కరించింది. ప్రచార నిధులను సొంతానికి వాడుకున్నారన్న ఆరోపణలపై ఎథిక్స్ కమిటీ అందించిన నివేదిక శాంటోస్‌ను దోషిగా తేల్చింది. ఇందుకు గాను సభ నుంచి బహిష్కరించాలన్న తీర్మానం 311–114 ఓట్ల తేడాతో ఆమోదం పొందింది.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
శనివారం : 2 డిసెంబర్ : 2023


సోమవారం నుంచి బెళగావి సువర్ణ సౌధలో శీతాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా శుక్రవారం సౌధ ప్రాంగణాన్ని శుభ్రపరుస్తున్న సిబ్బంది.

న్యూస్‌రీల్

చిరుత మృతి



మండ్య: గుర్తు తెలియని వాహనం ఢీకొని చిరుత మృతి చెందిన ఘటన మళవళ్లి తాలూకా బాచనహళ్లి సమీపంలోని జాతీయ రహదారిపై జరిగింది. గురువారం సాయంత్రం చిరుత నడిరోడ్డుపై రక్తపు మడుగులో పడి ఉండగా స్థానికులు గమనించి పోలీసులు, అటవీ శాఖాధికారులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి దానిని కాపాడేందుకు యత్నించినా ప్రయోజనం లేకుండా పోయింది. వైద్య పరీక్షల అనంతరం అటవీ శాఖ నిబంధనల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు.


డయాగ్నోస్టిక్ సెంటర్ తప్పిదం

- రోగి ప్రాణాలకు ముప్పు

దొడ్డబళ్లాపురం: డయాగ్నోస్టిక్ సెంటర్ సిబ్బంది చేసిన తప్పిదం ఒక రోగి ప్రాణాల మీదకు తెచ్చిన సంఘటన రామనగరలో చోటుచేసుకుంది. రామనగరకు చెందిన శివమ్మ అనే మహిళ సెప్టెంబర్ 2న రామనగర జిల్లా ఆస్పత్రిలో అనారోగ్యంతో చేరారు. అంతకు ముందు ఐజూరులోని ఓ డయాగ్నోస్టిక్ సెంటర్‌లో బ్లడ్ టెస్ట్ చేయించగా బ్లడ్ గ్రూపు ఏబీ పాజిటివ్‌గా రిపోర్టులో పేర్కొన్నారు. జిల్లా ఆస్పత్రిలో రిపోర్టు ఆధారంగా శివమ్మకు రక్తం ఎక్కించారు. చికిత్స తీసుకుని ఇంటికి చేరుకున్న శివమ్మ కొన్ని రోజుల్లోనే తీవ్ర అనారోగ్యం పాలయ్యారు. నడవలేని స్థితికి చేరుకుంది. నవంబర్ 28న మళ్లీ ఆమెను జిల్లా ఆస్పత్రిలో చేర్చి రక్త పరీక్ష చేశారు. రిపోర్టులో ఆమె బ్లడ్ గ్రూపు ఏ పాజిటివ్‌గా వచ్చింది. డయాగ్నోస్టిక్ సెంటర్‌లో ఏబీ పాజిటివ్ రావడం, జిల్లా ఆస్పత్రిలో ఏ పాజిటివ్‌గా రావడంతో శివమ్మ కుమారుడు అనుమానంతో మరోసారి మరో ప్రైవేటు డయాగ్నోస్టిక్ సెంటర్‌లో బ్లడ్ టెస్ట్ చేయించగా అక్కడా ఏ పాజిటివ్ వచ్చింది. దీంతో శివమ్మ కుమారుడు గతంలో రక్త పరీక్ష చేసిన డయాగ్నోస్టిక్ సెంటర్‌కు వెళ్లి ప్రశ్నించగా నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. అనంతరం జిల్లా ఆస్పత్రి వైద్యుల సలహా మేరకు శివమ్మ కుమారుడు ఐజూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

మార్చిలో ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షలు

- ద్వితీయ పీయూసీ పరీక్షలు కూడా
- తాత్కాలిక టైం టేబుల్ విడుదల



శివాజీనగర: ఎస్ఎస్ఎల్‌సీ, ద్వితీయ పీయూసీ వార్షిక పరీక్ష-1 తాత్కాలిక టైంటేబుల్‌ను కర్ణాటక పాఠశాల పరీక్ష, స్పాట్ వ్యాల్యు నిర్ణయ మండలి విడుదల చేసింది. దీనిపై అభ్యంతరాలు ఉంటే ఈనె 15లోపు తెలియజేయాలని కోరింది. 2024 మార్చి 25 నుంచి ఏప్రిల్ 6 వరకు ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షలు జరుగుతాయి. అదే విధంగా 2024 మార్చి 2 నుంచి అదేనెల 22 వరకు ద్వితీయ పీయూసీ వార్షిక పరీక్షలు జరుగుతాయి.

ఎస్ఎస్ఎల్‌సీ:
మార్చి 25న-ప్రథమ భాష (కన్నడ), మార్చి 27-సాంఘిక శాస్త్రం, మార్చి 30న-సైన్స్, ఏప్రిల్ 2న -గణితం, ఏప్రిల్ 4-తృతీయ భాష (హిందీ) ఏప్రిల్-6-ద్వితీయ భాష (ఇంగ్లిష్)

ద్వితీయ పీయూసీ:
మార్చి 2-కన్నడ, అరబిక్, మార్చి 4న-చరిత్ర, భౌతిక శాస్త్రం, మార్చి5-ఇన్ఫర్మేషన్ సాంకేతిక పరిజ్ఞానం, రిటైల్, హెల్త్‌కేర్, మార్చి 6-సాంఘిక శాస్త్రం, మార్చి 7-హిందీ, మార్చి 9-రాజనీతి శాస్త్రం, సంఖ్యా శాస్త్రం, మార్చి 11-ఇంగ్లిష్, మార్చి 12-తమిళు, తెలుగు, మలయాళం, మరాఠి, ఉర్దూ, సంస్కృతం, ఫ్రెంచ్, మార్చి 13-తర్కశాస్త్రం, మార్చి 14-గణితం, మార్చి 16-భూగోళశాస్త్రం, జీవశాస్త్రం, మార్చి 18-రసాయన శాస్త్రం, మార్చి 20 లెక్కశాస్త్రం, భూగర్భ శాస్త్రం, మార్చి 22-అర్థశాస్త్రం.

ఉలిక్కిపడిన సిలికాన్ సిటీ

- బాంబు బెదిరింపుతో పాఠశాలలకు పరుగులు తీసిన తల్లిదండ్రులు
- ఉత్తిదే అని తేలడంతో ఊపిరి పీల్చుకున్న బెంగళూరు ప్రజలు
- గతంలోనూ ఉత్తుత్తి బాంబు బెదిరింపులు


చామరాజపేటె భవన బెంగళూరు ప్రెస్ స్కూల్ ఆవరణలో విద్యార్థులు

బనశంకరి: ఉదయం పిల్లలను పాఠశాలలకు పంపిన తల్లిదండ్రులు తమ దైనందిన కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. అంతలోనే పిడుగులాంటి వార్త వారి చెవిన పడింది. గుర్తు తెలియని వ్యక్తులు 60 స్కూళ్లలో బాంబు పెట్టినట్లు ఉదయం 9గంటల సమయంలో వార్తలు రావడంతో నగరమంతా ఒక్కసారిగా ఉలిక్కి పడింది. బాంబు వార్త విని భయాందోళన చెందిన తల్లిదండ్రులు ఒక్కసారిగా పాఠశాలలకు పరుగులు తీశారు. తమ పిల్లలు ఎలా ఉన్నారో అంటూ ప్రాణాలు చేతిలో పెట్టుకొని బస్సులు, వాహనాల్లో తరలివెళ్లారు. అయితే ఉత్తుత్తి బాంబు బెదిరింపు అని తేలడంతో ఊపిరి పీల్చుకున్నారు. బసవేశ్వరనగర బసవేశ్వరనగర నేషనల్, విద్యాశిల్ప, సదాశివనగర పూర్ణప్రజ్ఞ, యలహంక పాఠశాలతో పాటు 60 కి పైగా ప్రైవేట్ పాఠశాలలకు ఉదయం 9గంటలకు ఈ-మెయిల్ వచ్చింది. స్కూళ్లలో బాంబులు పెట్టినట్లు అందులోని సారాంశం. దీంతో పాఠశాలల యజమాన్యం విద్యార్థులను పాఠశాలల గదులనుంచి బయటకు పంపించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. పోలీసులు, బాంబు స్క్వాడ్ సిబ్బంది చేరుకుని అణుఅణువునా క్షుణ్ణంగా గాలించారు.

గతంలోనూ బెదిరింపు ఘటనలు

నగర పోలీస్ కమిషనర్ దయానంద్ విలేకరులతో మాట్లాడుతూ నకిలీ బాంబు బెదిరింపు అని ప్రాథమిక దర్యాప్తులో తెలిసిందన్నారు. తమ పోలీస్ సిబ్బంది, బాంబుస్క్వాడ్ సిబ్బంది పాఠశాలలకు చేరుకొని తనిఖీలు చేశారన్నారు. గత ఏడాది ఇదే రోజు నగరంలోని 30 పాఠశాలల్లో బాంబు పెట్టినట్లు ఇ-మెయిల్ ద్వారా బెదిరించారన్నారు. మహాదేవపుర గోపాలన్ ఇంటర్నేషనల్ స్కూల్, వర్తూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఢిల్లీ పబ్లిక్‌స్కూల్, మారతహళ్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని న్యూ అకాడమి స్కూల్, హెణ్ణూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని సెయింట్‌విన్సెంట్ పాల్‌స్కూల్, గోవిందపుర పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇండియన్‌పబ్లిక్ స్కూల్‌లో బాంబు పెట్టినట్లు దుండగులు బెదిరింపుకాల్‌చేశారన్నారు. ఇవి ఒట్టి బెదిరింపులేనని, విద్యార్థుల తల్లిదండ్రులు భయపడాల్సిన అవసరం లేదన్నారు.

భయాందోళన వద్దు:

ఇంట్లో వ్యాయామం చేస్తుండగా టీవీలో న్యూస్ చూసి భయపడి బయటికి వచ్చానని డిప్యూటీ సీఎం శివకుమార్ తెలిపారు. తమ ఇంటి వద్ద నర్సరీ స్కూల్‌కు బాంబు బెదిరింపు ఈ-మెయిల్ వచ్చిందని, వెంటనే పోలీసులతో మాట్లాడగా నకిలీ బాంబు అని తేలిందన్నారు. ఎవరు భయపడరాదని, పిల్లలందరూ సురక్షితంగా ఉంటారని తెలిపారు. బెంగళూరు హబ్బ జరిగే సమయంలో అల్లరిమూకలు ఇలాంటి చర్యలకు పాల్పడి ఉంటారన్నారు. సైబర్‌క్రైం పోలీసులు అప్రమత్తంగా ఉన్నారని, అన్నింటి ఆచూకీ కనిపెడతారని డీకే.శివకుమార్ తెలిపారు.

ఈ మెయిల్‌లో ఏముందంటే

బెదిరింపు ఈ-మెయిల్ ఉగ్రవాదులనుంచి వచ్చినట్లు అనుమానం వ్యక్తమైంది. అందులోని వివరాలు.. భారత్ అంతా విస్తరిస్తాం, ఇస్లాం మతంలోకి మారండి లేదా కత్తులదాడిలో ప్రాణాలు అర్పించండి అని ప్రస్తావించారు.


చామరాజపేటలోని ప్రైవేటు పాఠశాలలో జాగిలంతో బాంబ్ స్క్వాడ్ తనిఖీలు

బాలుడి ఆగ్రహం

బాంబు బెదిరింపు ఘటనపై ఓ బాలుడు ఆగ్రహం వ్యక్తం చేశాడు. మా తల్లిదండ్రులు విధులకు వెళ్లారు. ఎంతో కష్టపడి స్కూల్‌కు తీసుకువస్తారు. మళ్లీ పాఠశాలకు వచ్చి మమ్ములను తీసుకెళ్తారు. బెదిరింపు లేఖ పంపిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తా అని పేర్కొన్నాడు.




బాలుడిని ఇంటికి తీసుకెళ్తున్న దృశ్యం, పిల్లలను బయటకు పంపుతున్న పాఠశాల నిర్వాహకులు, ప్రెసిడెన్సి స్కూల్ వద్దకు తరలివచ్చిన తల్లిదండ్రులు

అదుపులో హెచ్‌ఐవీ

- రాష్ట్రంలో తగ్గిన పాజిటివ్ కేసులు
- వ్యాధి నియంత్రణకు జాగృతి కార్యక్రమాలు



బనశంకరి: రోగ నిరోధక శక్తిని నిర్వీర్యం చేసి మనిషిని మృత్యుముఖానికి చేర్చే హెచ్‌ఐవీ కేసులు రాష్ట్రంలో గణనీయంగా తగ్గాయి. ప్రధానంగా గర్భిణుల్లో హెచ్‌ఐవీ వైరస్ ప్రమాణం తగ్గడం గమనార్హం. కర్ణాటక రాష్ట్ర ఎయిడ్స్ ప్రివెన్షన్ సొసైటీ(కేసాప్స్) 2023-24 ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు రాష్ట్రంలో అన్ని ఐసీటీసీ కేంద్రాలనుంచి 12 లక్షల మంది గర్భిణులను పరీక్షలు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా ఆరునెలల్లో 8.55 లక్షలు మందికి పరీక్షలు చేశారు. ఇందులో 338 మందిలో హెచ్‌ఐవీ ప్రమాణం 0.03 తగ్గిందని ఆరోగ్యశాఖ తెలిపింది.

ఆరు నెలల్లో 21,81,824 మందికి పరీక్షలు

రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమం కింద కేసాప్స్ 2023-24 లో రాష్ట్రంలో 475 ఐసీటీసీ కేంద్రాలనుంచి 35,94,055 మందిని పరీక్షలు చేయడాన్ని టార్గెట్‌గా పెట్టుకుంది. గత 6 నెలల్లో 21,81,824 మందిని(61శాతం) పరీక్షలు చేయగా 7,930 మందిలో వైరస్ కనిపించింది. దీంతో వైరస్ ప్రమాణం 0.36 తగ్గినట్లు నిర్ధారణ అయ్యింది.

9వ స్థానంలో కర్ణాటక

జాతీయ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమం (ఎన్ఏసీపీ-5) ప్రకారం భారత్‌లో నాగాల్యాండ్, మిజోరాం, త్రిపుర, మణిపుర, మేఘాలయ రాష్ట్రాల్లో ఎక్కువగా హెచ్‌ఐవీ, ఎయిడ్స్ ఉన్న రాష్ట్రాలు. కర్ణాటక 9వ స్థానంలో ఉంది. రాష్ట్రంలో 3.86 లక్షల మంది రోగులు ఏఆర్‌టీ కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోగా 3.19 లక్షలమందికి చికిత్స ప్రారంభించారు. వీరిలో పిల్లలు, అన్ని వయసువారు ఉన్నారు. ఇప్పటి వరకు చికిత్స ఫలించక 3,036 మంది పిల్లలు, సుమారు లక్షమంది మృతిచెందారు.

వ్యాధిగ్రస్తులకు సదుపాయాలు

హెచ్‌ఐవీ, ఎయిడ్స్ రోగులు కోలుకునేందుకు ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. ఆరోగ్యశాఖ ఉచిత పరీక్ష, చికిత్స అందిస్తుండగా ఆహార శాఖ అంత్యోదయ పథకం కింద 30 కిలోల బియ్యం అందిస్తుంది. మహిళా శిశు సంక్షేమశాఖ ధనశ్రీ పథకం పేరుతో రూ.25 వేలు, బాధితుల పిల్లలకు నెలకు రూ.1000 ఆర్థిక సాయం అందిస్తుంది. పిల్లలకు ఆర్‌టీఇ కింద ఉచితవిద్య, ఉన్నత విద్యకు ఉపకార వేతనాల సౌలభ్యం కల్పించింది. రోగులకు న్యాయ సేవతో పాటు ప్రభుత్వం నుంచి అనేక సౌలభ్యాలు కల్పిస్తుందని కేసాప్స్ తెలిపింది.

2030 లోగా ఎయిడ్స్ అంతం

ఎయిడ్స్ మహమ్మారిని 2030లోగా అంతంచేసే దిశగా సన్నద్ధం చేయాలని ప్రపంచ ఆరోగ్యసంస్థ పిలుపునిచ్చింది. ప్రపంచవ్యాప్తంగా 39 దశ లక్షలమందికి హెచ్‌ఐవీ ఉంది. 2022లో 13 లక్షలమంది హెచ్‌ఐవీ బారినపడగా 6.3 లక్షల మంది మృతిచెందారు. హెచ్‌ఐవీ నియంత్రించే దృష్టితో యువత నాయకత్వం వహించాలని ఆగ్నేయ ఏషియాడబ్ల్యూహెచ్‌ఓ ప్రాదేశిక డైరెక్టర్ డాక్టర్ పూనమ్‌ఖేత్రపాల్‌సింగ్ తెలిపారు.

హెచ్‌ఐవీ రహిత గ్రామ పంచాయతీలు

హెచ్‌ఐవీ బారిన పడకుండా ప్రజలను జాగృతం చేసేందుకు కార్యక్రమాలు చేపట్టాం. రానున్న రోజుల్లో హెచ్‌ఐవీ రహిత గ్రామపంచాయతీ కార్యక్రమం కింద ఇంటింటికి సమాచారం అందించే కార్యక్రమాలు చేపడుతాం.
– గోవిందరాజు, రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఐఇసీ, డిప్యూటీ డైరెక్టర్

ఎస్ఐ సహా ఆరుగురు పోలీసుల సస్పెన్షన్

యశవంతపుర: చిక్కమగళూరులో న్యాయవాదిపై దాడికి సంబంధించి ఎస్ఐ సహా ఆరుగురిపై సస్పెన్షన్ వేటు పడింది. వివరాలు.. న్యాయవాది ప్రీతం గురువారం బైకుపై వెళ్తుండగా హెల్మెట్ ధరించలేదని పోలీసులు అడ్డుకొని బైకు తాళం లాక్కున్నారు. తాళం ఎందుకు లాక్కుంటారు.. జరిమానా విధించండి అంటూ న్యాయవాది సూచించగా వాగ్వాదం జరిగి ఓ దశలో పోలీసులు ప్రీతంపై చేయి చేసుకున్నారు. తనపై పోలీసులు దాడి చేశారని న్యాయవాది పోలీసులకు ఫిర్యాదు చేశారు. జిల్లా ఎస్పీ విక్రం కేసు విచారణ చేపట్టి ఎస్ఐ, ఏఎస్ఐ, హెడ్‌కానిస్టేబుల్, ముగ్గురు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

అక్కాచెల్లెళ్ల మధ్య గొడవకు బాలుడి బలి

- పదేళ్ల బాలుడిని చంపి పాతిపెట్టిన పెద్దమ్మ
- మరో బాలికను విక్రయించేందుకు యత్నం


మృతదేహం కోసం గాలిస్తున్న పోలీసులు, బాలుడు మధు (ఫైల్)

చిక్కబళ్లాపురం: చెల్లెలిపై ద్వేషం పెంచుకున్న అక్క దారుణానికి ఒడిగట్టింది. చెల్లెలి కుమారుడైన ఆరేళ్ల బాలుడిని హత్య చేసి పాతి పెట్టింది. మరో బాలికను విక్రయిస్తూ కటకటాల పాలైంది. ఈ ఘటన చిక్కబళ్లాపురం తాలూకా ముత్తకదహళ్లి గ్రామంలో జరిగింది. జిల్లా ఎస్పీ నాగేష్ తెలిపిన మేరకు...గ్రామానికి చెందిన అంబిక, అనిత అక్క చెల్లెళ్లు. అనితను శిడ్లఘట్ట తాలూకా బుడగవారహళ్లి గ్రామానికి చెందిన విశ్వనాథ్‌కు ఇచ్చి వివాహం చేశారు. ఈ దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. భర్త మద్యానికి బానిస కావడంతో అనిత తన బిడ్డలతో కలిసి పుట్టింటికి చేరింది. ఇక ఆమె అక్క అంబికను ఇదే తాలూకా మావళ్లికి చెందిన వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. ఏ కారణంతోనే అంబిక ఇటీవల పుట్టింటికి వచ్చింది. అయితే అంబిక అనైతిక కార్యక్రమాలకు పాల్పడుతోందని అనిత అనుమానం పడింది. దీంతో ఇద్దరి మధ్య గొడవలు జరిగేవి. ద్వేషంతో రగిలిపోయిన అంబిక అనిత కుమారుడైన ఆరేళ్ల బాలుడిని గురువారం తన వెంటబెట్టుకొని తీసుకెళ్లింది. గుడిబండ రోడ్డులోని మునిరాజు సోదరునికి చెందిన మామిడితోటలో బాలుడిని గడ్డపారతో బాది హత్య చేసింది. అనంతరం మృదేహాన్ని అదే తోటలో పాతి పెట్టింది. ఇంటికి చేరుకున్న అనంతరం అనిత కుమార్తెను వెంట బెట్టుకొని యలహంక వైపు వచ్చి ఆటోలో బయల్దేరింది. ఆటో డ్రైవర్‌కు అనుమానం వచ్చి కబ్బన్‌పార్కు పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లాడు. పోలీసులు అంబికను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టగా బాలుడి హత్యోదంతం వెలుగు చూసింది. బాలికను కూడా విక్రయించాలని యత్నించినట్లు వెలుగు చూసింది. అనంతరం నిందితురాలిని ముత్తకదహళ్లికి తీసుకెళ్లి తోటలో పాతి పెట్టిన బాలుడి మృతదేహాన్ని వెలికి తీయించారు. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి నిందితురాలిని అరెస్ట్ చేసి కేసు దర్యాప్తు చేపట్టారు.

బెళగావి సమావేశాలకు వ్యూహాలు

- బీజేపీ, జేడీఎస్ నేతల కీలక భేటీ
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా సమష్టి పోరాటం

శివాజీనగర: బెళగావిలో సోమవారం నుంచి ప్రారంభం కానున్న శీతాకాల సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై బీజేపీ, జేడీఎస్ నేతలు కీలక సమావేశం నిర్వహించారు. నగరంలోని రేస్‌కోర్స్ రోడ్డులో ఉన్న ప్రతిపక్ష నాయకుడు ఆర్.అశోక్ అపార్ట్‌మెంట్‌లో మిత్రకూట పార్టీలు బీజేపీ, జేడీఎస్ నాయకులు సమావేశమయ్యారు. బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు బీ.వై.విజయేంద్ర, జేడీఎస్ రాష్ట్రాధ్యక్షుడు, జేడీఎస్ శాసనసభా పార్టీ నాయకుడు కుమారస్వామి, మాజీ సీఎం బసవరాజ బొమ్మైతో పాటుగా బీజేపీ, జేడీఎస్ పార్టీలో ఎంపికైన ప్రముఖ నాయకులు సమావేశంలో పాల్గొన్నారు. బెళగావిలో జరగనున్న శీతాకాల అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే విధంగా పోరాటం చేయాలని ఉభయ పార్టీల నాయకులు చర్చించారు. కరువు నిర్వహణలో విఫలం కావడం వంటి పలు కీలక అంశాలను లేవనెత్తాలని ఇరు పార్టీల నేతలు నిర్ణయించినట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వంలో గ్యారెంటీ పథకాలు, కరువు నిర్వహణలో వైఫల్యాలు, ప్రజా వ్యతిరేక విధానాలు, కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లు తదితర వాటిపై నిలదీయాలని నిర్ధారణకు వచ్చారు. ఎమ్మెల్యేలకు నిధులు విడుదల చేయకపోవడం, అభివృద్ధి పనులు స్తంభించడం తదితర వాటిపై రెండు పార్టీలు ఒకే గళంతో పోరాటం చేయాలని నిర్ణయించాయి. స్పీకర్ యూ.టీ ఖాదర్‌కు బీజేపీ ఎమ్మెల్యేలు చేతులెత్తి మొక్కే విధంగా చేస్తామని ఎమ్మెల్యే జమీర్ వ్యాఖ్యలపై అసెంబ్లీలో ప్రస్తావించి జమీర్‌తో క్షమాపణ చెప్పించాలని తీర్మానించినట్లు సమాచారం. మొత్తంమీద ఈ అసెంబ్లీ సమావేశాలు వాడీవేడిగా జరగనున్నాయి. సమావేశం తరువాత బీజేపీ నాయకులు బీ.వై విజయేంద్ర, బసవరాజ బొమ్మై, ఆర్.అశోక్ మీడియా ముందు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. అయితే జేడీఎస్ అధినేత హెచ్.డీ.కుమారస్వామి మాత్రం సమావేశాల్లో పోరాటంపై చర్చించుకున్నాం, ఏ విధంగా పోరాటం అనేది త్వరలో తెలియజేస్తామని చెప్పి వెళ్లిపోయారు. కుమారస్వామి కారులోనే ఆర్.అశోక్ కూడా వెళ్లటం ప్రత్యేకతను సంతరించుకుంది.

మాజీ సీఎం కెంగల్ హనుమంతయ్య వర్ధంతిని పురస్కరించుకొని విధానసౌధ వద్ద ఆయన చిత్రపటానికి శుక్రవారం నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య



క్లుప్తంగా

తాగునీరు, శుభ్రతకు అధిక ప్రాధాన్యం

కంప్లి: తాలూకాలోని ప్రజలకు తాగునీరు, పరిశుభ్రత కల్పనకు పెద్ద పీట వేయాలని ఎమ్మెల్యే నేమిరాజ్ నాయక్ తెలిపారు. కొట్టూరు తాలూకా కార్యాలయంలో నిర్వహించిన తాలూకా స్థాయి సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. దాతల సహకారంతో బోరుబావులను తవ్వించడంతో పాటు నిర్వహణ చేపట్టాలన్నారు. ఇతర మౌలిక సౌకర్యాల నిర్వహణపై నిర్లక్ష్యం చేయరాదన్నారు.

ద్విచక్ర వాహన దొంగలు అరెస్ట్

- రూ.2.75 కోట్ల విలువైన వాహనాలు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

బనశంకరి: పశ్చిమ విభాగ పరిధిలోని నమోదైన 83 ద్విచక్ర వాహనాల చోరీ కేసులను ఛేదించి 118 మందిని శుక్రవారం పశ్చిమ విభాగ పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.2.75 కోట్ల విలువ చేసే 426 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో 291 ద్విచక్ర వాహనాలు సొంతదారులకు అప్పగించారు. శుక్రవారం సీఏఆర్ కేంద్రంలో నిర్వహించిన ప్రాపర్టీ పరేడ్‌లో మొత్తం 619 వాహనాలను ప్రదర్శించారు.

కవితా గోష్టికి శ్రీకారం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

హొసపేటె: కన్నడ రాజ్యోత్సవం, కనకదాస జయంతి సందర్భంగా డాక్టర్ సులోచన ఇంట్లో కవితా గోష్టిని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి డాక్టర్ దయానంద కిన్నాళ్ అధ్యక్షత వహించగా కవి సమ్మేళనాన్ని డాక్టర్ సులోచన ప్రారంభించారు. భారతీయ మూలిమని, హల్యానాయక్, రేఖా కన్నడతి, సో.డాక్టర్ వంటి కవులు, విరుపాక్షగౌడ, భాగ్యలక్ష్మీ భరాడే, గోవిందప్ప, కవితా నాయుడు, అంజలి బెళగల్, వెంకటేష్ బడిగేర్, ఎర్రిసామి, విశాల్ మాస్టర్, జంబునాథ్, డాక్టర్ చెన్నరస, అద్విక, నూర్జహాన్, శీలా బడిగేర్, డాక్టర్ ఉషారాణి, సౌభాగ్యలక్ష్మి, నాగరాజ పత్తార్, శృతి, శ్రీనివాస్ పాటలు పాడారు. శివరాజ్ కవితలు వినిపించారు. వివిధ కవులు, చిన్నపిల్లల గొంతులను అనుకరించారు. అతిథులుగా మహిళా శిశు అభివృద్ధి సంస్థ విశ్రాంత అధికారిణి చెన్నమ్మ, సంగీత భారతి కన్వీనర్ కల్లంభట్, నూర్జహాన్, రీనా నందన్ పాల్గొన్నారు.

కోవిడ్ రాకపోయి ఉంటే ఆర్థిక శక్తిగా భారత్


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి భగవంత్‌ఖుబా

బనశంకరి: కోవిడ్ రాకపోయి ఉంటే ప్రపంచంలోనే భారత్ రెండు లేదా మూడో ఆర్థిక శక్తి దేశంగా అవతరించి ప్రపంచంలోనే జీడీపీలో 5వ స్థానంలో ఉండేదని కేంద్ర రసాయన ఎరువుల శాఖ మంత్రి భగవంత్‌ఖుబా అన్నారు. ప్యాలెస్ మైదానంలోని జ్ఞానజ్యోతి సభాంగణంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి యువ ఉత్సవ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భారత అమృతోత్సవాలు పూర్తయ్యాయని, 2047 నాటికి భారత్ మరింత అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. ఎమ్మెల్యే రిజ్వాన్‌అర్షద్ మాట్లాడుతూ యువతలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించడానికి యువజనోత్సవం వేదికగా మారిందన్నారు. ప్రాదేశిక డైరెక్టర్ ఎంఎస్.నటరాజ్, బెంగళూరు యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ లింగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన పౌరాణిక నాటకాలు


అతిథులను సన్మానించిన దృశ్యం

బొమ్మనహళ్లి: సనాతన హిందూ ధర్మం మానవత్వ విలువలను కాపాడుకుంటూ ముందుకు సాగుతోందని, త్రేతాయుగంలో శ్రీరామచంద్ర ప్రభు, ద్వాపర యుగంలో శ్రీకృష్ణ భగవానుడు యుగకర్తలుగా మారి దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కర్మ సిద్ధాంతాన్ని బోధించారని గడినాడు రంగభూమి కళాకారుల సంఘం అధ్యక్షుడు బళ్లూరు మంజునాథ్ రెడ్డి అన్నారు. బెంగళూరు నగర జిల్లా పరిధి ఆనేకల్ పట్టణంలోని శ్రీ రామ కుటీరంలో ఏర్పాటు చేసిన కన్నడ రాజ్యోత్సవంలో పాల్గొని పౌరాణిక నాటక కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన పలు నాటకాలు సభికులను అలరించాయి.

డ్రైనేజీలు అస్తవ్యస్తం..ప్రజలు సతమతం

- దుర్వాసనతో ప్రజలకు నరకయాతన
- పట్టించుకోని నగర పాలికె అధికారులు


బళ్లారి: డ్రైనేజీలో నిలిచిన మురుగు, పడవేసిన చెత్తాచెదారం



రాయచూరులో చెత్త కుప్పలపై పశువుల స్వైరవిహారం

సాక్షి, బళ్లారి: నగరంలో అస్తవ్యస్త డ్రైనేజీలతో జనం నరకయాతన అనుభవిస్తున్నారు. నిధులు ఉన్నా అభివృద్ధి మాత్రం మూడు అడుగులు ముందుకు, ఆరు అడుగులు వెనక్కి అన్న చందంగా మారింది. డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉండటంతో నెలల తరబడి అయినా డ్రైనేజీల్లో మురుగు పేరుకుపోయి ఆయా కాలనీల్లో డ్రైనేజీలు దుర్వాసన వెదజల్లుతున్నాయి. డ్రైనేజీల పక్కనే నివసిస్తున్న నగర వాసులకు నరకప్రాయంగా మారింది. మహానగర పాలికె అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తూతూమంత్రంగా నగరంలో సమస్యలను పర్యవేక్షిస్తుండటంతో పాటు వాటిని పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో నగర వాసులకు


రాయచూరులో చెత్తచెదారంతో మూసుకుపోయిన ఓ మురుగు కాలువ

మరింత శాపంగా మారింది. మహానగర పాలికె మేయర్ ఏడాది ఒకసారి మారిపోతుండటంతో నగరంలో అభివృద్ధి మాట అటుంచితే కనీసం చెత్త చెదారం కూడా సక్రమంగా తీయకుండా ఎక్కడబడితే అక్కడ పడేయడంతో పాటు అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థను చక్కబెట్టడం లేదు.

ఎక్కడి చెత్త అక్కడే.!

నగరంలోని వడ్డరబండలో ప్రధానంగా డ్రైనేజీ కాలువలో చెత్తచెదారం తీయకపోవడంతో మురుగు నీరు అక్కడే నిలిచిపోవడంతో దుర్వాసన భరించలేకపోతున్నారు. ఇలా నగరంలోని గణేష్ కాలనీ, రూపనగుడి రోడ్డు, విశాల్‌నగర్‌లోని రాజా కాలువ తదితర ప్రాంతాల్లోని డ్రైనేజీలు దుర్వాసన వెదజల్లుతున్నాయి. అక్కడక్కడా డ్రైనేజీల్లో తొలగించిన చెత్తాచెదారాన్ని రోడ్డులోనే వేయడంతో నగర వాసులు ఆయా రోడ్ల గుండా వెళ్లాలంటే ముక్కున వేలు వేసుకుని నడవాల్సిన పరిస్థితులున్నాయి. ఇక నగరంలోని అన్ని కాలనీలు, రోడ్లలో నిత్యం పందులు స్వైర విహారం చేస్తున్నాయి. పందులను నగరం నుంచి వెలివేస్తామని పాలకులు చెబుతున్నారే కాని ఏ ఒక్కరూ కూడా ఆ దిశగా ఆలోచించకపోవడంతో పందుల బెడదతో నగర వాసులు ఇబ్బందులకు గురవుతూ పలు రోగాల బారిన పడుతున్నారు. డ్రైనేజీల దుర్వాసనతో పాటు దోమలు స్వైర విహారం చేస్తుండటంతో పలు రోగాల బారిన పడుతున్నట్లు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నగరమా..నరక కూపమా?

రాయచూరు రూరల్: పేరుకు మాత్రమే రాయచూరు జిల్లా కేంద్రం. అభివృద్ధిలో మాత్రం పూర్తిగా గ్రామీణ ప్రాంతాల మాదిరిగా పారిశుధ్య లోపం, రోడ్ల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. నగరసభ అధికారం కాంగ్రెస్ చేతిలో ఉండగా, ఎమ్మెల్యే బీజేపీకి చెందినవారు కావడంతో అభివృద్ధి కుంటుపడింది. ఏ ప్రాంతానికి వెళ్లినా చెత్తకుప్పలు పేరుకుపోయి, మురుగు కాలువలు చెత్తచెదారంతో నిండాయి. నగరంలోని 35 వార్డుల్లో అభివృద్ధిని పట్టించుకొనే వారు లేరు. రాజకీయ నాయకులు ఒకరిపై మరొకరు బురద చల్లుకుంటూ విమర్శలు చేసుకోవడం తప్ప మరేమి లేదు. రోడ్ల మరమ్మతులో నగరసభ సభ్యులు, అధికారులు, ఎమ్మెల్యేల మధ్య అవగాహన లేకపోవడంతో నగరవాసుల జీవితం నిత్యం నరకప్రాయమైంది.


బళ్లారి: వడ్డరబండలో ఇళ్ల ముందు నుంచే డ్రైనేజీ నీరు పారుతున్న దృశ్యం

ఎయిడ్స్ ముక్త రాష్ట్రమే ధ్యేయం

- సీఎం సిద్దరామయ్య

శివాజీనగర: రానున్న ఐదు సంవత్సరాల్లో దేశం, రాష్ట్రాన్ని ఎయిడ్స్ నుంచి విముక్తి చేయటానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్య పిలుపునిచ్చారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని విధానసౌధ బ్యాంక్వెట్ హాల్‌లో కర్ణాటక రాష్ట్ర ఎయిడ్స్ ప్రివెన్షన్ సొసైటీ శుక్రవారం ఏర్పాటు చేసిన జాగృతి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. హెచ్ఐవీ ప్రమాదకరమైన రోగం, దీనిని అరికట్టడం అందరి బాధ్యత అని అన్నారు. 1996లో రాష్ట్రంలో హెచ్ఐవీ కేసులు వెలుగు చూశాయని, ఇటీవల వ్యాధిగ్రస్తుల సంఖ్య తగ్గుముఖం పట్టిందన్నారు. అయితే హెచ్ఐవీ పాజిటివ్ కేసులను జీరోకి తెచ్చేందుకు కృషి చేయాలన్నారు. హెచ్ఐవీ నియంత్రణ చట్టాన్ని 2017లో ప్రభుత్వం జారీ చేసిందన్నారు. అనంతరం ఎయిడ్స్ నియంత్రణ అభియాన్ రాయభారి అయిన నటి సంజనా గల్రానిని అభినందించారు. అనంతరం ఎయిడ్స్‌తో పోరాటం చేసి కోలుకున్న బాధితులను ముఖ్యమంత్రి అభినందించారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దినేశ్ గుండూరావు మాట్లాడుతూ ఎయిడ్స్ నియంత్రణకు శ్రమిస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు అని తెలిపారు. 2013–14లో వ్యాధిగ్రస్తుల స్థాయి 1.77 శాతం ఉండగా గర్భిణుల్లో 0.3 శాతం ఉండేదని, ప్రస్తుతం 0.21 శాతానికి తగ్గిందన్నారు. 2023–24 సంవత్సరంలో వ్యాధి ప్రమాణం 0.36 శాతానికి తగ్గిందన్నారు. రాష్ట్రంలో 3,82,910 హెచ్ఐవీ పాజిటివ్ కేసులు నమోదు కాగా 1.85 లక్షల మంది ఏఆర్‌టీ చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. బాధితులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. కల్యాణ కర్ణాటక ప్రాంతీయ అభివృద్ధి మండలి అధ్యక్షుడు ఎమ్మెల్యే అజయ్ సింగ్, నటి ప్రేమ, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అప్రమత్తంగా ఉండాలి

కోలారు: ప్రజలకు హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై తగిన జాగృతి చేయాలని, ఎయిడ్స్ వ్యాధి ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రధాన సెషన్స్ జడ్జి, జిల్లా న్యాయ సేవల ప్రాధికార అధ్యక్షుడు జీఏ మంజునాథ తెలిపారు. శుక్రవారం విశ్వ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని ప్రభుత్వ అతిథిగృహం వద్ద నిర్వహించిన ఎయిడ్స్ వ్యాధిపై జాగృతి జాతాకు పచ్చజెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. ఎయిడ్స్ మహమ్మారి నియంత్రణకు ప్రతి ఒక్కరి సహకారం అవసరం అన్నారు. అందరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ప్రభుత్వ అతిథిగృహం నుంచి ప్రారంభమైన జాతా నగరంలోని ప్రధాన వీధుల్లో సంచరించి తిరిగి ప్రభుత్వ అతిథిగృహం వద్దకు చేరుకుంది. జాతాలో జిల్లా న్యాయ సేవల ప్రాధికార సభ్యుడు సునీల్ హొసమని, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ ఎం జగదీష్, ఎస్ఎన్ఆర్ ఆస్పత్రి సర్జన్ డాక్టర్ విజయకుమార్ పాల్గొన్నారు.


జాగృతి జాతాను ప్రారంభిస్తున్న జడ్జి మంజునాథ

రక్తదానం మహాదానం


రక్తదానం చేస్తున్న దృశ్యం

కోలారు: పట్టణంలోని బీజీఎస్ కళాశాలలో శుక్రవారం కళాశాల విద్యార్థులు, బోధక వర్గం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. విద్యా సంస్థ డైరెక్టర్ ఏ.వెంకటరెడ్డి మాట్లాడుతూ అత్యవసర సమయంలో ప్రాణాలు కాపాడడానికి రక్తం ఎంతో అవసరం అని, యువత స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకు రావాలన్నారు. రక్తదానం మహాదానం అనే విషయాన్ని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గంగాధరగౌడ, వైద్యాధికారి డాక్టర్ రోహి సయ్యద్ ఉస్మా, రక్తనిధి కేంద్రం అనిత తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌డీ విద్యార్థి ఆత్మహత్య

బనశంకరి: భారతీయ విజ్ఞాన సంస్థలో పీహెచ్‌డీ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చోటుచేసుకుంది. భారతీయ విజ్ఞాన సంస్థ సాలిడ్‌స్టేట్, స్ట్రక్చరల్ కెమిస్ట్రీ యూనిట్‌లో ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న డైమండ్ ఖుష్వా (22) అనే విద్యార్థి గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై సమాచారం అందిన వెంటనే సదాశివ నగర పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఆత్మహత్యకు కారణం తెలియరాలేదు.

భాష రక్షణకు పాటుపడాలి


కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెంకటశివారెడ్డి

కోలారు: కన్నడ భాష రక్షణ కోసం ప్రతి ఒక్కరు సైనికుల్లా కృషి చేయాలని ఎమ్మెల్యే జీకే వెంకటశివారెడ్డి తెలిపారు. గురువారం రాత్రి పట్టణంలోని వివేకానంద సర్కిల్‌లో చైతన్య జాగృతి వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కన్నడ రాజ్యోత్సవం, సంగీత కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమన్నారు. రూ.25 కోట్ల వ్యయంతో పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు. రూ.40 కోట్ల వ్యయంతో శ్రీనివాసపురం–కోలారు రహదారి విస్తరణ పనులను చేపడుతున్నట్లు తెలిపారు. శ్రీనివాసపురం తాలూకాలో పరిశ్రమలను స్థాపించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలను కల్పించే విషయంపై కేడీపీ సమావేశంలో చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో జెడీ్ఎస్ మాజీ అధ్యక్షుడు తూపల్లి ఆర్.నారాయణస్వామి, సీఏ జయానంద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కన్నడ రాజ్యోత్సవం

బొమ్మనహళ్లి: బెంగళూరు నగర జిల్లా పరిధి ఆనేకల్ పట్టణంలో శుక్రవారం ఆనేకల్ భువనేశ్వరి కారు డ్రైవర్లు, యజమానుల సంఘం ఆధ్వర్యంలో కన్నడ రాజ్యోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేడుకలను పట్టణ పురసభ ముఖ్య అధికారి రాజేశ్ పాల్గొని కన్నడ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా రాజేశ్‌ను డ్రైవర్లు, యజమానులు సన్మానించారు. కార్యక్రమంలో పదాధికారులు మోహన్, అమానుల్లా, మురళి, రవి, లక్ష్మి నారాయణ, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.


పురసభ ముఖ్యాధికారిని సన్మానిస్తున్న దృశ్యం

పట్టుబడిన సైబర్ వంచకులు

- రూ.13.17 లక్షల నగదు, ఏటీఎం కార్డులు స్వాధీనం

బనశంకరి: ఫెడెక్స్ కొరియర్ పార్శిల్ పేరుతో సైబర్ వంచనకు పాల్పడిన 8 మంది పట్టుబడ్డారు. నిందితులు వాసీం, అబ్దుల్లా, ముజాయిద్దీన్, ముశ్రఫ్‌ఖాన్, నూరుల్లాఖాన్, మహ్మద్ ఉమర్‌హుసేన్, సయ్యద్‌హుసేన్‌మౌలా, సయద్ హుసేన్‌ను శుక్రవారం ఉత్తర విభాగం సీఈఎన్ పోలీసులు అరెస్ట్‌చేశారు. వారి నుంచి రూ.13.17 లక్షల నగదు, ఏటీఎం కార్డులు స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకు ఖాతాల్లో రూ.19 లక్షలు నగదు ఫ్రీజ్ చేశారు. 148 బ్యాంకు ఖాతాలు సీజ్ చేశారు. నిందితులు ఓ వ్యక్తికి ఫోన్ చేసి ముంబయి క్రైం బ్రాంచ్ పోలీసులుగా పరిచయం చేసుకొని మీపై మాదకద్రవ్యాల రవాణా, మనీ ల్యాండరింగ్ చేసినట్లు ఫిర్యాదులు అందాయని బెదిరించారు. కేసు మాఫీ చేస్తామని చెప్పి రూ.1కోటి 8 లక్షలు నగదు తమ ఖాతాలకు మళ్లించుకున్నారు. తాను మోసపోయినట్లు ఆలస్యంగా గ్రహించిన బాధితుడు దీనిపై గత నెల 10న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్ట్ చేశారని కమిషనర్ బీ.దయానంద్ తెలిపారు.



పట్టుబడిన నయవంచకులు

స్థానికం

ఎవరో కనిపెట్టండి

యశవంతపుర: బెంగళూరులో పాఠశాలలకు బాంబ్ బెదిరింపు ఈ మెయిల్ ఏవరు పెట్టింది ఎవరో కనిపెట్టాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్య అధికారులను ఆదేశించారు. ఆయన శుక్రవారం బెంగళూరులో విలేకర్లతో మాట్లాడుతూ గతంలోని ఇలాంటి బాంబ్ బెదిరింపు ఇమెయిల్స్ వచ్చాయన్నారు. ప్రస్తుతం చోటు చేసుకున్న బాంబు బెదిరింపు ఘటన వెనుక ఎవరున్నారో తెలుసుకొని కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు.

ఉగ్రవాదుల పనే

బెంగళూరులో పాఠశాలలకు బెదిరింపు ఇమెయిల్ వెనుక ఉగ్రవాదుల హస్తం ఉన్నట్లు ప్రతిపక్ష నాయకుడు ఆర్ అశోక్ ఆరోపించారు. బాంబ్ బెదిరింపు వచ్చిన బసవేశ్వరనగరలోని న్యాపెల్ పాఠశాలను సందర్శించిన అనంతరం విలేకర్లతో మాట్లాడారు. మెయిల్‌లో అల్లాకు మోసం చేశారని రాయటంతో ఉగ్రవాదుల హస్తం ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేశారు.

ఆందోళన కలిగిస్తుంది

పాఠశాలలకు ఇ మెయిల్ బాంబ్ బెదిరింపుపై మాజీ సీఎం హెచ్‌డీ కుమారస్వామి స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని, కఠినంగా వ్యవహరించాలని హెచ్చరించారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు ప్రభుత్వం ధైర్యం చెప్పాలన్నారు.

పారిశ్రామికవేత్తల రుణమాఫీపై ప్రశ్నించండి

మైసూరు: ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ఉచిత సంక్షేమ పథకాలపై విరుద్ధంగా మాట్లాడిన ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణమూర్తిపై జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ హెచ్‌సీ మహదేవప్ప మండిపడ్డారు. నారాయణ మూర్తి వ్యాఖ్యలు పూర్తిగా సామాజిక న్యాయం, రాజ్యాంగ విరుద్ధంగా ఉన్నాయని చెప్పారు. దళితులు, వెనుకబడిన వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం రాజ్యాంగంలోనే కొన్ని అంశాలు పొందుపరిచారని గుర్తు చేశారు. రాజ్యాంగం ఆశయాలకు అనుగుణంగానే రాష్ట్ర ప్రభుత్వం ఉచిత గ్యారెంటీ పథకాలను అందిస్తోందని తెలిపారు. తమ ఉచిత గ్యారెంటీ పథకాలను ప్రశ్నిస్తున్న నారాయణ మూర్తి ...తాను సామాజిక న్యాయానికి విరుద్ధంగా వ్యాఖ్యలు చేస్తున్నారేమో ఒక్కసారి పరిశీలించుకోవాలని హితవు పలికారు. ప్రధాని నరేంద్ర మోదీ పెద్ద పెద్ద పారిశ్రామికవేత్తలకు రుణమాఫీ చేస్తున్నారని, దానిపై నారాయణ మూర్తి ప్రశ్నించాలని సూచించారు. పారిశ్రామికవేత్తలకు రుణమాఫీ చేసే బదులు ఆ డబ్బులను రైతులు, వెనుకబడిన వర్గాలు, వ్యవసాయ కార్యకలాపాల కోసం వినియోగిస్తే సబబుగా ఉంటుందని చెప్పాలని కోరారు.

లోక్‌సభ ఎన్నికల్లో ప్రజ్వల్ రేవణ్ణ పోటీ

బనశంకరి: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో హాసన నియోజకవర్గం నుంచి ప్రజ్వల్ రేవణ్ణ పోటీ చేస్తారని మాజీ ప్రధాని హెచ్‌డీ.దేవెగౌడ తెలిపారు. శుక్రవారం హొళెనరసీపురలో జేడీఎస్ కార్యకర్తల సమావేశంలో దేవెగౌడ మాట్లాడుతూ రానున్న లోక్‌సభ ఎన్నికల్లో హాసన నుంచి ప్రజ్వల్ రేవణ్ణ పోటీ చేస్తారని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో జేడీఎస్– బీజేపీ, కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా కలిసికట్టుగా పోరాటం చేస్తుందన్నారు. మేము బీజేపీతో కలిసి కాంగ్రెస్‌పై పోరాటం చేయాలని తీర్మానించామని తెలిపారు.

కోలారు వార్తలు...

హత్య కేసు నిందితులను శిక్షిస్తాం


వినతిపత్రం స్వీకరిస్తున్న మంత్రి భైరతి సురేష్

కోలారు: శ్రీనివాసపురంలో ప్రముఖ నాయకుడు శ్రీనివాసన్ హత్య కేసులో నిందితులను ఎట్టి పరిస్థితిలోను వదిలేది లేదని, కఠినంగా శిక్షిస్తామని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి భైరతి సురేష్ తెలిపారు. శుక్రవారం శ్రీనివాసన్ హత్య కేసులో సుపారి ఇచ్చిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ శ్రీనివాసన్ అభిమానుల సంఘం సభ్యులు నగరంలోని శాశ్వత నీటిపారుదల వేదిక వద్ద చేపట్టిన ధర్నా శిబిరం వద్దకు వచ్చి ఆందోళనకారుల నుంచి వినతిపత్రం స్వీకరించి ఆయన మాట్లాడారు. హత్య కేసులో ఇప్పటికే ప్రభుత్వం సీఐడీ దర్యాప్తునకు ఆదేశించిందన్నారు. ఎలాటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా చట్ట ప్రకారం నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

అభ్యర్థి ఎవరైనా ప్రచారం చేస్తా


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మంజునాథ్

కోలారు: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఎవరైనా విజయం కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్ తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. పార్టీ హైకమాండ్ కోలారు అభ్యర్థిగా ఎవరిని ప్రకటించినా వారి విజయం కోసం పాటుపడతానన్నారు. రైతులు పండించిన పంటల ఖరీదు ధరను ప్రభుత్వం తగ్గించడం సరికాదని, దీనిపై ప్రభుత్వంతో చర్చిస్తానన్నారు. జిల్లాలో కరువు నివారణ చర్యలు తీసుకుంటున్నామన్నారు. పశువుల మేత, బోరుబావులను తవ్వించడం వంటి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడా తాగునీటి సమస్య ఎదురు కాకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలో బెళగావిలోని సువర్ణసౌధలో జరిగే శీతాకాల అసెంబ్లీ సమావేశాల్లో కోలారు జిల్లాలోని వివిధ సమస్యలపై చర్చిస్తామని అన్నారు.

పౌర కార్మికుల ధర్నా

కోలారు: కాంట్రాక్టు పౌర కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ పౌర కార్మికులు శుక్రవారం జిల్లాధికారి కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఆందోళనకారులు మాట్లాడుతూ తమ డిమాండ్ల సాధన కోసం గత 20 ఏళ్లుగా పోరాటాలు చేస్తున్నా వాటిని నెరవేర్చడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. గత ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై, ప్రస్తుత ముఖ్యమంత్రి సిద్దరామయ్య కూడా 25 వేల మంది పౌర కార్మికులను పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈనేపథ్యంలో త్వరలో బెళగావిలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో పౌర కార్మికులను పర్మినెంట్ చేసేలా నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లాధికారి అక్రంపాషాకు వినతిపత్రం సమర్పించారు. ధర్నాలో నగరసభ సభ్యుడు మంజునాథ్, పౌరకార్మికుల కావలా సమితి రాష్ట్ర సంచాలకురాలు ఎం.పద్మ, పౌర కార్మికుల మహా సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్.నాగేష్ పాల్గొన్నారు.


కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న దృశ్యం

రైతుల భూ రక్షణపై కేబినెట్‌లో చర్చిస్తాం

కోలారు: అటవీభూముల్లో ఆక్రమణల తొలగింపు కార్యాచరణలో రెవిన్యూ శాఖ నుంచి నియమానుసారంగా సాగు భూములు పొందిన రైతులకు అన్యాయం కాకుండా చర్యలు తీసుకుంటామని, కేబినెట్‌లో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి కెహెచ్ మునియప్ప తెలిపారు. శుక్రవారం నగరంలోని ప్రభుత్వ అతిథిగృహంలో శ్రీనివాసపురం అసెంబ్లీ నియోజకవర్గ వ్యాప్తిలోని పట్టణ, హోకూరు, సుగటూరు ఫిర్కాలకు చెందిన 130 మందికి పైగా రైతుల నుంచి మనవి స్వీకరించి మాట్లాడారు. రైతుల భూముల స్వాధీనం గురించి ఇప్పటికే అటవీశాఖ మంత్రితో చర్చించానన్నారు. ప్రస్తుతానికి ఆక్రమణల తొలగింపును నిలిపేశామన్నారు. అనంతరం ముఖ్యమంత్రితో కూడా చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని, రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. రాష్ట్ర మామిడి అభివృద్ధి మండలి మాజీ అధ్యక్షుడు దళసనూరు గోపాలకృష్ణ, కాంగ్రెస్ జిల్లా కార్యాధ్యక్షుడు ఊరుబాగిలు శ్రీనివాస్, కాంగ్రెస్ ఎస్‌సీ విభాగం జిల్లా అధ్యక్షుడు కె.జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి కెహెచ్ మునియప్ప

5న అటవీ శాఖకు వ్యతిరేకంగా ధర్నా

కోలారు: నగరంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు ఈనెల 5న అటవీ శాఖకు వ్యతిరేకంగా ధర్నా నిర్వహిస్తున్నట్లు కేపీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యశవంత్ తెలిపారు. శుక్రవారం నగరంలోని అరహళ్లి వద్ద అటవీ శాఖ రైతుల భూములను స్వాధీనం చేసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ నిర్వహించిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీనివాసపురంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో అటవీ శాఖ అధికారులు రైతులు పండించిన పంటలను నాశనం చేసి నిర్దాక్షిణ్యంగా భూములను స్వాధీనం చేసుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తూ నిర్వహించే ధర్నాలో పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో కేపీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు పీఆర్ సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు టీఎం వెంకటేష్, కార్యదర్శి పాతకోట నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న యశవంత్

క్లుప్తంగా

ప్రభుత్వ బస్సుల్లో ప్రయాణించండి



బస్సులకు పూజ చేస్తున్న దృశ్యం

గౌరిబిదనూరు: ప్రతి ఒక్కరూ ప్రభుత్వ బస్సుల్లో ప్రయాణించి సురక్షితంగా గమ్యాలకు చేరాలని ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ తెలిపారు. హొసూరు వైపు నుంచి ఆరూడి, ఎర్రనాగేనహళ్లి, ఇందిరానగర్ రూట్లలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన బస్సులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. డిపో మేనేజర్ శివప్ప,నరసింహారెడ్డి,శ్రీనివాసగౌడ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

తుమకూరు: తుమకూరు గ్రామీణ నియోజకవర్గంలో భారీగా కాంగ్రెస్‌లో చేరికలు జరిగాయి. జేడీఎస్, బీజేపీ మైత్రితో అసంతృప్తిగా ఉన్న కార్యకర్తలంతా మాజీ ఎమ్మెల్యే డీసీ గౌరిశంకర్ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గూళూరు జిల్లా పంచాయతీలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు.

గణితంలో పీహెచ్‌డీ



పీహెచ్‌డీ పట్టా అందుకున్న ప్రొఫెసర్ సంగీత

గౌరిబిదనూరు: స్థానిక అశ్వత్థయ్య సంజీవమ్మ నేషనల్ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న ప్రొఫెసర్ సంగీత ప్రెసిడెన్సీ విశ్వ విద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. ఈమె గణితంలో డాక్టర్ సందీప్‌కుమార్ మార్గదర్శకంలో ఎలిసిడేటివ్ స్టడీ ఆఫ్ టూ ప్యారామీటర్స్ మ్యాథమెటికల్ మీన్స్ అండ్ ఇట్స్ అప్లికేషన్స్ అనే అంశంపై సమర్పించిన వ్యాసానికి పీహెచ్‌డీ పట్టా లభించింది. ఈ సందర్భంగా పలువురు సంగీతను అభినందించారు.


దివ్యాంగుల క్రీడా పోటీలు ప్రారంభం

మైసూరు: దివ్యాంగ పిల్లలపై జాలి చూపకుండా వారిలో ఆత్మవిశ్వాసం నింపాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మహదేవప్ప పిలుపునిచ్చారు. నగరంలోని చాముండి విహార క్రీడా మైదానంలో మైసూరు జిల్లా దివ్యాగుల క్రీడలను మంత్రి ప్రారంభించి మాట్లాడారు. దివ్యాంగ పిల్లలను చూసుకోవడం సులభమైన పని కాదని, వారిని ప్రేమతో, ఎంతో నిబద్ధతతో పెంచాల్సి ఉంటుందని గుర్తు చేశారు. దివ్యాంగ పిల్లలను చూసుకోవడంలో టీచర్ల పాత్ర ఎక్కువగా ఉంటుందని తెలిపారు.

కన్నడ భాషను రక్షించుకోవాలి

గౌరిబిదనూరు: ప్రతి ఒక్కరూ కన్నడ భాషలో మాట్లాడి మాతృభాషను రక్షించుకోవాలని ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ అన్నారు. పట్టణంలోని ఆచార్య మైదానంలో కర్ణాటక రాజ్య రత్న యువ వేదికె ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన రాజ్యోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని కన్నడ భాష పరిరక్షణ ఆవశ్యకతను వివరించారు. కన్నడ భాషకు 2 వేల సంవత్సరాలకు పైగా చరిత్ర ఉందన్నారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు. అనంతరం జానపద కళాబృందాల ప్రదర్శన ప్రజలను ఆకట్టుకుంది. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు రక్షారామయ్య, అనంతరాజు, సప్తగిరి, ఫరీద్, వెంకటేశ్, పవన్, సాగర్ పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై నాటక ప్రదర్శన



కృష్ణరాజపురం: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆస్పత్రి వైద్యులు డాక్టర్ అశోక్ రెడ్డి, బెంగళూరు తూర్పు తాలూకా ఆరోగ్యాధికారి వింధ్య ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా డివైన్ ఆఫ్ నర్సింగ్ పాఠశాల విద్యార్థులు హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నియంత్రణపై ప్రజలు అనుసరించాల్సిన ముందస్తు జాగ్రత్తలపై నాటక ప్రదర్శనను నిర్వహించారు.

తపాలా శాఖ స్టాంప్ విడుదల

సాక్షి బెంగళూరు: చిన్న వయసులోనే పిల్లలను వేధించే క్యాన్సర్ వ్యాధిని నియంత్రించేందుకు, దానిపై అవగాహన కల్పించేందుకు పోస్టల్ శాఖ స్టాంప్‌ను విడుదల చేసింది. ఇందుకోసం బెంగళూరులోని అపోలో క్యాన్సర్ కేంద్రంతో తపాల శాఖ చేతులు కలిపింది. శుక్రవారం 'స్టాంప్ ఔట్ చైల్డ్‌హుడ్ క్యాన్సర్' పేరిట పోస్టల్ స్టాంప్‌ను బెంగళూరు ప్రధాన పోస్టాఫీస్ పోస్టుమాస్టర్ జనరల్ ఎల్‌కే డ్యాశ్, అపోలో పీడియాట్రిక్ అంకాలజీ సలహాదారుడు డాక్టర్ నీమా భట్ ఈ కార్యక్రమంలో పాల్గొని స్టాంప్ విడుదల చేశారు. ఈ స్టాంప్ విడుదల ద్వారా బాల్య దశలో క్యాన్సర్‌పై పోరాటం, అలాగే క్యాన్సర్‌బారిన పడిన చిన్నారుల్లో ధైర్యం, నమ్మకం, విశ్వాసాన్ని నెలకొల్పాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రారంభోత్సవం సందర్భంగా మొత్తం 60 వేల పోస్టల్ స్టాంప్స్ విడుదల చేశారు.



పురస్కారాలకు ఎంపికైన అత్యుత్తమ ఛాయాచిత్రాలు



ధ్రువపు ఎలుగుబంట్ల పోట్లాట



ఐస్ స్కేటింగ్‌లో దూసుకుపోతున్న పోటీదారులు

చిత్రం.. వైవిధ్యం

● నేటి నుంచి సలాన్ ఛాయా చిత్ర ప్రదర్శన

బనశంకరి: యూత్ ఫొటోగ్రఫిక్ సొసైటీ బెంగళూరు, అంతర్జాతీయ సలాన్–2023 ఛాయాచిత్ర ప్రదర్శన నగరవాసులను కనువిందు చేయనుంది. ఈ ప్రదర్శన శనివారం నుంచి రెండు రోజులపాటు చిత్రకళా పరిషత్‌లో ఏర్పాటు చేయనున్నారు. అంతర్జాతీయ సలాన్– 2023 ఇటీవల నిర్వహించిన ఛాయాచిత్ర ప్రదర్శన విజేతలను ఎంపిక చేశారు. దేశవ్యాప్తంగా 279 మంది ఫొటోగ్రాఫర్లు 3504 చిత్రాలను పోటీలకు పంపారు. ప్రకృతి, అందాలు, అడవులు, మానవ జీవితంతో సహా అనేక అంశాలతో కూడిన ఫొటోలు ఇందులో ఉన్నాయి. అందులో న్యాయనిర్ణేతలు 104 చిత్రాలను ఎంపిక చేసి విజేతలుగా నిర్ణయించారు. ఇందులో ఉత్తమ చిత్రాలను డిసెంబరు 2,3 తేదీల్లో విజేతలకు పురస్కారాలు ప్రదానం చేస్తారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఫొటో ఆర్టిస్ట్ జర్మనీ బర్బారాస్కిమిడ్ట్, ప్రత్యేక అతిథిగా ఎన్. శశికుమార్ యువజన క్రీడలు శాఖ కమిషనర్ పాల్గొంటారని సలాన్ చైర్మెన్ మంజువికాస్‌శాస్త్రి, కార్యదర్శి అనితా తెలిపారు.

కొనసాగుతున్న గెస్ట్ లెక్చరర్ల ధర్నా



ధర్నా చేస్తున్న అతిథి ఉపన్యాసకులు

తుమకూరు: రాష్ట్రంలోని 430 ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో పని చేస్తున్న గెస్ట్ లెక్చరర్లను శాశ్వత ఉద్యోగులుగా క్రమబద్ధీకరించాలని 9 రోజులుగా తరగతులు బహిష్కరించి ఆందోళనలు చేస్తున్నప్పటికీ ఇప్పటివరకు ప్రభుత్వ నుంచి ఎలాంటి స్పందన రాలేదని అతిథి అధ్యాపకుల సంఘం జిల్లాధ్యక్షుడు డాక్టర్ ధర్మవీర్ ఆవేదన వ్యక్తం చేశారు. డిసెంబర్ 4 లోగా ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోకపోతే బెళగావి సువర్ణసౌధ ఎదుట తమ ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. గత రెండు దశాబ్దాలుగా గెస్ట్ లెక్చరర్లను శాశ్వత ఉద్యోగులుగా మార్చాలని పోరాటం చేస్తున్న ప్రభుత్వాలు పట్టించుకోలేదని తెలిపారు. 2021లో బెళగావి సువర్ణసౌధ ఎదుట తాము ఆందోళన చేస్తున్నప్పుడు అప్పటి ప్రతిపక్ష నాయకుడు సిద్ధరామయ్య తమకు మద్దతుగా నిలిచి అసెంబ్లీలో ఈ విషయాన్ని ప్రస్తావించారు. ప్రస్తుతం ఆయనే సీఎంగా కొనసాగుతుండగా ఈ విషయంపై కనీసం దృష్టి కూడా సారించడం లేదని విమర్శించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



మంజునాథ్ మృతదేహం



ప్రమాదానికి గురైన స్కూటీ

మండ్య: జిల్లాలో రహదారులు నెత్తురోడాయి. వివిధ ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. మద్దూరు తాలూకా దొడ్డహోసగావి గ్రామం వద్ద జరిగిన ప్రమాదంలో ఎస్‌ఎస్‌ఎల్ చెక్కెర కర్మాగారం ఫీల్డ్‌మెన్ మంజునాథ్ (40) మృతి చెందాడు. మండ్య చాముండేశ్వరినగర లేఔట్ నివాసి అయిన మంజునాథ్ తన పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టి వెళ్లిపోయింది. ఘటనలో మంజునాథ్ అక్కడికక్కడే మరణించాడు. కొప్ప పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. అదేవిధంగా ముత్తత్తి రోడ్డులోని బ్యాడరహళ్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాణాళు గ్రామానికి చెందిన శివణ్ణ కుమార్తె సౌమ్య(16) మృతి చెందింది. బ్యాడరహళ్లి పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఆమె గురువారం కనకదాస జయంతి సందర్భంగా సెలవు కావడంతో అమ్మమ్మ ఇంటికి వెళ్లింది. గురువారం సాయంత్రం స్వగ్రామానికి తన పెద్దనాన్న శివలింగయ్యతో కలసి బైక్‌లో వస్తుండగా ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో సౌమ్య రోడ్డుపైకి పడిపోగా ఆమెపై ట్రాక్టర్ చక్రాలు వెళ్లాయి. దీంతో ఆమె అక్కడికక్కడే మరణించింది. గాయపడిన శివలింగయ్యను స్థానికులు కోసం మండ్య జిల్లా స్పత్రికి తరలించారు. హలగూరు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

దళిత సంఘర్ష సమితి ధర్నా



ధర్నా చేస్తున్న దళిత సంఘర్ష సమితి కార్యకర్తలు

దొడ్డబళ్లాపురం: దొడ్డ తాలూకా సక్కరెగొల్లహళ్లి గ్రామపంచాయతీ పరిధిలోని దళితుల భూమిని బోగస్ డాక్యుమెంట్లు తయారు చేసి కాజేసేందుకు పంచాయతీ మాజీ అధ్యక్షురాలి భర్త కుట్ర చేస్తున్నాడని ఆరోపిస్తూ దళిత సంఘర్ష సమితి కార్యకర్తలు గ్రామపంచాయతీ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడిన డీఎస్ఎస్ నేత బసవరాజు సక్కరెగొల్లహళ్లి గ్రామపంచాయతీ పరిధిలోని బూచనహళ్లి గ్రామం 132:11 సర్వే నంబర్‌లోని 2.20 ఎకరాల భూమిని బోగస్ డాక్యుమెంట్లు తయారు చేసి కాజేయడానికి కుట్ర చేసారని ఆరోపించారు. సక్కరెగొల్లహళ్లి గ్రామపంచాయతీ అధ్యక్షురాలి భర్త రుద్రమూర్తి ఈ కుట్రలో ప్రధాన నిందితుడని,పీడీఓ మునిరాజు కూడా ఇందుకు సహకరించాడని ఆరోపించారు. ఇందుకు సంబంధించి విచారణ చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండు చేసారు.

రైతుపై చిరుత దాడి

మండ్య: మేకలు కాసేందుకు వెళ్లిన రైతుపై చిరుత దాడి చేసి గాయపరచిన ఘటన ఆతగూరు హోబళి హడగనహళ్లిలో శుక్రవారం మధ్యాహ్నం జరిగింది. చిరుత దాడితో గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయి. గ్రామానికి చెందిన ప్రకాశ్ అనే వ్యక్తి చిరుత దాడిలో గాయపడ్డాడు. అతని చెవి, శరీరంపై చిరుత దాడి గాయాలు ఉన్నాయి. ఉదయం 11 గంటల సమయంలో ప్రకాశ్ మేకలు తీసుకుని చెరకు పొలం వైపు వెళ్లగా అక్కడ సమీపంలో దాగిన చిరుత ఒక్కసారిగా మేకల మందపై దాడి చేసింది. ఒక మేకను నోటిలో కరుచుకుని పరుగు తీసింది. దీంతో ప్రకాశ్ కట్టెతో చిరుతపై దాడి చేసేందుకు యత్నించాడు. చిరుత ప్రకాశ్‌పై దాడి చేసి గాయపరిచింది. క్షతగాత్రుడిని హుటాహుటిన మండ్య జిల్లా ఆస్పత్రికి తరలించారు.

నూతన అధ్యక్షుడిగా ఎన్నిక



నూతన అధ్యక్షుడిని అభినందిస్తున్న కౌన్సిలర్లు

దొడ్డబళ్లాపురం: దొడ్డ నగరసభ స్టాండింగ్ కమిటీకి నూతన అధ్యక్షుడిగా రవికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదిలక్ష్మి రాజీనామా చేయడంతో ఖాళీగా ఉన్న అధ్యక్ష స్థానానికి జరిగిన ఎన్నికలో రవికుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన రవికుమార్ తనపై నమ్మకంతో ఇచ్చిన పదవికి శాయశక్తులా కష్టపడి న్యాయం చేస్తానని, దొడ్డ పట్టణ అభివృద్ధికి శ్రమిస్తానన్నారు. నూతన అధ్యక్షుడిని జేడీఎస్ నాయకులు, తోటి కౌన్సిలర్లు అభినందించారు.

2030 నాటికి ఎయిడ్స్ సంపూర్ణ నియంత్రణ



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీహెచ్‌ఓ తదితరులు

చిక్కబళ్లాపురం: ఆరోగ్యమే మహాభాగ్యమని, ఆరోగ్యంగా ఉంటే ఏదైనా సాధించగలుగుతామని డీహెచ్‌ఓ మహేశ్‌కుమార్ అన్నారు. శుక్రవారం నగరంలోని అంబేడ్కర్ భవనంలో జిల్లా పాలక మండలి, జిల్లా ఆరోగ్యశాఖ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విశ్వ ఎయిడ్స్ దినోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో 2030 నాటికి ఎయిడ్స్‌ను సంపూర్ణంగా నియంత్రిస్తామని, హెచ్‌ఐవీ పీడితుల్లో కర్ణాటక 5వ స్థానంలో ఉందన్నారు. విశ్వ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీని జిల్లా జడ్జి నేరెళ వీరభద్రయ్య భవాని ప్రారంభించారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి మంజుల, జిల్లా ఎయిడ్స్ నియంత్రణాధికారి డాక్టర్ ఉమా, ఆశా, పారామెడికల్ విద్యార్థులు పాల్గొన్నారు.

బెట్ట ఆలయం వద్ద అగ్నిప్రమాదం

మైసూరు: చామరాజనగర జిల్లా హనూరు తాలూకా మలేమహదేశ్వరబెట్ట ఆలయం వద్ద అగ్నిప్రమాదం జరిగింది. లడ్డూ ప్రసాదం తయారీ కేంద్రంలో ఈ ప్రమాదం జరిగింది. మంటలు వ్యాపించడంతో ప్రాధికార సిబ్బంది వాటిని ఆర్పివేశారు. సిలిండర్ పేలడంతో ఈ మంటలు వ్యాపించినట్లు తెలుస్తోంది. తీపి తినుబండారాలు, వంట నూనె ఉండడంతో మంటలు ఎగసిపడ్డాయి. తయారీ కేంద్రంలోని పరికరాలు, వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణాపాయం జరగలేదు.

తాగునీటి సమస్య రానీయొద్దు

శివమొగ్గ: ప్రస్తుతం రాష్ట్రంలో కరువు సమస్య ఉండటంతో ప్రజలకు తాగునీటి సమస్య, పశువులకు మేత సమస్య రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని శివమొగ్గ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మధు బంగారప్ప అధికారులకు సూచించారు. శుక్రవారం శివమొగ్గ జిల్లా సాగరలోని ఐబీలో ఏర్పాటు చేసిన ప్రగతి పరిశీలన సమావేశంలో మంత్రి అధికారులతో మాట్లాడుతూ... వర్షాలు లేక జలాశయాలు ఖాళీ అవుతున్నాయని, పశువులు మేతకు ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

యువతిపై దౌర్జన్యం..నిందితుడి అరెస్ట్



శరత్ (ఫైల్)

యశవంతపుర: ప్రేమ పేరుతో యువతిపై లైంగిక దౌర్జన్యం చేసి, మానసికంగా వేధిస్తున్న యువకుడిపై హాసన జిల్లా సకలేశపుర పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. కుశాలనగర లేఔట్‌కు చెందిన శరత్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. మూడేళ్ల నుంచి శరత్ అదే ప్రాంతానికి చెందిన యువతిని ప్రేమిస్తున్నట్లు నమ్మించి నాటకం ఆడారు. యువతి వద్ద శరత్ డబ్బులు, బంగారంను తీసుకుని తనతో కలిసుండగానే శివమొగ్గకు చెందిన మరో యువతితో తిరుగుతూ ఆమెను ప్రేమిసున్నాడు. యువతి తనతో ప్రేమాయణం నడుపుతున్నట్లు శివమొగ్గ యువతికి ఇన్‌స్టాలో ట్యాగ్ చేసి ప్రశ్నించింది. ఈ విషయం తెలుసుకున్న శరత్ కోపం పెంచుకుని కుశాలనగర లేఔట్‌కు చెందిన యువతిని ఓ చోటకు పిలిచి ఇష్టానుసారంగా చితకబాదాడు. ఆమెను కొడుతున్న దృశ్యాలను వీడియో కాల్ చేసి కొత్త ప్రియురాలికి చూపించాడు. దెబ్బలు తిన్న యువతి కూడా తను తక్కువలేదంటూ వీడియో కాల్‌ను రికార్డ్ చేసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమెకు పెట్టిన చిత్రహింసలు వీడియో సామాజిక మాధ్యమాలలో వైరల్‌గా మారింది. ఇందుకు సంబంధించి సకలేశపుర పోలీసులు కేసు నమోదు చేసుకొని నిందితుడిని అరెస్ట్ చేశారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటం

మైసూరు: విద్యార్థుల జీవితాలతో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చెలగాటమాడుతోందని బీజేపీ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సీటీ రవి మండిపడ్డారు. శుక్రవారం చామరాజపురంలోని బీజేపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. యువత భవిష్యత్తుకు చక్కని పునాది కోసం కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానాన్ని (ఎన్‌ఈపీ) తీసుకొస్తే దాన్ని అనుసరించకుండా రాష్ట్ర విద్యా విధానాన్ని అమలు చేసేందుకు రాష్ట్రప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. ఎన్‌ఈపీని బీజేపీ తీసుకొచ్చిందనే ఒకే ఒక్క కారణంతో ఈ రాష్ట్ర ప్రభుత్వం దాన్ని వ్యతిరేకిస్తోందని మండిపడ్డారు.

ప్రధాన కార్యదర్శిగా బాధ్యతల స్వీకరణ

శివాజీనగర: రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా రజనీశ్ గోయల్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీఎం సిద్దరామయ్య ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రధాన కార్యదర్శి వందితా శర్మ పదవీకాలం నవంబర్ 30కు ముగిసిన నేపథ్యంలో గోయల్ నూతన ప్రధాన కార్యదర్శిగా నియామకమయ్యారు. గోయల్ గతంలో అదనపు ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. 1986 బ్యాచ్‌కు చెందిన ఈయన అధికార అవధి కేవలం 7 నెలలు మాత్రమే ఉంటుంది.

వ్యక్తి దారుణ హత్య



రక్తపు మడుగులో నాగరాజ్ మృతదేహం

కెలమంగలం: డెంకణీకోట తాలూకా సరిహద్దులో వ్యక్తిని దారుణంగా హత్య చేసిన దుండగుల కోసం పంజపల్లి పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. వివరాలు... ధర్మపురి జిల్లా నమ్మండహళ్లి పంచాయతీ పుదుపేటకాలనీ గ్రామానికి చెందిన నాగరాజ్ (50). శుక్రవారం ఉదయం ద్విచక్ర వాహనంలో పొలం వద్దకెళ్లిన తిరిగి రాకపోవడంతో భయపడిన కుటుంబ సభ్యులు పొలంవద్దకెళ్లి చూడగా హత్యకు గురై కనిపించాడు. ఈ ఘటనపై పంజపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు ఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని స్వాధీనపరుచుకొని ధర్మపురి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దుండగుల కోసం గాలిస్తున్నారు.

రక్షణ కల్పించండి

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

హోసూరు: ప్రేమ వివాహం చేసుకున్న జంట తమకు రక్షణ కల్పించాలని పోలీసులను ఆశ్రయించింది. వివరాలు.. అంచెట్టి తాలూకా వన్నాతిపట్టి గ్రామానికి చెందిన రాజా కొడుకు పచ్చయప్పన్(21), బేరికె సమీపంలోని పలవనపల్లి గ్రామానికి చెందిన రామప్ప కూతురు సౌమ్య(21)లు బీఎస్సీ నర్సింగ్ ముగించారు. ఇరువురూ చదువుతున్న సమయంలోనే ప్రేమించుకొన్నారు.ఈ విషయాన్ని ఇరువర్గాల కుటుంబ సభ్యులు అంగీకరించకపోవడంతో శుక్రవారం హోసూరులో కోటమారియమ్మ ఆలయంలో వివాహం చేసుకున్నారు. తమ తల్లిదండ్రుల నుంచి రక్షణ కల్పించాలని మహిళా పోలీసులను ఆశ్రయించారు.

ఎయిడ్స్ నియంత్రణకు సహకరించాలి



చైతన్య ర్యాలీలో విద్యార్థులు

హోసూరు: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం హోసూరులోని సెయింట్ పీటర్ వైద్య కళాశాల విద్యార్థులు చైతన్య కార్యక్రమాన్ని నిర్వహించారు. రాయకోట రోడ్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన ఈ చైతన్య ర్యాలీని హోసూరు కార్పొరేషన్ పారిశుద్ధ శాఖాధికారి ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఆర్.వి.ప్రభుత్వ బాలుర ఉన్నతోన్నతర పాఠశాల, తాలూకాఫీసు, డెంకణీకోట రోడ్డు, ప్రభుత్వ ఆస్పత్రి, రామనాయకు చెరువు కట్టమీదుగా పార్కు వద్దకు చేరుకొంది. ర్యాలీలో విద్యార్థినీ విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని ప్రజల్లో ఎయిడ్స్ నిర్మూలనపై చైతన్యం కల్పించారు. ర్యాలీలో 200 మందికిపైగా విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వైద్య కళాశాల బృందం పాల్గొన్నారు.

హోసూరు వార్తలు..

ఏనుగులున్నాయి జాగ్రత్త..!

● నిఘా కెమెరాలతో పర్యవేక్షణ



నగనూరు అటవీ ప్రాంతంలో రోడ్డు దాటుతున్న ఏనుగుల మంద (ఫైల్)


కెలమంగలం: డెంకణీకోట తాలూకా నగనూరు అటవీ ప్రాంతంలో ఏనుగుల సంచారంపై అటవీ శాఖాధికార్ల ప్రత్యేక బృందం నిఘా కెమెరాలతో పర్యవేక్షిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం కర్ణాటక రాష్ట్రం బన్నేరుఘట్ట అటవీ ప్రాంతం నుంచి వందకు పైగా ఏనుగులు గుంపులు గుంపులుగా విడిపోయి జవుళగిరి అటవీ ప్రాంతం మీదుగా డెంకణీకోట సమీపంలోని నగనూరు, బేవనత్తం, రాయకోట సమీపంలోని ఉడేదుర్గం, హోసూరు సమీపంలోని శ్యానమావు అటవీ ప్రాంతాలకు చేరుకున్నాయి. ప్రతి రోజూ ఏనుగుల దాడుల్లో ప్రజలు ప్రాణాలను కోల్పోవడంతో పాటు, రైతులు పండిస్తున్న పంటలను తీవ్రంగా ధ్వంసమవుతున్నాయి. ఏనుగుల దాడులకు శాశ్వత పరిష్కారం కల్పించాలని అటవీ ప్రాంత గ్రామాల ప్రజలు అటవీశాఖాధికార్లను డిమాండ్ చేయడంతో ముదుమలైకు చెందిన 8 మంది అటవీ శాఖాధికారుల బృందం డెంకణీకోటకు చేరుకొని ఏనుగుల సంచారాన్ని పర్యవేక్షిస్తున్నారు. అటవీ ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ఏనుగుల సంచారం ఉన్న ప్రాంతాల్లో ద్విచక్ర వాహనదారులు వెళ్లరాదని, పొలాల వద్దకు రైతులు కాపలా వెళ్లరాదని హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

నమ్మించారు...రూ.32 లక్షలు కొల్లగొట్టారు

హోసూరు: మాయమాటలతో సైబర్ వంచకులు ఇద్దరి వ్యక్తుల నుంచి రూ.32 లక్షలు కొల్లగొట్టారు. క్రిష్ణగిరి క్రైం బ్రాంచ్ పోలీసుల కథనం మేరకు వివరాలు.. హోసూరు కార్పొరేషన్ పరిధిలోని అన్నానగర్‌కు చెందిన ఇళయరాజ వాట్సాప్‌కు గత నెల 19న ఒక మెసేజ్ వచ్చింది. యూట్యాబ్‌లో వీడియోలు అప్‌లోడ్ చేస్తే కొంతమొత్తం బ్యాంకు ఖాతాకు జమ చేస్తామని నమ్మించారు. తొలుత కొన్ని వీడియోలు అప్‌లోడ్ చేయగా కొంతమొత్తం నగదు బదిలీ చేశారు. అయితే లక్షల్లో ఆదాయం రావాలంటే తమ వద్ద పెట్టుబడి పెట్టాలని సూచించగా విడతల వారీగా రూ. 19.58 లక్షలు వారు సూచించిన బ్యాంకు ఖాతాకు జమ చేశాడు. అనంతరం వంచకుల ఫోన్ స్విచ్ఛాఫ్ అయ్యింది. దంతో బాధితుడు ఇళయరాజ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదేవిధంగా పోచ్చంపల్లి సమీపంలోని కే. మోటూర్ గ్రామానికి చెందిన గోవిందరాజ్(37) బెంగళూరులోని ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. గత నెల 21న వాట్సప్‌కు వచ్చిన మెసేజ్‌పై స్పందించి రూ. 12.45 లక్షలు జమచేశాడు. అనంతరం ఫోన్ స్విచ్ఛాఫ్ అని సమాధానం వచ్చింది. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి సైబర్ వంచకుల కోసం గాలింపు చేపట్టారు.

ప్లాస్టిక్ విక్రయాలపై కొరడా

● గోదాము నిర్వాహకుడికి రూ.5 లక్షల జరిమానా



స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ కవర్లు

హోసూరు: హోసూరు కార్పొరేషన్ పరిధిలో ప్లాస్టిక్ కవర్ల విక్రేతలపై అధికారులు కొరడా ఝుళిపించారు. అధికారి ప్రభాకరన్ నేతృత్వంలో ఉద్యోగులు శుక్రవారం పట్టణంలోని మునీశ్వర్‌నగర్ ప్రాంతంలోని కూరగాయల మార్కెట్‌లో తనిఖీలు నిర్వహించారు. 17 మంది దుకాణదారుల నుంచి ప్లాస్టిక్ కవర్లను స్వాధీనపరుచుకొని వెయ్యి రూపాయలు చొప్పున జరిమానా విధించారు. బాగలూరు రోడ్డులోని గోదాములో సోదాలు చేపట్టి 500 కిలోల ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకొని రూ. 5 లక్షల జరిమానా విధించారు. ప్లాస్టిక్ వస్తువులు విక్రయించే వారితో పాటు వినియోగిస్తున్న వారిపై కూడా చర్యలు చేపడతామని హెచ్చరికలు జారీ చేశారు.

ల్యాప్‌టాప్ దొంగ అరెస్ట్

హోసూరు: హోసూరు పారిశ్రామికవాడలో నిర్వహిస్తున్న ఓ ప్రైవేట్ పరిశ్రమలో ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్ దొంగలించుకెళ్లిన నిందితున్ని సిప్‌కాట్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు...అంచెట్టి తాలూకా గోరిపాళ్యం గ్రామానికి చెందిన విజయ్ (23). హోసూరు కార్పొరేషన్ పరిధిలోని బేడరపల్లిలో నివాసముంటూ అదే ప్రాంతంలోని ప్రైవేట్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. గత నెల 28వ తేదీ పరిశ్రమలో ఉంచిన ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్‌ను గుర్తు తెలియని దుండగులు దోచుకెళ్లారు. ఈ ఘటనపై బాధితుడు సిప్‌కాట్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ జరుపగా బేగేపల్లి రాజాజీ నగర్‌కు చెందిన సంతోష్ చోరీ చేసినట్లు తెలిసింది. అతన్ని అరెస్ట్ చేసి సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుట్కా తరలిస్తున్న కారు స్వాధీనం

క్రిష్ణగిరి: కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నుంచి చెన్నైకు గుట్కా తరలిస్తున్న కారును సూళగిరి పోలీసులు స్వాధీనపరుచుకొన్నారు. వివరాలు... సూళగిరి పోలీసులు శుక్రవారం వేకువజామున హోసూరు– క్రిష్ణగిరి జాతీయ రహదారిపై వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో ఆ మార్గంలో వచ్చిన కారును అడ్డగించగా పోలీసులను గమనించిన డ్రైవర్ కారును నిలిపి పరారయ్యాడు. కారులో రూ. 78 వేలు విలువ చేసే 180 కిలోల గుట్కా బయటపడింది. గుట్కాను స్వాధీనపరుచుకొని డ్రైవర్ కోసం గాలిస్తున్నారు.

ఇద్దరు పిల్లలతో తల్లి అదృశ్యం

శివమొగ్గ: నగరంలోని దొడ్డపేట పోలీసు స్టేషన్ పరిధి బుద్ధనగర ఒకటో క్రాస్‌కు చెందిన మహిళ తన ఇద్దరు పిల్లలతో పాటు కనిపించకుండా పోయింది. ఆమె ఆచూకీ కోసం సహకరించాలని పోలీసు శాఖ విజ్ఞప్తి చేసింది. మహమ్మద్ జాఫర్ అనే వ్యక్తి భార్య ఉమ్మే హని (29), పిల్లలు ఆస్పియా కౌనైన్ (9), మహమ్మద్ సూఫియాన్ (5)లు కనిపించకుండా పోయారు. నవంబర్ 20న వీరు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని కుటుంబ సభ్యులు తెలిపారు.

పశుగ్రాసం కొరత లేకుండా చూడండి



మైసూరు: రాష్ట్రంలో కరువు పరిస్థితుల నేపథ్యంలో రానున్న రోజుల్లో పశుగ్రాసం కొరత లేకుండా చూడాలని అధికారులకు పశుసంవర్ధక మంత్రి కె.వెంకటేశ్ సూచించారు. శుక్రవారం మైసూరు జిల్లా పంచాయతీ దేవరాజ్ అరసు సభాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. పశువులకు చర్మగంటు వ్యాధి తొలిదశలోనే గుర్తించి చికిత్స అందించాలని సూచించారు. విత్తన కిట్లను రైతులకు అవసరమైన సంఖ్యలో అందించాలని తెలిపారు.

బెంగళూరు హబ్బ షురూ

● నగరంలో 11 రోజుల పాటు వేడుక

శివాజీనగర: అన్ బాక్సింగ్ బీఎల్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 1 నుంచి 11 వరకు నగరమంతటా 'బెంగళూరు హబ్బ' నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా గురువారం సాయంత్రం చిక్కపేటలో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కెంపేగౌడ ఎద్దుల బండి ఊరేగింపును ప్రారంభించి మాట్లాడుతూ...బెంగళూరు ప్రజలు ఈ పండుగలో పాల్గొని సంతోషాన్ని పంచుకోవాలని ఈ వేడుకలు నిర్వహిస్తున్నామని, బెంగళూరు నగరం ప్రపంచానికే మోడల్ అని అన్నారు. ప్రపంచంలో అన్ని వర్గాల ప్రజలు బెంగళూరు ద్వారా భారత్‌ను చూస్తున్నారు. ఇందుకు కెంపేగౌడ వేసిన పునాది కారణం. దీనిని తాము కాపాడుకొని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. బెంగళూరు హబ్బను 11 రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తామన్నారు. బెంగళూరు హబ్బకు సిలికాన్ సిటీలో లాంటాన్ ఏనుగులు చేరుకున్నాయి. బెంగళూరులో బ్రాండ్ పెంచేందుకు బెంగళూరు హబ్బ నిర్వహిస్తున్నామన్నారు.

క్లుప్తంగా...

ధర్మవరం సుబ్బారెడ్డి ఎవరో నాకు తెలీదు!

టీడీపీ నేత కేఈ కృష్ణమూర్తి



డోన్(నంద్యాల) : డోన్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా ధర్మవరం సుబ్బారెడ్డిని పార్టీ అధిష్టానం నియమించిన విషయం తనకు తెలియదని, ఒక్కసారి తప్ప ఆయనతో తనకు పెద్దగా పరిచయం కూడా లేదని టీడీపీ సీనియర్ నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి అన్నారు. ధర్మవరం సుబ్బారెడ్డి నియామకాన్ని ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు స్వయంగా ప్రకటించిన నేపథ్యంలో కేఈ వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. శుక్రవారం ఆయన డోన్‌లో మీడియాతో మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా కేఈ ప్రతాప్ ఉన్న విషయం తప్పితే మార్పు గురించి తన దృష్టికి రాలేదన్నారు. కేఈ ప్రతాప్ రాజకీయాల నుంచి పూర్తిగా వైదొలగడంతో ఆయన స్థానంలో టీడీపీ అభ్యర్థిగా కేఈ ప్రభాకర్‌ను పోటీ చేయించాలని కార్యకర్తలు కోరుకోవడం సమంజసమేనన్నారు. ఇంతలో కేఈ సతీమణి పద్మావతమ్మ జోక్యం చేసుకుంటూ డోన్ నుంచి కేఈ ప్రభాకర్ ఇండిపెండెంట్‌గా పోటీ చేసినా ఎమ్మెల్యేగా గెలుస్తాడని తెలిపారు.

రాష్ట్ర పరిస్థితులను పార్లమెంటులో ప్రస్తావించండి

టీడీపీ ఎంపీలకు చంద్రబాబు సూచన

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో వ్యవస్థలు గాడి తప్పాయని, ఈ విషయాన్ని పార్లమెంటులో ప్రస్తావించాలని పార్టీ ఎంపీలకు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు సూచించారు. ఉండవల్లిలోని తన నివాసంలో శుక్రవారం పార్టీ ఎంపీలతో ఆయన సమావేశమయ్యారు. త్వరలో ప్రారంభమయ్యే పార్లమెంటు సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. వైఎస్ జగన్ ప్రభుత్వం అన్ని విధాలా విఫలమైందని పార్లమెంటులో చెప్పాలని సూచించారు. ఓటర్ల జాబితాలో అక్రమాల ద్వారా లబ్ధి పొందాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చూస్తోందని, పోలవరం ప్రాజెక్టును నిర్లక్ష్యం చేశారని, విభజన చట్టం హామీల సాధనలో విఫలమయ్యారని, వీటిని పార్లమెంటులో లేవనెత్తాలన్నారు. కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాల కింద ఇస్తున్న నిధులను సద్వినియోగం చేసుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. కేంద్రం పథకాలకు రాష్ట్ర వాటా నిధులు విడుదల చేయకపోవడం వల్ల అనేక పథకాలు నిలిచిపోయాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి రాజకీయ కక్ష సాధింపులపై ఉన్న శ్రద్ధ నిధుల సద్వినియోగంపై లేదని ఎంపీలు సమావేశంలో అన్నారు. ఈ సమావేశంలో ఎంపీలు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కేశినేని నాని, కనకమేడల రవీంద్ర కుమార్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాబుకు స్వాగత ర్యాలీ వెలవెల



రమేష్ ఆస్పత్రి వద్ద చంద్రబాబు కాన్వాయ్

పటమట(విజయవాడతూర్పు)/గన్నవరం (విమానాశ్రయం):తిరుపతి నుంచి ప్రత్యేక విమానంలో శుక్రవారం విజయవాడ వచ్చిన టీడీపీ అధినేత నారా చంద్రబాబుకు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల నుంచి నిరాదరణే ఎదురైంది. ఆ పార్టీ విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, పార్టీ ఇతర నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వాగత ర్యాలీ కార్యకర్తలు, నాయకులు లేక వెలవెలబోయింది. జాతీయ రహదారి 16 వెంబడి రామవరప్పాడు రింగ్ నుంచి బెంజిసర్కిల్ మీదుగా బందరురోడ్డు వైపు వెళ్లిన చంద్రబాబు కాన్వాయ్‌లో నిర్వహించిన ర్యాలీలో కార్యకర్తలు లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. కాగా, తొలుత చంద్రబాబుకు గన్నవరం విమానాశ్రయంలో ఎంపీ కేశినేని నాని, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు, ఎమ్మెల్సీలు పి.అశోక్‌బాబు, పంచుమర్తి అనురాధ, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు, మాజీ మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, కొల్లు రవీంద్ర, నక్కా ఆనంద్‌బాబు తదితరులు నేతలు స్వాగతం పలికారు. వారితో ఎయిర్‌పోర్టులో చంద్రబాబు 50 నిమిషాల పాటు సమావేశమయ్యారు.

మేం వస్తే అధికారులపై చర్యలు తీసుకుంటాం: లోకేశ్

కాకినాడ రూరల్: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకుంటామని టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చెప్పారు. ఆయన శుక్రవారం కాకినాడ జిల్లాలో కాకినాడ సిటీ, రూరల్ నియోజకవర్గ పరిధిలో యువగళం పాదయాత్ర చేశారు. కాకినాడ సర్పవరం జంక్షన్‌లో జరిగిన సభలో ఆయన ప్రసంగిస్తూ.. స్కిల్ స్కాంలో తొలుత రూ.3 వేల కోట్లు అవినీతి అని, ఇప్పుడు రూ.27 కోట్లు అంటూ మాయ మాటలు చెబుతున్నారన్నారు. అదీ టీడీపీ అకౌంటులోకి వచ్చిన సభ్యత్వం డబ్బులని అన్నారు. కాకినాడ సిటీ, రూరల్ ఎమ్మెల్యేలు, వారి కుటుంబ సభ్యులపై ఆరోపణలు చేశారు.లోకేశ్ పాదయాత్రకు ప్రజా స్పందనే లేదు. చొల్లంగిపేట నుంచి రెండు గంటలు ఆలస్యంగా ప్రారంభమైన పాదయాత్ర సర్పవరం జంక్షన్ వరకు జరి గింది. సాయంత్రం సర్పవరం జంక్షన్‌లో బహిరంగ సభ జరిగింది. పాదయాత్ర, సభకు ప్రజలు, కార్యకర్తలు అంతంతమాత్రంగానే హాజరయ్యారు.

ఏపీకి జగనే ఎందుకు కావాలంటే.. వివరించే కార్యక్రమంలో భాగంగా..



చిత్తూరులో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద తదితరులు



ప్రకాశం జిల్లా త్రిపురాంతకంలో ప్రభుత్వ పథకాల వివరాల బోర్డును ఆవిష్కరిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్



శ్రీకాకుళం జిల్లా జలుమూరులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్ తదితరులు



ఏలూరు జిల్లా పోలవరంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు బుగ్గా మురళీకృష్ణ తదితరులు

మాటలు కాదు... మీ రాతలతోనే చేటు

పేదల్లో చీలిక తెచ్చి తెలుగుదేశానికి లబ్ధి చేకూర్చేందుకు 'ఈనాడు' ప్రయాస

- అందుకే ఎస్సీలకు అదనంగా ఏం చేశారంటూ కుట్రపూరిత కథనాలు
- దీనిపై ఒకరిద్దరిచేత మాట్లాడించి వికృతానందం పొందుతున్న ఎల్లో మీడియా
- ఎస్సీలకు లబ్ధి విషయంలో బాబు ప్రభుత్వంతో ఇపుడు పోలికే లేదు
- దళితులు శుభ్రంగా ఉండరని, ఎస్సీలుగా పుట్టాలని ఎవరనుకుంటారని అన్నది చంద్రబాబే
- ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లీషు మీడియాన్ని, దళితులకిస్తున్న ఇళ్లను అడ్డుకున్నదీ బాబే
- అప్పట్లో పెన్షన్ కేవలం నెలకు రూ.1,000.. ఇపుడది 3 వేలకు చేరువలో...
- టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎస్సీలకు లబ్ధి రూ.8,844 కోట్లే
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇప్పటివరకు రూ.40,440 కోట్ల ఖర్చు
- ఎస్టీలకు జరిగిన మేలు చూసుకున్నా అప్పటికన్నా ఆరు రెట్లు ఎక్కువ
- ఇవేవీ చెప్పకుండా దిగజారుడు రాతలతో పేదల్లో చీలిక తెచ్చేందుకు రామోజీ కుట్ర



సాక్షి, అమరావతి: ఇదెక్కడి కుట్ర రామోజీ? పేదలంతా వైఎస్ జగన్ పక్షాన నిలుస్తున్నారనే భయంతో వారిలో విభజన తెచ్చేందుకు కులాల పేరిట రెచ్చగొట్టడం అమానుషం కాదూ? ఎస్సీలను రకరకాలుగా తూలనాడి, వారిని కట్టు బానిసల్లా చూసిన చంద్రబాబు నాయుడికి వత్తాసుగా మరీ ఇంతలా దిగజారి రాయాలా? దళితులు శుభ్రంగా ఉండరని.. అసలు దళితుల్లో పుట్టాలని ఎవరైనా ఎందుకు కోరుకుంటారని రకరకాల మాటలు మాట్లాడిన చంద్రబాబును ఎవరైనా మరిచిపోగలరా? పేదల్లో అత్యధికులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలేనని భావించి... వారి కోసం వైఎస్ జగన్ ప్రభుత్వం నెలవారీ పింఛన్‌ను వెయ్యి రూపాయల నుంచి రూ.3వేలకు పెంచుతూ వస్తున్న మాట నిజం కాదా? పింఛన్లు అందుకుంటున్న వారి సంఖ్య ఏ మేరకు పెరిగిందో కనిపించటం లేదా? వైఎస్సార్ చేయూత సహా ఇప్పుడు ఎస్సీలకు, ఇతర పేదలకు అందుతున్న పథకం చంద్రబాబు హయాంలో ఒక్కటైనా ఉందా? అసలు పేదల్ని వారి పేదరికం నుంచి బయటపడేసేందుకు బాబు హయాంలో ఒక్క అడుగైనా పడిందా? ఇపుడు ఆ ప్రయత్నం సంపూర్ణంగా జరుగుతుంటే ఒక్కనాడు కూడా కనీసం ప్రశంసించకుండా... పైపెచ్చు వాళ్లలో విభజన తెస్తూ... మాకు అందరికంటే ఎక్కువేం చేశారు? అని ఒకరిద్దరితో అనిపిస్తూ... అదే దళితుల మాటగా రెచ్చిపోయి మీ ఎల్లో ఛానెళ్లలో ప్రసారం చేస్తూ పైశాచికానందం పొందుతున్న మాట నిజం కాదా? దాన్నే మీరు కూడా అచ్చువేస్తూ అబద్ధాలను నిజం చెయ్యాలనుకుంటే సాధ్యమయ్యే పనే అనుకుంటున్నారా? అసలు ఎస్సీలకు, ఇతర బలహీన వర్గాలకు ఈ ప్రభుత్వ హయాంలో జరిగిన సంక్షేమాన్ని మీరు వేరే ఏ ప్రభుత్వంతోనైనా పోల్చగలరా? ఇంకా ఎన్నాళ్లీ అబద్ధాలు?

దళితులు, బలహీనవర్గాల పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంలో చదువుకుంటే ఓర్వలేరు!. ఇంగ్లిష్ మీడియం ద్వారా మాతృభాషను దెబ్బతీస్తున్నారంటూ పెడబొబ్బలు పెడతారు. మీ పిల్లలు, మీ చంద్రబాబు పిల్లలు మాత్రం ఇంగ్లీషు మీడియంలోనే చదువుతారు. మీ మంత్రులేమో ఇంగ్లీషు మీడియం స్కూళ్లు నడుపుతారు. కానీ బడుగుల పిల్లలకు ఇంగ్లీషు మీడియం వద్దంటూ కోర్టుల్లో మీ వందిమాగధుల చేత పిటిషన్లు వేయించటం నిజం కాదా? ఎందుకంటే బడుగుల పిల్లలు బాగా చదువుకుని మీ పెత్తందార్ల పక్కన దర్జాగా కూర్చుంటారనే కదా మీ భయం?

ఇళ్లు లేని బడుగు, బలహీనవర్గాలకు ప్రభుత్వం ఇంటి స్థలాలు ఇస్తుంటే కోర్టులకు వెళ్లి అడ్డుకున్నది మీరు కాదా? ఒకో ఇంటి ద్వారా దాదాపు రూ.15 లక్షల విలువైన ఆస్తిని సమకూర్చిన ప్రభుత్వాన్ని పేదలంతా నెత్తిన పెట్టుకుంటుంటే మీరు మాత్రం ఇలా విమర్శలు గుప్పిస్తుండటాన్ని ఏమనుకోవాలి? అమరావతిలో మీ పక్కన బడుగు, బలహీనవర్గాల వారుంటే సామాజిక సమతౌల్యం దెబ్బతింటుందని నిస్సిగ్గుగా కోర్టులో చెప్పుకున్నది నిజం కాదా? ఈ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు కల్పిస్తూ బడుగు, బలహీనవర్గాలకు మేలు చేసింది. మీకు కనీసం అలాంటి ఆలోచన కూడా రాలేదు కదా? ఇవేమీ చెయ్యకున్నా చంద్రబాబును దళితుల పాలిట దేవుడిగా ప్రచారం చేస్తున్న మీ పచ్చమీడియాను అసలు నమ్మే వారెవరైనా ఉన్నారా?

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అక్కచెల్లెమ్మల అభ్యున్నతి కోసం అర్హతలున్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం ఏటా రూ.18,750 ఇస్తోంది. బాబు హయాంలో ఇదెప్పుడైనా చూశారా? ఓవైపు ప్రభుత్వం అందిస్తున్న పథకాలతో రాష్ట్రం శ్రీలంకలా ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతోందంటూ గగ్గోలు పెట్టేదీ మరోవైపు చంద్రబాబు ఫ్రీగా బెంజికార్లు ఇస్తామంటుంటే.. అది సాధ్యమేనంటూ డప్పు కొట్టేదీ మీరే. దీన్నేమనుకోవాలి? 'మాటలే స్వీటు.. చేతలు చేటు' అంటూ శుక్రవారం 'ఈనాడు' వండి వార్చిన దుర్మార్గపు కథనంలో అసలు నిజమేదైనా ఉందా? ఇదిగో చూద్దాం...

ఫ్యాక్ట్ చెక్

కుల కార్పొరేషన్ల నిర్వీర్యం ఎక్కడ?

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసిందని ఈనాడు విషం కక్కింది. వాస్తవానికి టీడీపీ హయాంలో ఒకటే కార్పొరేషన్‌గా ఉన్న ఎస్సీ కార్పొరేషన్‌ను జగన్ ప్రభుత్వం మూడు కార్పొరేషన్లుగా మార్చింది. మాల కార్పొరేషన్, మాదిగ కార్పొరేషన్, రెల్లి కార్పొరేషన్‌గా విడదీసింది. వీటిద్వారా ఎస్సీల అభ్యున్నతికి, సంక్షేమానికి పెద్దపీట వేసింది. టీడీపీ హయాంలో ఒకటే కార్పొరేషన్ కాగా... దీనిద్వారా లబ్ధి కలిగింది అతికొద్ది మందికి. కానీ ఇపుడు సంతృప్త స్థాయిలో... అంటే అర్హతలున్న ప్రతి ఒక్కరికీ పథకాలు అందుతున్నాయి. నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే నగదు జమవుతోంది. పచ్చ దండుకు మింగుడు పడనిది ఇదే.

పింఛన్ వ్యయం 227 శాతం అధికం..

చంద్రబాబు ప్రభుత్వం కేవలం 8,66,835 మంది ఎస్సీలకు నెలకు రూ.వెయ్యి చొప్పున మొత్తం రూ.4,415 కోట్లు, 3,01,242 మంది ఎస్టీలకు రూ.1,373 కోట్లు మాత్రమే ఇచ్చింది. వైఎస్ జగన్ ప్రభుత్వం ఇప్పటివరకు 12,15,030 ఎస్సీలు (గత ప్రభుత్వం కంటే 18.41 శాతం ఎక్కువ)కు నెలకు రూ.2,750 చొప్పున మొత్తం రూ.14,418 కోట్లు (గత ప్రభుత్వం కంటే 227 శాతం అధిక మొత్తం) అందించింది. అలాగే ఎస్టీలకు 3,94,753 మంది (గతం కంటే ఆరు శాతం ఎక్కువ)కు రూ.4,694 కోట్లు (గతం కంటే 241 శాతం అధికం) ఇచ్చారు.

దేశంలోనే మొదటి స్థానం

ఎస్సీ కాంపొనెంట్ అమల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే మొదటి స్థానంలో ఉంది. దేశంలోని 20 రాష్ట్రాల్లో ఎస్సీ కాంపొనెంట్ కింద చేసిన ఖర్చు కన్నా ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో చేసిన ఖర్చే అధికంగా ఉండటం విశేషం. ఎస్సీ కాంపొనెంట్ ద్వారా దేశవ్యాప్తంగా 12.41లక్షల స్వయంసహాయక సంఘాలు ఏర్పాటైతే, ఒక్క మన రాష్ట్రంలోనే 8.54 లక్షల సంఘాలు ఏర్పాటయ్యాయి.

భూమి కొనుగోలు పథకం ఎత్తివేసింది ఎవరు?

వాస్తవం: గత టీడీపీ ప్రభుత్వం భూమి కొనుగోలు పథకానికి ఎంతమేర భూమి సేకరించిందనే వివరాలే లేవు. దీన్నిబట్టే ఈ పథకాన్ని ఎవరు ఎత్తేశారో తెలుస్తుంది. దశాబ్దాల క్రితం భూమి కొనుగోలు కోసం ఎస్సీ కార్పొరేషన్ల నుంచి రుణాలు తీసుకున్న ఎస్సీల భూమి తనఖాలో ఉండిపోయింది. వైఎస్ జగన్ ప్రభుత్వం అలాంటి రుణాలన్నింటినీ రద్దుచేసి, వారికి ఆ భూములపై పూర్తి యాజమాన్య హక్కులు కల్పించింది. ఎస్సీల జీవితాల్లో ఇదో మైలురాయి. ఈ ప్రభుత్వ మేలుతో 14,223 దళిత మహిళలకు 16,213 ఎకరాలపై పూర్తి యాజమాన్య హక్కులు లభించాయి. మరో 3,57,085 మంది ఎస్సీలకు, 1,20,477 మంది ఎస్టీలకు సైతం అసైన్డ్ భూములపై పూర్తి హక్కులు లభించాయి. ఇళ్ల స్థలాల పంపిణీ, ఇంటి నిర్మాణాలకు గత ప్రభుత్వం ఒక్క సెంటు భూమిని కూడా కొనలేదు. కానీ ప్రస్తుత ప్రభుత్వం పేదలందరికీ ఇళ్ల పథకం కింద ఎస్సీ, ఎస్టీలకు బాసటగా నిలిచింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం సుమారు 31 లక్షలకుపైగా ఇళ్లపట్టాలు ఇస్తే అందులో 6,36,732 మంది లబ్ధిదారులు ఎస్సీ అక్కచెల్లెమ్మలే. అంటే లబ్ధిదారుల్లో 20.7 శాతం. తద్వారా ఆయా కుటుంబాలకు జగన్ ప్రభుత్వం రూ.10,949 కోట్ల లబ్ధి చేకూర్చింది. అంతేకాకుండా వారి కోసం చేస్తున్న 4,18,646 ఇళ్ల నిర్మాణ రూపంలో మరో రూ.10,949 కోట్ల మేర కూడా లబ్ధి చేకూరుతోంది. ఇక 1,41,496 మంది ఎస్టీ అక్కచెల్లెమ్మలు (మొత్తం లబ్ధిదారుల్లో 4.6 శాతం) ఉన్నా రు. చరిత్రలో ఏ ప్రభుత్వం ఈ స్థాయిలో ఎస్సీ, ఎస్టీలకు అండగా నిలబడలేదు. ఎస్సీలకు 12,816 ఎకరాలు, ఎస్టీలకు 5,978 ఎకరాల అసైన్డ్ భూములపై ఈ ప్రభుత్వం పూర్తి యాజమాన్య హక్కులు కల్పించింది.

హాస్టళ్లకూ నాడు - నేడు..

ఈనాడు తన కథనంలో 'హాస్టళ్లు సంక్షోభ వసతి కేంద్రాలు'గా ఉన్నాయంటూ అబద్ధాలను అచ్చేసింది. వాస్తవానికి రాష్ట్ర విభజన తర్వాత 168 సోషల్ వెల్ఫేర్ స్కూళ్లు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నాయి. వీటికి టీడీపీ ప్రభుత్వం మరో 21 స్కూళ్లను మాత్రమే అదనంగా చేర్చగలిగింది. ఇందులో కూడా 15 స్కూళ్లను 2019 ఎన్నికలకు కేవలం రెండు నెలల ముందు మాత్రమే... అదీ కాగితాలపైనే ప్రకటించింది. ఈ ప్రభుత్వం వచ్చాక సోషల్ వెల్ఫేర్ స్కూళ్లలో మరమ్మతుల కోసం ఇప్పటికే 64.33 కోట్లు ఖర్చు చేసింది. 39 సివిల్ వర్కుల కోసం మరో రూ. . కోట్లు ఖర్చు పెట్టింది. దీంతో ఈ భవనాలన్నీ నిర్వహణలోకి వచ్చాయి. అలాగే 177 స్కూళ్లలో నాడు-నేడు పనులకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసింది, ఇందుకు రూ.318 కోట్లు ఖర్చు చేయనుంది.

నాణ్యమైన విద్య అందుతోంది ఇప్పుడే..

'నాణ్యమైన విద్యకు తిలోదకాలు' ఇచ్చారంటూ ఈనాడు మరో అబద్ధాన్ని పేర్చింది. వాస్తవానికి ఈ ప్రభుత్వం విద్యను అత్యంత ప్రాధాన్యంగా గుర్తించింది. నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను సర్వ సదుపాయాలతో తీర్చిదిద్దింది. జగనన్న విద్యా కానుక, జగనన్న గోరుముద్ద, జగనన్న అమ్మ ఒడి వంటి పథకాలను అందిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ, ఇంగ్లిష్ మీడియంను ప్రవేశపెట్టింది. 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తోంది. ఈ పథకాల వల్ల అత్యధిక శాతం లబ్ధి పొందుతోంది.. బడుగు, బలహీనవర్గాల పిల్లలే. టోఫెల్ లాంటి ఉన్నతాదాయ వర్గాల పిల్లలకే పరిమితమైన వాటిని కూడా ప్రభుత్వం బడుగు, బలహీనవర్గాల పిల్లలకు అందుబాటులోకి తెచ్చింది. ఇటీవలే ప్రభుత్వం సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకాలను ప్రకటించింది. ఈ క్రమంలో మెయిన్స్‌కు అర్హత సాధిస్తే రూ.లక్ష , ఇంటర్వ్యూలకు క్వాలిఫై అయినవారికి అదనంగా రూ.50 వేల చొప్పున ప్రోత్సాహకాలను ప్రకటించింది. పిల్లలంతా బడిలో ఉండాలనే ఏకైక ధ్యేయంతో జగనన్న అమ్మఒడి కింద ఇప్పటివరకు 8,84,131 మంది ఎస్సీ విద్యార్థుల తల్లులకు రూ.15 వేల చొప్పున రూ.5,335.7 కోట్లు అందించింది. అలాగే 2,86,379 ఎస్టీ విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.1,714.75 కోట్లు జమ చేసింది. జగనన్న వసతి దీవెన ద్వారా 5.06 లక్షల మందికిపైగా ఎస్సీ విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.834 కోట్లు నేరుగా వేసింది. 83 వేల మంది ఎస్టీ విద్యార్థుల తల్లుల ఖాత్లాఓ రూ.135. కోట్లను జమ చేసింది. జగనన్న విద్యాదీవెన కింద రూ.5.4 లక్షల మంది ఎస్సీ విద్యార్థుల తల్లులకు రూ.2,081 కోట్లు అందించింది. అలాగే 1.11 లక్షల మంది ఎస్టీ విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.346 కోట్లు జమ చేసింది. ఈ మొత్తాలన్నీ అత్యంత పారదర్శకంగా, ఎలాంటి అవినీతికి చోటు లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే జమయ్యాయి.

స్వయం ఉపాధి పథకాల కింద

- టీడీపీ ప్రభుత్వ హయాంలో 2,02,414 మందికి రూ.2,726 కోట్లు
- ఈ ప్రభుత్వం హయాంలో ఇప్పటివరకు వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత ద్వారా ఎస్సీల్లో 23,17,558 మందికి రూ.7,075.29 కోట్లు. ఎస్టీలకు 4,72,018 మందికి రూ.1,392 కోట్లు లబ్ధి చేకూరింది.
- ఎస్సీ లబ్ధిదారుల స్థిరమైన జీవనోపాధి, ఆర్థిక అభ్యున్నతి కోసం పౌర సరఫరాల సంస్థ ద్వారా 2020-21లో రాష్ట్ర ప్రభుత్వం రూ.133.67 కోట్లతో 2,300 ఫోర్ వీలర్ మినీ ట్రక్ మొబైల్ డిస్పెన్సరీ యూనిట్ వాహనాలను ప్రజా పంపిణీ వ్యవస్థ డోర్ డెలివరీ కోసం అందించింది. జాతీయ ఎస్సీ కులాల ఆర్థికాభివృద్ధి సంస్థ (ఎన్ఎస్ఎఫ్‌డీసీ) ద్వారా స్వయం ఉపాధి పథకం కింద రూ.63.20 కోట్లతో 1,038 యూనిట్లను అమలు చేసింది.

మరింత మెరుగ్గా విదేశీ విద్యా దీవెన

గత ప్రభుత్వం అమలు చేసిన విద్యోన్నతి పథకం రద్దైందని ఈనాడు గగ్గోలు పెట్టింది. కానీ గత ప్రభుత్వం హయాంలో ఈ పథకంలో జరిగిన లోపాలను, అవినీతిని, అక్రమాలను గుర్తించి ఆ స్థానంలో జగనన్న విదేశీ విద్యా దీవెన పథకాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. ప్రతిభ ఉన్న విద్యార్థులందరికీ సమాన అవకాశాలు దక్కేలా, ప్రతిష్టాత్మక కాలేజీల్లో సీటు సాధించిన వారికి పూర్తి స్థాయిలో ఫీజులు చెల్లించేలా పథకాన్ని సమున్నతంగా తీర్చిదిద్ది అమలు చేస్తోంది. 21 కోర్సులలో క్యూఎస్ ర్యాంకింగ్ లేదా టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ర్యాంక్‌ల ప్రకారం టాప్ 50లో నిలిచిన విద్యా సంస్థల్లో ప్రవేశం పొందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు గరిష్టంగా రూ.1.25 కోట్లు లేదా 100 శాతం ట్యూషన్ ఫీజును ప్రభుత్వం చెల్లిస్తోంది. మిగిలిన వర్గాలకు రూ.కోటి లేదా అసలు ట్యూషన్ ఫీజు (ఏది తక్కువ అయితే అది) చెల్లిస్తున్నారు.

	గత ప్రభుత్వం	ప్రస్తుత ప్రభుత్వం
ఎస్సీలకు లబ్ధి	రూ.8,844 కోట్లు	రూ.40,440 కోట్లు
ఎస్టీలకు లబ్ధి	రూ.2,611.3 కోట్లు	రూ.12,257 కోట్లు

బడ్జెట్ వ్యయం (రూ.కోట్లలో)

	టీడీపీ ప్రభుత్వం	వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
ఎస్సీ	33,625.49	61,596.77
ఎస్టీ	12,487.48	19,617.85

బడుగుల అభివృద్ధి కనిపించడంలేదా?

- అంబేడ్కర్ ఆశయాలు నెరవేరుతున్నాయి
- సీఎం జగన్ విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారు
- పేద పిల్లలకు అంతర్జాతీయ విద్య అందిస్తున్నారు
- అనేక కార్యక్రమాలతో బడుగుల అభ్యున్నతికి పాటుపడుతున్నారు
- ఇవేవీ రామోజీరావుకు కనిపించడంలేదు
- దళితులపై రామోజీకి ఉన్నది కపట ప్రేమే
- చంద్రబాబు, రామోజీ ఇద్దరూ దళిత వ్యతిరేకులే
- బాబు నాడు అంబేడ్కర్ విగ్రహాన్ని ముళ్ల పొదలకే పరిమితం చేయాలని చూస్తే
- సీఎం జగన్ నేడు ఆకాశమంత ఎత్తులో అంబేడ్కర్‌ను నిలిపారు
- మంత్రి మేరుగు నాగార్జున ధ్వజం

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రంలో బడుగువర్గాల అభివృద్ధి ఈనాడు రామోజీరావుకు కనిపించడం లేదా అని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున ధ్వజమెత్తారు. రాష్ట్రంలో పరిఢవిల్లుతున్న సామాజిక విప్లవం, నెరవేరుతున్న అంబేడ్కర్ ఆశయాలు వృద్ధ రామోజీరావు కంటికి కనిపించడం లేదని మండిపడ్డారు. దేశంలో మరే రాష్ట్రంలో జరగని విధంగా రాష్ట్రంలో బడుగులు అభివృద్ధి చెందుతున్నారని తెలిపారు. పని గట్టుకుని వైఎస్ జగన్ ప్రభుత్వంపై బురద జల్లుతూ రోత రాతలు రాసే రామోజీకి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఆయన శుక్రవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో



మీడియాతో మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ ఆంధ్రప్రదేశ్ చరిత్రలో సామాజిక విప్లవానికి తెరదీశారని చెప్పారు. అంబేడ్కర్ కోరుకున్న విధంగా విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తూ పరిపాలన చేస్తున్నారన్నారు. నాడు – నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ విద్యా సంస్థలకన్నా మిన్నగా తీర్చిదిద్ది, ఇంగ్లిష్ మీడియం బోధన ప్రవేశపెట్టి పేద కుటుంబాల్లోని పిల్లలకు అంతర్జాతీయ స్థాయి విద్యనందిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులు ఇప్పుడు ఇంగ్లిష్ కూడా అనర్గళంగా మాట్లాడటం రామోజీకి కనిపించడంలేదన్నారు. ఇవేవీ రామోజీకి పట్టవని.., ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను అణగదొక్కిన చంద్రబాబు మాత్రం ఆయనకు చాలా స్వీటుగా కనిపిస్తున్నారని అన్నారు. ఏపీలో దళితులకు అన్యాయం జరుగుతున్నట్లు రామోజీ చూపిస్తున్న కపట ప్రేమ అని, వాస్తవానికి రామోజీ, చంద్రబాబు ఇద్దరూ దళిత వ్యతిరేకులేనని స్పష్టంచేశారు. దళితుల భూముల్ని లాక్కుని ఫిల్మ్‌సిటీ నిర్మించుకుని రూ.లక్షల కోట్ల ఆస్తులు పోగేసుకున్నది రామోజీ రావని అన్నారు. దళితులపై దాడుల్లో దేశంలో నాలుగో స్థానంలో నిలిచిన చరిత్ర చంద్రబాబుదన్నారు. బాబు చేసిన దళిత ఊచకోతలు ఎన్నో ఉన్నాయని చెప్పారు. కారంచేడు, పదిరికుప్పం, చుండూరు, నీరుకొండ ఘటనలన్నీ బాబు హయాంలో ఆయన సామాజికవర్గం చేసిన దాష్టీకాలేనన్నారు. దళితులు బిక్కుబిక్కు మంటూ బతికారని, ఎప్పుడు టీడీపీ ప్రభుత్వం మారుతుందా అని ఎదురుచూశారన్నారు. సీఎం జగన్ అధికారం లోకొచ్చాక దళిత కుటుంబాల స్థితిగతులు మారాయని, ధైర్యంగా బతుకుతున్నారని చెప్పారు. పేదరికం 12 శాతం నుంచి 6 శాతానికి వచ్చిందంటేనే సీఎం జగన్ పాలనా సమర్థత అర్థమవుతుందన్నారు. సీఎం జగన్ ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక కమిషన్ ఉండాల్సిన అవసరాన్ని గుర్తించి ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేశారన్నారు. దళిత క్రైస్తవుల్ని ఎస్సీలు చేసేందుకు తీర్మానం చేసిన చరిత్ర సీఎం జగన్‌దని చెప్పారు.

ప్రపంచం గర్వించేలా అంబేడ్కర్ విగ్రహం

చంద్రబాబు సీఎంగా ఉండగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ముళ్ల పొదలకే పరిమితం చేయాలని చూశారని.., సీఎంగా జగన్ వచ్చాక విజయవాడ నడిబొడ్డున ఆకాశమంత ఎత్తులో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఒకప్పుడు చంద్రబాబు అమ్ముకోవాలని ప్రయత్నించిన అత్యంత ఖరీదైన ప్రాంతంలో ప్రపంచం గర్వించేలా 125 అడుగుల విగ్రహాన్ని రూ.400 కోట్లతో సీఎం జగన్ ఏర్పాటు చేస్తున్నారన్నారు. సీఎం జగన్ అందిస్తున్న సుపరిపాలనను ప్రపంచం యావత్తూ కొనియాడుతుంటే రామోజీరావు మాత్రం ఎందుకు రాయలేకపోతున్నారని ప్రశ్నించారు. బాబును అధికార పీఠంపై కూర్చోబెట్టాలన్న కుతితో రామోజీరావు రోజుకో రీతిగా ప్రభుత్వ పథకాలపై, లబ్ధి పొందుతున్న వర్గాలపై రామోజీ రోత రాతలు రాస్తున్నారన్నారు. ఆయనెంతగా రాసుకుని, గునపాలతో పైకి లేపినా బాబుకు అధికారం కల్లేనని, రామోజీ పిచ్చి కలేనని చెప్పారు. ఇప్పటికైనా నీచమైన రాతలు మానుకోవాలని హితవు చెప్పారు.

టీడీపీతో కలిసి నడవాల్సిందే..

- జనసేన అధినేత పవన్‌కళ్యాణ్

సాక్షి, అమరావతి : టీడీపీతో కలిసి నడవాల్సిందేనని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ తన పార్టీ శ్రేణులకు స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీని ఓడించడమే లక్ష్యంగా మళ్లీ టీడీపీతో కలిసే ముందుకెళుతున్నట్టు చెప్పారు. తాను తీసుకున్న నిర్ణయాలను తప్పుబట్టే నాయకులు తనకు అవసరం లేదన్నారు. రానున్నది జనసేన-టీడీపీ ప్రభుత్వమేనని, అధికారంలోకి రాగానే షణ్ముఖ వ్యూహంలో చెప్పినవన్నీ అమలు చేసి తీరుతామన్నారు. మంగళగిరి పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో పవన్ ప్రసంగించారు. తెలంగాణలో బీజేపీ-జనసేనలు కలిసి పని చేశాయన్నారు. తెలంగాణ ఏర్పడిన పదేళ్ల తర్వాత ఎన్నికల్లో పోటీ చేసినట్టు తెలిపారు. ఏపీలో జనసేనకు ఆరున్నర లక్షల క్యాడర్ ఉందని, పొరుగు రాష్ట్రాల యువత కూడా తమకు మద్దతిస్తోందన్నారు. కార్యకర్తల చిత్తశుద్ధి వల్లే జనసేనకు ఢిల్లీలోనూ గుర్తింపు వచ్చినట్టు చెప్పారు. పార్టీలో చాలా మంది నేటికీ అమరావతిని వ్యతిరేకిస్తూనే ఉన్నారని, పొత్తు విషయంలో అమరావతితో సహా అనేక అంశాలు తెరపైకి వస్తున్నాయని, ఏదైనా సరే ఏకాభిప్రాయంతో పార్టీలో అంతర్గతంగా చర్చించుకోవాలేగానీ పెద్దవి చేసుకోవద్దన్నారు. పొత్తు ధర్మానికి తూట్లు పొడిస్తే రాష్ట్ర భవితకు తూట్లు పొడిచినట్టేనని చెప్పారు. నియోజకవర్గ స్థాయిలో పార్టీ పరిస్థితిపై తనకు పూర్తి నివేదిక ఉందని, త్వరలోనే పార్టీ నాయకులు ఇన్‌చార్జిలతో సమావేశమవుతానన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి తన వెంట నడిచిన వారిని గుర్తుపెట్టుకుంటానని, అధికారంలోకి రాగానే వాళ్లకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని తెలిపారు. ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో తమ నాయకులు వైఎస్సార్‌సీపీతో పోరాడుతున్నారో, లేక మనతోనే పోట్లాడుతున్నారో అర్థంకావడంలేదన్నారు. కొందరు మన పార్టీ వాళ్లే మనకు వెన్ను పోటు పొడవాలని చూసేందుకు ప్రయత్నిస్తున్నారని, అలాంటి వారిని ఉపేక్షించేది లేదన్నారు. సమావేశంలో నాదెండ్ల మనోహర్, పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న చంద్రబాబు

తిరుమల: కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వరస్వామికి తాను ఎల్లప్పుడూ కృతజ్ఞుడినని తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అన్నారు. శుక్రవారం ఉదయం తన భార్య భువనేశ్వరితో కలసి చంద్రబాబు తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్నారు. వైకుంఠం-1 క్యూకాంప్లెక్స్ ద్వారా ఆలయంలో ప్రవేశించిన చంద్రబాబుకు టీటీడీ అధికారులు దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో చంద్రబాబు దంపతులకు వేద పండితులు ఆశీర్వాదం అందించారు. ఆలయ అధికారులు శేష వస్త్రంతో సత్కరించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. దర్శన అనంతరం ఆలయం వెలుపల చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. ధర్మ పరిరక్షణ క్షేత్రమైన తిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం రోడ్డు మార్గం గుండా రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న చంద్రబాబు.. 11.30 గంటల సమయంలో అమరావతికి విమానంలో బయలుదేరి వెళ్లారు.

సాక్షి ఫ్యామిలీ
బెంగళూరు
శనివారం ॥ 2-12-2023

ధన్యత



బట్టల తాత వచ్చాడోచ్

ఒరిస్సాలో ఏదో ఒక ఉదయం ఏదో ఒక మారుమూల పల్లెలో వ్యాన్ ఆగుతుంది. దానిని చూసిన వెంటనే పిల్లల కళ్లల్లో వెలుగు. కటిక దారిద్ర్యం వల్ల చలికాలమైనా వానాకాలమైనా ఒంటి నిండా బట్టలు లేని వారికి గగన్ బట్టలు పంచుతాడు. రిటైర్డ్ ఉద్యోగి అయిన పెయిటల్ గగన్ తన భార్యతో కలిసి ఊరూరా తిరిగి బట్టలు సేకరించి పంచుతాడు. పిల్లల పసినవ్వును ఆశీర్వాదంగా పొందుతాడు.

సంఘటనలు అందరికీ ఎదురవుతుంటాయి. కొందరు స్పందిస్తారు. కొందరు స్పందించరు. కొందరు ఆ సంఘటనలతో తమ లక్ష్యాన్ని, కర్తవ్యాన్ని తెలుసుకుంటారు. అలాంటి వారు ఆదర్శంగా నిలుస్తారు.

పదేళ్ల క్రితం– భువనేశ్వర్‌లో చిన్న పోస్టల్ ఉద్యోగైన గగన్ పెయిటల్ ఇంటికి వెళుతున్నాడు. అతనికి వాణీ విహార్ రైల్వే స్టేషన్ దగ్గర ఒక దిక్కులేని మహిళ కనిపించింది. ఆమె చిరిగిన చీర కట్టుకుని ఉంది. గగన్ ఆమెను చూసి జాలిపడి హోటల్ నుంచి ఫుడ్ ప్యాకెట్ తెచ్చి ఇచ్చాడు. కాని ఆమె 'అన్నం వద్దు. ముందు ఒక చీర ఇవ్వండి' అని ప్రాధేయపడింది. స్త్రీగా ఆమె అవస్థ గమనించిన గగన్ వెంటనే ఇంటికి వెళ్లి తన తల్లి పాత చీర తెచ్చి ఇచ్చాడు. 'దానిని అందుకుంటూ ఆమె ముఖంలో కనిపించిన సంతోషం అంతా ఇంతా కాదు. ఒంటికి తగిన బట్ట ఉంటేనే మనిషికి మర్యాద. అది లేని వారు ఈ దేశంలో ఎందరో ఉన్నారు. వారి కోసం ఏదైనా చేయాలి అని నిశ్చయించుకున్నాను' అంటాడు గగన్. ఉద్యోగంలో ఉండగా మొదలుపెట్టిన ఈ పనిని రిటైరయ్యాక కూడా కొనసాగిస్తున్నాడు.

చిన్న ఉద్యోగి అయినా

పోస్టాఫీసులో చిరుద్యోగిగా పని చేసి రిటైరైన గగన్ భువనేశ్వర్‌లో చకైసియాని ప్రాంతంలో నివసిస్తాడు. కొడుకు మృత్యుంజయ బలిగూడ అనే ఊళ్లో క్యాబ్ డ్రైవర్. కోడలు టీచర్‌గా పని చేస్తున్నది. ఇతర బాదరబందీలు లేని గగన్ తన భార్య అన్నపూర్ణకు తన ఆలోచన చెప్పాడు. 'మనం అందరికీ కొత్త బట్టలు ఇవ్వలేం. అలాగని అన్నేసి పాత బట్టలూ ఉండవు. కాబట్టి సేకరించి పంచుదాం' అన్నాడు. అన్నపూర్ణ అతనికి సహరించడానికి అంగీకరించింది. ఆ రోజు నుంచి గగన్ తనకు ఖాళీ ఉన్నప్పుడల్లా భువనేశ్వర్‌లోని అపార్ట్‌మెంట్లకూ హౌసింగ్ కాలనీలకు తిరిగి వాడిన దుస్తులను సేకరిస్తాడు. అవసరమైతే కటక్ వంటి ఇతర పట్టణాలకు కూడా వెళతాడు. 'పేదలకు పంచుతాం. మీరు ఉపయోగించక పడేసిన దుస్తులు ఇవ్వండి' అంటే చాలా మంది ఇస్తారు. వాటిని తీసుకొస్తాడు గగన్.



● చిన్నారులకు దుస్తులు పంచుతూ...



● భార్యతో కలిసి సేకరించిన దుస్తులను ప్యాక్ చేస్తూ...

సరి చేసి, ఇస్త్రీ చేసి

'మనం బట్టలు పంచినా అవి సరిగ్గా ఉండాలి. మావారు తెచ్చిన బట్టలు ఏవైనా చిరిగి ఉంటే కుట్టి, ఇస్త్రీ చేసి, స్త్రీలవి, పురుషులవి, పిల్లలవి విడివిడిగా ప్యాక్ చేసి కొత్తవిగా కనిపించేలా చేస్తాను' అంటుంది గగన్ భార్య అన్నపూర్ణ. వాళ్లుండేది చిన్న ఇల్లే అయినా ఒక గది ఖాళీ చేసి పూర్తిగా గోడౌన్‌గా వదిలారు. భార్యాభర్తలిద్దరూ డాబా మీదకు చేరి వాటిని విభజించి మూటలుగా కడతారు. ఆ తర్వాత గగన్ తీసుకెళ్లి పంచుతాడు.

బట్టలు, బూట్లు, దోమతెరలు

గగన్ ముఖ్యంగా చిన్నపిల్లల కోసం బట్టలు సేకరిస్తాడు. ఒడిసాలో గిరిజన పిల్లలకు సరైన బట్టలు ఉండవు. కొండ ప్రాంతాలకు వెళ్లి వారి బాగోగులు ఎవరూ చూడరు. గగన్ అలాంటి పిల్లల కోసం బట్టలు సేకరించి పంచుతాడు. గగన్ సేవా భావం గమనించిన దాతలు అతనికో వ్యాన్ ఏర్పాటు చేశారు. గగన్‌కు ఏనుగంత బలం వచ్చింది. తాను సేకరించిన బట్టలను వ్యాన్‌లో వేసుకుని మారుమూల పల్లెలకు వెళ్లి పిల్లలకు పంచుతాడు. దోమలు కుట్టి పసికందులు రోగాల బారిన పడకుండా దోమతెరలు పంచుతాడు. బొమ్మలు ఇస్తాడు. పిల్లలు ఎంతో సంతోషంగా వాటిని స్వీకరిస్తారు. బట్టల తాత అని పిలుస్తారు.

పండుగల ముందు

ఒడిసాలో చేసుకునే పండగల ముందు చాలా శ్రమించి బట్టలు సేకరిస్తాడు గగన్. పేదలు పండగ సమయంలో వీలైనంత మంచి బట్టలు వేసుకోవాలని ఆ సమయాలలో ప్రత్యేకంగా తీసుకెళ్లి పంచుతాడు. అంతేకాదు పూరి జగన్నాథ రథ యాత్ర సమయంలోనూ, కటక్ దుర్గా పూజకూ ఎక్కడెక్కడి పేదవారో వస్తారు. అక్కడ ప్రత్యేకంగా స్టాల్స్ పెట్టి మరీ పాత బట్టలు పంచుతాడు.

ఈ దేశంలో ప్రతి పేదవాళ్లకి ఒంటినిండా బట్ట దొరికే దాకా గగన్ లాంటి వాళ్లు వందలుగా పని చేయాల్సి ఉంటుంది. ఇలాంటి వారుగా ఎవరైనా ఉండొచ్చు. ప్రయత్నించాలి... కొద్దిగా మనసు పెట్టాలి అంతే.

పవర్ లిఫ్టింగ్

మన బలమేంటో మనమే నిరూపించాలి

క్రీడల పట్ల ఆసక్తితోపాటు చదువులోనూ రాణిస్తూ తనని తాను కొత్తగా ఆవిష్కరించుకుంటోంది హైదరాబాద్ వాసి, 28 ఏళ్ల స్ఫూర్తి ఏనుగు. లా చదువుతూ రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడాపోటీల్లోనూ పాల్గొని పతకాలు సాధిస్తోంది. ఇటీవల కిర్గిజ్‌స్థాన్‌లో జరిగిన అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలో పాల్గొని బంగారు పతకాన్ని సాధించింది. ఈ సందర్భంగా పవర్ లిఫ్టర్ స్ఫూర్తి ఏనుగు పంచుకున్న విషయాలు ఇవి...



● స్ఫూర్తి ఏనుగు

“సహజంగా ఇళ్లలో బరువులెత్తే పనులు అమ్మాయిలకు చెప్పరు. అవి, కేవలం అబ్బాయిల పనే అన్నట్టు చూస్తారు. చిన్నప్పటి నుంచి శిక్షణ ఇవ్వడం లేదా టెక్నిక్స్ తెలుసుకుంటే బరువులు ఎత్తడం అమ్మాయిలకూ సులువే. ప్రొఫెషనల్ అవ్వాలన్నా, శారీరక బరువు, మానసిక సమతుల్యత సాధించాలన్నా వెయిట్ మానేజ్‌మెంట్ తెలుసుకోవడం చాలా ముఖ్యం.

ఛాలెంజెస్

అమ్మాయిలకు ఈ రంగంలో ప్రధాన సమస్య నెలసరి సమస్య. అది ఫేస్ చేయాల్సి వస్తుంది. ప్రతిసారి ఒకే బరువును మోయలేం. శక్తిలోనూ మార్పులు వస్తుంటాయి. ఇందుకు తీసుకునే ఆహారం అబ్బాయిలతో పోల్చితే భిన్నంగా ఉంటుంది. బరువులు ఎత్తే సమయంలో కండరాలు పట్టేస్తుంటాయి. దెబ్బలు తగులుతుంటాయి. జాయింట్స్ దగ్గర సమస్యలు వస్తుంటాయి. బరువులు ఎత్తే సమయంలో ఊపిరిలో తేడాలు వస్తుంటాయి. కానీ, వీటన్నింటినీ సాధనతో అధిగమిస్తుంటాను. మంచి ఆహారం, సరైన నిద్రాసమయం, స్ట్రెస్ లెవల్స్ అన్నింటినీ బ్యాలెన్స్ చేసుకోవడానికి ప్రతిరోజూ ప్రయత్నిస్తుంటాను. ఈ విషయంలో మా అమ్మ సాధన, నాన్న రామారావు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు.

బరువును బ్యాలెన్స్ చేసుకోవడానికి...

సెకండ్ క్లాస్ నుంచి స్పోర్ట్స్‌లో ప్రవేశం ఉంది. డిస్క్ త్రో, జావలిన్ త్రో వంటి క్రీడల్లో పతకాలు సాధించాను. రెండేళ్ల నుంచి వెయిట్‌లిఫ్టింగ్ ప్రాక్టీస్ చేస్తున్నాను. కరోనా టైమ్‌లో బరువు పెరిగాను. పది కేజీల బరువు తగ్గాలనుకున్నాను. అందుకు డైట్‌లో మార్పులు చేసుకోవడానికి బదులు నాకు ఎలాగూ స్పోర్ట్స్ అంటే ఇష్టం కాబట్టి, బరువు తగ్గడానికి వెయిట్‌లిఫ్టింగ్ సాధన చేశాను. ప్రాక్టీస్ చేసేటప్పుడు మనల్ని మనం ఎలా క్రమశిక్షణగా మలచుకోవాలో నిపుణుల ఆధ్వర్యంలో తెలిసిపోతుంది. అందుకు అనుగుణంగా సరైన దినచర్యను అమలు చేసుకుంటూ, విజయం దిశగా నా ప్రయాణాన్ని కొనసాగిస్తున్నాను.

ఆలోచనలో మార్పు..

అమ్మాయిలు చిన్నప్పటి నుంచే క్రీడలను ప్రాక్టీస్ చేస్తూ ఉంటే వారు ఎంచుకున్న రంగంలోనూ చాలా బాగా దూసుకుపోగలరు. ఇంట్లో వాటర్ క్యాన్స్, గ్యాస్ సిలిండర్, సోఫా.. వంటి బరువులు ఎత్తడంలో కూడా టెక్నిక్స్ ఉంటాయి. సాధారణంగా అమ్మాయిలు కూడా 50–60 కేజీల బరువు ఎత్తగలరు. కానీ, టెక్నిక్స్ తెలియకుండా ఎత్తి, నొప్పితో బాధపడుతుంటారు. దీంతో అమ్మాయిలు వెయిట్ లిఫ్టింగ్ చేయలేరు అనే అభిప్రాయం మనలో చాలా మందిలో పాతుకుపోయి ఉంది. మన ఆలోచనలో మార్పు రావాలంటే తల్లిదండ్రులు కూడా చిన్నప్పటి నుంచే స్పోర్ట్స్ దిశగా అమ్మాయిలను ప్రోత్సహించాలి.

క్రీడలతోపాటు ...

చదువునూ బ్యాలెన్స్ చేసుకోవాలి. ఎంబీయే పూర్తి చేశాను. సివిల్ సర్వీసెస్ కోసం ప్రిపేర్ అవుతూనే స్పోర్ట్స్‌లో సాధన చేస్తూ వచ్చాను. ఇప్పుడు లా చదువుతున్నాను. రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లోనే కాదు, కిందటి నెలలో కిర్గిజ్‌స్థాన్‌లో జరిగిన ఏడబ్ల్యూసీ ఓపెన్ వరల్డ్ కప్‌లో పాల్గొని బంగారు పతకాన్ని సాధించాను. మా అమ్మానాన్నల ప్రోత్సాహంతో పాటు కోచ్ ఇచ్చే గైడెన్స్ ఎంతగానో తోడ్పడుతున్నాయి. మరిన్ని పోటీలు, అవకాశాలను అందిపుచ్చుకోవడానికి సిద్ధంగా ఉన్నాను. ప్రతిచోటా ఎన్నో సవాళ్లు ఉంటాయి. వాటిని దృఢ సంకల్పంతో, పట్టుదలతో ఎదుర్కొన్నవారే విజేతలవుతారు. 'వెయిట్ లిఫ్టింగ్ అంటే అబ్బాయిలదే. అమ్మాయిలకు ఏం సాధ్యమవుతుంది, సూటవదు' అనే మాట ఇప్పటికీ ఈ రంగంలో మొదటగా వినిపిస్తుంది. కానీ, మనల్ని మనం గెలిచి చూపినప్పుడు అమ్మాయిలుగా మన బలం ఏంటో కూడా ప్రపంచానికి తెలుస్తుంది” అని వివరిస్తుంది స్ఫూర్తి.

– నిర్మలారెడ్డి

బ్యూటిప్స్

సహజ సిద్ధమైన మాయిశ్చరైజర్



● కొబ్బరినూనె మంచి సౌందర్య సాధనంగా పనిచేస్తుంది. సెలబ్రిటీలు చాలామంది తమ చర్మాన్ని అందంగా... ఆరోగ్యంగా ఉంచుకునేందుకు కొబ్బరి నూనెను విరివిగా వాడుతుంటారు. కొబ్బరినూనెలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలు పొడి చర్మానికి ఔషధంలా పనిచేస్తాయి. కొబ్బరినూనె చర్మానికి సహజసిద్ధమైన మాయిశ్చరైజర్‌గా పనిచేస్తుంది.

● టీ స్పూను కొబ్బరినూనెలో అర టీ స్పూను పెరుగు, టీస్పూను ఓట్స్ పొడి వేసి మెత్తని పేస్టులా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పూతలా వేసి పదిహేను నిమిషాలపాటు ఆరనివ్వాలి. పూర్తిగా ఆరాక గుండ్రంగా మర్దన చేస్తూ గోరువెచ్చని నీటితో కడిగేయాలి. వారానికి రెండు సార్లు ఈ ప్యాక్ వేసుకోవడం వల్ల ముఖ చర్మానికి తేమ అంది ఆరోగ్యంగా, ఆకర్షణీయంగా కనిపిస్తుంది.

● రెండు టీస్పూన్ల కొబ్బరినూనెలో కొద్దిగా నిమ్మరసం, టీస్పూను వంటసోడా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముక్కు, గడ్డం, నుదురు వంటి బ్లాక్‌హెడ్స్ ఎక్కువగా ఉండే ప్రాంతంలో పట్టించి పది నిమిషాల తరువాత నీటితో కడిగేయాలి. ఈ ప్యాక్ బ్లాక్‌హెడ్స్‌ను తొలగించడమేగాక, చర్మాన్ని లోతుగా శుభ్రం చేస్తుంది. ఫలితంగా చర్మరంధ్రాల్లో పేరుకున్న అధిక జిడ్డు, దుమ్మూ ధూళీ పోయి చర్మం చక్కని నిగారింపుని సంతరించుకుంటుంది.

● ముఖం మీద నల్లమచ్చలు, కంటి చుట్టూ ఏర్పడిన నల్లని వలయాలపై కొబ్బరినూనెతో క్రమం తప్పకుండా మర్దన చేస్తుంటే .. మచ్చలు తగ్గు ముఖం పడతాయి.

పురస్కారం

వీఆర్ అంటే విజయ సంకేతం



● వీఆర్ లలితాంబిక

ఉద్యోగంలో చేరిన తొలి రోజుల్లో 'ఫెయిల్యూర్' ఎదురొచ్చి భయపెట్టాలని చూసింది. 'అంతా గందరగోళం' అన్నట్లుగా ఉండేది పరిస్థితి. సందేహం వచ్చినప్పుడు ఎవరిని అడిగితే ఏమనుకుంటారో అనే భయం ఉండేది. అయినా సరే... 'ఇస్రో' రహదారిలో లలితాంబిక ఎక్కడా తన ప్రయాణాన్ని ఆపలేదు. అడుగడుగునా పాఠం నేర్చుకుంది. సుదీర్ఘ ప్రయాణంలో ఇస్రో టాప్ ఇంజనీర్‌లలో ఒకరిగా ఎదిగింది. తాజాగా... అత్యున్నత ఫ్రెంచ్ పౌర పురస్కారం 'ది లెజియన్ డి ఆనర్ ఆఫ్ ఫ్రాన్స్'ను అందుకుంది వీఆర్ లలితాంబిక...

కేరళలోని తిరువనంతపురంలో జన్మించింది లలితాంబిక. తండ్రితో సహా చుట్టాలలో ఎక్కువమంది ఇంజనీర్‌లు. గణితశాస్త్రంలో దిట్టగా పేరున్న తాత వల్ల లలితకు శాస్త్రీయ విషయాలపై ఆసక్తి మొదలైంది. ఆ ఆసక్తే ఇస్రో వరకు తీసుకువెళ్లింది.

చదువు పూర్తికాగానే పెద్దలు పెళ్లి ఫిక్స్ చేశారు. పెళ్లి తరువాత కూడా చదువుకు విరామం ఇవ్వలేదు లలిత. ఎంటెక్ చేస్తున్న కాలంలో ఆమెకు కూతురు జన్మించింది. కాలేజీకి విరామం ఇచ్చినప్పటికి స్నేహితురాలు తెచ్చి ఇచ్చిన క్లాసులకు నోట్స్ ఇంట్లోనే చదువుకునేది. 1998లో తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌లో చేరింది.

కొద్దిరోజుల్లోనే తాను పనిచేస్తున్న ఏరియాలో కంట్రోల్ సిస్టమ్‌కు సంబంధించిన సాఫ్ట్‌వేర్ ఎర్రర్ వల్ల ఫెయిల్యూర్ ఎదురైంది.

'ఆ రోజుల్లో ప్రతిదీ కొత్తగానే అనిపించేది. ప్రతిరోజూ ఒక సవాలుగానే ఉండేది. ఒక సమస్యకు సంబంధించి పరిష్కారాన్ని అన్వేషించడానికి, అధ్యయనం చేయడానికి అవసరమైన పుస్తకాలు ఉండేవి కాదు. సీనియర్‌లను అడగాలంటే భయంగా ఉండేది. ఆత్మస్థైర్యం అంతంత మాత్రంగానే ఉండేది' అని గతాన్ని గుర్తు చేసుకుంది లలిత.

పీఎస్‌ఎల్‌వీ ప్రాజెక్ట్‌లో పనిచేస్తున్నప్పుడు లలిత యంగ్ మదర్.

ఒకవైపు... ఏ టైమ్‌కు ఇంటికి వెళతారో తెలియనంత ఊపిరి సలపని పని.

మరోవైపు... పని విరామంలో పదే పదే గుర్తుకు వచ్చే బిడ్డ.

1993లో పీఎస్‌ఎల్‌వీ లాంచ్ ఫెయిల్ అయింది. అదే సంవత్సరం రెండో ప్రయత్నానికి సంబంధించిన షెడ్యూల్ వచ్చింది. పని ఒత్తిడి మరింత పెరిగింది. అలాంటి క్లిష్టమైన కీలక సమయంలోనూ ఎప్పుడూ 'ఇక చాలు. ఈ ఉద్యోగం చేయడం మన వల్ల కాదు' అనుకోలేదు. 'ఇంకా నేర్చుకోవాల్సింది చాలా ఉంది' అని మాత్రమే అనుకుంది.

'ఆ సమయంలో జరిగిన తప్పుల నుంచి పాఠాలు నేర్చుకున్నాం. తప్పులు పునరావృతం కాకుండా చూసుకున్నాం. తప్పుల నుంచి నేర్చుకోవడం అనేది ఇస్రో సంస్కృతిలో ఒకటి' అంటుంది లలిత.

సెకండ్ పీఎస్‌ఎల్‌వీ లాంచ్ సక్సెస్‌కు సంబంధించిన ఆనందం లలితకు ఆత్మస్థైర్యం, అంతులేని ఉత్సాహాన్ని ఇచ్చింది.

'పీఎస్‌ఎల్‌వీలో ఆటోపైలట్ సిస్టమ్ విభాగంలో చాలాకాలం నుంచి ఉన్నాను. లాంచ్ రోజులు ఉత్కంఠభరితమైనవి. అదే సమయంలో సంతోషం రూపంలో ఆత్మస్థైర్యాన్ని రెట్టింపు చేసేవి. ప్రతి ఫెయిల్యూర్ కొత్త పాఠం నేర్పేది. ప్రతి సక్సెస్ కొత్త శక్తిని ఇచ్చేది' అంటుంది లలిత.

'మీ విజయరహస్యం?' అనే ప్రశ్నకు లలిత చెప్పే మాట...

'ఫ్యామిలీ సపోర్ట్'

'లాంచ్‌కు సంబంధించిన రోజుల్లో పనే లోకంగా ఉండేవాళ్లం. ఏ టైమ్‌కు ఇంటికి చేరుతామో తెలియదు. ఇలాంటి సమయంలోనూ నాకు కుటుంబ మద్దతు రూపంలో ప్రోత్సాహం, బలం లభించాయి. వ్యక్తిగత త్యాగాలను కూడా ఇష్టపూర్వకంగా చేసే రోజులు అవి. స్త్రీ, పురుషులను వేరు వేరుగా చూడడం అనే సంస్కృతి ఇస్రోలో కనిపించేది కాదు. ఎవరైనా ఒక్కటే అన్నట్లుగానే ఉండేది. మహిళా ఉద్యోగుల భద్రతకు ప్రాధాన్యత ఇచ్చేవారు' అంటుంది లలిత.

ఫ్రెంచ్ అత్యున్నత పౌర పురస్కారం విషయానికి వస్తే...

ఫ్రాన్సు, మన దేశం మధ్య అంతరిక్ష సహకారాన్ని పెంపొందించడంలో చేసిన విశేష కృషికి ఇస్రోలో డైరెక్టరేట్ ఆఫ్ హ్యూమన్ స్పేస్ ఫ్లైట్ ప్రోగామ్ మాజీ డైరెక్టర్ అయిన వీఆర్ లలితాంబికను ఫ్రెంచ్ అత్యున్నత పౌరపురస్కారంతో సత్కరించారు. ఫ్రాన్స్ ప్రభుత్వం తరపున మన దేశంలోని ఫ్రాన్స్ రాయబారి మాథ్యూ నుంచి ఈ అవార్డ్ అందుకుంది లలిత.

'అంతరిక్ష సాంకేతికతలో విశిష్ట శాస్త్రవేత్త' అని మాథ్యూ లలితాంబికను కొనియాడారు.

'ఈ గౌరవం మరింత మంది మహిళలు స్టెమ్ రంగాలలోకి రావడానికి, విజయాలు సాధించడానికి స్ఫూర్తిగా నిలుస్తుంది' అంటుంది వీఆర్ లలితాంబిక.



● ఫ్రెంచ్ పౌర పురస్కారం అందుకుంటూ...

ఉత్కర్షిణి కిచెన్

ఆకలి తీర్చే అమ్మ



● బిందు రమాకాంత్

ప్రేమను పంచడంలో అమ్మ తర్వాతే ఎవరైనా! కొంతమంది తల్లులు తమ పిల్లల్లాగే... ఇతరులను సైతం ప్రేమగా చూసుకుంటుంటారు. కడుపున జన్మించకపోయినప్పటికీ ఆ తల్లి చూపే ప్రేమాభిమానాలకు అమ్మ అని ఆప్యాయంగా పిలుస్తుంటారు. ఈ కోవకు చెందిన వారే బిందు రమాకాంత్ ఘట్‌పాండే. బిందుని తన పిల్లలేగాక, వేలాది మంది 'అమ్మ' అని అప్యాయంగా పిలుస్తున్నారు. ఆకలితో అలమటిస్తున్న వారికి కడుపునిండా భోజనం పెడుతూ ఎందరికో అమ్మగా మారింది బిందు రమాకాంత్ ఘట్‌పాండే. అంతమందికి అమ్మగా మారిన బిందు గురించి ఆమె మాటల్లోనే....

“రాజస్థాన్‌లోని ఝుంఝునులో పుట్టాను. ముగ్గురు అక్కచెల్లెళ్లు, నలుగురు అన్నదమ్ములు ఉన్న పెద్ద కుటుంబం మాది. నాన్న అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేసేవారు. ఉద్యోగరీత్యా ప్రతి రెండేళ్లకోసారి నాన్నకు బదిలీలు జరిగేవి. దీంతో చాలా భాషలు పరిచయం అయ్యాయి. పంజాబీ, హిందీ, బెంగాలీ, మరాఠీ భాషలు చక్కగా మాట్లాడగలను. నా పెళ్లి అయిన తరువాత మా ఆయనతో కలిసి భోపాల్‌లో స్థిరపడ్డాను. నాకు ఇద్దరు పిల్లలు. మా అబ్బాయి కోల్‌కతా ఐఐఎమ్ టాపర్. అమ్మాయి దుబాయ్‌లో రేడియో జాకీ. యాంకర్‌గా పనిచేస్తోంది. పిల్లల బాధ్యతలు తీరాక నాకు చాలా ఖాళీ సమయం దొరికింది. ఈ సమయంలో సమాజానికి ఏదైనా మంచి చేయాలనిపించింది. ఏం చేయాలా... అని ఆలోచిస్తున్న సమయంలో ఒక రోజు టీవీలో 'గ్రాండ్ మదర్స్ కిచెన్' గురించి చూశాను. అప్పుడే నాకు కూడా ఆకలితో అలమటించే వారికి అన్నం పెట్టాలన్న ఆలోచన వచ్చింది. మా ఆయనకు చెప్పాను. దానికి ఆయన ఒప్పుకున్నారు. వెంటనే ఇంట్లో భోజనం తయారు చేసి కారులో పెట్టుకుని రోడ్డుమీదకు ఆకలితో ఉన్న వారు కనిపిస్తే వారికి భోజనం పార్శిల్ ఇచ్చేదాన్ని. వాళ్లు తిన్న తరవాత చెప్పే కృతజ్ఞతలతో నాకు కడుపు నిండిపోయేది. అలాగే ఉదయాన్నే పాతిక లీటర్ల గంజి తయారు చేసి వీధికుక్కలకు పోసేదాన్ని. ఆ తరువాత 'ఉత్కర్షిణి' పేరిట కిచెన్‌ను ఏర్పాటు చేశాను. ప్రస్తుతం ఈ ఉత్కర్షిణి వందలాది మంది ఆకలి తీరుస్తోంది.

రోజుకో మెను...

కిచెన్‌లో ఎంతో పరిశుభ్రంగా భోజనం వండిస్తాను. తయారీ అంతా నా పర్యవేక్షణలో జరుగుతుంది. రోజుకొక మెను పెడుతున్నాను. ఒక రోజు పప్పు, కూరలు, అన్నం పెడితే.. మరుసటిరోజు రాజ్మా, అన్నం, ఇంకోరోజు పూరీ, కూరలతో వడ్డిస్తున్నాం. పప్పు, అన్నం అయితే ప్లేటు ఐదు రూపాయలకు, రసగుల్లా, హల్వా పూరీ ఉన్న రోజు ప్లేటు ఇరవై రూపాయలకు విక్రయిస్తున్నాం. మా భోజనం తినేవారి సంఖ్య పెరగడం... “భోజనం బావుంది, కానీ స్వీట్ ఉంటే బావుంటుంది” అని కస్టమర్లు చెప్పడంతో తొలుత హల్వా పెట్టడం మొదలుపెట్టాము. ఇప్పుడు రసగుల్లా కూడా పెడుతున్నాం.



● సహాయకులతో బిందు



ఆకలి తీరడానికి మాత్రమే...

ఉత్కర్షిణి కిచెన్‌లో తయారైన భోజనానికి ఎలాంటి నిబంధనలు లేవు. నిరుపేదల నుంచి ఎవరైనా తినవచ్చు. మా భోజనం తినేవారిలో పారిశుధ్య కార్మికులు, రిక్షా నడిపేవాళ్లు, నర్సులు, డాక్టర్లు, విద్యార్థులు ఉన్నారు. వీరిలో ఎవరికి ఆకలి వేసినా తిని వెళ్లాల్సిందే తప్ప.. ఇంటికి ప్యాక్ చేసి ఇవ్వడం లేదు. ఆసుపత్రికి వచ్చే రోగులు మందులు వేసుకునే ముందు ఏదైనా తినాలని చెప్పి సమోసా, బిస్కెట్లు తింటుంటారు. ఇవి ఆరోగ్యానికి మంచిది కాదు. అందుకే వీరు సైతం తినేలా మా కిచెన్ ఆహార పదార్థాలు అందిస్తోంది.

అలా వందలమందికి..

నేను పెడుతోన్న భోజనానికి డిమాండ్ పెరగడంతో వంటవాళ్లను పెట్టుకుని వండించడం మొదలుపెట్టాను. ప్రస్తుతం ఆసుపత్రి, దానిపక్కన స్టూడెంట్ క్యాంపస్ ఉంది. అక్కడ భోజనం ప్లేటు ఐదు రూపాయలకు ఇస్తున్నాను. చాలామంది విద్యార్థులు వచ్చి తింటున్నారు. అలా నా దగ్గర భోజనం చేయడానికి వచ్చేవారు నన్ను “అమ్మ లేదా మా” అని పిలుస్తుంటే ఎంతో సంతోషంగా ఉంది. ప్రస్తుతం మా ఉత్కర్షిణి కిచెన్ కుటుంబం రోజురోజుకి పెరిగిపోతోంది. అందుకే త్వరలో భోపాల్‌లోని ఇతర ప్రాంతాలకు కూడా నా సేవలను విస్తరించబోతున్నాను. మరింత మంది ఆకలి తీర్చడమే నా లక్ష్యం” అని చెప్పింది బిందు రమాకాంత్ ఘట్‌పాండే

స్మార్ట్‌గా మాన్పించండి



ప్రస్తుత కాలంలో ఎవరింట చూసినా పిల్లల చేతిలో స్మార్ట్‌ఫోన్లు, టాబ్లెట్లు, ఐపాడ్లు ఉండవలసిందే! స్మార్ట్‌ఫోన్లు అధికంగా వాడుతున్న పిల్లలు కదలకుండా ఒకేచోట కూర్చొని ఉంటారు. దీనివల్ల వారు చిన్న వయసులోనే ఊబకాయం బారిన పడే అవకాశం ఉంది. అంతేకాదు ఫోన్ లేదా టీవీ చూస్తూ ఉంటే కాస్త ఎక్కువే తినేస్తారు. దీనివల్ల భవిష్యత్తులో ఊబకాయం, మధుమేహం, కీళ్ల సమస్యలు, గుండె జబ్బులు వంటి వాటి బారిన పడే ప్రమాదం పెరిగిపోతుంది. వీటన్నింటి నుంచి రక్షించాలంటే పిల్లలు స్మార్ట్‌ఫోన్ వాడకుండా చేయాలి. అదెలాగో చూద్దాం.

పిల్లల మనసు అద్దం లాంటిది. తల్లిదండ్రులు, ఇంట్లో ఉన్న ఇతర పెద్దలు ఏం చేస్తున్నారో చూసి అదే అలవాటు చేసుకుంటారు. కాబట్టి ఇంట్లో ఉన్న సమయంలో తల్లిదండ్రులు, ఇతర పెద్దలూ స్మార్ట్‌ఫోన్, లాప్‌టాప్ వంటివి చూడకూడదని గుర్తుంచుకోండి.

పిల్లలకు ఫోన్ చూస్తూ తినే అలవాటు ఉంటే, వాళ్లకు ఆకలిగా ఉన్నప్పుడే అన్నం పెట్టండి. ఎందుకంటే ఆకలితో ఉన్నప్పుడు అల్లరి చేయరు. మొబైల్ గురించి ఆలోచించరు. తిండి పైనే ధ్యాస పెడతారు.

మొబైల్ లేకుండా ఐదు నిమిషాల పాటు వారికి ఆహారం పెట్టడానికి ప్రయత్నించండి. పేచీ పెట్టకుండా సరిగ్గా తింటే, ఈ సమయాన్ని పెంచవచ్చు.

పిల్లలకు తినిపించేటప్పుడు వాళ్లతో మాట్లాడుతూ ఉండండి. వంటకాలు ఎలా ఉన్నాయో అడగండి. నవ్వుతూ... కబుర్లు చెబుతూ, జోకులేస్తూ, సరదాగా గడిపితే మొబైల్ ఫోన్ చూపించి తిండి పెట్టాల్సిన అవసరం ఉండదు.

చిన్నప్పటినుంచి పిల్లలకు పుస్తక పఠనం అలవాటు చేయాలి. ముందు బొమ్మల పుస్తకాలతో మొదలు పెట్టండి. ఆ తర్వాత పజిల్స్ పూర్తి చేయడం, కథల పుస్తకాలు, వార్తా పత్రికలలో పిల్లలకోసం కేటాయించే కథనాలను చదవడం అలవాటు చేయడం వల్ల వారి దృష్టి స్మార్ట్‌ఫోన్ పైకి మళ్లదు.

పిల్లలకు బాల్యం నుంచి చుట్టుపక్కల పిల్లలతో ఆటలు ఆడటం అలవాటు చేయాలి. వారి వయసు పిల్లలు లేకపోతే మీరే వారితో ఆడుకోండి. కాసేపు ఔట్‌డోర్ ఆటలు, కాసేపు చెస్, క్యారమ్స్ వంటివి ఆడటం అలవాటు చేస్తే స్మార్ట్‌ఫోన్ బారిన పడకుండా స్మార్ట్‌గా తయారవుతారు.

ఆ బద్ధకాన్ని వదిలించుకోండిలా...



చాలామంది పైకి చెప్పుకోలేరు కానీ ఈ రోజుల్లో చాలామందిని వేధించే సమస్యలలో మలబద్ధకం కూడా ఒకటి. చిత్రం ఏమిటంటే, దానిని అసలు ఒక సమస్యగా కూడా గుర్తించకపోవడం! మలబద్ధకాన్ని సీరియస్‌గా తీసుకోకపోతే మాత్రం శరీరంలో అనేక అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. దీర్ఘకాల మలబద్ధకం వల్ల కిడ్నీ సమస్యలు, జీర్ణవ్యవస్థ సమస్యలు, పైల్స్, తలనొప్పి, గ్యాస్, ఆకలి లేకపోవడం, బలహీనత, వికారం, ముఖం మీద మొటిమలు, నల్ల మచ్చలు వంటి సమస్యలు మొదలవుతాయి. అందువల్ల రోజువారీ మన అలవాట్లలో కొన్ని మార్పులు చేసుకుంటూ డైట్‌లో కొన్ని ఆహార పదార్థాలు చేర్చుకుంటే.. మలబద్ధకం సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు.

మలబద్ధకంతో బాధపడే వారికి కడుపులో అసౌకర్యంగా... ఇబ్బందిగా ఉంటుంది. మల ద్వారం కోసుకుపోవడం, రక్తస్రావం వంటి సమస్యలు ఎదురవుతాయి. కదలకుండా కూర్చునే జీవనశైలి, అస్తవ్యస్తమైన ఆహారపు అలవాట్లు, జంక్ ఫుడ్, వేపుళ్లు, ప్రాసెస్డ్ ఫుడ్, తగినన్ని నీరు తాగకపోవడం, ఫైబర్ ఎక్కువగా తీసుకోకపోవడం, శారీరక శ్రమ లేకపోవడం, బలహీనమైన జీవక్రియలు, రాత్రిళ్లు ఆలస్యంగా తినడం లేదా అసలే తినకపోవడం వంటి కారణాల వల్ల మలబద్ధకం వచ్చే అవకాశం ఉంది. ఇది దీర్ఘకాలం ఉంటే.. కిడ్నీ సమస్యలు, జీర్ణవ్యవస్థ సమస్యలు, పైల్స్, తలనొప్పి, గ్యాస్, ఆకలి లేకపోవడం, బలహీనత, వికారం, ముఖం మీద మొటిమలు, నల్ల మచ్చలు వంటి సమస్యలు మొదలవుతాయి. దీనిని నివారించడానికి ఎన్నో చికిత్సలు, ఔషధాలు ఉన్నాయి. మీ డైట్‌లో కొన్ని ఆహార పదార్థాలు చేర్చుకుంటే.. మలబద్ధకం నుంచి ఉపశమనం పొందవచ్చు. అవేంటో తెలుసుకుందాం.



■ ఆహారంలో మెంతులు

మలబద్ధకం సమస్య ఉంటే.. చెంచాడు మెంతులను రాత్రంతా నానబెట్టి, ఉదయాన్నే తినండి లేదంటే పడుకునే ముందు గోరువెచ్చని నీటిలో చెంచాడు మెంతిపొడిని కలుపుకుని తాగడం వల్ల తెల్లారేసరికి సుఖ విరేచనం అవుతుంది.



■ పండ్లు, కూరగాయలు

ఉదయానే టిఫిన్ చేసిన తర్వాత, మధ్యాహ్నం భోజనానికి ముందు, సాయంత్రం మీకు ఇష్టమైన కూరగాయలతో చేసిన గ్లాసుడు వెజిటబుల్ జ్యూస్ తీసుకోవడం వల్ల మలబద్ధకం బారిన పడకుండా ఉంటారు. బచ్చలికూర, టొమాటో, బీట్‌రూట్, నిమ్మరసం, అల్లం కలిపి జ్యూస్‌ను తయారు చేసుకుని తాగడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. తాజాపండ్లు ముఖ్యంగా బొప్పాయి పండు తినడం మంచిది.



■ సబ్జానీళ్లు

మలబద్ధకంతో బాధపడేవారు రోజూ ఉదయం నానబెట్టిన సబ్జా గింజలను చెంచాడు ఖాళీ కడుపుతో తీసుకుంటే సమస్య తగ్గుముఖం పడుతుంది. నానబెట్టిన బాదం పప్పులు, వాల్‌నట్, ఎండు ద్రాక్షలను తీసుకున్నా మంచిది.



■ అంజీర్

అంజీర్‌లో విటమిన్ బీ6 పుష్కలంగా ఉంటుంది. ఇందులో కరిగే ఫైబర్ ఉంటుంది. ఇది జీర్ణక్రియను సులభతరం చేస్తుంది, మలబద్ధకాన్ని నివారిస్తుంది. రాత్రిపూట నానబెట్టిన అంజీర పండ్లను ప్రతిరోజూ ఉదయం తీసుకుంటే మలబద్ధకం సమస్య తగ్గుతుంది. అంజీర్ పేగు కదలికలను సులభతరం చేస్తుంది.



■ బొప్పాయి

ప్రతి రోజూ ఉదయం 11 గంటల ప్రాంతంలో, భోజనానికి ముందు కప్పుడు బొప్పాయి ముక్కలు తీసుకుంటే మంచిది. అలాగే జామపండు ముక్కలు, దోసబద్దలు తీసుకున్నా మంచిదే. భోజనానికి అరగంట ముందు గ్లాసు మజ్జిగ, అర స్పూన్ అవిసెగింజలు తీసుకుంటే మలబద్ధకం తగ్గుతుంది.



■ ఓట్స్

ఓట్స్‌లో బీటా–గ్లూకాన్స్ పుష్కలంగా ఉంటాయి. ఇది కరిగే ఫైబర్, ఇది కడుపు పనితీరును ప్రోత్సహిస్తుంది. ఓట్స్ ప్రేగులలో మంచి బ్యాక్టీరియాను పెంచడంలో కూడా సహాయపడతాయి. ఓట్స్ పేగుల పనితీరును ప్రోత్సహించడంలో, మెరుగుపరచడంలో సహాయపడుతుంది. దీంతో మలబద్ధకం సమస్య త్వరగా తగ్గుతుంది.



■ నెయ్యి

నెయ్యికి ఉండే.. సహజమైన జిడ్డు తత్వం పేగుల కదలికలను వేగవంతం చేస్తుంది. రోజూ ఆహారంలో నెయ్యి వేసుకుని తింటే మలబద్ధకం నుంచి విముక్తి పొందచ్చు.

జామపండ్లు, దోసకాయ, కాకరకాయ, చిక్కుళ్లు మలబద్ధకాన్ని నివారించడంలో ముందుంటాయి కాబట్టి అవి ఆహారంలో ఉండేలా చూసుకుంటే మంచిది.

చలిలోనూ కురులు నిగనిగా...



శీతాకాలంలో చర్మ సమస్యలు సాధారణం. ఈ విషయం అందరికీ తెలిసిందే. అయితే ఈ కాలంలో చర్మానికే కాదు.. జుట్టుకూ సమస్యల చిక్కులు తప్పవు. ముఖ్యంగా చలికాలంలో జుట్టు రాలిపోవడం కాస్త ఎక్కువగానే ఉంటుంది. శీతాకాలంలో శిరోజాలను సంరక్షించుకోవాలంటే ఏం చేయాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి... తదితర విషయాలు తెలుసుకుందాం...

శీతాకాలంలో ఉండే చల్లగాలుల వల్ల శరీరంలోనే కాదు, శిరోజాల్లో కూడా తేమ శాతం తగ్గిపోతుంది. ఫలితంగా జుట్టంతా అట్టకట్టినట్లు పొడిగా తయారవుతుంది. అంతే కాదు, కుదుళ్ళు బలహీనపడి జుట్టు రాలిపోయే సమస్య అధికం అవుతుంది కాబట్టి చలి బారి నుంచి శిరోజాలను కూడా సంరక్షించుకోవాలంటే ఏం చేయాలో చూద్దాం.

✗ ఇవి వద్దు

✗ తరచూ తలస్నానం

శీతాకాలంలో తలస్నానం మరీ ఎక్కువగా లేదా తక్కువగా చేయకూడదు. వారానికి రెండుసార్లు చేస్తే సరిపోతుంది. అంతకన్నా ఎక్కువసార్లు చేయడం వల్ల జుట్టు రాలిపోయే ప్రమాదం ఉంది.

✗ వేడినీటి స్నానం

శీతాకాలంలో స్నానానికి బాగా వేడిగా ఉన్న నీళ్లను ఉపయోగించకూడదు. గోరు వెచ్చని నీటిని మాత్రమే ఉపయోగించాలి. వేడి నీటి స్నానం వల్ల చర్మం, శిరోజాల్లోని సహజనూనెల శాతం తగ్గిపోయి కురులు పొడిగా... నిర్జీవంగా మారిపోతాయి.

✗ హెయిర్ డ్రయ్యర్స్

శీతాకాలంలో జుట్టుకు ఉపయోగించే డ్రయర్స్, కర్లర్స్‌స్ట్రెయిటనర్స్ వంటి వాటికి దూరంగా ఉండాలి. టవల్‌తో తుడుచుకుని ఆరబెట్టుకునే విధానానికే పరిమితం కావాలి.

✔ ఇవి చేయాలి

✔ కండీషనింగ్

తలస్నానానికి ముందు జుట్టుకు కండీషనర్ తప్పకుండా అప్లై చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల కుదుళ్లు బలంగా ఉంటాయి.

✔ హెయిర్ ఆయిల్

చలికాలంలో శిరోజాలకు తరచు నూనె పెడితే మంచిది. ఇది జుట్టులోని తేమ శాతం ఎక్కువ సమయం నిలిచి ఉండటానికి ఉపకరిస్తుంది. అలాగే దువ్వుకోవడానికి సన్న పళ్ల దువ్వెన కాకుండా పళ్లు కాస్త దూరంగా... వెడల్పుగా ఉన్న దువ్వెన వాడటం మంచిది.

అట్ట కట్టినట్టు ఉంటే : చలిగాలులకు జుట్టు అట్టకట్టినట్టుగా కాకుండా ఉండాలంటే రోజూ రాత్రిళ్లు విటమిన్ ఇ ఉన్న నూనెను రాసుకోవాలి. అలాగే బయటకు వెళ్లేటప్పుడు కురులను కవర్ చేసేలా స్కార్ఫ్, టోపీ వంటివి ధరించాలి. కుదరని పక్షంలో బాడీలోషన్ కొద్దిగా తీసుకుని చేతులకు రుద్దుకోవాలి. తర్వాత ఆ చేతులతో జుట్టును మెల్లగా దువ్వుతున్నట్లు సవరించుకోవాలి. ఇలా చేయడం వల్ల పెళుసుదనం పోయి, శిరోజాలు ప్రకాశవంతంగా మారుతాయి.

ఈ జాగ్రత్తలతో ఈ కాలంలోనూ కురులు నిగనిగలాడతాయి.

సినిమా

ముట్టుకోవద్దని చెప్పాను కద రా...



● పృథ్వీరాజ్, ప్రభాస్

ప్రభాస్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఆసక్తిగా ఎదురు చూసిన 'సలార్ పార్ట్ 1– సీజ్‌ఫైర్' ట్రైలర్ వచ్చేసింది. ప్రభాస్ హీరోగా 'కేజీఎఫ్' ఫేమ్ ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహించిన పాన్ ఇండియన్ చిత్రం 'సలార్'. హోంబలే ఫిల్మ్స్ పతాకంపై విజయ్ కిరగందూర్ నిర్మిస్తున్న ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. తొలి భాగం 'సలార్: సీజ్‌ఫైర్' క్రిస్మస్ పండగ సందర్భంగా ఈ నెల 22న తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో రిలీజ్ కానుంది. శుక్రవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. 'దూరంగా ఉన్న ఒక ప్రాంతంలో..., ఎవడ్రా ఎవడు?', 'అరే దేవా.. వద్దురా వెళ్దాం పదా', 'చెప్పరా.. ఎవడు?' అనే డైలాగ్‌తో టీజర్ ప్రారంభమైంది. 'పెద్ద పెద్ద గోడలు కట్టిందే భయపడి.. బయటకు ఎవడు పోతాడో అని కాదు.. లోపలికి ఎవడొస్తాడా? అని', 'ముట్టుకోవద్దని చెప్పాను కదరా', 'నిన్ను ఎవడూ ముట్టుకోకూడదు.. ప్లీజ్.. ఐ కైండ్లీ రిక్వెస్ట్' అంటూ దేవ పాత్రధారి ప్రభాస్ చెప్పే డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి. ట్రైలర్ చూస్తే స్నేహితులైన ప్రభాస్ (దేవా), పృథ్వీరాజ్ సుకుమారన్(వరద రాజమన్నార్) శత్రువులుగా ఎలా మారారు? అనే నేపథ్యంలో కథ సాగుతుందని తెలుస్తోంది. శ్రుతీహాసన్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో జగపతిబాబు, టీనూ ఆనంద్, శ్రియా రెడ్డి, ఈశ్వరీ రావు తదితరులు కీలక పాత్రలు పోషించారు.

బచ్చల మల్లి షురూ

'అల్లరి' నరేశ్ హీరోగా 'బచ్చల మల్లి' సినిమా షురూ అయింది. ఈ చిత్రానికి 'సోలో బ్రతుకే సో బెటర్' ఫేమ్ సుబ్బు మంగాదేవి దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో అమృతా అయ్యర్ కథానాయిక. హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేశ్ దండా, బాలాజీ గుత్తా నిర్మిస్తున్న ఈ చిత్రం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి ప్రతాప్‌రెడ్డి కెమెరా స్విచ్చాన్ చేయగా, అనిల్ రావిపూడి క్లాప్ ఇవ్వగా, విజయ్ కనకమేడల గౌరవ దర్శకత్వం వహించారు. దర్శకులు మారుతి, బుచ్చిబాబు స్క్రిప్ట్‌ని మేకర్స్‌కి అందజేశారు. ''న్యూ ఏజ్ యాక్షన్ డ్రామాగా యునిక్ కథతో 'బచ్చల మల్లి' రూపొందుతోంది. 1990 నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ మూవీలో యాక్షన్ ఎక్కువగా ఉంటుంది. 'అల్లరి' నరేశ్ ఇంటెన్స్ రోల్ చేస్తున్నారు. ఆయన కెరీర్‌లో 63వ చిత్రమిది. పూర్తిగా కొత్త లుక్‌లో కనిపించనున్నారు నరేశ్. ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ త్వరలో ప్రారంభమవుతుంది'' అని మేకర్స్ పేర్కొన్నారు. కోట జయరామ్, రావు రమేశ్, సాయికుమార్, ధనరాజ్, హరితేజ ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: విశాల్ చంద్రశేఖర్, కెమెరా: రిచర్డ్ ఎం.నాథన్.



● 'అల్లరి' నరేశ్, సుబ్బు, అనిల్ రావిపూడి, రాజేశ్ దండా

కడపకు కంగువా



● సూర్య

కడపకు పయనమవ్వనున్నారట కంగువా. సూర్య హీరోగా శివ దర్శకత్వంలో రూపొందుతున్న పీరియాడికల్ యాక్షన్ ఫిల్మ్ 'కంగువా'. దిశా పటానీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కేఈ జ్ఞానవేల్‌రాజా నిర్మిస్తున్న ఈ సినిమా తాజా షెడ్యూల్ చిత్రీకరణను కడపలో ప్లాన్ చేశారని, ఈ నెల రెండో వారంలో ఈ చిత్రీకరణ మొదలవుతుందని సమాచారం. సినిమాలోని కీలక సన్నివేశాల చిత్రీకరణ కడపలో జరగనుందట. రెండు భాగాలుగా విడుదల కానున్న 'కంగువా' ఫస్ట్ పార్ట్ ఏప్రిల్‌లో విడుదల కానుంది.

మార్చిలో మొదలు



● సల్మాన్ ఖాన్


సల్మాన్ ఖాన్ హీరోగా 'షేర్షా' ఫేమ్ విష్ణువర్ధన్ దర్శకత్వంలో 'ది బుల్' అనే సినిమా తెరకెక్కనుంది. కరణ్ జోహార్ ఈ సినిమాను నిర్మించనున్నారు. ఈ సినిమా రెగ్యులర్ చిత్రీకరణ మార్చిలో ప్రారంభం కానుందని బాలీవుడ్ సమాచారం. వాస్తవ ఘటనల ఆధారంగా ఈ సినిమా తెరకెక్కనుందని, ఇందులో పారా మిలిటరీ ఆఫీసర్‌గా సల్మాన్ ఖాన్ నటిస్తారని టాక్. వచ్చే ఏడాది ఈ సినిమాను విడుదల చేయాలనుకుంటున్నారు. ఇక తన సినిమాల వైఫల్యాల ('అంతిమ్, కిసీ కా భాయ్ కిసీ కీ జాన్'లను ఉద్దేశిస్తూ..) గురించి కూడా సల్మాన్ ఓ ఇంటర్వ్యూలో స్పందించారు. నా సినిమాలు విడుదలైనప్పుడు, ఆ సినిమాల టికెట్ ధరలు తక్కువగా ఉంటున్నాయని, ఎక్కువ ధరలతో విడుదల చేస్తే ఆ సినిమాల కలెక్షన్స్ కూడా భారీగానే ఉంటాయని, నా తర్వాతి సినిమాను అలాగే రిలీజ్ చేస్తానని సల్మాన్ ఖాన్ చెప్పుకొచ్చారు. అంతేకాదు.. తక్కువ సినిమా టికెట్ ధరలతో ప్రజల డబ్బును మేం సేవ్ చేస్తున్న విషయం అందరికీ సరిగ్గా అర్థం కావడం లేదని కూడా సల్మాన్ ఖాన్ పేర్కొన్నారు.

కొత్త ప్రయాణం ఆరంభం



● ట్రైన్ సినిమా ప్రారంభోత్సవంలో...

రైలు ప్రయాణం మొదలు పెట్టారు విజయ్ సేతుపతి. ఆయనతో జర్నీ షేర్ చేసుకుంటున్నారు డింపుల్ హయతి. విజయ్ సేతుపతి హీరోగా డింపుల్ హయతి ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ థ్రిల్లర్ ఫిల్మ్‌కు 'ట్రైన్' టైటిల్‌ను ఖరారు చేశారు. దర్శకుడు మిస్కిన్ తెరకెక్కిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ శుక్రవారం ప్రారంభమైంది. రైలు ప్రయాణం నేపథ్యంలో సాగే ఈ సినిమాలో విజయ్ సేతుపతి క్యారెక్టరైజేషన్, లుక్‌ను కొత్తగా డిజైన్ చేశారు మిస్కిన్.



● విజయ్ సేతుపతి

ఇరవై సార్లు పెళ్లి చేసుకున్నా!



● అవికా గోర్

''చిన్నారి పెళ్లి కూతురు' సీరియల్ మొదలుకొని ఇప్పటివరకూ నేను ఆన్‌స్క్రీన్‌పై కనీసం ఇరవై సార్లు పెళ్లి చేసుకుని ఉంటా. అయితే ఇది బోర్ కొట్టలేదు. పెళ్లి కూతురిలా ముస్తాబవడం నాకు చాలా ఇష్టం. మరోసారి 'వధువు'లో పెళ్లి కూతురిగా నటించాను. థ్రిల్లర్ జానర్‌లో రూపొందిన ఈ సిరీస్ ఆసక్తిగా సాగుతుంది'' అని హీరోయిన్ అవికా గోర్ అన్నారు. నందు, అలీ రెజా, అవికా గోర్ కీలక పాత్రల్లో నటించిన వెబ్ సిరీస్ 'వధువు'. పోలూరు కృష్ణ దర్శకత్వంలో శ్రీకాంత్ మొహతా, మహేంద్ర సోని నిర్మించిన 'వధువు' ఈ నెల 8 నుంచి డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా అవికా గోర్ మాట్లాడుతూ–''బెంగాలీ సక్సెస్‌ఫుల్ వెబ్ సిరీస్ 'ఇందు'ను తెలుగులోకి 'వధువు'గా తీసుకొస్తున్నాం. ఇలాంటి స్క్రిప్ట్‌లో నేను ఇప్పటిదాకా నటించలేదు. నాకు టీవీ సీరియల్స్ చేసిన అనుభవం ఉంది. బుల్లితెర ప్రేక్షకులకు ఎలాంటి కంటెంట్ ఇష్టమో.. అది 'వధువు'లో ఉంటుంది. ఇక చిన్నప్పుడే నటిగా మారడం వల్ల నా పర్సనల్ లైఫ్‌కు టైమ్ కోల్పోయినా... నటిగా నేను ప్రతి రోజూ ఒక కొత్త పాత్రలో కనిపించగలుగుతున్నాను.. ప్రతి రోజూ ఒక కొత్త లైఫ్ చూస్తున్నాను. నిర్మాతగా 'పాప్ కార్న్' సినిమా తీయడం గర్వంగా ఉంది. ఎలాంటి హంగామా లేకుండా ఇరు కుటుంబ సభ్యుల సమక్షంలో నిరాడంబరంగా నా పెళ్లి చేసుకోవాలనుంది. ప్రస్తుతం తెలుగులో ఆది సాయికుమార్ హీరోగా రూపొందుతున్న ఒక సినిమా చేస్తున్నా. అలాగే హిందీలో కొన్ని ప్రాజెక్ట్స్‌లో నటిస్తున్నాను'' అన్నారు.

కన్నీరే నెత్తురు చిందగా...



● విశాల్

విశాల్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'రత్నం'. ఈ చిత్రానికి 'సింగం' సిరీస్ ఫేమ్ హరి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రియా భవానీ శంకర్ హీరోయిన్. కార్తికేయన్ సంతానం, జీ స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ సినిమా టీజర్‌ని విడుదల చేశారు మేకర్స్. ఓ పెద్ద మైదానంలో బర్రెలు, గుర్రాలు పరిగెడుతూ ఉండగా వాటి మధ్య లారీ నుంచి దిగి వచ్చి మోకాలి మీద కూర్చున్న ఒక వ్యక్తి తలని విశాల్ నరికి, దాన్ని చేత్తో పట్టుకుని నడిచి వచ్చే సన్నివేశాన్ని టీజర్‌లో చూపించారు. 'కన్నీరే నెత్తురు చిందగా.. క్రోధమే రుధిరం చిమ్మగా.. ఆగ్రహమే అరుణధారగా.. రణరంగమే రక్తపు ఏరుగా...' వంటి డైలాగులు టీజర్‌లో వినిపిస్తాయి. 'రత్నం' చిత్రంలో విశాల్ మరోసారి మాస్ లుక్‌లో కనిపించనున్నారని టీజర్ చూస్తే తెలుస్తోంది. ఈ చిత్రాన్ని 2024 వేసవిలో విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. సముద్ర ఖని, గౌతమ్ మీనన్, యోగిబాబు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.

సాక్షి బిజినెస్
శనివారం
2-12-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
493	135
67,481	20,268

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	14,298	▲	72
డోజోన్స్	36,211	▲	260
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,529	▲	76
డాక్స్	16,398	▲	182
షాంఘై	3,032	▲	2
నికాయ్	33,432	▼	55

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (24 క్యారెట్)	62,728
బంగారం (22 క్యారెట్)	62,477
వెండి (కేజీ)	76,400

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.53	84.20
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	103.73	107.11
€	యూరో	ఒకటి	89.40	93.09
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	55.48	57.18
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	53.93	56.53
S$	సింగపూర్ డాలర్	ఒకటి	54.31	56.29
SAR	సౌదీ రియాల్	పదింటికి	21.25	22.88
UAE D	యూఏఈ దిర్హామ్	పదింటికి	21.78	23.57
¥	చైనా యువాన్	పదింటికి	10.54	12.62

జీఎస్‌టీ వసూళ్లు రూ.1.68 లక్షల కోట్లు

నవంబర్‌లో 15 శాతం అప్



న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు నవంబర్‌లో రూ.1.68 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. గత ఏడాది ఇదే నెలతో (రూ.1.45 లక్షల కోట్లు) పోల్చితే ఈ పరిమాణం 15% అధికం. ఆర్థిక శాఖ విడుదల చేసిన గణాంకాలను పరిశీలిస్తే..

- మొత్తం వసూళ్లు రూ. 1,67,929 కోట్లు
- ఇందులో సీజీఎస్‌టీ వసూళ్లు రూ.30,420 కోట్లు.
- ఎస్‌జీఎస్‌టీ వసూళ్లు రూ.38,226 కోట్లు.
- ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ పరిమాణం రూ. 87,009 కోట్లు (వస్తు దిగుమతులపై వసూలయిన రూ.30,198 కోట్లు కలిపి)
- సెస్ రూ.12,274 కోట్లు (వస్తు దిగుమతులపై వసూలయిన రూ.1,036 కోట్లుసహా)

ఆర్థిక సంవత్సరంలో తీరిది...

ఆర్థిక సంవత్సరం తొలి నెల ఏప్రిల్లో చరిత్రాత్మక స్థాయిలో రూ.1.87 లక్షల కోట్ల అత్యధిక వసూళ్లు నమోదయ్యాయి. మే, జూన్ నెలల్లో వరుసగా రూ.1.57 లక్షల కోట్లు, రూ.1.61 లక్షల కోట్లు ఒనగూరాయి. జూలై వసూళ్లు రూ.1.60 లక్షల కోట్లు. ఆగస్టు వసూళ్లు రూ. 1.59 లక్షల కోట్లు కాగా, సెప్టెంబర్‌లో రూ. 1.63 లక్షల కోట్ల జీఎస్‌టీ రాబడి నమోదయ్యింది. ఇక అక్టోబర్ విషయానికి వస్తే. వసూళ్లు భారీగా రూ.1.72 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. 2017 జూలైలో ప్రారంభం తర్వాత ఇవి రెండవ భారీ స్థాయి వసూళ్లు (2023 ఏప్రిల్ తర్వాత) కావడం గమనార్హం.

నవంబర్‌లో 'తయారీ' పటిష్టం

56కు ఎస్‌అండ్‌పీ గ్లోబల్ ఇండియా పీఎంఐ



న్యూఢిల్లీ: భారత్ మొత్తం పారిశ్రామిక ఉత్పత్తి (ఐఐపీ)లో దాదాపు దాదాపు 77 శాతం వాటా కలిగిన తయారీ రంగం నవంబర్‌లో చక్కటి ఫలితాన్ని నమోదు చేసుకుంది. ఎస్‌అండ్‌పీ గ్లోబల్ ఇండియా మాన్యుఫాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) 56కు ఎగసింది. అక్టోబర్‌లో ఈ సూచీ 55.5 వద్ద ఉంది. ధరల ఒత్తిడి తగ్గడం.. సమీక్షా నెల చక్కటి ఫలితానికి కారణమని ఈ మేరకు జరిగిన ఒక సర్వే వెల్లడించింది. కాగా ఎస్‌అండ్‌పీ పీఎంఐ 50 పైన ఉంటే వృద్ధి ధోరణిగా, ఆ దిగువకు పడితేనే క్షీణతగా పరిగణిస్తారు. ఈ ప్రాతిపదికన సూచీ వరుసగా 29 నెలల నుంచి వృద్ధి బాటలోనే కొనసాగుతోంది. తయారీ రంగం 2024లో కూడా పటిష్ట పనితీరును ప్రదర్శిస్తుందన్న ఆశాభావాన్ని సర్వేలో పాల్గొన్న ప్రతినిధులు వ్యక్తం చేశారు.

ప్రజల వద్ద మిగిలిన రూ. 2,000 నోట్ల విలువ రూ. 9,760 కోట్లు

- 97.26% నోట్లు వెనక్కు వచ్చేశాయ్
- ఆర్‌బీఐ ప్రకటన



సాక్షి, న్యూఢిల్లీ: చెలామణీలో ఉన్న రూ.2,000 నోట్లలో దాదాపు 97.26 శాతం బ్యాంకింగ్ వ్యవస్థలోకి తిరిగి వచ్చేశాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఒక ప్రకటనలో పేర్కొంది. ఇంకా ప్రజల వద్ద దాదాపు రూ.9,760 కోట్ల విలువైన నోట్లు ఉన్నట్లు పేర్కొంది. ''రూ. 2,000 బ్యాంకు నోట్ల ఉపసంహరణ ప్రకటించిన 2023 మే 19న వ్యాపారం ముగిసే సమయానికి చెలామణీలో ఉన్న రూ. 2,000 బ్యాంకు నోట్ల మొత్తం విలువ రూ. 3.56 లక్షల కోట్లు. 2023 నవంబర్ 30 వ్యాపారం ముగిసే సమయానికి ఈ విలువ రూ.9,760 కోట్లకు తగ్గింది'' అని ప్రకటన వివరించింది. కాగా, నోట్లు ఇప్పటికీ మార్చుకునే వీలుందని ఆర్‌బీఐ వివరించింది. దేశంలోని 19 ఆర్‌బీఐ కార్యాలయాల్లో ప్రజలు రూ. 2,000 నోట్లను డిపాజిట్ చేయవచ్చు లేదా మార్చుకోవచ్చు. రాష్ట్ర రాజధానుల్లో ఆర్‌బీఐ కార్యాలయాలు ఉన్నందున, ఎవరైనా ఈ కార్యాలయాలకు వెళ్లలేని పక్షంలో పోస్టల్ శాఖ సేవలను పొందవచ్చని ఆర్‌బీఐ సూచించింది. కాగా, రూ.2,000 నోట్ల మార్పిడి లేదా డిపాజిట్ కోసం ఆర్‌బీఐ కార్యాలయాల వద్ద పని వేళల్లో పొడవైన క్యూలు కనిపిస్తున్నాయి. రూ.2 వేల నోట్ల డిపాజిట్ లేదా మార్పిడి సేవలను బ్యాంకు శాఖలు అక్టోబర్ 7 వరకు అందించాయి. అక్టోబర్ 8 నుంచి ఈ సేవలను 19 ఆర్‌బీఐ కార్యాలయాలకు మారాయి. ఆర్‌బీఐ కార్యాలయాల వద్ద వ్యక్తులు, కంపెనీలు తమ వద్ద ఉన్న రూ.2 వేల నోట్లను ఒకసారి రూ.20,000 వరకు మార్చుకోవచ్చు. డిపాజిట్‌కు మాత్రం ఎటువంటి పరిమితి లేదు. 2016 నవంబరులో రూ.500, రూ.1,000 నోట్ల రద్దు తర్వాత ఆర్‌బీఐ రూ.2,000 నోట్లతోపాటు కొత్త రూ.500 నోట్లను పరిచయం చేసింది.

సత్యం కేసులో సెబీ తాజా చర్యలు

- రూ. 624 కోట్లు కట్టమంటూ ఆదేశాలు
- రామలింగరాజు, రామరాజుపై నిషేధం



న్యూఢిల్లీ: సత్యం కంప్యూటర్ సర్వీసెస్ కేసులో మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా రూ. 624 కోట్లు కట్టమంటూ ఆదేశాలు జారీ చేసింది. కంపెనీ అప్పటి వ్యవస్థాపకుడు రామలింగరాజు, మరో నలుగురితో పాటు ఒక సంస్థకు ఈ ఆదేశాలు జారీ చేసింది. 14 ఏళ్ల క్రితం నాటి సత్యం కుంభకోణంలో చట్టవిరుద్ధంగా ఆర్జించిన సొమ్మును తిరిగి చెల్లించవలసిందిగా సెబీ స్పష్టం చేసింది. అంతేకాకుండా రామలింగరాజు, రామరాజులను సెక్యూరిటీల మార్కెట్ల నుంచి దాదాపు ఐదేళ్లపాటు నిషేధించింది. అయితే పెండింగ్‌లో ఉన్న వీరిరువురి అప్పీల్‌పై సుప్రీంకోర్టు నిర్ణయం మేరకు ఆదేశాల అమలు ఉంటుందని పేర్కొంది. రామలింగరాజు, రామరాజు, బి.సూర్యనారాయణ రాజు, వి.శ్రీనివాస్, జి.రామకృష్ణతో పాటు.. ఎస్ఆర్ఎస్ఆర్ హోల్డింగ్స్ అక్రమంగా సంపాదించిన రూ. 624 కోట్లను చెల్లించమంటూ 96 పేజీల తాజా ఆర్డర్‌లో సెబీ ఆదేశించింది. 2009 జనవరి 7 నుంచి వార్షిక వడ్డీ సహా అక్రమార్జనను చెల్లించవలసిందిగా స్పష్టం చేసింది.

సరికొత్త శిఖరంపై నిఫ్టీ

- 67 వేల స్థాయి పైకి సెన్సెక్స్
- కలిసొచ్చిన విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు ప్రోత్సాహకర ఆర్థిక గణాంకాల నమోదు ప్రభావం...



ముంబై: వరుసగా నాలుగో రోజూ లాభాల జోరు కొనసాగించిన నిఫ్టీ కొత్త రికార్డు నెలకొల్పింది. విదేశీ ఇన్వెస్టర్ల వరుస కొనుగోళ్లు, మెరుగైన స్థూల ఆర్థిక గణాంకాల నమోదు ఇన్వెస్టర్ల విశ్వాసాన్ని పెంచాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందాయి. ఆటో మినహా అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. విద్యుత్, ఎఫ్ఎంసీజీ, యుటిలిటీ, రియల్టీ, మెటల్, కమోడిటీ, పారిశ్రామికోత్పత్తి షేర్లను కొనేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపారు. ఉదయం ఉత్సాహంగా మొదలైన సూచీలు ట్రేడింగ్ ఆద్యంతం స్థిరమైన లాభాలతో కదలాడాయి. నిఫ్టీ 158 పాయింట్లు బలపడి 20,292 వద్ద కొత్త జీవితకాల గరిష్ట స్థాయిని నమోదు చేసింది. మార్కెట్ ముగిసే సరికి 135 పెరిగి 20,268 వద్ద స్థిరపడింది. ఈ ముగింపు కూడా నిఫ్టీకి సరికొత్త గరిష్ట స్థాయి కావడం విశేషం. మరో సూచీ సెన్సెక్స్ 493 పాయింట్లు పెరిగి రెండున్నర నెలల గరిష్టం 67,481 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో 576 పాయింట్లు పెరిగి 67,564 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. చిన్న, మధ్య తరహా షేర్లకు డిమాండ్ నెలకొనడంతో బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.96%, 0.48% చొప్పున రాణించాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,590 కోట్లు, దేశీ ఇన్వెస్టర్లు రూ.1,448 కోట్ల షేర్లను కొన్నారు. డాలర్ మారకంలో రూపాయి విలువ 7 పైసలు పెరిగి 83.30 వద్ద స్థిరపడింది. ''దేశీయ క్యూ2 జీడీపీ డేటా అంచనాలకు మించి నమోదవడంతో దలాల్ స్ట్రీట్ అప్‌ట్రెండ్ మూమెంటం కొనసాగింది. వడ్డీ రేట్ల పెంపునకు ఈసీబీ విరామం ఇవ్వొచ్చన్న ఆశలు, ఫెడ్ రిజర్వ్ ప్రసంగం నేపథ్యంలో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లూ ర్యాలీ చేస్తున్నాయి. క్రూడాయిల్ ధరలు దిగువ స్థాయిలో ట్రేడవుతున్నాయి. పండుగ జోష్ కలిసి రావడంతో నవంబర్ ఆటో అమ్మకాల గణాంకాల్లో వృద్ధి నమోదైంది తయారీ రంగ యాక్టివిటీ ఊపందుకోవడంతో పాటు ప్రభుత్వ మూలధన కేటాయింపుతో మౌలిక, క్యాపిటల్ గూడ్స్ షేర్లు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాయి. అయితే అధిక వాల్యుయేషన్లు సూచీల అప్‌సైడ్ మూమెంటంకు నిరోధంగా నిలిచాయి'' అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

- సెన్సెక్స్ నాలుగు రోజుల్లో 1,511 పాయింట్లు పెరగడంతో బీఎస్ఈలో 6.76 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ జీవితకాల గరిష్ట స్థాయి రూ.337.67 లక్షల కోట్ల వద్ద ముగిసింది. ఈ ఏడాది(2023) సెప్టెంబర్ 15న సెన్సెక్స్ 67,927 వద్ద ఆల్‌టైం హై స్థాయికి నమోదు చేసిన సంగతి తెలిసిందే.
- ఫ్లెయిర్ రైటింగ్ ఇండస్ట్రీస్ షేరు ఇష్యూ ధర (రూ.304)తో పోలిస్తే 65% ప్రీమియంతో రూ.503 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 69% పెరిగి రూ.514 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 49% లాభంతో రూ.453 వద్ద స్థిరపడింది. కంపెనీ విలువ రూ.4,771 కోట్లు నమోదైంది.
- ఈ వారంలో బంపర్ లిస్టింగ్ సాధించిన ఐఆర్ఈడీఏ, టాటా టెక్నాలజీ, గంధార్ ఆయిల్ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో వరుసగా 4%, 7.50%, 7% చొప్పున నష్టపోయాయి.

తగ్గిన వాహన విక్రయాల జోరు

ముంబై: పండుగ సీజన్‌లో నెలకొన్న డిమాండ్‌కు సరిపడేలా ఆటో కంపెనీలు డీలర్లకు సరఫరా పెంచడంతో నవంబర్‌లో ప్యాసింజర్ వాహనాల విక్రయాలు పర్వాలేదనిపించాయి. నవంబర్ నెలలో 3.35 లక్షల యూనిట్ల విక్రయాలు జరిగాయి. గత ఏడాది ఇదే నెలలో అమ్ముడైన 3.22 లక్షల వాహనాలతో పోలిస్తే ఇవి 3.9% అధికం. ''నవంబర్ 15 వరకు పండుగ సీజన్ డిమాండ్ కొనసాగడంతో పాటు ఉత్పత్తిని పెంచేందుకు సరిపడా ఎలక్ట్రానిక్స్ ఉపకరణాల లభ్యత కారణంగా హోల్‌సేల్ అమ్మకాలు పెరిగాయి. ఈ ఏడాదిలో మొత్తం 41 లక్షల యూనిట్ల ప్యాసింజర్ వాహన విక్రయాలు జరగొచ్చని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి'' అని మారుతీ సుజుకీ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శశాంక్ శ్రీవాస్తవ తెలిపారు. టయోటా కిర్లోస్కర్, హోండా కార్స్, ఎంఅండ్ఎం కంపెనీలు అమ్మకాల్లో రెండంకెల వృద్ధి నమోదు చేయగా, మారుతీ, హ్యుందాయ్ మోటార్స్, ఎంజీ మోటార్స్ ఒక అంకె వృద్ధికి పరిమితమయ్యాయి. ద్విచక్ర వాహన విక్రయాల్లో గణనీయమైన వృద్ధి నమోదైంది.



నవంబర్ విక్రయాలు ఇలా..

కంపెనీ	2023	2022	వృద్ధి (%)
మారుతీ సుజుకీ	1,64,439	1,59,044	(+)3
హ్యుందాయ్ మోటార్స్	65,801	64,003	(+)3
టాటా మోటార్స్	74,172	75,478	(-)2
ఎండ్‌అండ్‌ఎం	70,576	58,303	(+)21
హోండా కార్స్	8,730	7,051	(+)24
ఎంజీ మోటార్స్	4,154	4,079	(+)2
టయోటా కిర్లోస్కర్	17,818	11,765	(+)51
ద్విచక్ర వాహనాలు			
బజాజ్ ఆటో	4,03,003	3,06,719	(+)31
హోండా	4,47,849	3,73,234	(+)20
హీరో మోటోకార్ప్	4,91,050	3,90,932	(+)25
టీవీఎస్ మోటార్స్	3,64,231	2,77,123	(+)31
రాయల్ ఎన్‌ఫీల్డ్	80,251	70,766	(+)13
వాణిజ్య వాహనాలు			
వోల్వో ఐషర్	5,194	4,903	(+)6
అశోక్ లేలాండ్	16,864	14,864	(+)13
ట్రాక్టర్లు			
ఎస్కార్ట్స్	8,258	7,960	(+)4
మహీంద్రా ట్రాక్టర్స్	32,074	30,528	(+)5



పాక్ సెలక్టర్‌గా 'మ్యాచ్ ఫిక్సర్'

ఫిక్సింగ్ ఉదంతంలో నిషేధానికి గురి కావడంతో పాటు జైలు శిక్ష కూడా అనుభవించిన మాజీ ఆటగాడు సల్మాన్ బట్‌ను పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) జాతీయ జట్టు సెలక్టర్‌గా ఎంపిక చేసింది. అతనితో పాటు మరో ఇద్దరు మాజీలు కమ్రాన్ అక్మల్, ఇఫ్తికార్ అంజుమ్ కూడా సెలక్టర్లుగా ఎంపికయ్యారు. చీఫ్ కోచ్ వహాబ్ రియాజ్‌తో కలిసి వీరిద్దరు పని చేస్తారు. సల్మాన్ బట్ పాక్ తరఫున 33 టెస్టులు, 78 వన్డేలు, 24 టి20 మ్యాచ్‌లు ఆడాడు. 2010లో ఇంగ్లండ్‌తో జరిగిన లార్డ్స్ టెస్టులో కెప్టెన్‌గా ఉన్న బట్ సహచరులు ఆసిఫ్, ఆమిర్‌లతో నోబాల్స్ వేయించి స్పాట్ ఫిక్సింగ్‌కు పాల్పడ్డాడు. ఐసీసీ నిషేధంతో పాటు బట్‌కు 30 నెలల జైలు శిక్ష కూడా పడింది. అయితే 7 నెలలకే విడుదలైన బట్ 2016లో తిరిగి క్రికెట్‌లోకి అడుగు పెట్టాడు. దేశవాళీలో మంచి ప్రదర్శన కనబర్చినా... పాక్ జట్టు కోసం అతని పేరును మళ్లీ పరిశీలించలేదు. అయితే ఇప్పుడు సెలక్టర్‌గా అతను అధికారిక పదవిలోకి వచ్చాడు.

ఓటమి దిశగా న్యూజిలాండ్



తైజుల్

సిల్హెట్: బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో న్యూజిలాండ్ పరాజయానికి చేరువైంది. 332 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ మ్యాచ్ నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి తమ రెండో ఇన్నింగ్స్‌లో 113 పరుగులకే 7 వికెట్లు కోల్పోయింది. డరైల్ మిచెల్ (44 నాటౌట్) మినహా ఇతర బ్యాటర్లంతా విఫలమయ్యారు. లెఫ్టార్మ్ స్పిన్నర్ తైజుల్ ఇస్లామ్ (4/24) నాలుగు వికెట్లతో ప్రత్యర్థిని దెబ్బ తీశాడు. విజయానికి కివీస్ మరో 219 పరుగులు చేయాల్సి ఉంది. అంతకు ముందు ఓవర్‌నైట్ స్కోరు 212/3తో శుక్రవారం ఆట కొనసాగించిన బంగ్లాదేశ్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 338 పరుగులకు ఆలౌటైంది. ముష్ఫికర్ రహీమ్ (67), మెహదీ హసన్ మిరాజ్ (50 నాటౌట్) అర్ధసెంచరీలు చేశారు.

హైదరాబాద్‌కు మరో పరాజయం

విజయ్‌హజారే ట్రోఫీ



తన్మయ్

జైపూర్: దేశవాళీ వన్డే టోర్నీ విజయ్‌హజారే ట్రోఫీలో హైదరాబాద్‌కు 'హ్యాట్రిక్' పరాజయం ఎదురైంది. గ్రూప్ 'బి'లో భాగంగా శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో మహారాష్ట్ర 3 వికెట్ల తేడాతో హైదరాబాద్‌ను ఓడించింది. టోర్నీలో తొలి 2 మ్యాచ్‌లు నెగ్గిన హైదరాబాద్ ఆపై వరుసగా మూడు మ్యాచ్‌లలో పరాజయంపాలైంది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 315 పరుగులు చేసింది. తన్మయ్ అగర్వాల్ (117 బంతుల్లో 103; 9 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీ సాధించగా... కెప్టెన్ రాహుల్ సింగ్ (69), రాహుల్ బుద్ధి (58 నాటౌట్), రవితేజ (51 నాటౌట్) హాఫ్ సెంచరీలతో అండగా నిలిచారు. అనంతరం మహారాష్ట్ర 49.4 ఓవర్లలో 7 వికెట్లకు 316 పరుగులు సాధించింది. అంకిత్ బావ్నే (108 బంతుల్లో 113; 12 ఫోర్లు, 1 సిక్స్) శతకానికి తోడు అజీమ్ కాజీ (80), కౌశల్ తాంబే (38), కెప్టెన్ కేదార్ జాదవ్ (32 నాటౌట్) రాణించి జట్టును గెలిపించారు. మరో వైపు చండీగఢ్‌లో ఆంధ్ర, గుజరాత్ జట్ల మధ్య జరగాల్సిన గ్రూప్ 'డి' మ్యాచ్ వర్షం కారణంగా ఒక్క బంతి కూడా పడకుండానే రద్దయింది.

సిరీస్ చేతికందింది...

- నాలుగో టి20లో 20 పరుగులతో భారత్ గెలుపు
- 3–1తో సిరీస్ వశం
- గెలిపించిన అక్షర్ పటేల్
- రేపు ఆఖరి టి20

సిరీస్‌లోని గత మ్యాచ్‌లతో పోలిస్తే ఈ పోరు భిన్నంగా సాగింది. భారత జట్టు నుంచి చెప్పుకోదగ్గ భారీ షాట్లు లేవు. ఒక్క బ్యాటరూ అర్ధ సెంచరీ చేయలేదు. 200 పరుగులు అవలీలగా చేసిన ఈ సిరీస్‌లో కనీసం ఇక్కడ 180 పరుగులైనా చేయలేకపోయింది. అయినా సరే భారతే మ్యాచ్ గెలిచింది. ఆఖరి పోరుకు ముందే సిరీస్‌ను 3–1తో సాధించింది. బ్యాటర్ల అరకొర మెరుపులతో పాటు అక్షర్ పటేల్ (4–0–16–3) అద్భుతమైన స్పెల్ ఆసీస్‌ను ఓడించింది.



అక్షర్‌కు సహచరుల అభినందన

రాయ్‌పూర్: సొంతగడ్డపై ఆస్ట్రేలియా చేతిలో వన్డే ప్రపంచకప్‌ను కోల్పోయిన భారత్‌కు కాస్త ఊరట! పొట్టి ఫార్మాట్‌లో టీమిండియా కంగారూపై సిరీస్‌ను కై వసం చేసుకుంది. నాలుగో టి20లో సూర్యకుమార్ సేన 20 పరుగుల తేడాతో ఆస్ట్రేలియాపై నెగ్గింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 174 పరుగులు చేసింది. రింకూ సింగ్ (29 బంతుల్లో 46; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), యశస్వి జైస్వాల్ (27 బంతుల్లో 37; 6 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. డ్వార్‌షుయిస్ 3, బెహ్రెన్‌డార్ఫ్, సంఘా చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం ఆసీస్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 154 పరుగులే చేయగలిగింది. కెప్టెన్ మాథ్యూ వేడ్ (23 బంతుల్లో 36 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఓపెనర్ ట్రవిస్ హెడ్ (16 బంతుల్లో 31; 5 ఫోర్లు, 1 సిక్స్) మెరుగ్గా ఆడారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అక్షర్ (3/16) స్పిన్‌తో, దీపక్ (2/44) పేస్‌తో దెబ్బ తీశారు. నాలుగో టి20లో భారత్ 4 మార్పులతో బరిలోకి దిగింది.



జితేశ్

తిలక్ వర్మ, ఇషాన్ కిషన్, ప్రసిధ్‌కృష్ణ, అర్ష్‌దీప్ స్థానాల్లో శ్రేయస్ అయ్యర్, జితేశ్ శర్మ, ముకేశ్ కుమార్, దీపక్ చహర్ తుది జట్టులోకి వచ్చారు. ఆస్ట్రేలియా కూడా నాలుగు మార్పులు చేసింది. క్రిస్ గ్రీన్, మెక్‌డెర్మాట్, డ్వార్‌షుయిస్, ఫిలిప్ తుది జట్టులో ఆడారు.

రాణించిన రింకూ, జితేశ్

ఓపెనర్లు యశస్వి, రుతురాజ్ (28 బంతుల్లో 32; 3 ఫోర్లు, 1 సిక్స్) తొలి వికెట్‌కు 50 పరుగులు జోడించిన తర్వాత తడబడింది. స్వల్ప వ్యవధిలో జైస్వాల్, శ్రేయస్ అయ్యర్ (8), సూర్యకుమార్ (1) అవుటయ్యారు. 13వ ఓవర్లో జట్టు స్కోరు వంద దాటింది. కాసేపటికి రుతురాజ్ ఆటను సంఘా ముగించాడు. ఈ దశలో రింకూ సింగ్, జితేశ్ శర్మ (19 బంతుల్లో 35; 1 ఫోర్, 3 సిక్స్‌లు) ధాటితో భారత్ ఆ మాత్రం స్కోరు చేసింది. అయితే ధనాధన్ బాదాల్సిన డెత్ ఓవర్లలో 8 బంతుల వ్యవధిలోనే భారత్ 5 వికెట్లను కోల్పోయింది. 19వ ఓవర్లో జితేశ్‌తో పాటు అక్షర్ పటేల్ (0), ఆఖరి ఓవర్లో రింకూ సింగ్, దీపక్ చహర్ (0), రవి బిష్ణోయ్ (4) అవుటయ్యారు.

అక్షర్ స్పిన్ వలలో...

ఆసీస్ లక్ష్య ఛేదనను ధాటిగా ఆరంభించింది. 3 ఓవర్లలోనే చకచకా 40 పరుగులు చేసింది. ఇంతవరకు బాగానే ఉన్నా... నాలుగో ఓవర్ నుంచి ఆట రూటు ఒక్కసారిగా మారింది. ఫిలిప్ (8)ను స్పిన్నర్ రవి బిష్ణోయ్ పడేయగా... అక్షర్ కట్టుదిట్టమైన బౌలింగ్‌తో హెడ్‌తో పాటు మెక్‌డెర్మాట్ (19), హార్డి (8)లను పడగొట్టడంతో ఆసీస్ కష్టాల్లో పడింది. తర్వాత వచ్చిన వారిలో కెప్టెన్ వేడ్ తప్ప ఇంకెవరూ భారత బౌలింగ్‌ను ఎదుర్కోలేకపోయారు. చెప్పుకోదగ్గ పరుగులు చేయలేకపోయారు.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: యశస్వి (సి) మెక్‌డెర్మాట్ (బి) హార్డి 37; రుతురాజ్ (సి) డ్వార్‌షుయిస్ (బి) సంఘా 32; అయ్యర్ (సి) క్రిస్ గ్రీన్ (బి) సంఘా 8; సూర్యకుమార్ (సి) వేడ్ (బి) డ్వార్‌షుయిస్ 1; రింకుసింగ్ (ఎల్బీ) (బి) బెహ్రెన్‌డార్ఫ్ 46; జితేశ్ (సి) హెడ్ (బి) డ్వార్‌షుయిస్ 35; అక్షర్ (సి) సంఘా (బి) డ్వార్‌షుయిస్ 0; చహర్ (సి) క్రిస్ గ్రీన్ (బి) బెహ్రెన్‌డార్ఫ్ 0; బిష్ణోయ్ రనౌట్ 4; అవేశ్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 10; మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 174. వికెట్ల పతనం: 1–50, 2–62, 3–63, 4–111, 5–167, 6–168, 7–168, 8–169, 9–174. బౌలింగ్: హార్డి 3–1–20–1, బెహ్రెన్‌డార్ఫ్ 4–0–32–2, బెన్ డ్వార్‌షుయిస్ 4–0–40–3, క్రిస్ గ్రీన్ 4–0–36–0, తన్వీర్ సంఘా 4–0–30–2, మాథ్యూ షార్ట్ 1–0–10–0. ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: హెడ్ (సి) ముకేశ్ (బి) అక్షర్ 31; ఫిలిప్ (బి) బిష్ణోయ్ 8; మెక్‌డెర్మాట్ (బి) అక్షర్ 19; హార్డి (బి) అక్షర్ 8; డేవిడ్ (సి) యశస్వి (బి) చహర్ 19; షార్ట్ (సి) యశస్వి (బి) చహర్ 22; వేడ్ నాటౌట్ 36; డ్వార్‌షుయిస్ (బి) అవేశ్ 1; క్రిస్‌గ్రీన్ నాటౌట్ 8; ఎక్స్‌ట్రాలు 8; మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 154. వికెట్ల పతనం: 1–40, 2–44, 3–52, 4–87, 5–107, 6–126, 7–133. బౌలింగ్: దీపక్ చహర్ 4–0–44–2, ముకేశ్ 4–0–42–0, రవి బిష్ణోయ్ 4–0–17–1, అక్షర్ పటేల్ 4–0–16–3, అవేశ్ ఖాన్ 4–0–33–1.

హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలో...

ఇంగ్లండ్, ఆస్ట్రేలియాలతో సిరీస్‌లకు భారత మహిళల జట్లు



ముంబై: సొంతగడ్డపై భారత మహిళల క్రికెట్ జట్టు ఆడే రెండు కీలక సిరీస్‌ల కోసం బీసీసీఐ శుక్రవారం జట్లను ప్రకటించింది. ఈ రెండు టీమ్‌లకు కూడా హర్మన్‌ప్రీత్ కౌర్ నాయకత్వం వహిస్తుంది. ఇంగ్లండ్‌తో 3 టి20 మ్యాచ్‌ల సిరీస్‌లో తలపడే భారత జట్టు ఆ తర్వాత ఇంగ్లండ్, ఆస్ట్రేలియాలతో ఒక్కో టెస్టు మ్యాచ్ ఆడుతుంది. ఆసీస్‌తో టి20 సిరీస్‌కు టీమ్‌ను తర్వాత ప్రకటిస్తారు. ఈ మ్యాచ్‌లన్నీ ముంబై వేదికగానే జరుగుతాయి. ఈ నెల 6న భారత్, ఇంగ్లండ్ మధ్య తొలి టి20 జరుగుతుంది.

ఇంగ్లండ్‌తో టి20లకు జట్టు: హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), స్మృతి మంధాన, జెమీమా, షఫాలీ, దీప్తి శర్మ, యస్తిక, రిచా ఘోష్, అమన్‌జోత్, శ్రేయాంక, మన్నత్ కశ్యప్, సైకా ఇషాక్, రేణుకా సింగ్, టిటాస్ సాధు, పూజ వస్త్రకర్, కనిక అహుజా, మిన్ను మని.

ఇంగ్లండ్, ఆసీస్‌లతో టెస్టులకు జట్టు: హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), స్మృతి మంధాన, జెమీమా, షఫాలీ, దీప్తి శర్మ, యస్తిక, రిచా ఘోష్, స్నేహ్ రాణా, శుభ సతీశ్, హర్లీన్ డియోల్, సైకా ఇషాక్, రేణుకా సింగ్, టిటాస్ సాధు, రాజేశ్వరి గైక్వాడ్, పూజ వస్త్రకర్

భారత మహిళల ఓటమి



సాంటియాగో (చిలీ): హాకీ మహిళల జూనియర్ ప్రపంచకప్‌లో తొలి మ్యాచ్‌లో ఘన విజయం సాధించిన భారత్‌కు తర్వాతి మ్యాచ్‌లో ఓటమి ఎదురైంది. టోర్నీ రెండో పోరులో జర్మనీ 4–3 గోల్స్ తేడాతో భారత మహిళల జట్టును ఓడించింది. భారత్ తరఫున అన్ను (11వ నిమిషం), రోప్నీ కుమారి (14వ ని.), ముంతాజ్ ఖాన్ (24వ ని.) గోల్స్ కొట్టగా...జర్మనీ తరఫున లౌరా ప్లూత్ (21వ నిమిషం, 36వ ని.), సోఫియా స్వాబ్ (17వ ని.), కరోలిన్ సీడెల్ (38వ ని.) గోల్స్ సాధించారు. తొలి క్వార్టర్‌లోనే 2 గోల్స్ సాధించి ముందంజలో నిలిచిన భారత్ మ్యాచ్ అర్ధ భాగం ముగిసే సరికి కూడా 3–2తో ఆధిక్యంలోనే ఉంది. అయితే అనూహ్యంగా పుంజుకున్న జర్మనీ రెండో అర్ధభాగంలో రెండు నిమిషాల వ్యవధిలో 2 గోల్స్ కొట్టింది. ఆఖరి క్వార్టర్‌లో ఇరు జట్లూ పోరాడినా ఒక్క గోల్ నమోదు కాకపోగా, జర్మనీ తమ ఆధిక్యాన్ని చివరి వరకు నిలబెట్టుకుంది. భారత్ తమ తర్వాతి మ్యాచ్‌లో బెల్జియంతో తలపడుతుంది.

సెమీస్‌లో ప్రియాన్షు

లక్నో: సయ్యద్ మోడి ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పురుషుల సింగిల్స్‌లో భారత ఆటగాడు ప్రియాన్షు రజావత్ సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. శుక్రవారం జరిగిన క్వార్టర్స్ మ్యాచ్‌లో ప్రియాన్షు 21–15, 21–16 స్కోరుతో అల్వి ఫర్హాన్ (ఇండోనేసియా)పై విజయం సాధించాడు. 49 నిమిషాల పాటు సాగిన ఈ పోరులో వరల్డ్ జూనియర్ చాంపియన్ ఫర్హాన్‌పై ప్రియాన్షుదే పైచేయి అయింది. మహిళల డబుల్స్‌లో భారత జోడి అశ్విని పొన్నప్ప – తనీషా క్రాస్టో సెమీస్ చేరింది. క్వార్టర్స్‌లో అశ్విని – తనీషా 21–19, 21–8తో భారత్‌కే చెందిన గాయత్రి గోపీచంద్ – ట్రిసా జాలీని ఓడించారు.

అక్కడ అన్వయ్... ఇక్కడ సమిత్...



అన్వయ్



భారత క్రికెట్ జట్టు హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ తన భార్య విజితతో కలిసి ఉన్న ఈ చిత్రం మైసూర్‌లోనిది. ద్రవిడ్ పెద్ద కుమారుడు సమిత్ ఇక్కడ జరుగుతున్న బీసీసీఐ దేశవాళీ టోర్నీ (అండర్–19) కూచ్ బెహర్ ట్రోఫీలో కర్నాటక తరఫున ఆడుతున్నాడు. ఉత్తరాఖండ్‌తో జరుగుతున్న ఈ మ్యాచ్‌ను ప్రత్యక్షంగా చూసేందుకు ద్రవిడ్ వచ్చాడు. మరో వైపు విజయవాడలో జరుగుతున్న అండర్–16 విజయ్‌మర్చంట్ ట్రోఫీలో ద్రవిడ్ చిన్న కుమారుడు అన్వయ్ బరిలో ఉన్నాడు. ఉత్తరాఖండ్‌తోనే జరుగుతున్న ఈ మ్యాచ్‌లో తొలి రోజు కెప్టెన్, వికెట్‌కీపర్ అయిన అన్వయ్ 59 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు.

కోస్తాంధ్రపై మిచాంగ్ తుపాను పడగ!

5న నెల్లూరు-మచిలీపట్నం మధ్య తీరాన్ని దాటే అవకాశం

సాక్షి, విశాఖపట్నం/ సాక్షి, అమరావతి: బంగాళా ఖాతంలో ఏర్పడనున్న తుపాను కోస్తాంధ్రపై పడగ విప్పనుంది. రాయలసీమలోనూ పెను ప్రభావం చూపనుంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తోంది. తుపాను ప్రభావిత జిల్లాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించింది. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసింది. తాడేపల్లిలో రాష్ట్ర కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, ఫోన్ నంబర్లను ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది. విపత్కర పరిస్థితుల్లో ప్రజలను రక్షించేందుకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధం చేసింది. నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం శుక్రవారం రాత్రికి నెల్లూరుకు ఆగ్నేయంగా 790, బాపట్లకు దక్షిణ ఆగ్నేయంగా 860, మచిలీపట్నానికి దక్షిణ ఆగ్నేయంగా 850 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఇది పశ్చిమ వాయవ్య దిశగా పయనిస్తూ శనివారం నాటికి తీవ్ర వాయుగుండంగా మారనుంది. అనంతరం పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ ఆదివారం నాటికి తుపానుగా బలపడుతుంది. ఆపై వాయవ్య దిశగా పయనిస్తూ ఈనెల 4వ తేదీకి దక్షిణ కోస్తాంధ్ర తీరానికి చేరుకుంటుంది. అనంతరం ఉత్తర దిశగా కదులుతూ ఐదో తేదీ ఉదయం నెల్లూరు – మచిలీపట్నం మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. రానున్న రెండు రోజులు గంటకు 50 నుంచి 60 కి.మీలు, తీరాన్ని దాటే సమయంలో గంటకు 80–90 కి.మీలు, గరిష్టంగా 100 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. ఈ తుపానుకు మయన్మార్ సూచించిన 'మిచాంగ్'గా నామకరణం చేయనున్నారు. తుపాను ప్రభావం శనివారం నుంచి మొదలై ఈ నెల ఐదో తేదీ వరకు కొనసాగనుంది.



తుపాను గమ్యాన్ని తెలిపే సైక్లోన్‌ట్రాక్

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

తుపాను నేపథ్యంలో తాడేపల్లిలోని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో స్టేట్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ ఎండీ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. ఇక్కడి నుంచి ఎప్పటికప్పుడు పరిస్థితులు పర్యవేక్షిస్తామన్నారు. జిల్లాల యంత్రాంగాన్ని ఇప్పటికే అప్రమత్తం చేసినట్లు తెలిపారు. ప్రజలు అత్యవసర సహాయం, వాతావరణ సమాచారం కోసం 24 గంటలు అందుబాటులో ఉండే స్టేట్ కంట్రోల్ రూమ్ నంబర్లు **1070, 112, 18004250101**లో సంప్రదించాలని తెలిపారు.

'ముందు జాగ్రత్తలు తీసుకోండి'

సాక్షి, అమరావతి: తుపాను నేపథ్యంలో ముందు జాగ్రత్తలు తీసుకోవాలని కేంద్ర కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబ ఆదేశించారు. తుపానును ఎదుర్కోవడానికి చేపట్టాల్సిన చర్యలపై ఆయన శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి, డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులతోపాటు ఒడిశా, తమిళనాడు, పుదుచ్చేరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తుపాను నేపథ్యంలో ప్రాణ, ఆస్తి నష్టాలను కనిష్ట స్థాయికి పరిమితం చేసేలా పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని రాజీవ్ గౌబ సూచించారు.

పూర్తి సన్నద్ధంగా ఉన్నాం..

తుపానును సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ముందు జాగ్రత్తలతో పూర్తి సన్నద్ధంగా ఉన్నామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి కేంద్ర కేబినెట్ కార్యదర్శికి వివరించారు. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్లను పూర్తి స్థాయిలో అప్రమత్తం చేశామని తెలిపారు. 2 ఎన్డీఆర్ఎఫ్, 6 ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచామన్నారు. అలాగే పౌరసరఫరాల విభాగం ద్వారా నిత్యావసర సరుకులను పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచామని వివరించారు. బలహీనంగా ఉన్న ఏటిగట్లు, వంతెనలు తదితర ప్రాంతాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాల్సిందిగా ఇప్పటికే అధికారులకు ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. తుపాను ప్రభావంతో ఎలాంటి పరిస్థితులు తలెత్తినా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సన్నద్ధతతో ఉందన్నారు. ఈ నెల 4న చెన్నై– మచిలీపట్నం మధ్య తుపాను తీరాన్ని తాకొచ్చన్నారు. ఆ సమయంలో గంటకు 80 నుంచి 100 కి.మీల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం నుంచి మత్స్యకారులు ఎవరూ సముద్రంలోకి చేపల వేటకు వెళ్లవద్దని ఇప్పటికే హెచ్చరించామన్నారు.

నడి సముద్రంలో తప్పిన పెనుముప్పు

భైరవపాలెం సముద్రతలంపై బోటు దగ్ధం



- తృటిలో తప్పించుకున్న 11 మంది మత్స్యకారులు
- రక్షించిన తోటి మత్స్యకారులు, రిలయన్స్ సిబ్బంది
- ఒడ్డుకు చేర్చిన కోస్ట్‌గార్డ్ బృందం..రూ.70 లక్షలు ఆస్తి నష్టం

కాకినాడ క్రైం: భారీ మత్స్య సంపదతో తీరానికి చేరుతున్నామని పట్టరాని ఆనందంలో ఉన్న 11 మంది మత్స్యకారుల తలరాత క్షణాల్లో మారిపోయింది. ఆనందపు అంచుల నుంచి ఒక్కసారిగా మృత్యు ఒడికి దాదాపుగా జారుకున్నారు. సంద్రపు అలని తలదన్నే ఎత్తులో అగ్నికీలలు ఆకాశాన్ని తాకుతుంటే నివ్వెరపోయారు. ఆ కీలలన్నీ తమ బోటు నుంచేనని తెలిసే లోపే మంటల్లో చిక్కుకున్నారు. తక్షణమే లైఫ్ జాకెట్లు వేసుకుని సముద్రంలోకి దూకేశారు. ఒకొక్కరూ గంటకు పైగా మృత్యువుతో పోరాడారు. చివరికి అటుగా వచ్చిన సహ మత్స్యకారులు, కార్పొరేట్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న మరో బోటులోని సిబ్బంది.. వారి ప్రాణాలు కాపాడి తమ బోటులోకి చేర్చుకున్నారు. ఈ ఘటన కాకినాడ జిల్లాలోని ఓడలరేవు తీరం భైరవపాలెం సముద్ర ఉపరితలంలో శుక్రవారం జరిగింది. కాకినాడలోని జగన్నాథపురం, ఏటిమొగకు చెందిన 11 మంది కాకినాడ ఫిషింగ్ హార్బర్ నుంచి ఈ నెల 1న బోటులో చేపల వేటకు వెళ్లారు. ఈ బోటు యజమాని పరం రామకృష్ణ. నారాయణ అనే మత్స్యకారుడు బోటు మాస్టర్. ఈ 11 మంది కాకినాడ తీరం నుంచి సుదూరానికి వెళుతూ...వెళ్లే దారిలో తిరుగు ప్రయాణంలో భైరవపాలెం వద్ద ఒక భారీ వల వేశారు. సముద్ర తీరంలో 135 నాటికల్ మైళ్ల దూరంలో వేటలో ఉండగా గురువారం రాత్రి కోస్ట్ గార్డ్ బృందం తుఫాను హెచ్చరికలు చేసి తీరానికి వెళ్లిపోవాలని వీరిని అప్రమత్తం చేసింది. వీరు శుక్రవారం తెల్లవారుజామున కాకినాడ తీరానికి బయల్దేరారు. భైరవపాలెంలో వేసిన వల తీసేందుకు వెళ్లి ఆ దారిలో కాకినాడ తీరం వైపుగా వెళ్లాలని అనుకున్నారు. భైరవపాలెంలో వల తీస్తుండగా అప్పటికే వేడెక్కి ఉన్న ఇంజన్ నుంచి ఇంధనం ట్యాంకులకు అనుసంధానం చేసిన పైపుల నుంచి డీజిల్ చిమ్మింది. గొట్టాల పరిసరాలన్నీ ఇంధనంతో తడిసి..ఇంధన ట్యాంక్‌పై చమురు చిమ్మి మంటలు అంటుకున్నాయి. ఈ మంటలు దావనలంలా వ్యాపించాయి. ఓడ పూర్తిగా దగ్ధమై నీట మునిగిపోతున్న చివరి క్రమంలో వీరు సముద్రంలోకి దూకేశారు. సరిగ్గా అటుగా వస్తున్న మత్స్యకార బృంద ఈ11 మందిని చూశారు. రిలయన్స్ సిబ్బందితో కలిసి వారు 11 మందిని రక్షించారు. కోస్ట్‌గార్డ్ సిబ్బంది మత్స్యకారులను ఐసీజీఎస్ చార్లీ–438 షిప్ ద్వారా కాకినాడ తీరానికి చేర్చారు. కోస్ట్‌గార్డ్ అసిస్టెంట్ కమాండెంట్ విశ్వాస్ తాపా ఆధ్వర్యంలో 10 మంది కోస్ట్ గార్డు సిబ్బంది మత్స్యకారుల్ని కాకినాడ తీరానికి చేర్చారు. మొత్తం రూ.70 లక్షలు ఆస్తి నష్టం జరిగింది. ఈ ఘటనపై ఓడలరేవు మెరైన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.



ప్రాణాలతో బయటపడ్డ మత్స్యకార బృందం

మృత్యుంజయులు వీరే...

బొమ్మిడి వీరబాబు, సంగాడి నారాయణ, పెమ్మాడి సత్యం, చెక్కా నాగూర్, పాలెపు నూకరాజు, పినపోతు తాతారావు, ఆదం ధనరాజు, కొప్పిడి సత్యనారాయణ, పంతాడి సతీష్, పినపోతు ధర్మరాజు, దోమ వీరబాబు

క్లుప్తంగా...

స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల కాలపరిమితి పొడిగింపు


సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల నిర్వహణలో అంతర్భాగంగా ఉన్న తల్లిదండ్రుల కమిటీ(స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ) పదవీ కాలాన్ని వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం వరకు పొడిగించారు. పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ ఉత్తర్వులు జారీ చేశారు. 2024–25 విద్యా సంవత్సరం కొత్త కమిటీలు ఏర్పాటయ్యే వరకు ఈ కమిటీలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

డివిజన్‌కు ఒక డీవైఈవో

సాక్షి, అమరావతి: పాఠశాల విద్యాశాఖలో పారదర్శకత, మెరుగైన ఫలితాల కోసం ప్రతి రెవెన్యూ డివిజన్‌కు ఒక డిప్యూటీ ఎడ్యుకేషనల్ అధికారులను ప్రభుత్వం నియమించనున్నది. ఈమేరకు పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో రాష్ట్రంలో 53 డివిజన్లు ఉండగా, వాటిని 74కు పెంచారు. దీంతో మరో 21 డీవైఈవో పోస్టులు భర్తీ చేయనున్నారు.

నేటినుంచి విశాఖలో లెజెండ్స్ క్రికెట్

ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపినాథరెడ్డి



విశాఖ స్పోర్ట్స్: వైఎస్సార్ స్టేడియంలో ముగిసే లీగ్ దశ చివరి ఫేజ్‌లో తొలి నాలుగు స్థానాల్లో నిలిచే జట్లు ఎల్ఎల్‌సీ నాకవుట్‌కు చేరుకుంటాయని ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపినాథరెడ్డి తెలిపారు. లెజెండ్స్ లీగ్ క్రికెట్ (ఎల్ఎల్‌సీ)లో చివరి దశ పోటీల్లో భాగంగా శనివారం తలపడనున్న జట్ల ఆటగాళ్లు శుక్రవారం విశాఖ చేరుకున్నారని చెప్పారు. నాకవుట్ పోటీలు సూరత్‌లో జరుగనున్నాయన్నారు. ఇండియా కాపిటల్స్, మణిపాల్ టైగర్స్, గుజరాత్ జెయింట్స్‌తో పాటు సదరన్ సూపర్‌స్టార్స్ జట్ల సభ్యులు విశాఖ చేరుకోగా ఎయిర్‌పోర్టులో ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ ఘనంగా స్వాగతం పలికిందని తెలిపారు. అర్బన్‌రైజర్స్ జట్టు శనివారం విశాఖ చేరుకోనుందని చెప్పారు.

విశాఖలో మ్యాచ్‌లు..

శనివారం రాత్రి ఏడుగంటలకు ఇండియా కాపిటల్స్ జట్టుతో మణిపాల్ టైగర్స్ తలపడనుండగా, ఆదివారం మధ్యాహ్నం మూడుగంటలకు గుజరాత్ జెయింట్స్‌తో సదరన్ సూపర్ స్టార్స్ జట్టు తలపడనుంది. 4వ తేదీ రాత్రి ఏడుగంటలకు లీగ్ దశలో చివరి మ్యాచ్ రాత్రి ఏడుగంటలకు మణిపాల్ టైగర్స్‌తో అర్బన్ రైజర్స్ హైదరాబాద్ జట్టు తలపడనుంది.

నేటి నుంచి మావోయిస్టుల పీఎల్‌జీఏ వారోత్సవాలు

- ఏవోబీలో పోలీస్ బలగాల భద్రతా చర్యలు



సాక్షి, పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): మావోయిస్టు పార్టీ పీఎల్‌జీఏ వారోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఆంధ్ర, ఒడిశా బోర్డర్(ఏవోబీ)లో పోలీస్ బలగాలు భద్రతా చర్యలు చేపట్టాయి. ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. సీఆర్‌పీఎఫ్, గ్రేహౌండ్స్, క్యాప్ పార్టీల పోలీస్ బలగాలు విస్తృతంగా కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. జిల్లాలోని చింతూరుకు సరిహద్దులోని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మావోయిస్టుల కదలికలు ఉన్న నేపథ్యంలో అక్కడ కూడా పోలీస్ బలగాలు సరిహద్దులో గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి. ఎస్పీ తుహిన్‌సిన్హా ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలలోని మావోయిస్టు ప్రభావిత జిల్లాల ఎస్పీలతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.మావోయిస్టుల వారోత్సవాలు ముగిసేంత వరకు ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల నేతలు మారుమూల గ్రామాల పర్యటనలు రద్దు చేసుకుని, సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని నోటీసులు జారీ చేసినట్లు ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు.

తెలంగాణ

రిగ్గింగ్ ఆరోపణలు అవాస్తవం

- కొన్ని కేంద్రాల్లో రాత్రి 9.30 వరకు కొనసాగిన ఓటింగ్
- అందుకే పోలింగ్ శాతం పెరిగింది: సీఈఓ వికాస్‌రాజ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభకు గురువారం జరిగిన ఎన్నికల్లో పెద్ద ఎత్తున రిగ్గింగ్ జరగడంతోనే సాయంత్రం 5 గంటల తర్వాత పోలింగ్ శాతం భారీగా పెరిగిందన్న ఆరోపణలను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) వికాస్‌రాజ్ తోసిపుచ్చారు. రాష్ట్రంలోని కొన్ని పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 9.30 గంటల వరకు ఓటింగ్ కొనసాగడంతోనే పోలింగ్ శాతం పెరిగిందని చెప్పారు. శుక్రవారం వికాస్‌రాజ్ తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 13 వామపక్ష తీవ్రవాద ప్రభావిత నియోజకవర్గాల్లో సాయంత్రం 4 గంటలకు, మిగతా చోట్ల సాయంత్రం 5 గంటలకే పోలింగ్ సమయం ముగిసినా.. అప్పటికే పోలింగ్ కేంద్రాలకు చేరుకుని క్యూలైన్లలో నిలబడిన వారందరికీ నిబంధనల ప్రకారం ఓటేసే అవకాశం కల్పించామని వివరించారు. అందువల్ల ఆయాచోట్ల రాత్రి 9.30 గంటల వరకు పోలింగ్ జరిగిందని, అధికారులు ఈవీఎంలు, ఇతర సామాగ్రిని సర్దుకుని రిసెప్షన్ కేంద్రాలకు చేరుకునే సరికి మరింత ఆలస్యమైందని చెప్పారు. ప్రాథమిక స్క్రూటినీ తర్వాతే 70.6 శాతం పోలింగ్ జరిగినట్టు ప్రాథమికంగా అంచనాకు వచ్చామని తెలిపారు. శుక్రవారం అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో తుది స్క్రూటినీ నిర్వహిస్తున్నారని వివరించారు. స్క్రూటినీ ముగిశాకే కచ్చితమైన పోలింగ్ శాతంతో పాటు రిగ్గింగ్ ఆరోపణల్లో నిజానిజాలపై స్పష్టత వస్తుందన్నారు. చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని తెలిపారు.

భారీగా పెరిగిన పోస్టల్ బ్యాలెట్లు

ఈసారి పోస్టల్ బ్యాలెట్ల ఓటింగ్ గణనీయంగా పెరిగిందని వికాస్‌రాజ్ తెలిపారు. 16,005 మంది 80 ఏళ్లకు పైబడిన ఓటర్లు, 9,459 మంది దివ్యాంగ ఓటర్లు, 1.80 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకున్నారని వివరించారు. ఈ నెల 3న ఓట్ల లెక్కింపు కోసం ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 33 కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, కేంద్ర బలగాలు, రాష్ట్ర సాయుధ రిజర్వ్‌డ్ బలగాలు, రాష్ట్ర పోలీసులతో మూడంచెల భద్రత ఏర్పాటు చేస్తున్నమని వివరించారు. కౌంటింగ్‌లో తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించి తర్వాత ఈవీఎంలో నిక్షిప్తమైన ఓట్లను లెక్కిస్తారని తెలిపారు. ఒకవేళ పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు అధిక సమయం పడితే.. సమాంతరంగా ఈవీఎం ఓట్ల లెక్కింపూ మొదలవుతుందని వివరించారు. ఉదయం 10.30 గంటలకల్లా కౌంటింగ్‌లో ముందంజలో ఉన్న అభ్యర్థుల విషయంలో స్పష్టత వస్తుందని వికాస్‌రాజ్ అంచనా వేశారు. కాగా, తెలంగాణ రాష్ట్ర నిర్వహణలో ఉన్న నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి సగభాగాన్ని ఏపీ ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న ఘటనకు రాష్ట్ర శాసనసభ ఎన్నికలతో ఎలాంటి సంబంధం లేదని వికాస్‌రాజ్ స్పష్టం చేశారు. డీప్ ఫేక్, ఇతర తప్పుడు ప్రచారాల ఆరోపణలపై సోషల్ మీడియాలోని 120 లింక్‌లను తొలగించామన్నారు.

కాంగ్రెస్‌కే పూర్తి మెజారిటీ!

- ఇండియా టుడే- యాక్సిస్ మైఇండియా ఎగ్జిట్‌పోల్స్ అంచనా
- కాంగ్రెస్‌కు63–73 స్థానాలు, బీఆర్ఎస్‌కు 34–44 స్థానాలు
- బీజేపీకి 4–8 సీట్లు.. ఎంఐఎం సహా ఇతరులకు 5–8 సీట్లు

సాక్షి, హైదరాబాద్/సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మెజారిటీ సీట్లను సాధిస్తుందని ఇండియా టుడే- యాక్సిస్ మైఇండియా ఎగ్జిట్‌పోల్ సర్వే పేర్కొంది. మొత్తం 119 అసెంబ్లీ నియోజకవర్గాలకుగాను.. అధికార బీఆర్ఎస్ 32శాతం ఓట్లతో 34–44 సీట్లు వస్తాయని, కాంగ్రెస్ పార్టీ 42 శాతం ఓట్లతో 63–73 సీట్లు సాధించి అధికారంలోకి వస్తుందని అంచనా వేసింది. బీజేపీకి 14శాతం ఓట్లతో 4 నుంచి 8 సీట్లు రావొచ్చని.. ఎంఐఎం 8శాతం ఓట్లతో 5–7 సీట్లు సాధించవచ్చని తెలిపింది. రాష్ట్రంలో గురువారం పోలింగ్ ముగియగానే.. జాతీయ, ప్రాంతీయ మీడియా సంస్థలు, సర్వే సంస్థలు తమ ఎగ్జిట్ పోల్స్ సర్వేలను విడుదల చేశాయి. చాలా వరకు కాంగ్రెస్ వైపు మొగ్గ ఉన్నట్టు పేర్కొన్నాయి. ఈ క్రమంలో ఇండియా టుడే- యాక్సిస్ మైఇండియా శుక్రవారం తెలంగాణ ఎగ్జిట్ పోల్స్ ఫలితాలను ప్రకటించింది. బీఆర్ఎస్ సర్కారుపై వివిధ వర్గాల ప్రజల్లో ఏర్పడిన వ్యతిరేకత ఎగ్జిట్‌పోల్ సర్వేలో కనిపించిందని పేర్కొంది. ముఖ్యంగా సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో చాలా మందికి మళ్లీ టికెట్ ఇవ్వడం, వారిపై స్థానికంగా నెలకొన్న తీవ్ర వ్యతిరేకత ప్రభావం చూపిందని విశ్లేషించింది. ప్రాంతాల వారీగా పరిశీలన జరిపి రాష్ట్రంలో ఉత్తర, మధ్య (సెంట్రల్), దక్షిణ తెలంగాణ, హైదరాబాద్ ప్రాంతాల వారీగా ఇండియాటుడే -యాక్సిస్ ఎగ్జిట్ పోల్స్‌ను విడుదల చేసింది. ఉత్తర తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య హోరాహోరీ పోరు సాగిందని.. హైదరాబాద్‌లో బీఆర్ఎస్‌దే పైచేయిగా ఉందని వివరించింది. దక్షిణ, మధ్య తెలంగాణలలో కాంగ్రెస్ పూర్తి ఆధిపత్యాన్ని కనబరిచిందని, ఈ ప్రాంతాల నుంచే ఎక్కువ సీట్లు గెలిచే అవకాశం ఉందని పేర్కొంది. ఉత్తర తెలంగాణలో బీఆర్ఎస్‌కు 13, కాంగ్రెస్‌కు 15, బీజేపీకి 5 సీట్లు రావొచ్చని పేర్కొంది. దక్షిణ తెలంగాణలో బీఆర్ఎస్‌కు 6, కాంగ్రెస్‌కు 27, బీజేపీకి ఒక స్థానం వస్తాయని అంచనా వేసింది. మధ్య తెలంగాణలో బీఆర్ఎస్ 9, కాంగ్రెస్ 22 సీట్లు సాధించవచ్చని తెలిపింది. హైదరాబాద్‌లో బీఆర్ఎస్ 11, కాంగ్రెస్ 3, బీజేపీ 1, ఎంఐఎం 6 చోట్ల గెలిచే అవకాశాలు ఉన్నాయని అంచనా. సీఎంగా కేసీఆర్ ఉంటే బాగుంటుందని 32 శాతం మంది, రేవంత్‌రెడ్డి కావాలని 21 శాతం మంది, ఇతర కాంగ్రెస్ నాయకుడు సీఎం కావాలని 22 శాతం మంది పేర్కొన్నారు.

ఆగమెందుకు.. మళ్లీ మన సర్కారే!

ప్రగతిభవన్‌లో తనను కలిసిన నేతలతో సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: 'ఆగమాగం, పరేశాన్ ఎందుకు అయితున్నరు. మళ్లా మనమే గెలుస్తున్నం. ఈ రాష్ట్రానికి సుపరిపాలన అందించబోతున్నాం. రెండు రోజులు నిమ్మలంగా ఉండండి.3వ తేదీన అందరం కలసి సంబురాలు చేసుకుందాం' అని బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పార్టీ శ్రేణులకు సూచించారు. శుక్రవారం పొద్దంతా ఓటింగ్ సరళి, ఇతర అంశాలపై సమీక్షించిన సందర్భంగా నేతలకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. మరోవైపు ఈ నెల 4న (సోమవారం) మధ్యాహ్నం 2 గంటలకు సచివాలయంలో సీఎం కేసీఆర్ అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరుగుతుందని సీఎంవో నుంచి ప్రకటన వెలువడింది. ఆదివారం అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు జరగనుండటంతో.. సీఎం కేసీఆర్ వ్యాఖ్యలు, కేబినెట్ భేటీ నిర్వహణకు నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

ప్రగతిభవన్‌కు బారులు తీరిన నేతలు

సీఎం కేసీఆర్ గురువారం సాయంత్రమే ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రం నుంచి ప్రగతిభవన్‌కు చేరుకోగా.. శుక్రవారం ఉదయం నుంచే బీఆర్ఎస్ నేతలు ప్రగతిభవన్‌కు బారులు తీరారు. పార్టీ పార్లమెంటరీ నేత కె.కేశవరావు, మంత్రి నిరంజన్‌రెడ్డి, మధుసూదనాచారి, బాల్క సుమన్‌తోపాటు నల్గొండ, హైదరాబాద్ తదితర జిల్లాలకు చెందిన నేతలు వచ్చి సీఎం కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆదివారం వెలువడే ఎన్నికల ఫలితాలు బీఆర్ఎస్‌కే సానుకూలంగా ఉంటాయని కేసీఆర్ ధీమా వ్యక్తం చేసినట్టు తెలిసింది. నేతలంతా.. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని పేర్కొనడం గమనార్హం.

తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో నేవీ డే విన్యాసాలు వాయిదా

సాక్షి, విశాఖపట్నం: దూసుకొస్తోన్న మిచాంగ్ తుఫాన్ కారణంగా ఈ నెల 4న నిర్వహించాల్సి ఉన్న నేవీ డేను 10వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు తూర్పు నావికాదళ వర్గాలు ప్రకటించాయి. తుఫాన్ కారణంగా బాధితులకు సహాయక చర్యలందించేందుకు నౌకాదళ సిబ్బంది సిద్ధంగా ఉన్నారని, విపత్తును ఎదుర్కొన్న తర్వాతే ఉత్సవాలు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. కాగా, పాకిస్తాన్‌పై జరిగిన యుద్ధంలో విజయం సాధించినందుకు గాను ఏటా డిసెంబర్ 4న విశాఖ వేదికగా భారత నౌకాదళ దినోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ.

స్టెమీపై కార్డియాక్ వర్క్‌షాపు ప్రారంభం

- ప్రత్యేక ఎమర్జెన్సీ కేర్ యూనిట్ల ఏర్పాటు
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు

గుంటూరు మెడికల్: ప్రతి ఒక్కరి గుండె కాపాడటమే లక్ష్యంగా సీఎం జగన్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా స్టెమీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణ బాబు తెలిపారు. శుక్రవారం గుంటూరు జీజీహెచ్‌లో పలు జిల్లాలకు చెందిన వైద్యులకు స్టెమీపై కార్డియాక్ వర్క్‌షాపు జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన కృష్ణబాబు మాట్లాడుతూ స్టెమీ కార్యక్రమంపై అవగాహన ఉండాలని, శిక్షణ పొందిన వారు ప్రజల ప్రాణాలు రక్షించడమే ధ్యేయంగా పనిచేయాలన్నారు. రాష్ట్రంలో కర్నూలు, విశాఖపట్నం, గుంటూరు జీజీహెచ్‌ల్లో కార్డియాలజీ వైద్య విభాగాలు ఉన్నాయని, త్వరలో రాష్ట్రవ్యాప్తంగా 11 వైద్య కళాశాలల్లో కార్డియాలజీ వైద్య విభాగాలను ప్రారంభించేలా చర్యలు చేపట్టామని చెప్పారు. గుండె ఆపరేషన్‌లు చేసేందుకు ప్రస్తుతం కర్నూలు, కాకినాడకు క్యాథ్‌ల్యాబ్‌లు మంజూరు చేశామని, త్వరలోనే ఒంగోలు, శ్రీకాకుళం, నెల్లూరు, కడప ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏర్పాటు చేస్తామన్నారు. స్టెమీ కార్యక్రమం ద్వారా నెలరోజుల్లోనే 70 మంది గుండె పోటు బాధితుల ప్రాణాలు కాపాడామన్నారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో సైతం కార్డియాలజీ వైద్య సేవలు అందించేలా ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలో ప్రభుత్వం క్రిటికల్ కేర్ యూనిట్లు ఏర్పాటు చేస్తుందన్నారు. గుంటూరు జీజీహెచ్‌లో నాట్కో ట్రస్టు ఆధ్వర్యంలో క్యాన్సర్ రోగులకు ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఉచిత వైద్యం అందిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్, ఆరోగ్యశ్రీ సీఈఓ డాక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడారు.

ఇంటింటికీ ఆర్యోగశ్రీపై అవగాహన

రాష్ట్ర ప్రజలందరికి ఆరోగ్యశ్రీపై అవగాహన కల్పించి, పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడటమే లక్ష్యంగా శుక్రవారం నుంచి ఇంటింటికి ఆరోగ్యశ్రీ కార్యక్రమాన్ని చేపట్టామని కృష్ణబాబు తెలిపారు. జీజీహెచ్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ బ్రోచర్‌లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏఎన్ఎంలు, సీహెచ్‌ఓలు ఇంటింటికి వెళ్లి ఆరోగ్య శ్రీ పథకం గురించి వివరిస్తారని చెప్పారు. అలాగే ప్రతి ఒక్కరి ఫోన్‌లో ఆరోగ్యశ్రీ యాప్‌ను వైద్య సిబ్బంది డౌన్‌లోడ్ చేయిస్తారన్నారు. నెలరోజులపాటు ఈ అవగాహన కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

ఖైదీల్లో పరివర్తన దిశగా..

- 15 జైళ్లలో పరివర్తన కేంద్రాల ఏర్పాటు
- మూడు కేటగిరీలుగా కౌన్సెలింగ్
- రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం

సాక్షి, అమరావతి : ఖైదీల్లో సామాజిక పరివర్తన తెచ్చి వారిలో మంచి నడవడికను తీసుకొచ్చే దిశగా ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. ఇందుకోసం జైళ్లలో ప్రత్యేకంగా పరివర్తన కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. పరివర్తన కేంద్రాల ఏర్పాటు, నిర్వహణపై స్పష్టమైన మార్గదర్శకాలను విడుదల చేసింది. మొదటి దశలో 15 జైళ్లలో వాటిని ఏర్పాటు చేస్తారు. కేంద్ర కారాగారాలైన విశాఖపట్నం, రాజమహేంద్రవరం, కడప, అనంతపురంలోని ఖైదీల వ్యవసాయ కాలనీ జైలు, అలాగే జిల్లా జైళ్లు శ్రీకాకుళం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, ఒంగోలు, కర్నూలు, అనంతపురం, చిత్తూరుతో పాటు మహిళా జైళ్లు కడప, రాజమహేంద్రవరం, అవసరమైన సబ్ జైళ్లలో వీటిని ఏర్పాటుచేస్తారు.

కౌన్సెలింగ్ ఇలా..

ఈ జైళ్లలో 45 రోజుల్లో ప్రత్యేక పరివర్తన కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. ఏడాది కంటే ఎక్కువ జైలు శిక్ష పడిన ఖైదీలు, ఏడాదిలోపు జైలు శిక్ష పడిన ఖైదీలు, రిమాండ్ ఖైదీలు అనే మూడు కేటగిరీలుగా ఖైదీలకు రోజూ కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఇందుకోసం ప్రత్యేక నిపుణుల బృందాలను నియమిస్తారు. ఆ బృందంలో సామాజిక కౌన్సెలర్, స్వచ్ఛంద సంస్థ(ఎన్జీవో) ప్రతినిధి, సామాజిక సేవకులు, మానసిక వైద్య నిపుణులు, సంక్షేమ శాఖ అధికారి, ఆర్థిక రంగ నిపుణుడు సభ్యులుగా ఉంటారు. ఖైదీల్లో నిస్పృహ తొలగించడం, హింస/నేర ప్రవృత్తిని రూపుమాపడం, చట్టానికి బద్ధుడయ్యే పౌరుడిగా తీర్చిదిద్దడం, ఆర్థిక ప్రణాళిక అవసరాన్ని తెలియజేయడం, వృత్తి నైపుణ్యాలను పెంపొందించడం, సామాజికంగా గౌరవ జీవనం ఆవశ్యకతను గుర్తించడం మొదలైన అంశాలపై కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఏడాది కంటే ఎక్కువ శిక్ష పడిన ఖైదీలకు జైలుకు వచ్చిన వెంటనే, ఆ తర్వాత మొదటి 15 రోజులకు, నెల రోజులకు, ఆ తర్వాత ప్రతి 45 రోజులకోసారి కౌన్సెలింగ్ ఇస్తారు. ఏడాది కంటే తక్కువ శిక్ష పడిన ఖైదీలకు.. జైలుకు వచ్చిన వెంటనే, వారం రోజులకు, 15 రోజులకు, ఆ తర్వాత నెలకోసారి కౌన్సెలింగ్ ఇస్తారు. ఖైదీలకు కౌన్సెలింగ్ నిర్వహించి ఆ మేరకు నివేదికను ఎప్పటికప్పుడు ప్రత్యేక పోర్టల్‌లో నమోదు చేస్తారు. వారిలో సామాజిక పరివర్తన తీరును విశ్లేషించి తదనుగుణంగా తదుపరి చర్యలు తీసుకుంటారు. జైలు నుంచి విడుదలయ్యాక తుది నివేదిక కాపీని సంబంధిత పోలీస్ స్టేషన్‌కు పంపుతారు. తద్వారా జైలు నుంచి విడుదలయ్యాక ఖైదీలు ఎలాంటి సామాజిక జీవనాన్ని కొనసాగిస్తున్నారన్నది పరిశీలిస్తారు. ఈ విధంగా సమాజంలో నేరాల రేటును కూడా తగ్గించగలమని ప్రభుత్వం భావిస్తోంది.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
శనివారం ౹ 2 ౹ డిసెంబర్ ౹ 2023



సోమవారం నుంచి బెళగావి సువర్ణ సౌధలో శీతాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా శుక్రవారం సౌధ ప్రాంగణాన్ని శుభ్రపరుస్తున్న సిబ్బంది.

న్యూస్‌రీల్

చిరుత మృతి



మండ్య: గుర్తు తెలియని వాహనం ఢీకొని చిరుత మృతి చెందిన ఘటన మళవల్లి తాలూకా బాచనహళ్లి సమీపంలోని జాతీయ రహదారిపై జరిగింది. గురువారం సాయంత్రం చిరుత నడిరోడ్డుపై రక్తపు మడుగులో పడి ఉండగా స్థానికులు గమనించి పోలీసులు, అటవీ శాఖాధికారులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి దానిని కాపాడేందుకు యత్నించినా ప్రయోజనం లేకుండా పోయింది. వైద్య పరీక్షల అనంతరం అటవీ శాఖ నిబంధనల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు.


డయాగ్నోస్టిక్ సెంటర్ తప్పిదం

- రోగి ప్రాణాలకు ముప్పు

దొడ్డబళ్లాపురం: డయాగ్నోస్టిక్ సెంటర్ సిబ్బంది చేసిన తప్పిదం ఒక రోగి ప్రాణాల మీదకు తెచ్చిన సంఘటన రామనగరలో చోటుచేసుకుంది. రామనగరకు చెందిన శివమ్మ అనే మహిళ సెప్టెంబర్ 2న రామనగర జిల్లా ఆస్పత్రిలో అనారోగ్యంతో చేరారు. అంతకు ముందు ఐజూరులోని ఓ డయాగ్నోస్టిక్ సెంటర్‌లో బ్లడ్ టెస్ట్ చేయించగా బ్లడ్ గ్రూపు ఏబీ పాజిటివ్‌గా రిపోర్టులో పేర్కొన్నారు. జిల్లా ఆస్పత్రిలో రిపోర్టు ఆధారంగా శివమ్మకు రక్తం ఎక్కించారు. చికిత్స తీసుకుని ఇంటికి చేరుకున్న శివమ్మ కొన్ని రోజుల్లోనే తీవ్ర అనారోగ్యం పాలయ్యారు. నడవలేని స్థితికి చేరుకుంది. నవంబర్ 28న మళ్లీ ఆమెను జిల్లా ఆస్పత్రిలో చేర్చి రక్త పరీక్ష చేశారు. రిపోర్టులో ఆమె బ్లడ్ గ్రూపు ఏ పాజిటివ్‌గా వచ్చింది. డయాగ్నోస్టిక్ సెంటర్‌లో ఏబీ పాజిటివ్ రావడం, జిల్లా ఆస్పత్రిలో ఏ పాజిటివ్‌గా రావడంతో శివమ్మ కుమారుడు అనుమానంతో మరోసారి మరో ప్రైవేటు డయాగ్నోస్టిక్ సెంటర్‌లో బ్లడ్ టెస్ట్ చేయించగా అక్కడా ఏ పాజిటివ్ వచ్చింది. దీంతో శివమ్మ కుమారుడు గతంలో రక్త పరీక్ష చేసిన డయాగ్నోస్టిక్ సెంటర్‌కు వెళ్లి ప్రశ్నించగా నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. అనంతరం జిల్లా ఆస్పత్రి వైద్యుల సలహా మేరకు శివమ్మ కుమారుడు ఐజూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

మార్చిలో ఎస్‌ఎస్‌ఎల్‌సీ పరీక్షలు

- ద్వితీయ పీయూసీ పరీక్షలు కూడా
- తాత్కాలిక టైం టేబుల్ విడుదల



శివాజీనగర: ఎస్‌ఎస్‌ఎల్‌సీ, ద్వితీయ పీయూసీ వార్షిక పరీక్ష-1 తాత్కాలిక టైంటేబుల్‌ను కర్ణాటక పాఠశాల పరీక్ష, స్పాట్ వ్యాల్యు నిర్ణయ మండలి విడుదల చేసింది. దీనిపై అభ్యంతరాలు ఉంటే ఈనె 15లోపు తెలియజేయాలని కోరింది. 2024 మార్చి 25 నుంచి ఏప్రిల్ 6 వరకు ఎస్‌ఎస్‌ఎల్‌సీ పరీక్షలు జరుగుతాయి. అదే విధంగా 2024 మార్చి 2 నుంచి అదేనెల 22 వరకు ద్వితీయ పీయూసీ వార్షిక పరీక్షలు జరుగుతాయి.

ఎస్‌ఎస్‌ఎల్‌సీ:

మార్చి 25న-ప్రథమ భాష (కన్నడ), మార్చి 27-సాంఘిక శాస్త్రం, మార్చి 30న-సైన్స్, ఏప్రిల్ 2న -గణితం, ఏప్రిల్ 4-తృతీయ భాష (హిందీ) ఏప్రిల్-6-ద్వితీయ భాష (ఇంగ్లిష్)

ద్వితీయ పీయూసీ:

మార్చి 2-కన్నడ, అరబిక్, మార్చి 4న-చరిత్ర, భౌతిక శాస్త్రం, మార్చి5-ఇన్ఫర్మేషన్ సాంకేతిక పరిజ్ఞానం, రిటైల్, హెల్త్‌కేర్, మార్చి 6-సాంఘిక శాస్త్రం, మార్చి 7-హిందీ, మార్చి 9-రాజనీతి శాస్త్రం, సంఖ్యా శాస్త్రం, మార్చి 11-ఇంగ్లిష్, మార్చి 12-తమిళు, తెలుగు, మలయాళం, మరాఠి, ఉర్దూ, సంస్కృతం, ఫ్రెంచ్, మార్చి 13-తర్కశాస్త్రం, మార్చి 14-గణితం, మార్చి 16-భూగోళశాస్త్రం, జీవశాస్త్రం, మార్చి 18-రసాయన శాస్త్రం, మార్చి 20 లెక్కశాస్త్రం, భూగర్భ శాస్త్రం, మార్చి 22-అర్థశాస్త్రం.

ఉలిక్కిపడిన సిలికాన్ సిటీ

- బాంబు బెదిరింపుతో పాఠశాలలకు పరుగులు తీసిన తల్లిదండ్రులు
- ఉత్తిదే అని తేలడంతో ఊపిరి పీల్చుకున్న బెంగళూరు ప్రజలు
- గతంలోనూ ఉత్తుత్తి బాంబు బెదిరింపులు



చామరాజపేటె భవన బెంగళూరు ప్రెస్ స్కూల్ ఆవరణలో విద్యార్థులు

బనశంకరి: ఉదయం పిల్లలను పాఠశాలలకు పంపిన తల్లిదండ్రులు తమ దైనందిన కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. అంతలోనే పిడుగులాంటి వార్త వారి చెవిన పడింది. గుర్తు తెలియని వ్యక్తులు 60 స్కూళ్లలో బాంబు పెట్టినట్లు ఉదయం 9గంటల సమయంలో వార్తలు రావడంతో నగరమంతా ఒక్కసారిగా ఉలిక్కి పడింది. బాంబు వార్త విని భయాందోళన చెందిన తల్లిదండ్రులు ఒక్కసారిగా పాఠశాలలకు పరుగులు తీశారు. తమ పిల్లలు ఎలా ఉన్నారో అంటూ ప్రాణాలు చేతిలో పెట్టుకొని బస్సులు, వాహనాల్లో తరలివెళ్లారు. అయితే ఉత్తుత్తి బాంబు బెదిరింపు అని తేలడంతో ఊపిరి పీల్చుకున్నారు. బసవేశ్వరనగర బసవేశ్వరనగర నేషనల్, విద్యాశిల్ప, సదాశివనగర పూర్ణప్రజ్ఞ, యలహంక పాఠశాలతో పాటు 60 కి పైగా ప్రైవేట్ పాఠశాలలకు ఉదయం 9గంటలకు ఈ-మెయిల్ వచ్చింది. స్కూళ్లలో బాంబులు పెట్టినట్లు అందులోని సారాంశం. దీంతో పాఠశాలల యజమాన్యం విద్యార్థులను పాఠశాలల గదులనుంచి బయటకు పంపించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. పోలీసులు, బాంబు స్క్వాడ్ సిబ్బంది చేరుకుని అణుఅణువునా క్షుణ్ణంగా గాలించారు.

గతంలోనూ బెదిరింపు ఘటనలు

నగర పోలీస్ కమిషనర్ దయానంద్ విలేకరులతో మాట్లాడుతూ నకిలీ బాంబు బెదిరింపు అని ప్రాథమిక దర్యాప్తులో తెలిసిందన్నారు. తమ పోలీస్ సిబ్బంది, బాంబుస్క్వాడ్ సిబ్బంది పాఠశాలలకు చేరుకొని తనిఖీలు చేశారన్నారు. గత ఏడాది ఇదే రోజు నగరంలోని 30 పాఠశాలల్లో బాంబు పెట్టినట్లు ఇ-మెయిల్ ద్వారా బెదిరించారన్నారు. మహాదేవపుర గోపాలన్ ఇంటర్నేషనల్ స్కూల్, వర్తూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఢిల్లీ పబ్లిక్‌స్కూల్, మారతహళ్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని న్యూ అకాడమి స్కూల్, హెణ్ణూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని సెయింట్‌విన్సెంట్ పాల్‌స్కూల్, గోవిందపుర పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇండియన్‌పబ్లిక్ స్కూల్‌లో బాంబు పెట్టినట్లు దుండగులు బెదిరింపుకాల్‌చేశారన్నారు. ఇవి ఒట్టి బెదిరింపులేనని, విద్యార్థుల తల్లిదండ్రులు భయపడాల్సిన అవసరం లేదన్నారు.

భయాందోళన వద్దు:

ఇంట్లో వ్యాయామం చేస్తుండగా టీవీలో న్యూస్ చూసి భయపడి బయటికి వచ్చానని డిప్యూటీ సీఎం శివకుమార్ తెలిపారు. తమ ఇంటి వద్ద నర్సరీ స్కూల్‌కు బాంబు బెదిరింపు ఈ-మెయిల్ వచ్చిందని, వెంటనే పోలీసులతో మాట్లాడగా నకిలీ బాంబు అని తేలిందన్నారు. ఎవరు భయపడరాదని, పిల్లలందరూ సురక్షితంగా ఉంటారని తెలిపారు. బెంగళూరు హబ్బ జరిగే సమయంలో అల్లరిమూకలు ఇలాంటి చర్యలకు పాల్పడి ఉంటారన్నారు. సైబర్‌క్రైం పోలీసులు అప్రమత్తంగా ఉన్నారని, అన్నింటి ఆచూకీ కనిపెడతారని డీకే.శివకుమార్ తెలిపారు.

ఈ మెయిల్‌లో ఏముందంటే

బెదిరింపు ఈ-మెయిల్ ఉగ్రవాదులనుంచి వచ్చినట్లు అనుమానం వ్యక్తమైంది. అందులోని వివరాలు.. భారత్ అంతా విస్తరిస్తాం, ఇస్లాం మతంలోకి మారండి లేదా కత్తులదాడిలో ప్రాణాలు అర్పించండి అని ప్రస్తావించారు.



చామరాజపేటలోని ప్రైవేటు పాఠశాలలో జాగిలంతో బాంబ్ స్క్వాడ్ తనిఖీలు

బాలుడి ఆగ్రహం

బాంబు బెదిరింపు ఘటనపై ఓ బాలుడు ఆగ్రహం వ్యక్తం చేశాడు. మా తల్లిదండ్రులు విధులకు వెళ్లారు. ఎంతో కష్టపడి స్కూల్‌కు తీసుకువస్తారు. మళ్లీ పాఠశాలకు వచ్చి మమ్ములను తీసుకెళ్తారు. బెదిరింపు లేఖ పంపిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తా అని పేర్కొన్నాడు.



బాలుడిని ఇంటికి తీసుకెళ్తున్న దృశ్యం, పిల్లలను బయటకు పంపుతున్న పాఠశాల నిర్వాహకులు, ప్రెసిడెన్సి స్కూల్ వద్దకు తరలివచ్చిన తల్లిదండ్రులు

అదుపులో హెచ్‌ఐవీ

- రాష్ట్రంలో తగ్గిన పాజిటివ్ కేసులు
- వ్యాధి నియంత్రణకు జాగృతి కార్యక్రమాలు



బనశంకరి: రోగ నిరోధక శక్తిని నిర్వీర్యం చేసి మనిషిని మృత్యుముఖానికి చేర్చే హెచ్‌ఐవీ కేసులు రాష్ట్రంలో గణనీయంగా తగ్గాయి. ప్రధానంగా గర్భిణుల్లో హెచ్‌ఐవీ వైరస్ ప్రమాణం తగ్గడం గమనార్హం. కర్ణాటక రాష్ట్ర ఎయిడ్స్ ప్రివెన్షన్ సొసైటీ(కేసాప్స్) 2023-24 ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు రాష్ట్రంలో అన్ని ఐసీటీసీ కేంద్రాలనుంచి 12 లక్షల మంది గర్భిణులను పరీక్షలు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా ఆరునెలల్లో 8.55 లక్షలు మందికి పరీక్షలు చేశారు. ఇందులో 338 మందిలో హెచ్‌ఐవీ ప్రమాణం 0.03 తగ్గిందని ఆరోగ్యశాఖ తెలిపింది.

ఆరు నెలల్లో 21,81,824 మందికి పరీక్షలు

రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమం కింద కేసాప్స్ 2023-24 లో రాష్ట్రంలో 475 ఐసీటీసీ కేంద్రాలనుంచి 35,94,055 మందిని పరీక్షలు చేయడాన్ని టార్గెట్‌గా పెట్టుకుంది. గత 6 నెలల్లో 21,81,824 మందిని(61శాతం) పరీక్షలు చేయగా 7,930 మందిలో వైరస్ కనిపించింది. దీంతో వైరస్ ప్రమాణం 0.36 తగ్గినట్లు నిర్ధారణ అయ్యింది.

9వ స్థానంలో కర్ణాటక

జాతీయ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమం (ఎన్‌ఏసీపీ-5) ప్రకారం భారత్‌లో నాగాల్యాండ్, మిజోరాం, త్రిపుర, మణిపుర, మేఘాలయ రాష్ట్రాల్లో ఎక్కువగా హెచ్‌ఐవీ, ఎయిడ్స్ ఉన్న రాష్ట్రాలు. కర్ణాటక 9వ స్థానంలో ఉంది. రాష్ట్రంలో 3.86 లక్షల మంది రోగులు ఏఆర్‌టీ కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోగా 3.19 లక్షలమందికి చికిత్స ప్రారంభించారు. వీరిలో పిల్లలు, అన్ని వయసువారు ఉన్నారు. ఇప్పటి వరకు చికిత్స ఫలించక 3,036 మంది పిల్లలు, సుమారు లక్షమంది మృతిచెందారు.

వ్యాధిగ్రస్తులకు సదుపాయాలు

హెచ్‌ఐవీ, ఎయిడ్స్ రోగులు కోలుకునేందుకు ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. ఆరోగ్యశాఖ ఉచిత పరీక్ష, చికిత్స అందిస్తుండగా ఆహార శాఖ అంత్యోదయ పథకం కింద 30 కిలోల బియ్యం అందిస్తుంది. మహిళా శిశు సంక్షేమశాఖ ధనశ్రీ పథకం పేరుతో రూ.25 వేలు, బాధితుల పిల్లలకు నెలకు రూ.1000 ఆర్థిక సాయం అందిస్తుంది. పిల్లలకు ఆర్‌టీఇ కింద ఉచితవిద్య, ఉన్నత విద్యకు ఉపకార వేతనాల సౌలభ్యం కల్పించింది. రోగులకు న్యాయ సేవతో పాటు ప్రభుత్వం నుంచి అనేక సౌలభ్యాలు కల్పిస్తుందని కేసాప్స్ తెలిపింది.

2030 లోగా ఎయిడ్స్ అంతం

ఎయిడ్స్ మహమ్మారిని 2030లోగా అంతంచేసే దిశగా సన్నద్ధం చేయాలని ప్రపంచ ఆరోగ్యసంస్థ పిలుపునిచ్చింది. ప్రపంచవ్యాప్తంగా 39 దశ లక్షలమందికి హెచ్‌ఐవీ ఉంది. 2022లో 13 లక్షలమంది హెచ్‌ఐవీ బారినపడగా 6.3 లక్షల మంది మృతిచెందారు. హెచ్‌ఐవీ నియంత్రించే దృష్టితో యువత నాయకత్వం వహించాలని ఆగ్నేయ ఏషియాడబ్ల్యూహెచ్‌ఓ ప్రాదేశిక డైరెక్టర్ డాక్టర్ పూనమ్‌ఖేత్రపాల్‌సింగ్ తెలిపారు.

హెచ్‌ఐవీ రహిత గ్రామ పంచాయతీలు

హెచ్‌ఐవీ బారిన పడకుండా ప్రజలను జాగృతం చేసేందుకు కార్యక్రమాలు చేపట్టాం. రానున్న రోజుల్లో హెచ్‌ఐవీ రహిత గ్రామపంచాయతీ కార్యక్రమం కింద ఇంటింటికి సమాచారం అందించే కార్యక్రమాలు చేపడుతాం.

– గోవిందరాజు, రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఐఇసీ, డిప్యూటీ డైరెక్టర్

ఎస్‌ఐ సహా ఆరుగురు పోలీసుల సస్పెన్షన్

యశవంతపుర: చిక్కమగళూరులో న్యాయవాదిపై దాడికి సంబంధించి ఎస్‌ఐ సహా ఆరుగురిపై సస్పెన్షన్ వేటు పడింది. వివరాలు.. న్యాయవాది ప్రీతం గురువారం బైకుపై వెళ్తుండగా హెల్మెట్ ధరించలేదని పోలీసులు అడ్డుకొని బైకు తాళం లాక్కున్నారు. తాళం ఎందుకు లాక్కుంటారు.. జరిమానా విధించండి అంటూ న్యాయవాది సూచించగా వాగ్వాదం జరిగి ఓ దశలో పోలీసులు ప్రీతంపై చేయి చేసుకున్నారు. తనపై పోలీసులు దాడి చేశారని న్యాయవాది పోలీసులకు ఫిర్యాదు చేశారు. జిల్లా ఎస్పీ విక్రం కేసు విచారణ చేపట్టి ఎస్‌ఐ, ఏఎస్‌ఐ, హెడ్‌కానిస్టేబుల్, ముగ్గురు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

అక్కాచెల్లెళ్ల మధ్య గొడవకు బాలుడి బలి

- పదేళ్ల బాలుడిని చంపి పాతిపెట్టిన పెద్దమ్మ
- మరో బాలికను విక్రయించేందుకు యత్నం



మృతదేహం కోసం గాలిస్తున్న పోలీసులు, బాలుడు మధు (ఫైల్)

చిక్కబళ్లాపురం: చెల్లెలిపై ద్వేషం పెంచుకున్న అక్క దారుణానికి ఒడిగట్టింది. చెల్లెలి కుమారుడైన ఆరేళ్ల బాలుడిని హత్య చేసి పాతి పెట్టింది. మరో బాలికను విక్రయిస్తూ కటకటాల పాలైంది. ఈ ఘటన చిక్కబళ్లాపురం తాలూకా ముత్తకదహళ్లి గ్రామంలో జరిగింది. జిల్లా ఎస్పీ నాగేష్ తెలిపిన మేరకు...గ్రామానికి చెందిన అంబిక, అనిత అక్క చెల్లెళ్లు. అనితను శిడ్లఘట్ట తాలూకా బుడగవారహళ్లి గ్రామానికి చెందిన విశ్వనాథ్‌కు ఇచ్చి వివాహం చేశారు. ఈ దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. భర్త మద్యానికి బానిస కాదడంతో అనిత తన బిడ్డలతో కలిసి పుట్టింటికి చేరింది. ఇక ఆమె అక్క అంబికను ఇదే తాలూకా మావళ్లికి చెందిన వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. ఏ కారణంతోనే అంబిక ఇటీవల పుట్టింటికి వచ్చింది. అయితే అంబిక అనైతిక కార్యక్రమాలకు పాల్పడుతోందని అనిత అనుమానం పడింది. దీంతో ఇద్దరి మధ్య గొడవలు జరిగేవి. ద్వేషంతో రగిలిపోయిన అంబిక అనిత కుమారుడైన ఆరేళ్ల బాలుడిని గురువారం తన వెంటబెట్టుకొని తీసుకెళ్లింది. గుడిబండ రోడ్డులోని మునిరాజు సోదరునికి చెందిన మామిడితోటలో బాలుడిని గడ్డపారతో బాది హత్య చేసింది. అనంతరం మృదేహాన్ని అదే తోటలో పాతి పెట్టింది. ఇంటికి చేరుకున్న అనంతరం అనిత కుమార్తెను వెంట బెట్టుకొని యలహంక వైపు వచ్చి ఆటోలో బయల్దేరింది. ఆటో డ్రైవర్‌కు అనుమానం వచ్చి కబ్బన్‌పార్కు పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లాడు. పోలీసులు అంబికను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టగా బాలుడి హత్యోదంతం వెలుగు చూసింది. బాలికను కూడా విక్రయించాలని యత్నించినట్లు వెలుగు చూసింది. అనంతరం నిందితురాలిని ముత్తకదహళ్లికి తీసుకెళ్లి తోటలో పాతి పెట్టిన బాలుడి మృతదేహాన్ని వెలికి తీయించారు. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి నిందితురాలిని అరెస్ట్ చేసి కేసు దర్యాప్తు చేపట్టారు.

మూడు రాష్ట్రాల్లో గెలుపు మాదే

- కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి

హుబ్లీ: ఐదు రాష్ట్రాలకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మూడింటిలో విజయం తమదేనని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ధీమా వ్యక్తం చేశారు. ధార్వాడలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. అన్ని రాష్ట్రాల్లో గెలవాలన్నదే బీజేపీ లక్ష్యం అన్నారు. అయితే మూడు చోట్ల గెలుపు తథ్యమని అన్నారు. మిజోరంలో ఎన్‌డీఏ సర్కారు వస్తుందన్నారు. తెలంగాణలో మూడు పార్టీల మధ్య పోటీ ఉందన్నారు. కర్ణాటక ప్రభుత్వంలోని జగడాల వల్ల ఎటువంటి అభివృద్ధి పనులు జరగడం లేదని ఆరోపించారు. బీజేపీ హయాంలో మంజూరైన పనులను ఆపివేశారని మండిపడ్డారు. కేంద్రం 5 కేజీల బియ్యం ఇస్తోంది. రాష్ట్రప్రభుత్వం ఇస్తామన్న 10 కేజీల బియ్యం ఎప్పుడు ఇస్తారంటూ సిద్దరామయ్య ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రధాని నేతృత్వంలో కేబినెట్ సమావేశం జరిగింది. సమావేశంలో రేషన్ బియ్యం పంపిణీపై కీలక నిర్ణయం తీసుకున్నారు. 80 కోట్ల మంది ప్రజలకు ప్రతి ఒక్కరికీ 5 కేజీల బియ్యం ఇవ్వాలని తీర్మానించామన్నారు. కర్ణాటకలో సుమారు 6.5 కోట్ల జనాభా ఉందన్నారు. వీరిలో 50 శాతానికి పైగా ప్రజలకు లాభం కానుందన్నారు. ధార్వాడ జిల్లాలో అనేక రోడ్లు పాడయ్యాయన్నారు. అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిచి పోయాయన్నారు. ఈ విషయంలో సీఎం, డీసీఎం, పీడబ్ల్యూడీ శాఖా మంత్రిని డిమాండ్ చేస్తున్నామన్నారు. కొన్ని పాత పనులు మాత్రమే ప్రారంభించి వాటిని తామే చేశామంటూ కొందరు బోర్డు వేసుకున్నారన్నారు. అంతర్గత కలహాలకు స్వస్తి చెప్పి ఓ వ్యక్తిని కాపాడటానికి మొత్తం చట్టాన్నే ప్రభుత్వం చేతిలోకి తీసుకోవడం ఖండనీయమన్నారు. రాష్ట్రంలో గ్యారంటీ పథకాలు ఏ ఒక్కటీ సరిగ్గా అమలు కావడం లేదన్నారు.

విద్యార్థులకు ఉన్నత ఆశయాలు అవసరం

- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నాగేంద్ర



యువజనోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి నాగేంద్ర

సాక్షి, బళ్లారి: తాను చిన్నప్పటి నుంచి చదువుతో పాటు ఇతర రంగాల్లో రాణించి, ముందుగా సినిమా హీరో కావాలని ఆశ పడ్డానని, అయితే తగినంత ఎత్తు లేనందున డైరెక్టర్ కావాలని కలలు కన్నానని, చివరకు చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుని వ్యాపారంలో అంచెలంచెలుగా రాణించిన తర్వాత ఎమ్మెల్యేగా పోటీ చేసి, మంత్రిని అయి ఇలా మీ ముందుకు వచ్చి మాట్లాడే భాగ్యాన్ని ప్రజలు, ఆ భగవంతుడు కల్పించాడని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నాగేంద్ర అన్నారు. ఆయన శుక్రవారం నగరంలోని బీడీఏఏ ఫుట్‌బాల్ మైదానం ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి యువజనోత్సవంలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు తల్లిదండ్రుల ఉన్నత ఆశయాలకు అనుగుణంగా ముందడుగు వేయాలన్నారు. సమాజంలో దురలవాట్లకు ప్రభావితం కారాదన్నారు. యువత సన్మార్గంలో నడవాలని సూచించారు.

ఎమ్మెల్యే, మంత్రిని అయ్యాను

కళాశాల దశ ఎంతో కీలకమైందన్నారు. సద్వినియోగం చేసుకుని భావిభారత పౌరులుగా ఎదగాలన్నారు. తాను చిన్నప్పుడు తన స్నేహితులతో కలిసి బెంగళూరుకు వెళ్లి అసెంబ్లీ ముందు నుంచి వెళ్లేటప్పుడు ఎప్పుడో ఒకసారి ఖచ్చితంగా తాను ఎమ్మెల్యేగా గెలుపొంది అసెంబ్లీలోకి వెళతానని చెప్పానని, ఈ రోజు ఆ స్నేహితులు కూడా ఇదే వేదికపై ఉండటం తనకు ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. తాను కలలు కన్న విధంగా ఎమ్మెల్యేగా నాలుగు సార్లు గెలుపొందానని గుర్తు చేశారు. విద్యార్థులు కూడా మంచి ఆలోచన విధానంతో ముందుకు వెళితే ఖచితంగా అనుకున్న లక్ష్యాలను చేరుకుంటారన్నారు. చదువుతో పాటు ఆట పాటలు, సేవాదృక్పథం అలవరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపమేయర్ జానకమ్మ, కార్పొరేటర్లు వివేక్(విక్కీ), మాజీ ఉప మేయర్ బెణకల్లు బసవరాజుగౌడ పాల్గొన్నారు.

నాలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్ గాలి

ఐదు రాష్ట్రాలకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మిజోరం మినహా మిగిలిన నాలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కు అనుకూలంగా జనం ఓట్లు వేశారని మంత్రి నాగేంద్ర అన్నారు. తాను తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల పరంగా ప్రచారం చేశానని, కాంగ్రెస్‌కు వచ్చిన జనప్రభంజనం చూసి ఖచ్చితంగా అధికారంలో వస్తామనే నమ్మకం కలిగిందన్నారు. ఛత్తీస్‌ఘడ్‌లో కూడా మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి రానుందన్నారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లో కూడా కాంగ్రెస్ గెలుస్తుందనే నమ్మకం ఉందన్నారు.

బెళగావి సమావేశాలకు వ్యూహాలు

- బీజేపీ, జేడీఎస్ నేతల కీలక భేటీ
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా సమష్టి పోరాటం

శివాజీనగర: బెళగావిలో సోమవారం నుంచి ప్రారంభం కానున్న శీతాకాల సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై బీజేపీ, జేడీఎస్ నేతలు కీలక సమావేశం నిర్వహించారు. నగరంలోని రేస్‌కోర్స్ రోడ్డులో ఉన్న ప్రతిపక్ష నాయకుడు ఆర్.అశోక్ అపార్ట్‌మెంట్‌లో మిత్రకూట పార్టీలు బీజేపీ, జేడీఎస్ నాయకులు సమావేశమయ్యారు. బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు బీ.వై.విజయేంద్ర, జేడీఎస్ రాష్ట్రాధ్యక్షుడు, జేడీఎస్ శాసనసభా పార్టీ నాయకుడు కుమారస్వామి, మాజీ సీఎం బసవరాజ బొమ్మైతో పాటుగా బీజేపీ, జేడీఎస్ పార్టీలో ఎంపికైన ప్రముఖ నాయకులు సమావేశంలో పాల్గొన్నారు. బెళగావిలో జరగనున్న శీతాకాల అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే విధంగా పోరాటం చేయాలని ఉభయ పార్టీల నాయకులు చర్చించారు. కరువు నిర్వహణలో విఫలం కావడం వంటి పలు కీలక అంశాలను లేవనెత్తాలని ఇరు పార్టీల నేతలు నిర్ణయించినట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వంలో గ్యారెంటీ పథకాలు, కరువు నిర్వహణలో వైఫల్యాలు, ప్రజా వ్యతిరేక విధానాలు, కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లు తదితర వాటిపై నిలదీయాలని నిర్ధారణకు వచ్చారు. ఎమ్మెల్యేలకు నిధులు విడుదల చేయకపోవడం, అభివృద్ధి పనులు స్తంభించడం తదితర వాటిపై రెండు పార్టీలు ఒకే గళంతో పోరాటం చేయాలని నిర్ణయించాయి. స్పీకర్ యూ.టీ ఖాదర్‌కు బీజేపీ ఎమ్మెల్యేలు చేతులెత్తి మొక్కే విధంగా చేస్తామని ఎమ్మెల్యే జమీర్ వ్యాఖ్యలపై అసెంబ్లీలో ప్రస్తావించి జమీర్‌తో క్షమాపణ చెప్పించాలని తీర్మానించినట్లు సమాచారం. మొత్తంమీద ఈ అసెంబ్లీ సమావేశాలు వాడీవేడిగా జరగనున్నాయి. సమావేశం తరువాత బీజేపీ నాయకులు బీ.వై విజయేంద్ర, బసవరాజ బొమ్మై, ఆర్.అశోక్ మీడియా ముందు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. అయితే జేడీఎస్ అధినేత హెచ్.డీ.కుమారస్వామి మాత్రం సమావేశాల్లో పోరాటంపై చర్చించుకున్నాం, ఏ విధంగా పోరాటం అనేది త్వరలో తెలియజేస్తామని చెప్పి వెళ్లిపోయారు. కుమారస్వామి కారులోనే ఆర్.అశోక్ కూడా వెళ్లటం ప్రత్యేకతను సంతరించుకుంది.

పోలీసులపై దాడి కేసులో 9 మందికి జైలు

అనంతపురం క్రైం: పోలీసులపై దాడి చేసిన తొమ్మిది మందికి రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ అనంతపురం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి దీన తీర్పు వెలువరించారు. వివరాలు.. అనంతపురం రూరల్ మండలం పూలకుంటలో జరిగిన చోరీ కేసులో ఓబులేసు అనే వ్యక్తి ప్రధాన నిందితుడు. 2016 జూనల్ 17న బళ్లారి జిల్లా కౌలు బజారు పోలీసు స్టేషన్‌కు చెందిన ఏఎస్‌ఐ జటింగప్పతో పాటు మరికొంత మంది పోలీసులు గ్రామానికి వెళ్లారు. బ్రూస్ పేట చోరీ కేసులో నిందితుడిగా ఉన్న ఓబులేసును అదుపులోకి తీసుకుంటుండగా ఓబులేసు కుటుంబ సభ్యులు కర్ణాటక పోలీసులపై రాళ్లు, కట్టెలతో దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారు. ఈ దాడిలో కర్ణాటక పోలీసు బృందంలోని వన్నూరప్ప, వీరేష్‌లకు బలమైన గాయాలయ్యాయి. మిగిలిన వారికి స్వల్పగాయాలయ్యాయి. పోలీసు వాహనాన్ని రాళ్లు, కట్టెలతో ధ్వంసం చేశారు. ఈసమయంలో పోలీసుల సీడీఫైల్‌ను అపహరించారు. మరోసారి ఈ గ్రామంలోకి అడుగుపెడితే చంపుతామని బెదిరించారు. ఈ దాడిలో గాయపడిన వన్నూరప్ప, వీరేష్‌లను తోటి పోలీసు సిబ్బంది ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఏఎస్‌ఐ జట్టింగప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పట్లో ఇటుకలపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. అనంతపురం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి దీన ప్రధాన నిందితుడు ఎం.ఓబులేసుతో కలిపి దాడికి తెగబడిన తొమ్మిది మందికి రెండేళ్ల జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. అప్పటి దర్యాప్తు అధికారి అబ్దుల్ ఖరీమ్, ఏపీపీ వెంకటరమణారెడ్డి, కానిస్టేబుల్ చంద్రమౌలిలను జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ అభినందించారు.

మాజీ సీఎం కెంగల్ హనుమంతయ్య వర్ధంతిని పురస్కరించుకొని విధానసౌధ వద్ద ఆయన చిత్రపటానికి శుక్రవారం నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య



అప్పుల బాధతో రైతు మృతి

కంప్లి: పంట సాగు కోసం చేసిన అప్పులు తీర్చే దారి కనిపించక జీవితంపై విరక్తితో ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం రాత్రి జరిగింది. వివరాలు.. తాలూకాలోని దమ్మూరుకు చెందిన మహంతేష(35) అనే రైతు తన తల్లి పేరిట ఉన్న 3 ఎకరాలు, తమ్ముడి పేరిట 1.50 ఎకరాలు, భార్య పేరిట ఉన్న ఒక ఎకరం భూమిలో మిరప సాగు చేపట్టాడు. పంట సాగు కోసం గ్రామంలోని సహకారం సంఘంలో తల్లి పేరుతో రూ.1.50 లక్షలు, తమ్ముడి పేరిట రూ.70 వేలు, వ్యక్తిగతంగా రూ.10 లక్షలు అప్పు చేశాడు. అయితే సాగు నీటి కొరత వల్ల కరువుతో పంటలు ఎండిపోయి నష్టం ఎదురైంది. దీంతో మనస్తాపం చెంది కుటుంబ సభ్యులు గౌరమ్మకు ఆరతి అందించేందుకు వెళ్లగా ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. విషయం తెలిసిన వెంటనే తహసీల్దార్ రాఘవేంద్ర రావ్, ఎమ్మెల్యే గణేష్ కుటుంబీకులను పరామర్శించి ప్రభుత్వం నుంచి లభించే సౌకర్యాలు అందిస్తామని హామీ ఇచ్చారు.



మహంతేష్(ఫైల్)

డ్రైనేజీలు అస్తవ్యస్తం..ప్రజలు సతమతం

- దుర్వాసనతో ప్రజలకు నరకయాతన
- పట్టించుకోని నగర పాలికె అధికారులు

సాక్షి, బళ్లారి: నగరంలో అస్తవ్యస్త డ్రైనేజీలతో జనం నరకయాతన అనుభవిస్తున్నారు. నిధులు ఉన్నా అభివృద్ధి మాత్రం మూడు అడుగులు ముందుకు, ఆరు అడుగులు వెనక్కి అన్న చందంగా మారింది. డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉండటంతో నెలల తరబడి అయినా డ్రైనేజీల్లో మురుగు పేరుకుపోయి ఆయా కాలనీల్లో డ్రైనేజీలు దుర్వాసన వెదజల్లుతున్నాయి. డ్రైనేజీల పక్కనే నివసిస్తున్న నగర వాసులకు నరకప్రాయంగా మారింది. మహానగర పాలికె అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తూతూమంత్రంగా నగరంలో సమస్యలను పర్యవేక్షిస్తుండటంతో పాటు వాటిని పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో నగర వాసులకు



బళ్లారి: డ్రైనేజీలో నిలిచిన మురుగు, పడవేసిన చెత్తాచెదారం



రాయచూరులో చెత్త కుప్పలపై పశువుల స్వైరవిహారం



రాయచూరులో చెత్తచెదారంతో మూసుకుపోయిన ఓ మురుగు కాలువ

మరింత శాపంగా మారింది. మహానగర పాలికె మేయర్ ఏడాది ఒకసారి మారిపోతుండటంతో నగరంలో అభివృద్ధి మాట అటుంచితే కనీసం చెత్త చెదారం కూడా సక్రమంగా తీయకుండా ఎక్కడబడితే అక్కడ పడేయడంతో పాటు అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థను చక్కబెట్టడం లేదు.

ఎక్కడి చెత్త అక్కడే.!

నగరంలోని వడ్డరబండలో ప్రధానంగా డ్రైనేజీ కాలువలో చెత్తచెదారం తీయకపోవడంతో మురుగు నీరు అక్కడే నిలిచిపోవడంతో దుర్వాసన భరించలేక పోతున్నారు. ఇలా నగరంలోని గణేష్ కాలనీ, రూపనగుడి రోడ్డు, విశాల్‌నగర్‌లోని రాజా కాలువ తదితర ప్రాంతాల్లోని డ్రైనేజీలు దుర్వాసన వెదజల్లుతున్నాయి. అక్కడక్కడా డ్రైనేజీల్లో తొలగించిన చెత్తాచెదారాన్ని రోడ్డులోనే వేయడంతో నగర వాసులు ఆయా రోడ్ల గుండా వెళ్లాలంటే ముక్కున వేలు వేసుకుని నడవాల్సిన పరిస్థితులున్నాయి. ఇక నగరంలోని అన్ని కాలనీలు, రోడ్లలో నిత్యం పందులు స్వైర విహారం చేస్తున్నాయి. పందులను నగరం నుంచి వెలివేస్తామని పాలకులు చెబుతున్నారే కాని ఏ ఒక్కరూ కూడా ఆ దిశగా ఆలోచించకపోవడంతో పందుల బెడదతో నగర వాసులు ఇబ్బందులకు గురవుతూ పలు రోగాల బారిన పడుతున్నారు. డ్రైనేజీల దుర్వాసనతో పాటు దోమలు స్వైర విహారం చేస్తుండటంతో పలు రోగాల బారిన పడుతున్నట్లు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నగరమా..నరక కూపమా?

రాయచూరు రూరల్: పేరుకు మాత్రమే రాయచూరు జిల్లా కేంద్రం. అభివృద్ధిలో మాత్రం పూర్తిగా గ్రామీణ ప్రాంతాల మాదిరిగా పారిశుధ్య లోపం, రోడ్ల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. నగరసభ అధికారం కాంగ్రెస్ చేతిలో ఉండగా, ఎమ్మెల్యే బీజేపీకి చెందినవారు కావడంతో అభివృద్ధి కుంటుపడింది. ఏ ప్రాంతానికి వెళ్లినా చెత్తకుప్పలు పేరుకుపోయి, మురుగు కాలువలు చెత్తచెదారంతో నిండాయి. నగరంలోని 35 వార్డుల్లో అభివృద్ధిని పట్టించుకొనే వారు లేరు. రాజకీయ నాయకులు ఒకరిపై మరొకరు బురద చల్లుకుంటూ విమర్శలు చేసుకోవడం తప్ప మరేమి లేదు. రోడ్ల మరమ్మతులో నగరసభ సభ్యులు, అధికారులు, ఎమ్మెల్యేల మధ్య అవగాహన లేకపోవడంతో నగరవాసుల జీవితం నిత్యం నరకప్రాయమైంది.



బళ్లారి: వడ్డరబండలో ఇళ్ల ముందు నుంచే డ్రైనేజీ నీరు పారుతున్న దృశ్యం

ఎయిడ్స్ ముక్త రాష్ట్రమే ధ్యేయం

- సీఎం సిద్ధరామయ్య

శివాజీనగర: రానున్న ఐదు సంవత్సరాల్లో దేశం, రాష్ట్రాన్ని ఎయిడ్స్ నుంచి విముక్తి చేయటానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్య పిలుపునిచ్చారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని విధానసౌధ బ్యాంక్వెట్ హాల్‌లో కర్ణాటక రాష్ట్ర ఎయిడ్స్ ప్రివెన్షన్ సొసైటీ శుక్రవారం ఏర్పాటు చేసిన జాగృతి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. హెచ్‌ఐవీ ప్రమాదకరమైన రోగం, దీనిని అరికట్టడం అందరి బాధ్యత అని అన్నారు. 1996లో రాష్ట్రంలో హెచ్‌ఐవీ కేసులు వెలుగు చూశాయని, ఇటీవల వ్యాధిగ్రస్తుల సంఖ్య తగ్గుముఖం పట్టిందన్నారు. అయితే హెచ్‌ఐవీ పాజిటివ్ కేసులను జీరోకి తెచ్చేందుకు కృషి చేయాలన్నారు. హెచ్‌ఐవీ నియంత్రణ చట్టాన్ని 2017లో ప్రభుత్వం జారీ చేసిందన్నారు. అనంతరం ఎయిడ్స్ నియంత్రణ అభియాన్ రాయభారి అయిన నటి సంజనా గల్రానిని అభినందించారు. అనంతరం ఎయిడ్స్‌తో పోరాటం చేసి కోలుకున్న బాధితులను ముఖ్యమంత్రి అభినందించారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దినేశ్ గుండూరావు మాట్లాడుతూ ఎయిడ్స్ నియంత్రణకు శ్రమిస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు అని తెలిపారు. 2013–14లో వ్యాధిగ్రస్తుల స్థాయి 1.77 శాతం ఉండగా గర్భిణుల్లో 0.3 శాతం ఉండేదని, ప్రస్తుతం 0.21 శాతానికి తగ్గిందన్నారు. 2023–24 సంవత్సరంలో వ్యాధి ప్రమాణం 0.36 శాతానికి తగ్గిందన్నారు. రాష్ట్రంలో 3,82,910 హెచ్‌ఐవీ పాజిటివ్ కేసులు నమోదు కాగా 1.85 లక్షల మంది ఏఆర్‌టీ చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. బాధితులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. కల్యాణ కర్ణాటక ప్రాంతీయ అభివృద్ధి మండలి అధ్యక్షుడు ఎమ్మెల్యే అజయ్ సింగ్, నటి ప్రేమ, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై జాగృతి జాతా



జాగృతి జాతా నిర్వహిస్తున్న దృశ్యం

హొసపేటె: విజయనగర జిల్లాలోని కూడ్లిగిలో శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణ ప్రధాన వీధుల గుండా జాగృతి జాతాను నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ ఎన్‌టీ శ్రీనివాస్ జాతాను ప్రారంభించి మాట్లాడుతూ హెచ్‌ఐవీ ఎయిడ్స్‌తో మరణాలను అరికట్టడానికి ప్రభుత్వం, ఆరోగ్య శాఖలు ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నాయన్నారు. వివిధ సంఘసంస్థలు కూడా హెచ్‌ఐవీ ఎయిడ్స్ నిర్మూలనకు సహకరించాలన్నారు. తాలూకా ఆరోగ్య అధికారి డాక్టర్ ఎస్పీ ప్రదీప్ కుమార్, ఇతర అధికారులు, ఆస్పత్రి సిబ్బంది జాతాలో పాల్గొన్నారు.

ఎయిడ్స్‌ను తరిమికొడదాం



జాతాను ప్రారంభిస్తున్న దయానంద్

రాయచూరు రూరల్: దేశాన్ని పట్టిపీడిస్తున్న ఎయిడ్స్ మహమ్మారిపై ప్రజలను ముమ్మరంగా చైతన్యపరిచి తరిమికొట్టాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి దయానంద్ పిలుపు ఇచ్చారు. శుక్రవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ జాతాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. సమాజంలో ఈ వ్యాధికి గురైన వారిపై వివక్షత చూపడం సరికాదన్నారు. జాతాలో జెడ్పీ సీఈఓ రాహుల్ తుకారాం పాండే, జిల్లా ఆరోగ్య శాఖాధికారి సురేంద్రబాబు, ఎయిడ్స్ నోడల్ అధికారి గణేష్, నందిత, మనోహర్ పత్తార్, షాకీర్, బాబులున్నారు.

అభ్యర్థి ఎవరైనా ప్రచారం చేస్తా

కోలారు: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఎవరైనా విజయం కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్ తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. పార్టీ హైకమాండ్ కోలారు అభ్యర్థిగా ఎవరిని ప్రకటించినా వారి విజయం కోసం పాటుపడతానన్నారు. రైతులు పండించిన పంటల ఖరీదు ధరను ప్రభుత్వం తగ్గించడం సరికాదని, దీనిపై ప్రభుత్వంతో చర్చిస్తానన్నారు. జిల్లాలో కరువు నివారణ చర్యలు తీసుకుంటున్నామన్నారు. పశువుల మేత, బోరుబావులను తవ్వించడం వంటి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడా తాగునీటి సమస్య ఎదురు కాకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలో బెళగావిలో జరిగే శీతాకాల సమావేశాల్లో కోలారు జిల్లాలోని వివిధ సమస్యలపై చర్చిస్తామన్నారు.

చైతన్యంతోనే బయలు మలవిసర్జనకు చెక్

- లోకాయుక్త న్యాయమూర్తి పాటిల్

హుబ్లీ: ఇతరుల ఇంటి ముందుకెళ్లి మల విసర్జన చేసే ఉత్తర కర్ణాటక ప్రజల మనోస్థితిపై లోకాయుక్త న్యాయమూర్తి బీఎస్ పాటిల్ అసంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన జెడ్పీ సభామందిరంలో జిల్లా స్థాయి అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బహిరంగ మల విసర్జన రహితంగా చేయడానికి చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. విజయపుర, బాగలకోటె, యాదగిరి, ధార్వాడ, బెళగావి, కలబుర్గి జిల్లాల ప్రజలకు బహిరంగ మలవిసర్జన నిర్మూలన గురించి వివరించాలన్నారు. ఈ ప్రాంతాల ప్రజలు మనోగతం మార్చుకోవాలి. ఈ తతంగం మానడానికి చైతన్య కార్యక్రమాలు చేస్తున్నాం. పూలదండలు వేసి కూడా చెప్పాం అయినా మారడం లేదన్నారు. ఇకపై చట్ట ప్రకారమే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. పెద్దలను పిలిచి అవగాహన కల్పించాలి, ఉపాధ్యాయుల తరఫున ప్రచారం చేయించాలన్నారు. ఆ తర్వాత కూడా మరుగుదొడ్లు నిర్మించకపోతే ఇలాంటి వారికి ఇచ్చే ప్రభుత్వ వసతులను నిలిపి వేసేలా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. చట్ట ప్రకారమే సరైన రీతిలో ఈ ప్రాంతాల ప్రజలను మార్చి హితవు చెప్పాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులైనా మరుగుదొడ్లు కట్టించుకోలేదన్నారు. ఇలాంటి గ్రామీణ ప్రాంతాల ప్రభుత్వ ఉద్యోగులను సస్పెండ్ చేయాలన్నారు. అలా వారిని అప్రమత్తం చేయాలన్నారు. అధికారులు తమ పూర్తి స్థాయి అధికారాలను, సామర్థ్యాన్ని వాడుకొని ఈ ప్రక్రియను నిర్మూలించాలని కోరారు. కరోనా వంటి పరిస్థితులు మళ్లీ తలెత్తితే అప్పుడు చీమల్లా చనిపోతామన్నారు. అందువల్ల అధికారులు చిత్తశుద్ధితో ఇంటింటికీ మరుగుదొడ్ల నిర్మాణానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లాధికారి గురునాథ్‌హెగ్డేతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లోకాయుక్త న్యాయమూర్తి పాటిల్

సంస్కృతీ, సంప్రదాయాలు కాపాడాలి

రాయచూరు రూరల్: నేటి ఆధునిక యుగంలో ప్రతి ఒక్కరూ సంస్కృతీ, సంప్రదాయాల రక్షణకు కట్టుబడాలని కన్నడ సంస్కృతి శాఖాధికారి మంగళ నాయక్ వెల్లడించారు. శుక్రవారం జిల్లా జైలులో కన్నడ సంస్కృతి శాఖ ఆధ్వర్యంలో సాంస్కృతిక సౌరభ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. నేడు టీవీ, కంప్యూటర్ల బెడదను పక్కనబెట్టి పాత కాలం నాటి సాంస్కృతిక సౌరభాల వైపు రావాలన్నారు. ఇలాంటి కార్యక్రమాల్లో సంగీతం, కళాకారులతో సాంస్కృతిక జానపద కళలు ప్రదర్శిస్తే ఖైదీలు అన్ని బాధలు మరిచి పోతారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆరోగ్యాధికారి సురేంద్ర బాబు, సాంఘీక సంక్షేమ శాఖాధికారి రాజేంద్ర జాలదార్, గ్రంథాలయాధికారి నిర్మల, జన శిక్షణ సంస్థ డైరెక్టర్ సదానంద పూజారి, జిల్లా జైలర్ బీ.ఆర్.అందానిలున్నారు. అనంతరం కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు.



జ్యోతి వెలిగిస్తున్న మంగళ నాయక్

12వ వార్డుకు ఉప ఎన్నిక నిర్వహించండి

రాయచూరు రూరల్: నగరంలోని 12వ వార్డుకు ఉప ఎన్నిక నిర్వహించాలని ఉస్మానియా కాయగూరల మార్కెట్ విక్రయదారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మహావీర్ జిల్లాధికారిని డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో నగరసభ అధ్యక్షుడిగా కొనసాగిన వినయ్ కుమార్ నగరసభ సభ్యత్వానికి రాజీనామా చేసి గత అసెంబ్లీ ఎన్నికల్లో జేడీఎస్ తరఫున పోటీ చేయడంతో ఆ స్థానం ఖాళీ పడిందన్నారు. ఖాళీ అయిన స్థానానికి ఆరు నెలల్లోగా ఎన్నిక నిర్వహించాలన్నారు. ఆర్టీఓ సర్కిల్ నుంచి రోడ్డు పనులు పూర్తి చేయాలన్నారు. రైతులు పాత మార్కెట్‌లో కూరగాయలు అమ్మే విధంగా అవకాశం కల్పించాలన్నారు. విలేకరుల సమావేశంలో ప్రభు నాయక్, బసవరాజ్, రమేష్, ఉదయ్ కుమార్, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహావీర్

ఎవరో కనిపెట్టండి

యశవంతపుర: బెంగళూరులో పాఠశాలలకు బాంబ్ బెదిరింపు ఈ మెయిల్ ఏవరు పెట్టింది ఎవరో కనిపెట్టాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అధికారులను ఆదేశించారు. అయన శుక్రవారం బెంగళూరులో విలేకర్లతో మాట్లాడుతూ గతంలోని ఇలాంటి బాంబ్ బెదిరింపు ఇమెయిల్స్ వచ్చాయన్నారు. ప్రస్తుతం చోటు చేసుకున్న బాంబు బెదిరింపు ఘటన వెనుక ఎవరున్నారో తెలుసుకొని కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు

ఉగ్రవాదుల పనే

బెంగళూరులో పాఠశాలలకు బెదిరింపు ఇమెయిల్ వెనుక ఉగ్రవాదుల హస్తం ఉన్నట్లు ప్రతిపక్ష నాయకుడు ఆర్ అశోక్ ఆరోపించారు. బాంబ్ బెదిరింపు వచ్చిన బసవేశ్వరనగరలోని న్యాపెల్ పాఠశాలను సందర్శించిన అనంతరం విలేకర్లతో మాట్లాడారు. మెయిల్‌లో అల్లాకు మోసం చేశారని రాయటంతో ఉగ్రవాదుల హస్తం ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేశారు.

ఆందోళన కలిగిస్తుంది

పాఠశాలలకు ఇ మెయిల్ బాంబ్ బెదిరింపుపై మాజీ సీఎం హెచ్‌డీ కుమారస్వామి స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని, కఠినంగా వ్యవహరించాలని హెచ్చరించారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు ప్రభుత్వం ధైర్యం చెప్పాలన్నారు.

పారిశ్రామికవేత్తల రుణమాఫీపై ప్రశ్నించండి

మైసూరు: ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ఉచిత సంక్షేమ పథకాలపై విరుద్ధంగా మాట్లాడిన ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణమూర్తిపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ హెచ్‌సీ మహదేవప్ప మండిపడ్డారు. నారాయణ మూర్తి వ్యాఖ్యలు పూర్తిగా సామాజిక న్యాయం, రాజ్యాంగ విరుద్ధంగా ఉన్నాయని చెప్పారు. దళితులు, వెనుకబడిన వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం రాజ్యాంగంలోనే కొన్ని అంశాలు పొందుపరిచారని గుర్తు చేశారు. రాజ్యాంగం ఆశయాలకు అనుగుణంగానే రాష్ట్ర ప్రభుత్వం ఉచిత గ్యారెంటీ పథకాలను అందిస్తోందని తెలిపారు. తమ ఉచిత గ్యారెంటీ పథకాలను ప్రశ్నిస్తున్న నారాయణ మూర్తి ...తాను సామాజిక న్యాయానికి విరుద్ధంగా వ్యాఖ్యలు చేస్తున్నారేమో ఒక్కసారి పరిశీలించుకోవాలని హితవు పలికారు. ప్రధాని నరేంద్ర మోదీ పెద్ద పెద్ద పారిశ్రామికవేత్తలకు రుణమాఫీ చేస్తున్నారని, దానిపై నారాయణ మూర్తి ప్రశ్నించాలని సూచించారు. పారిశ్రామికవేత్తలకు రుణమాఫీ చేసే బదులు ఆ డబ్బులను రైతులు, వెనుకబడిన వర్గాలు, వ్యవసాయ కార్యకలాపాల కోసం వినియోగిస్తే సబబుగా ఉంటుందని చెప్పాలని కోరారు.

విద్యార్థులకు ఉన్నత ఆశయాలు అవసరం

- ఇతర రంగాల్లోనూ రాణించాలి
- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నాగేంద్ర

సాక్షి, బళ్లారి: తాను చిన్నప్పటి నుంచి చదువుతో పాటు ఇతర రంగాల్లో రాణించి, ముందుగా సినిమా హీరో కావాలని ఆశ పడ్డానని, అయితే తగినంత ఎత్తు లేనందున డైరెక్టర్ కావాలని కలలు కన్నానని, చివరకు చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుని వ్యాపారంలో అంచెలంచెలుగా రాణించిన తర్వాత ఎమ్మెల్యేగా పోటీ చేసి, మంత్రిని అయి ఇలా మీ ముందుకు వచ్చి మాట్లాడే భాగ్యాన్ని ప్రజలు, ఆ భగవంతుడు కల్పించాడని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నాగేంద్ర అన్నారు. ఆయన శుక్రవారం నగరంలోని బీడీఏఏ ఫుట్‌బాల్ మైదానం ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి యువజనోత్సవంలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు తల్లిదండ్రుల ఉన్నత ఆశయాలకు అనుగుణంగా ముందడుగు వేయాలన్నారు. సమాజంలో దురలవాట్లకు ప్రభావితం కారాదన్నారు. యువత సన్మార్గంలో నడవాలని సూచించారు.

ఎమ్మెల్యే, మంత్రిని అయ్యాను

కళాశాల దశ ఎంతో కీలకమైందన్నారు. సద్వినియోగం చేసుకుని భావిభారత పౌరులుగా ఎదగాలన్నారు. తాను చిన్నప్పుడు తన స్నేహితులతో కలిసి బెంగళూరుకు వెళ్లి అసెంబ్లీ ముందు నుంచి వెళ్లేటప్పుడు ఎప్పుడో ఒకసారి ఖచ్చితంగా తాను ఎమ్మెల్యేగా గెలుపొంది అసెంబ్లీలోకి వెళతానని చెప్పానని, ఈ రోజు ఆ స్నేహితులు కూడా ఇదే వేదికపై ఉండటం తనకు ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. తాను కలలు కన్న విధంగా ఎమ్మెల్యేగా నాలుగు సార్లు గెలుపొందానని గుర్తు చేశారు. విద్యార్థులు కూడా మంచి ఆలోచన విధానంతో ముందుకు వెళితే ఖచితంగా అనుకున్న లక్ష్యాలను చేరుకుంటారన్నారు. చదువుతో పాటు ఆట పాటలు, సేవాదృక్పథం అలవరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉప మేయర్ జానకమ్మ, కార్పొరేటర్లు వివేక్(విక్కీ), మాజీ ఉపమేయర్ బెణకల్లు బసవరాజుగౌడ పాల్గొన్నారు.



యువజనోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి నాగేంద్ర

నాలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్ గాలి

ఐదు రాష్ట్రాలకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మిజోరం మినహా మిగిలిన నాలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కు అనుకూలంగా జనం ఓట్లు వేశారని మంత్రి నాగేంద్ర అన్నారు. ఎన్నికల అనంతరం పలు సర్వేల్లో కూడా కాంగ్రెస్‌కు జనం పట్టం కట్టినట్లుగానే సర్వేలు వెల్లడించాయని గుర్తు చేశారు. తాను తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల పరంగా ప్రచారం చేశానని, కాంగ్రెస్‌కు వచ్చిన జనప్రభంజనం చూసి ఖచ్చితంగా అధికారంలో వస్తామనే నమ్మకం కలిగిందన్నారు. చత్తీస్‌ఘడ్‌లో కూడా మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి రానుందన్నారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లో కూడా కాంగ్రెస్ గెలుస్తుందనే నమ్మకం ఉందన్నారు.

క్లుప్తంగా

తాగునీరు, శుభ్రతకు అధిక ప్రాధాన్యం

కంప్లి: తాలూకాలోని ప్రజలకు తాగునీరు, పరిశుభ్రత కల్పనకు పెద్ద పీట వేయాలని ఎమ్మెల్యే నేమిరాజ్ నాయక్ తెలిపారు. కొట్టూరు తాలూకా కార్యాలయంలో నిర్వహించిన తాలూకా స్థాయి సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. దాతల సహకారంతో బోరుబావులను తవ్వించడంతో పాటు నిర్వహణ చేపట్టాలన్నారు. ఇతర మౌలిక సౌకర్యాల నిర్వహణపై నిర్లక్ష్యం చేయరాదన్నారు.

స్వచ్ఛంద రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

హొసపేటె: విజయనగర జిల్లా కూడ్లిగిలోని డిప్లొమో కళాశాలలో శుక్రవారం స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. యూత్ రెడ్ క్రాస్ వింగ్ ప్రాజెక్ట్ ఆఫీసర్ జగదీష్ మాట్లాడుతూ యువత రక్తదానానికి చురుకుగా ముందుకు రావాలని కోరారు. శిబిరంలో 180 మందికి పైగా విద్యార్థులు తమ బ్లడ్ గ్రూప్ పరీక్షలు చేయించుకోగా, 35 మందికి పైగా విద్యార్థులు, అధ్యాపకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కే.రాఘవేంద్ర, తాలూకా ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది, కళాశాల విద్యార్థులు ప్రశాంత్‌కుమార్, సోమశేఖర్, పత్రిగౌడ తదితరులు పాల్గొన్నారు.

కవితా గోష్టికి శ్రీకారం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

హొసపేటె: కన్నడ రాజ్యోత్సవం, కనకదాస జయంతి సందర్భంగా డాక్టర్ సులోచన ఇంట్లో కవితా గోష్టిని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి డాక్టర్ దయానంద కిన్నాళ్ అధ్యక్షత వహించగా కవి సమ్మేళనాన్ని డాక్టర్ సులోచన ప్రారంభించారు. భారతీయ మూలిమని, హల్యానాయక్, రేఖా కన్నడతి, సో.డాక్టర్ వంటి కవులు, విరుపాక్షగౌడ, భాగ్యలక్ష్మీ భరాడే, గోవిందప్ప, కవితా నాయుడు, అంజలి బెళగల్, వెంకటేష్ బడిగేర్, ఎర్రిసామి, విశాల్ మ్యాస్టర్, జంబునాథ్, డాక్టర్ చెన్నరస, అద్విక, నూర్జహాన్, శీలా బడిగేర్, డాక్టర్ ఉషారాణి, సౌభాగ్యలక్ష్మి, నాగరాజ పత్తార్, శృతి, శ్రీనివాస్ పాటలు పాడారు. శివరాజ్ కవితలు వినిపించారు. వివిధ కవులు, చిన్నపిల్లల గొంతులను అనుకరించారు. అతిథులుగా మహిళా శిశు అభివృద్ధి సంస్థ విశ్రాంత అధికారిణి చెన్నమ్మ, సంగీత భారతి కన్వీనర్ కల్లంభట్, నూర్జహాన్, రీనా నందన్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల ధర్నా



ధర్నాలో పాల్గొన్న పౌర కార్మికులు

రాయచూరు రూరల్: తమను పర్మినెంట్ చేయాలని నగరసభ దినకూలి పౌర కార్మికులు ధర్నా చేపట్టారు. శుక్రవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నానుద్దేశించి పౌర కార్మికుల సంఘం జిల్లాధ్యక్షుడు మారెప్ప మాట్లాడారు. ఐదు నెలల బకాయి వేతనాలను చెల్లించాలన్నారు. పీఎఫ్, జీపీఎఫ్, సేవా భద్రత లేదని, 25 ఏళ్ల నుంచి విధులు నిర్వహిస్తున్న తమను పర్మినెంట్ చేసి న్యాయం చేయాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

కుక్కను కొనివ్వలేదని యువకుడు ఆత్మహత్య

హుబ్లీ: ఖరీదైన కుక్కను కొనివ్వలేదని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన నగరంలోని మిషన్ కాంపౌండ్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. అలెన్‌భొస్మె(23) ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు. యువకుడికి కుక్కలంటే మహా ప్రేమ. ఇంట్లో వివిధ జాతుల కుక్కలను పెంచుకున్నాడు. ఇటీవల రూ.2 లక్షల విలువ చేసే కుక్కల పిల్లను కొనివ్వాలని తల్లిని ఒత్తిడి చేశాడు. దీంతో విసిగిపోయిన తల్లి ఇల్లు విడిచి వెళ్లిపోయింది. ఈ విషయంపై అలెన్ బాధపడుతూ జీవితంపై విరక్తితో ఇంట్లో ఎవరూ లేని వేళలో ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు నిర్ధారించారు. హుబ్లీ ఉపనగర పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

దేవదాసి మహిళల ఆందోళన విరమణ



సమ్మె విరమింపజేస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: దేవదాసి మహిళల సమస్యలపై రెండు రోజులుగా చేస్తున్న ఆందోళనకు తెరదించారు. శుక్రవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాలో దేవదాసి మహిళా సంఘం జిల్లాధ్యక్షుడు అభయ్ మాట్లాడారు. దేవదాసి మహిళలకు పింఛన్, సౌకర్యాలను ఏడు నెలలుగా ఉన్న బకాయి వేతనాలను చెల్లించాలన్నారు. విద్యార్థి వేతనాలు అందించాలని కోరిన సభ్యుల డిమాండ్లపై జెడ్పీ సీఈఓ రాహుల్ తుకారాం పాండే స్పందించి వారికి భరోసా ఇచ్చి బొండాలను తాగించి సమ్మెను విరమింపచేశారు.

క్రీడలతో శారీరక ఆరోగ్యం



క్రీడా జ్యోతిని అందిస్తున్న జిల్లా ఎస్పీ తదితరులు

రాయచూరు రూరల్: సమాజంలో శాంతిభద్రతలకు తోడు రక్షణ విధులతో పాటు క్రీడల్లో రాణించాలని జిల్లా ఎస్పీ నిఖిల్ అన్నారు. శుక్రవారం పోలీసు క్రీడా మైదానంలో మూడు రోజుల పాటు జరిగే వార్షిక క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. 24 గంటలు విధులు నిర్వహించే పోలీసులు మానసికంగా, శారీరకంగా ఎదగడానికి క్రీడలు దోహదపడతాయన్నారు. అంతర్జాతీయ ఖోఖో క్రీడాకారిణి గౌరీ క్రీడలకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో ఏఎస్పీ శశికుమార్, డీఎస్పీలు సత్యనారాయణ, దత్తాత్రేయ, సీఐ నాగరాజ్, గురురాజ్ కట్టిమని, ఎస్సైలు మంజునాథ్, దాదావలి, వైశాలిలున్నారు.

కిడిగణ్ణయ్యకు కన్నడ రత్న అవార్డు



అవార్డు అందుకున్న కిడిగణ్ణయ్య

రాయచూరు రూరల్: జిల్లాలోని మాన్వికి చెందిన జిల్లా బేడ జంగమ సంఘం అధ్యక్షుడు కిడిగణ్ణయ్య కన్నడ రత్న అవార్డును అందుకున్నారు. జిల్లాలో గత దశాబ్ద కాలం నుంచి సమాజ సేవా రంగంలో అందించిన సేవలకు గుర్తింపుగా గురువారం ధార్వాడలో జరిగిన 68వ కన్నడ రాజ్యోత్సవంలో విశ్వదర్శన కన్నడ పర స్నేహ సంఘం ఆధ్వర్యంలో ఈ అవార్డును స్వీకరించారు.

కూడ్లిగిలో కనక భవన్ నిర్మిస్తాం

కంప్లి: కురుబ సమాజ చిరకాల కోరిక మేరకు కూడ్లిగిలో కనక భవన్‌ను నిర్మించేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తానని ఎమ్మెల్యే డాక్టర్ ఎన్టీ శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలోని చంద్రశేఖర్ ఆజాద్ రంగ మందిరంలో ఏర్పాటు చేసిన కనకదాస జయంతిని ప్రారంభించి ఆయన మాట్లాడారు. అనంతరం ప్రతి సముదాయానికి అవసరమైన భవనాల నిర్మాణానికి తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు.

జీవన్ ఉత్సవ్ పాలసీల్లో రాయచూరు డివిజన్ ప్రథమం



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

రాయచూరు రూరల్: జీవన్ ఉత్సవ్ పాలసీల్లో రాయచూరు ఎల్ఐసీ డివిజన్ ప్రథమ స్థానం సంపాదించిందని ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం రాయచూరు ఎల్ఐసీ డివిజన్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోని 13 డివిజన్లలో రాయచూరు నాలుగో స్థానంలో ఉందన్నారు. నెలరోజుల్లోనే వంద జీవన్ ఉత్సవ్ పాలసీలు చేయించినట్లు తెలిపారు. ఐదేళ్ల పాటు రూ.5 లక్షల పాలసీ చేయిస్తే 11 ఏళ్ల తర్వాత మరణించేంత వరకు నెలకు రూ.50 వేలు ఇస్తామన్నారు. మార్కెటింగ్ మేనేజర్ సురేష్, సేల్స్ మేనేజర్ శ్రీనివాస్, నరసింహ రాజులున్నారు.

భాష రక్షణకు పాటుపడాలి

కోలారు: కన్నడ భాష రక్షణ కోసం ప్రతి ఒక్కరు సైనికుల్లా కృషి చేయాలని ఎమ్మెల్యే జీకే వెంకటశివారెడ్డి తెలిపారు. గురువారం రాత్రి పట్టణంలోని వివేకానంద సర్కిల్‌లో చైతన్య జాగృతి వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కన్నడ రాజ్యోత్సవం, సంగీత కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమన్నారు. రూ.25 కోట్ల వ్యయంతో పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు. రూ.40 కోట్ల వ్యయంతో శ్రీనివాసపురం–కోలారు రహదారి విస్తరణ పనులను చేపడుతున్నట్లు తెలిపారు. శ్రీనివాసపురం తాలూకాలో పరిశ్రమలను స్థాపించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలను కల్పించే విషయంపై కేడీపీ సమావేశంలో చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ అధ్యక్షుడు తూపల్లి ఆర్.నారాయణస్వామి, సీఐ జయానంద్ తదితరులు పాల్గొన్నారు.